
# ఆయుధం పట్టని యోధుడు

## మార్టిన్ లూథర్ కింగ్



ఎం.వి.రమణారెడ్డి

# ఆయుధం పట్టని యోధుడు

అమెరికన్ నల్లజాతి పోరాటంలో
అహింసా విధానానికి ఊపిరి పోసి,
'నోబెల్ శాంతి పురస్కారం'తో సత్కరించబడిన
డా. మార్టిన్ లూథర్ కింగ్ జీవితచరిత్ర

రచన:
**డా. ఎం.వి.రమణారెడ్డి**

ప్రచురణ:
**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**
**హైదరాబాద్.**

**ఆయుధం పట్టని యోధుడు**
తొలి ప్రచురణ: మార్చి 2008

హక్కులు: రచయితవి

ముఖచిత్రం:

వెల:

ముద్రణ:

ప్రతులకు:
హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ 85 బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్-500 067.

Published by:
Hyderabad Book Trust, Plot no. 85, Balaji Nagar,
Gudi Malkapur, HYDERABAD-500 067.

Ph. no. 23521849, 23517401.

# అంకితం:

కులాలకూ మతాలకూ అతీతంగా

మనిషిలోని విలువలను ఆదరించే సహృదయులకు

## - ఒక పాఠకుడిగా . . .

చాలా ఏళ్ళక్రితం నేను చదివిన హారియట్ బీషర్‌స్టోవే రాసిన 'అంకుల్ టామ్స్ కేబిన్' నవలా, హోవర్డ్ ఫాస్ట్ రాసిన 'ఫ్రీడం రోడ్' నవలా, ఎలెగ్జ్ హేలీ 'రూట్స్' నవలా, ఇలాంటివి మరికొన్ని, నా స్మృతి పథంలో మెదిలాయి డా.ఎం.వి. రమణారెడ్డిగారు 'ఆయుధం పట్టని యోధుడు' పేరుతో రాసిన మార్టిన్ లూథర్ కింగ్ జీవితచరిత్రను చదువుతున్నంతసేపూ!

ఆ నవలలు చదివినప్పుడు మనస్ఫూర్తిగా అమెరికాను అసహ్యించుకున్నాను! ప్రపంచంలో అగ్రరాజ్యంగా, నాగరిక దేశంగా 'కీర్తించబడుతున్న' అమెరికాలో శతాబ్దాల తరబడి నీగ్రోజాతిమీద జరిపిన దాడులూ, రంగు వివక్షా, అణచివేతా, క్రూరమైన హింసాకాండా, ఇలాంటివి ఎన్నెన్నో అర్థమై, 'ఇంత అనాగరిక ఆటవిక రాజ్యమా అమెరికా?' అని కంపరం కలిగింది. ఈ నవలల్లోని కథాకాలం ఒక శతాబ్దం కిందటిదన్న మాట నిజమే అయినప్పటికీ, మీ చేతిలోవున్న ఈ పుస్తకంలోని చారిత్రికకాలం ఎప్పటిది? మొన్నటికి మొన్న, అమెరికాలో ఉంటున్న ఒక సాహితీమిత్రుడు ఇటీవల ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పిన మాటలేమిటి? ఇప్పటికీ నీగ్రోలపట్ల ఆ దేశంలో వివక్ష కొనసాగుతూనే వున్నదని ఆ మిత్రుడు పలు ఉదాహరణలతో నాకు తెలియజెప్పినాడు. విద్యాలయాల్లో మొక్కుబడిగా ఇప్పటికి గూడా కొద్ది శాతం మాత్రమే నల్లజాతివారిని అనుమతిస్తున్నారట! ఈ అమెరికాను స్వర్గధామంగా కలలుగంటూ, అక్కడికి వెళ్ళాలని ఉవ్విళ్ళూరే అసంఖ్యాకుల పట్ల నిజంగానే నాకు జాలి కలిగింది!

అమెరికాతో మన దేశాన్ని పోల్చినప్పుడు, ఇక్కడ దళితుల పట్ల వివక్ష, అస్పృశ్యతా ఇంకా కొనసాగుతున్నప్పటికీ, అమెరికాలోలా క్రూరంగా, పాశవికంగా, నిర్లజ్జగా, నీగ్రోల పట్ల అనుసరించే జాతివివక్షతో పోల్చినప్పుడు, ఈ దేశం ఎంత నయమోగదా అనిపించింది. ఎం.వి.రమణారెడ్డిగారి ఈ పుస్తకం చదివిం తర్వాత, అమెరికా గురించి నా అభిప్రాయం మరింత బలపడటమే గాకుండా, ప్రపంచంలో అస్పృశ్యదేశం ఏదైనా ఉన్నదీ అంటే అది అమెరికానే అని గట్టిగా తీర్మానించుకున్నాను. ప్రపంచీకరణ పేరుతో ఆ దేశం కొనసాగిస్తున్న ఆర్థిక,

సాంస్కృతిక దోపిడీల వర్తమాన నేపథ్యంలో, ఈ పుస్తకం అవసరం ఎంతో ఉన్న దనీ, మరీ ముఖ్యంగా ఆ దేశంపట్ల భ్రమలుగలవారికి మరింత ఆవశ్యకత ఉందనీ నేను స్పష్టం చేస్తున్నాను.

మార్టిన్ లూథర్ కింగ్ జీవితచరిత్ర మాత్రమే కాదు, ఇది అమెరికా సాంస్కృతిక చరిత్ర కూడా!!

ఒక సిటీ బస్సులో ప్రయాణం చేస్తున్న ఒక నల్లజాతి స్త్రీ, ఒక తెల్లజాతీయునికి సీటు ఖాళీచేసి ఇవ్వని కారణంగా అరెస్టుకు గురిఅయింది - ఆ సంఘటనతో ప్రారంభమైన జాతివివక్ష వ్యతిరేక ఉద్యమం, మార్టిన్ లూథర్ కింగ్ నాయకత్వంలో ఎలాంటి ప్రకంపనలు కలిగించింది, ఎలాంటి అవరోధాలు ఎదుర్కొన్నది, ఎలాంటి అణిచివేతకు గురిఅయినది, ఎలాంటి దశలను అధిగమించినది, క్రమక్రమంగా విస్తరిస్తూ ఎలాంటి ఫలితాలను సాధించినది, ఈ పుస్తకంద్వారా పాఠకుడు గ్రహించడమే గాకుండా, తానుగూడా ఆ ఉద్యమంలో మానసికంగా ఉన్ముఖీకరణ చెందే విధంగా సాగిన రచనానిర్మాణం ఈ పుస్తకంయొక్క విశిష్టత!

మార్టిన్ లూథర్ కింగ్ ఉద్యమం అహింసాయుత ఉద్యమం - ఆయుధం పట్టని ఉద్యమం, బూటకపు ప్రజాస్వామ్యాన్ని బట్టబయలు చేసిన ఉద్యమం, కనీసపు ఓటుహక్కు కూడా లేని నీగ్రోలు పిడికిలి బిగించిన ఉద్యమం, అనేకానేక సంక్షోభాలనూ ఒత్తిళ్ళనూ అణచివేతలనూ ఎదుర్కొన్న ఉద్యమం, మనదేశపు మహాత్మాగాంధీని ఆదర్శంగా స్వీకరించిన ఉద్యమం, అసంఖ్యాక ప్రజాబలంతో విస్తరించిన ఉద్యమం, ఆశయంకోసం తన ప్రాణాలనే మార్టిన్ లూథర్ కింగ్ ఫణంగా పెట్టిన ఉద్యమం!!

ఈ పుస్తకంలో ఒకచోట అన్నట్టు, తాటాకు చప్పుళ్ళకు బెదిరే రకంగాదు అమెరికా! మార్టిన్ ఉద్యమాన్ని అణచటానికీ, అభాసుపాలు చేయటానికీ, కుటిలమైన జిత్తులతో మోసపు ఎత్తుగడలతో తీవ్రమైన నిర్బంధంతో ఎన్నెన్నో కుట్రల్ని పన్నిన వైనం, మనకు అమెరికా అప్రజాస్వామికత పట్ల ఏవగింపు కలిగేలా చేస్తుంది. పాఠకుడు ఈ పుస్తకం చదవటం ప్రారంభించినప్పటినుండి ఒక క్రమోన్మీలనంతో తాదాత్మ్యం చెందుతాడు, ఉద్విగ్నుడౌతాడు, ఉద్రిక్తుడౌతాడు, ఉత్తేజితుడౌతాడు!

ఎం.వి.రమణారెడ్డిగారు ఇప్పటికే కథకుడుగా (పరిష్కారం కథల సంపుటి), అనువాదకుడుగా (సాపియాన్, అవే విత్ ఆల్ ద పెస్ట్స్ అన్న గ్రంథాలకు),

పత్రికా సంపాదకుడుగా (ప్రభంజనం పత్రిక), రాయలసీమ ఉద్యమకారుడిగా (రాయలసీమ కన్నీటి గాథ), చాలామంది మాబోటివారికి చిరపరిచితులు. వారు మార్టిన్ లూథర్ కింగ్ జీవితచరిత్రను ఒక ఫిక్షన్‌లా నవలానిర్మాణంలో ఒదిగించి రాసిన తీరు పాఠకుడిని ముగ్ధుణ్ణి చేస్తుంది. వారి వాక్యనిర్మాణం, పదాల కూర్పు, శైలి పఠితను ముందుకు వెంటవెంటనే నడిపిస్తుంది. ప్రాంతీయమైన పలుకుబళ్ళు ఒక వింత సొబగుతో అక్కడక్కడా మెరుస్తాయి -

రెండువందల పుటల ఈ పుస్తకం రాయటానికి వారు పడిన శ్రమ నాకు తెలుసు. ఒక సంవత్సరమైనా వారు ఇందుకోసం వెచ్చించి వుంటారు. కనీసం నాలుగువేల పుటలకు పైగా ఇందుకు సంబంధించిన పుస్తకాలనూ, పత్రాలనూ అధ్యయనం చేసివుంటారు. పాఠకుడిని సునాయాసంగా చదివించే ఈ పుస్తకం వెనుక, వారి సుదీర్ఘ పరిశ్రమా, నిరంతర కృషీ దాగున్నాయని పాఠకుడు గుర్తిస్తే వారి రచనా లక్ష్యం నెరవేరినట్టే!

అనంతపురం, - సింగమనేని నారాయణ

14.02.2008.

# సందర్భం

మొదట మార్టిన్ లూథర్ కింగ్ ప్రసంగాలను తెలుగులోకి అనువదించమని శ్రీమతి గీతా రామస్వామిగారు నాకు అప్పగించారు. అవి అద్భుతమైన ప్రసంగాలు. మాటలను పదునైన ఆయుధంగా మలచిన అరుదైన వక్త డా. మార్టిన్ లూథర్ కింగ్. ఆయన ప్రసంగాలూ వ్యాసాలూ కలిసిన పుస్తకం దాదాపు 700 పేజీలుంది. అన్నిటినీ అనువదిస్తే తెలుగులో పుస్తకం రాశి మరింత పెరుగుతుంది. పుస్తకం పెద్దది కాకుండా చూడటానికి కొన్ని ప్రసంగాలనే ఏరుకున్నాం. దాదాపు పది ప్రసంగాల అనువాదం ముగిసిన తరువాత నాకొక అనుమానం తగిలింది. లూథర్ కింగ్‌ను ఎరిగినవాళ్ళు తెలుగు పాఠకుల్లో ఎక్కువమంది ఉండరు. ఆయనెవరో తెలీకుండా ఆ వ్యాసాలమీద ఆసక్తి కనబరిచే అవసరం ఎవరికుంటుంది? అందువల్ల, ఆయన జీవిత చరిత్రను తెలుగులో తీసుకురావడం అవసర మనిపించింది. గీతాగారిని సంప్రదిస్తే సరే నన్నారు.

లూథర్ కింగ్ జీవితాన్నీ, సిద్ధాంతాన్నీ ప్రశంసించే రచనలూ, విమర్శించే రచనలూ ఇంగ్లీషులో కొల్లలు. ఆయన స్నేహితులు వ్రాసినవీ, ఆయన భార్య కొరెట్టా పర్యవేక్షణలో వెలువడినవి గూడా చాలా ఉన్నాయి. వాటిల్లో చాలా పుస్తకాలు గీతాగారు నాకు అందజేశారు. ఏవొక్కటి తెలుగు పాఠకులను మెప్పించేలా నాకు కనిపించలేదు. అనువాదం కంటే, ఆ సమాచారాన్ని ఆధారం చేసుకుని కొత్త పుస్తకం తయారుజెయ్యడం మంచిదని నాకు తోచింది. ఆ ప్రయత్నం ఏడాది క్రిందట మొదలెట్టాను. చాలా ఇబ్బంది పడ్డాను. ప్రతి పది పేజీల తయారీకి కనీసం నాలుగువందల పేజీలను అధ్యయనం చేసి, దాన్నుండి కావలసిన సమాచారం ఏరుకోవాలి. ఇంటర్నెట్ సౌకర్యంతో దొరికిన సమాచారం ఈ పరిశ్రమలో నాకు చాలా ఉపకరించింది. ప్రశంసల్లో విమర్శల్లో దేన్నీ నిర్లక్ష్యం చెయ్యకుండా, కథానాయకుని వ్యక్తిత్వం చిన్నబోకుండా కలబోయడం పెద్ద కసరతుగా, చివరకు ఈ రచన ముగించగలిగాను. దీనికి వెల కట్టే బాధ్యత ఇక మీదే. నమస్తే.

**-రచయిత**

## గనుపులు:

| | |
|---|---|
| 1. బాల్యం | 3 |
| 2. కౌమారం | 11 |
| 3. యవ్వనం | 17 |
| 4. ఉద్యోగం | 23 |
| 5. ఉద్యమం | 27 |
| 6. సన్నాహం | 33 |
| 7. ప్రతీకారం | 40 |
| 8. ఉపశమనం | 47 |
| 9. బీభత్సం | 57 |
| 10. ఉత్సాహం | 63 |
| 11. గతుకుల ప్రయాణం | 70 |
| 12. అపాయం | 75 |
| 13. తీర్థయాత్ర | 79 |
| 14. ఇంటిపోరు | 86 |
| 15. సుడిగుండం | 90 |
| 16. ఎన్నికలు | 96 |
| 17. స్వేచ్ఛాప్రయాణం | 102 |
| 18. ఎదురుదెబ్బ | 111 |
| 19. బర్మింగ్‌హాం | 124 |
| 20. వాషింగ్టన్ డి.సి.లో కవాతు | 141 |
| 21. పంజా విసిరిన పెద్దపులి | 150 |
| 22. ఫలించిన కల | 153 |
| 23. ఓటుహక్కు | 162 |
| 24. కొత్తకోణం | 177 |
| 25. ఉత్తరాదిపై దండయాత్ర | 185 |
| 26. మొండిపట్టు | 199 |
| 27. చెదరిపోయిన కల | 205 |

# బాల్యం

అనగా అనగా ఒకప్పుడు, ఈజిప్టు అంతరిక్షంలో ఒక నక్షత్రం పొడిచింది. ఫ్యారో చక్రవర్తుల ఉక్కుపాదంక్రింద నలిగిపోతున్న ఇజ్రేలీ బానిసలకది విజయకేతనమైంది. బానిసలు నివసించే మురికివాడలో ఒక పసికందు రూపంలో తిరుగుబాటు జన్మించింది. ఆ నక్షత్రాన్ని చూడగానే మతగురువులు కంగారుపడ్డారు. రాజప్రాసాదానికి పరుగులు తీశారు. బానిసవాడలో శత్రువు ఆవిర్భవించిన సంకేతం పొడచూపిందని చక్రవర్తికి నివేదించారు. బానిసకుటుంబాల్లో పుట్టిన పసిపిల్లలందరిని నరికేయమని చక్రవర్తి ఆజ్ఞాపించాడు. బొడ్డూడని పిల్లలంతా పురిట్లోనే ప్రాణాలు కోల్పోయారు. కానీ, అసలు బిడ్డ తప్పించుకుని చక్రవర్తి అంతఃపురం చేరిపోయింది. మోసెస్ పేరుతో అక్కడే పెరిగి, ఫ్యారోల పెత్తనాన్ని తుదముట్టించింది. బానిసలందరిని విముక్తిచేసి, ఎర్రసముద్రం దాటించి, ఇజ్రేల్లో 'దేవుని సామ్రాజ్యం' స్థాపించింది. ఇదొక మతగ్రంథం చెప్పిన ఇతిహాసం.

చాలారోజుల తరువాత అలాటి మరో నక్షత్రం అరబ్బీ గగనతలంమీద మిరుమిట్లు గొలిపింది. ఈ నక్షత్రంగూడా ఎంతోమంది పసికందులను రోమన్ చక్రవర్తి నిరంకుశత్వానికి బలిచేసింది. అసలు శిశువు ఈసారిగూడా తప్పించుకుంది. గొర్రెలకొట్టంలో పుట్టి జీసెస్‌గా చరిత్రలో నిలిచింది.

''దుర్మార్గం ప్రబలినప్పుడు చోటుచేసుకునే సంఘటనల్లో, సీజర్ అంతఃపురాన్ని ఆక్రమించనూవచ్చు, క్రీస్తు శిలువమీదికు చేరనూవచ్చు. కానీ, క్రీస్తుపూర్వం క్రీస్తుశకంగా చరిత్రను విభజిస్తూ, సీజర్ జీవితకాలాన్ని సైతం తన పేరుమీదుగా లెక్కగట్టే చరిత్రగా అదే క్రీస్తు వొకానొకరోజు సజీవుడై లేచి నిలుచుంటాడు.'' అనేది డా. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ విశ్వాసం.

అమెరికా సంయుక్తరాష్ట్రాల అంతరిక్షంలో 1929 జనవరి 15న ప్రత్యేక నక్షత్రమేదైనా అవతరించిందో లేదో తెలీదుగానీ, ఆ రోజు, అట్లాంటా నగరంలోని ఆబర్న్-అవెన్యూలోని ఒక సాధారణ నీగ్రో కుటుంబంలో డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ జన్మించాడు. అది ఆయన తాతగారి ఇల్లు. తండ్రి మైకేల్ (తరువాత మార్టిన్‌గా ఆయన పేరు మారింది) లూథర్ కింగ్ సీనియర్. తల్లి ఆల్బర్టా. ఎబనేజర్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్‌గా పనిజేసే వి.డి.విలియమ్స్‌కు ఆమె ఏకైక కుమార్తె. అందువల్ల, అల్లుడూ కూతుర్లను విలియమ్స్ తన ఇంట్లోనే ఉంచుకున్నాడు. 1931లో

విలియమ్స్ మరణానంతరం, ఎబనేజర్ చర్చి పాస్టర్ స్థానానికి అతని అల్లుడు మార్టిన్ లూథర్ కింగ్ సీనియర్ ఎన్నికైనాడు.

ఒద్దికగా సంసారం నడుపుకొచ్చే తలిదండ్రులు దొరకడం బహుకొద్దిమంది పిల్లలు నోచుకునే అదృష్టం. ఆ విషయంలో మార్టిన్ లూథర్ కింగ్ చాలా అదృష్ట వంతుడు. తన చిన్ననాటి ముచ్చట్లను ప్రస్తావిస్తూ, ''అమ్మానాన్నలు వాదులాడు కోవడంగానీ, ఎడముఖం పెడముఖంగా ఉండటంగానీ, నేనెప్పుడూ చూడలేదు'' అంటాడు డా.కింగ్. తల్లి ఆల్బర్టా. చదువు సంస్కారం కలిగిన వనిత. పెద్దగా కలిగిన కుటుంబంలో పుట్టకపోయినా, కాలేజీలో చదివించటానికి తగిన స్తోమత కలిగిన తండ్రికి ఆమె ఏకైక కుమార్తె. గర్వమనేది ఏకోశానా లేకుండా ఆమె పెరిగింది. మాటల్లో మంచితనం, మనసులో ఆప్యాయత ఆమె ఆభరణాలు. ఎదుటివారిని నొప్పించే స్వభావం ఆమెకు లేదు. తండ్రి మైకేల్ స్వభావం కాసింత భిన్నమైంది. ఆయన ముక్కుసూటి మనిషి. తనకు నచ్చని విషయాన్ని కుండ బొక్కలేసినట్టు ముఖాన్నే చెప్పేస్తాడు. జీవితంలో భయమంటే ఏమిటో ఎరుగని వ్యక్తి మైకేల్ కింగ్ సీనియర్. బలిష్టమైన శరీరంతో, మొండి ధైర్యంతో, జార్జియా వంటి కల్లోలిత రాష్ట్రంలో నిండుకుండలా కుటుంబాన్ని ఈదుకొచ్చిన మనిషి.

అట్లాంటాకు పద్దెనిమిది మైళ్ళ దూరంలోవుండే స్టాక్‌బ్రిడ్జ్ గ్రామం మైకేల్ కింగ్ సీనియర్ జన్మస్థలం. సంతానంగా తొమ్మిదిమందిని కలిగిన కుటుంబంలో అతడొక సభ్యుడు. తండ్రి వొక భూస్వామి కమతంలో కౌలుదారుడు. తప్పుడు లెక్కలతో ఆ భూస్వామి తన తండ్రి కష్టాన్ని దోచుకోవడం లోకం తెలియని మైకేల్ నిగ్రహించుకోలేక, భూస్వామి సమక్షంలోనే ఆ గుట్టును బట్టబయలు చేశాడు. ఫలితంగా, జీవనాధారమైన కౌలుభూమిని ఆ కుటుంబం కోల్పోయింది. కలిగిన కుటుంబాలకు బట్టలుతికి, ఇస్త్రీజేసి, తన తల్లి, అక్క తీసుకొచ్చే చిల్లర సంపాదన కుటుంబానికి ఆధారమైంది. పూటగడవడం బరువయ్యేకొద్దీ తండ్రిలో సహనం నశించడం మొదలయింది. ఉపశమనంకోసం తాగుడుకు బానిసయ్యాడు. తప్పతాగి ఇంటికొచ్చి, తన అక్కసునంతా కుటుంబంమీద తీర్చుకోవడం మొదలెట్టాడు. నడ్డివిరిగే చాకిరితో, జాలిగొలిపే పరిస్థితులతో సతమతమయ్యే తల్లి, చర్చి ప్రార్థనల్లోని ఓదార్పుకు అలవాటుపడింది. ప్రతి ఆదివారం, పిల్లలతో సహా, ఊర్లోవున్న చర్చికి హాజరై, ఆమె మనశ్శాంతిని పొందుతూ వచ్చింది. ఈ విధంగా, మైకేల్ కింగ్‌కు మతవిశ్వాసం తల్లిద్వారా సంక్రమించింది.

బడికైతే వెళ్ళేవాడుగానీ, మైకేల్‌కు చదువుచెప్పిన స్థలాన్ని 'బడి' అనేకంటే 'సంత' అనడం సబబుగా ఉంటుంది. అది నల్లజాతి పిల్లలకోసం ఏర్పాటైన బడి. అన్ని తరగతులకూ కలిసి విద్యార్థుల సంఖ్య 234. అన్ని తరగతులకూ కలిపి నియమించబడిన టీచరు వొకేవొక్కరు. పుస్తకాలు చదవడంవరకు మైకేల్‌కు తెలిసొచ్చిందిగానీ, వ్రాత అబ్బలేదు. చర్చితో ఏర్పడిన సాన్నిహిత్యంతో, మతబోధకునిగా ఎదగాలనే అభిలాష అతనిలో మొలకెత్తింది. ఆ కోరికకు చాలినంత బడిచదువు లేకపోయినా, జనరంజకమైన కంఠస్వరం అతనికి కొంత అవకాశం కల్పించింది. ప్రార్థనాగీతాల ఆలాపనతో చర్చి కార్యక్రమాల్లో ఇమిడిపోయాడు. మెలిమెల్లిగా, పెంపుడుజంతువుల దహనసంస్కారాలు నిర్వహించే స్థాయికి చేరుకున్నాడు. ఆ తరువాత, ఎన్నో అడ్డంకులు దాటుకుని, జోన్స్‌బరో అట్లాంటాల మధ్యనుండే ఒక చిన్నపల్లెటూరి చర్చికి పాస్టర్‌గా నియమితుడయ్యాడు.

ఎత్తుకు ఎదగాలనే కుతూహలముండే మైకేల్‌కు ఆ కుగ్రామం ఇరుకయింది. 1918లో అతడు అట్లాంటాకు మకాం మార్చేశాడు. ఏడాదిక్రితం అతని అక్క 'ఊడే' అట్లాంటా చేరుకుని స్థిరపడింది. మైకేల్ ఆమె ఇంటికి చేరుకున్నాడు. ఆమెద్వారా అతనికి ఎ.డి.విలియమ్స్ కుటుంబంతో పరిచయం ఏర్పడింది. మగసంతానంలేని విలియమ్స్ కుటుంబం అతన్ని ఆదరించి, చదువుకోటానికి ప్రోత్సహించింది. ఈ క్రమంలో, విలియమ్స్ కూతురు ఆల్బర్టాతో అతనికి చనువు ఏర్పడింది. 1924లో ఆ యిద్దరికీ ఎబనేజర్ బాప్టిస్టు చర్చిలో నిశ్చితార్థం జరిగింది. అప్పట్లో, చుట్టుపక్కలుండే చిన్నచిన్న చర్చిల్లో పాస్టర్‌గా పనిజేస్తూనే, బ్రేయన్ ప్రిపరేటరీ స్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్నాడు మైకేల్. అప్పటికే టీచర్ ట్రైనింగ్ పూర్తిజేసిన ఆల్బర్టా ఒక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరింది. ఆ బడిలో వివాహితలను ఉపాధ్యాయురాళ్ళుగా ఉంచుకునే సాంప్రదాయం లేనందున, ఆల్బర్టా ఉద్యోగజీవితం ఆట్టేకాలం కొనసాగలేదు.

1926లో ఆల్బర్టా, మైకేల్ల వివాహం ఎబనేజర్ చర్చిలో ఆడంబరంగా జరిగింది. నీగ్రో సమాజంలో గౌరవ మర్యాదలు కలిగిన విలియమ్స్ కుటుంబానికి మైకేల్ ఇల్లరికపు టల్లుడైనాడు. ఇంకా చదువుకోవాలనే తపన పెళ్లైంతరువాతగూడా అతన్లో తరగలేదు. అదే సంవత్సరం, మామగారి పలుకుబడితో, మూర్‌హౌస్ మతకళాశాలలో సీటు సంపాదించాడు. చదువులో పెద్దగా రాణించకపోయినా, విజ్ఞత కలిగిన మతబోధకునిగా పేరు సంపాదించుకున్నాడు.

మామగా గౌరవించడం కంటే, విలియమ్స్‌ను గురువుగా ఆరాధించేవాడు మైకేల్. నీగ్రోలకు కేవలం మతబోధకునిగా కాక, నల్లజాతి హక్కులకోసం విలియమ్స్ చేపట్టిన కృషి మైకేల్‌ను పెద్దగా ఆకర్షించింది. పంతొమ్మిదో శతాబ్దం చివర్లో, అమెరికాలో అంతర్యుద్ధం ముగిసిన తరువాత, నీగ్రో జాతీయుల్లో పౌరహక్కుల స్పృహ కలిగించేందుకు ఎ.డి.విలియమ్స్ చేపట్టిన చర్యలు మైకేల్‌కు మార్గదర్శకాలు. 1917లో నేషనల్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కలర్డ్ పీపుల్ (ఎన్.ఎ.ఎ.సి.పి.) ప్రాంతీయశాఖను అట్లాంటాలో నెలకొల్పిన వ్యవస్థాపక సభ్యుల్లో విలియమ్స్‌గూడా వొకడు. ఆ సంస్థ తరఫున, హీనమైన వసతులతో నల్లజాతి పిల్లలకోసం నడపబడే పాఠశాలల్లో పరిస్థితులు మెరుగుపరచడానికి పోరాడి, ఫలితం సాధించాడు.

అదే అడుగుజాడల్లో పౌరహక్కుల పోరాటాన్ని కొనసాగించిన వారసుడు మైకేల్. ఎన్.ఎ.ఎ.సి.పి. అట్లాంటా శాఖలో సభ్యుడై, ఆ తరువాత ఆ సంస్థకు అధ్యక్షుడైనాడు. జాతివివక్ష లేకుండా ఉపాధ్యాయుల జీతాలు సమంగా ఉండాలనే పోరాటం నడిపి, విజయం సాధించాడు. ఒకేరకం పనిజేసే వ్యక్తుల వేతనాల్లో జాతినిబట్టి హెచ్చుతగ్గులుంచడం అప్పటి అమెరికాలో ఆనవాయితి. ప్రభుత్వ సర్వీసుల్లోనూ అంతే, ప్రైవేటు కర్మాగారాల్లోనూ అంతే. పది బస్తాలు మోసిన తెల్లజాతీయునికిచ్చే కూలిలో, అదేపని చేసిన నల్లజాతీయునికిచ్చేది సగమే. ఈ తారతమ్యాన్ని వ్యతిరేకిస్తూ మొట్టమొదట ఉద్యమించిన ఉద్యోగులబృందం ఉపాధ్యాయులది.

1931లో ఎ.డి.విలియమ్స్ మరణించాడు. అతని స్థానంలో చర్చికమిటీ మైకేల్‌ను నియమించింది. ప్రఖ్యాతి గడించిన ఎబనేజర్ చర్చికి పాస్టర్ హోదాను మైకేల్ సంపాదించుకున్నాడు. మామగారి ఔన్నత్యాన్ని అందుకోవడం తొలిరోజుల్లో కష్టమనిపించినా, మతబోధనలో తనకున్న సామర్థ్యంతో క్రమంగా లోటును పూడ్చ గలిగాడు. ఏడాదిలోపే ఎబనేజర్ చర్చి సభ్యత్వం ఊహకుమించి పెరిగింది. దాంతోపాటు మైకేల్ ఆదాయంగూడా పెరిగింది. పెరిగిన ఆర్థికస్థోమత అతనికి విదేశాలు పర్యటించే అవకాశం కల్పించింది. 1934లో జరిగిన ప్రపంచ బాప్టిస్టు సమావేశంలో పాల్గొనటానికి అతడు బెర్లిన్‌కు చేసిన విదేశీయాత్రలో భాగంగా, ప్యారిస్, రోమ్, టునీసియా, లిబియా, ఈజిప్ట్, పాలస్తినా మొదలైన ప్రాంతాలను సందర్శించాడు. అతని విదేశీపర్యటన 'అట్లాంటా డైలీ వర్ల్డ్' పత్రికలో మొదటిపేజీ

వార్తగా ప్రచురించబడింది. పెరిగిన ప్రాముఖ్యత మైకేల్ పేరును మార్చేసింది. మైకేల్ లూథర్ కింగ్ అనే మనిషి మార్టిన్ లూథర్ కింగ్‌గా ప్రఖ్యాతుడైనాడు.

విదేశీపర్యటననుండి తండ్రి తిరిగొచ్చేనాటికి మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ఆరేళ్ళ బాలుడు. కింగ్, విలియమ్స్ కుటుంబాల్లో మొదటిసారిగా కలిగిన మగ సంతానం గాబట్టి, అతడు అమ్మమ్మ సెలెస్టాకు ముద్దులమనుమ డైనాడు. ఆప్యాయతలో పిల్లలమధ్య వ్యత్యాసం చూపే అలవాటు అతనితల్లి ఆల్బర్టాకు లేదు.

కింగ్ జూనియర్‌కు ఇద్దరు తోబుట్టువులు. ఆల్బర్టా మైకేల్ల తొలిసంతానం ఆడపిల్ల. 1927 సెప్టంబర్ 11న పుట్టింది. ఆ పిల్లను విల్లీ క్రిస్టిన్ పేరుతో పిలుచుకున్నారు. రెండో సంతానం కింగ్ జూనియర్. 1929 జనవరిలో పుట్టాడు. 1930 జూలైలో వారికి మరో మగశిశువు జన్మించాడు. తాతపేరుమీద అతన్ని ఆల్ఫ్రెడ్ డేనియల్ విలియమ్స్ అంటూ నామకరణం చేశారు. నామకరణం చేయడంలో ఇంటిపేర్లు తారుమారైనా అమెరికన్ నీగ్రోలకు పట్టింపులేదు. ఇంటిపేరును ఆఫ్రికాలోనే పోగొట్టుకుని అమెరికా చేరిన దౌర్భాగ్యమానవులు అమెరికన్ నీగ్రోలు.

“1691లో, అంటే ‘మతాచార్యుల తీర్థయాత్ర’కంటే ఏడాది ముందు, మొట్టమొదటి నీగ్రో ఈ భూభాగంమీద అడుగు మోపాడు. ఆ నీగ్రోలను ఆఫ్రికానుండి ఇక్కడికి తీసుకొచ్చారు. మతాచార్యులను తెచ్చుకున్నంత మర్యాదగా కాదు తీసుకొచ్చింది; నీగ్రోల ఇష్టానికి వ్యతిరేకంగా, సంకెళ్ళు తగిలించి తీసుకొచ్చారు. బానిస విధానం పరాకాష్ఠలో కొనసాగిన అలనాటి కాలమంతా నీగ్రోలను నోటితో చెప్పలేనంత అమానుషంగా హింసించారు. వాడుక పనిముట్టుగా తప్ప, ఆదరించదగిన మనిషిగా అతన్ని ఏనాడూ చూడనేలేదు.” - డా. కింగ్.

కాబట్టి, ఆఫ్రికాలో వాళ్ళ ఇంటిపేర్లు ఎలావుండేవో వేటాడి పట్టుకొచ్చిన వేటగాళ్ళకూ తెలీదు; వేలంపాటలో అమ్మిన దళారులకూ తెలీదు; అవసరంకోసం ఖరీదుచేసిన యజమానులకూ తెలీదు. ఏ బానిస ఏ యజమాని సరుకుగా ఉంటాడో, ఆ యజమాని ఇంటిపేరుతో బానిసను గుర్తిస్తారు. యజమాని మారితే ఇంటిపేరు మారుతుంది. కొత్తయజమాని ఇంటిపేరు బానిసకు సంక్రమిస్తుంది. బానిసకు కుటుంబం ఉండదు. దంపతులుగా కుదురుకోవచ్చు; సంతానాన్ని కనొచ్చు. కానీ, వాళ్ళ కుటుంబవ్యవస్థను యజమానులు గుర్తించరు. బానిసలకు కలిగిన సంతానం యజమాని ఆస్తిలో భాగమౌతుంది. ఇష్టమొచ్చినప్పుడు ఆ పిల్లలను అతడు అమ్ముకోవచ్చు; భార్యాభర్తలను విడివిడిగా అమ్ముకోవచ్చు. ఈ దారుణమైన

విధానం దాదాపు 200 సంవత్సరాలపాటు అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో నిరాఘాటంగా కొనసాగింది.

1863లో బానిసవిధానాన్ని రద్దుచేస్తూ అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ బిల్లును తీసుకొచ్చింతరువాత ఆ హీనమైన పరిస్థితి తొలగిపోయింది. కానీ, బానిసత్వాన్ని సమర్థించే దక్షిణాదిరాష్ట్రాలు కొత్తవిధానానికి సర్దుబాటు కాలేకపోయాయి. దీంతో, నీగ్రోలకు చట్టపరంగా బానిసత్వం చెల్లిపోయిందే తప్ప, నిజమైన స్వాతంత్ర్యం, సమానత్వం అందుబాటుకాలేదు. పాఠశాలల మొదలు తినుబండారాల దుకాణాల వరకు 'తెల్లవారికి మాత్రమే ప్రవేశం' అనే బోర్డులు దక్షిణాది రాష్ట్రాల సంస్కృతికి నిదర్శనంగా వెలిశాయి. హద్దులుమీరిన జాతివివక్ష దక్షిణాదిలో తాండవించింది.

'మనవాళ్ళు కాదు', 'మనతో సమానులు కాదు', 'మనకంటే తక్కువజాతి' అనిపించే వాతావరణం నీగ్రోలను పురిటినుండే వెంటాడింది. మూడేళ్ళప్రాయంలో వొక తెల్లజాతి పిల్లాడితో కింగ్ జూనియర్‌కు నేస్తం కలిసింది. అతడు ఆబర్న్-అవెన్యూలో వొక షాపుయజమాని కుమారుడు. రోజూ తండ్రివెంట ఆ ప్రాంతానికి వచ్చేవాడు. రోజంతా లూథర్ కింగ్‌తో కలిసిమెలసి ఆడుకునేవాడు. బడిలో చేరే వయసొచ్చిందాకా స్నేహం కొనసాగింది. ఇద్దరూ వొకే బడిలో చేరే అవకాశంలేదు. నల్లబడి వేరు, తెల్లబడి వేరు. చెరో బడిలో చేరి విడిపోయారు. సెలవురోజుల్లోగూడా ఆ ఆబ్బాయి కనిపించడం మానేశాడు. అనుకోకుండా వొకరోజు అదేవీధిలో అతడు ఎదురయ్యాడు. ''ఇంకెప్పుడూ నీతో కలవద్దన్నాడు మానాన్న'' అంటూ తప్పుకున్నాడు. ఏకైక మిత్రుని ఎడబాటు లూథర్ పసిగుండెల్లో కల్లోలం రేపింది.

ఇంటికి దగ్గర్లోవుండే 'అట్లాంటా లాబొరేటరీ పాఠశాల'లో చేర్పించారు లూథర్‌ను. పదమూడేళ్ళ ప్రాయంవరకు సరదాగా గడిచిపోయింది. 1942లో ఆ పాఠశాల మూతబడటంతో, అతన్ని 'బుకర్ టి వాషింగ్టన్ హైస్కూల్'కు మార్పించారు. ఆ బడి పట్టణానికి ఆవలివైపు ఉండటంతో, రోజూ సిటీబస్సులో వెళ్ళొచ్చేవాడు. ప్రయాణంలో పిల్లలకు ముందుసీట్లమీద ఉబలాటం ఎక్కువ. కానీ, దక్షిణ అమెరికా రాష్ట్రాల్లో ఆ సీట్లు తెల్లవారికోసం అట్టిపెట్టినవి. వేర్పాటువిధానం చాలా కఠినంగా అమలయ్యే రోజులవి. తెల్లవారికి కేటాయించిన సీట్లు ఖాళీగావున్నా, వాటిల్లో నల్లజాతీయులు కూర్చోవడం నేరం. కూర్చునేందుకు స్థలం దొరక్కపోతే నిలుచుని ప్రయాణంచెయ్యాలేగాని, వాటిల్లో కూర్చునే అర్హతలేదు. ఖాళీగావుండే

ముందుసీట్లను ఆశగా చూస్తూ, 'ఏదోవొకరోజు అక్కడ కూర్చోలేకపోతానా'అనే ధీమాతో నిలుచుని ప్రయాణం చేసేవాడు లూథర్.

''తెలిసీ తెలీని వయసులో పిల్లలడిగే ప్రశ్నలు ఏ నీగ్రో తలిదండ్రులనైనా ఎంత ఇరకాటంలో పడేస్తాయో, నా తల్లినిగూడా అంతే ఇరకాటంలో పడేసేవి. బానిసత్వాన్ని గురించీ, అంతర్యుద్ధాన్ని గురించీ వివరించడానికి ఆమె ప్రయత్నించేది. ఈ హెచ్చుతగ్గులు తనకు నచ్చవనిగూడా చెప్పేది. 'నువ్వు వాళ్ళకు ఎందులోనూ తీసిపోవ'ని బుజ్జగించేది'' అంటూ తన బాల్యాన్ని గుర్తుచేసుకుంటాడు డా. కింగ్ జూనియర్.

జాతివివక్షపట్ల అతని తండ్రి మైకేల్ నడవడిక మరింత కఠినంగా ఉండేది. కింగ్ జూనియర్ పుట్టకపూర్వంనుండి, సిటీబస్సుల్లో ప్రయాణించడం అతడు తనకుతానుగా మానుకున్నాడు. ఒకరోజు, నీగ్రో ప్రయాణికుల గుంపుమీద జరిగిన అమానుష దాడి కళ్లారా చూసి, అప్పటినుండి ఆ బస్సులెక్కడం మానేశాడు. తండ్రిలో వెల్లడయ్యే ఆత్మాభిమానం కింగ్ జూనియర్ జీవితానికి ఆదర్శం. స్కూల్లో చదువుకునే రోజుల్లో, బూట్లు కొనటానికి తండ్రితోపాటు ఒక చెప్పుల షాపులో ప్రవేశించాడు. ముందుభాగంలో ఖాలీగావున్న సీట్లల్లో తండ్రీకొడుకులు కూర్చున్నారు. షాపు గుమస్తాగా పనిజేసే తెల్లజాతి కుర్రోడు వాళ్ళ దగ్గరికొచ్చాడు.

''మీరు ఆ చివరిసీట్లకు రండి. మీకేం కావాలో నేను చూస్తాను.'' అన్నాడు.

''ఈ సీట్లు బాగానే ఉన్నాయి. ఇబ్బందేం లేదు.'' జవాబిచ్చాడు తండ్రి.

''మరేమనుకోకండి. మీరు చివరిసీట్లకు మారాలి.''

''కొంటే ఇక్కడే కూర్చుని కొంటాం. లేదంటే మాకు సరుకే వద్దు.'' అంటూ, కొడుకును చేత్తోపట్టుకుని బయటికి నడిచాడు.

మరో సందర్భంలో, ట్రాఫిక్ నిబంధనలు పాటించనందుకు మైకేల్ కారును ట్రాఫిక్ జవాను అడ్డుకున్నాడు.

''అబ్బాయ్! ఏదీ నీ లైసన్సు చూడనీ'' అడిగాడు జవాను.

పక్కన కూర్చున్న కొడుకును వేలితో చూపిస్తూ, ''ఇతన్ని అబ్బాయంటారు. నేను పెద్దవాణ్ణి. నన్ను అబ్బాయిగానే నువ్వు పిలవాలనుకుంటే, నీ మాటవినే అవసరం నాకు లేదు.'' అనే మైకేల్ జవాబుకు ట్రాఫిక్ జవాను ఖంగుతిన్నాడు.

పద్నాలుగేళ్ళ ప్రాయంలో ఉన్నప్పుడు, డబ్లిన్ పట్టణంలో స్కూలుపిల్లలకు జరిగిన వక్తృత్వ పోటీలో మార్టిన్ లూథర్ కింగ్ పాల్గొన్నాడు. 'నీగ్రో జీవితం, రాజ్యాంగం' అనేది అతడు మాట్లాడిన అంశం. పోటీలో మొదటి బహుమతి

సంపాదించుకుని, తన ఉపాధ్యాయిని శ్రీమతి బ్రాడ్లీతో కలిసి బస్సులో ఇంటికి తిరిగొస్తున్నాడు. దారిలో కొంతమంది తెల్లజాతీయులు బస్సులో ఎక్కారు. సీటును ఖాళీచెయ్యడంలో బ్రాడ్లీకీ, లూథర్‌కూ కాస్తా ఆలస్యం కాగానే, తెల్లడ్రైవరు బూతులు అందుకున్నాడు. లూథర్‌కు రోషమొచ్చింది. సీటు ఖాళీ చెయ్యనని మొండికేశాడు. టీచరు అతన్ని బుజ్జగించి సీటునుండి లేపి నిలబెట్టింది. తరువాతి తొంభైమైళ్ళు వాళ్ళ ప్రయాణం కాళ్ళమీదే నిలుచుని కొనసాగింది. అదొక పీడకలలా లూథర్‌ను జీవితాంతం పీడించింది.

కుమ్మరి సారెలా తిరిగే కాలచక్రంమీద మట్టిముద్దవంటిది మనిషి ఆలోచన. కళాకారుని స్పర్శలాగా ఆ ముద్దకు రూపం కల్పించేది సమాజం. బుద్దెరుగని దినాల మొదలు మనిషి అభిప్రాయాలనూ, నడవడికనూ సమాజంలోని ఆటుపోట్లు రూపకల్పన చేస్తాయి.

‘‘తెల్లమనిషిని ద్వేషించడం తప్పని అమ్మనాన్నా ఎంతగానో నచ్చజెప్పేవాళ్ళు. ఒక క్రిష్టియన్‌గా, వాళ్ళను ప్రేమించడం నా ధర్మమని నూరిపోసేవాళ్ళు. నన్ను నిలువునా చీలేస్తున్న మనుషులను ప్రేమించడం ఎలాగో నాకు తెలిసొచ్చేది కాదు.’’ అంటాడు మార్టిన్ లూథర్ కింగ్. మానసికంగా ఎదిగే రోజుల్లో అతని మనసులో విప్లవబీజాన్ని నాటింది సమాజం. కానీ, చిత్రమేమంటే, విప్లవకారుడు కాకుండా, అతడొక క్రిష్టియన్ మతబోధకుడుగా జీవితంలో ప్రవేశించాడు.

## కౌమారం

''నేను మతవిశ్వాసం కలవాణ్ణి. నేను పెరిగిందే ప్రార్థనామందిరంలో. నా తండ్రి మతబోధకుడు; తాత మతబోధకుడు; ముత్తాత మతబోధకుడు; నా తమ్ముడూ పినతండ్రి మతబోధకులు. ఇక నాకు మార్గాంతర మేముంది?'' అంటాడు డా. కింగ్. జోగాడే ప్రాయంనుండి ఎబనేజర్ చర్చి అతని రెండో ఇల్లు. కుటుంబసభ్యులందరూ మతారాధకులు. మొక్కుబడిగా కాక, అంకితభావంతో మతాన్ని ఆచరించే మనుషులు.

ఒకరోజు వర్జీనియానుండి పేరుమోసిన మతగురువు వాళ్ళ చర్చికి అతిథిగా వచ్చాడు. ఆదివారం ప్రార్థనాసమావేశంలో ఆసక్తిజనకంగా ఉపన్యాసమిచ్చాడు. ఉపన్యాసం ముగించి, బాప్టిజం తీసుకునేవాళ్ళుంటే ముందుకురమ్మని ఆహ్వానించాడు. అప్పుడు లూథర్ కింగ్ వయసు ఐదేళ్ళు. అందరికంటేముందు లూథర్ అక్క క్రిస్టిన్ మతం పుచ్చుకోటానికి సిద్ధపడింది. అది చూసి, తనుగూడా చేరాలనే తపన లూథర్‌ను ముందుకు నడిపింది. ''ఆరోజు నేను చేసింది మతంమీద విశ్వాసంతో గాదు. అక్కతో పోటీపడాలనే బాల్యచాపల్యం తప్ప మరేమీగాదు.'' అంటూ దాచకుండా ఒప్పుకుంటాడు డా. కింగ్.

మతం వివరించే కొన్ని విషయాలమీద అనుమానాలు పొడజూపడం అతని పదమూడవయేట మొదలయింది. మతగ్రంథాలను సందేహించడమే అపరాధంగా తలపోసేది చుట్టూవున్న ప్రపంచం. ఆదివారం సమావేశాలు నిర్వహించే మతగురువుల్లో పెద్దగా చదువుకున్నవాళ్ళు కరువు. గుడ్డిగా అనుసరించేవాళ్ళేగానీ, లోతుకు దిగి ఆలోచించేవాళ్ళు లేరు. బైబిల్‌మీద విమర్శలున్నాయని వాళ్లకు తెలీనైనా తెలీదు. విషయాన్ని తరచితరచి ప్రశ్నించే స్వభావం లూథర్‌ది. తర్కానికి తట్టుకోలేని సమాచారం దీర్ఘకాలం మనలేదని అతని అభిప్రాయం. ఏసుక్రీస్తు పునరుత్థానంమీద అతనికి నమ్మకం కుదరక, ఎంతోమంది పురోహితులకు ఇబ్బంది కలిగించాడు.

మతచర్చలోనేగాక, మిగతా నడవడికలోగూడా లూథర్‌లో ప్రవేశించిన మార్పు అతని తండ్రిని కాసింత కలవరపెట్టింది. తండ్రీకొడుకులను వేరువేరు వ్యక్తులుగా విడదీసేది నూనూగుమీసాల వయసు. అది పిల్లల్లో సొంత జీవితం మొలకెత్తే దశ. సరదాలకోసం మనసు పరుగులు తీస్తుంటుంది. పెద్దలకు నచ్చని సహవాసాలు కలుస్తాయి. పిక్నిక్‌లూ, డ్యాన్సులు వంటి వినోదాలంటే కింగ్ సీనియర్‌కు

ఈసడింపు. తండ్రిని ఎదిరించాలని లేకపోయినా, కట్టుబాట్లకు వొదగడం లూథర్‌కు కష్టమయింది. తండ్రికి ముఖం చాటేసి, స్నేహితులతో తిరిగే సమయం పెరిగింది. సరదాలు ఎక్కువైతే చదువు కుంటుబడడం సహజం. బొటాబొటిగా పరీక్షలు నెగ్గుతున్నాడేతప్ప, పాటవం కలిగిన విద్యార్థిగా పేరు తెచ్చుకోవడం అతనికి చేతగాలేదు.

ఐతే, మొదటినుండి ఉపన్యాసాలమీద అతనికి ఆసక్తి మెండు. విద్యార్థిదశ నుండి మంచి వక్తగా గుర్తింపు పొందాడు. శ్రోతలను ఆకర్షించే నైపుణ్యం అతనికి ఆ వయసులోనే పట్టుబడింది. చిన్నప్పటినుండి సామాజిక సమస్యలమీద ఏర్పడిన అవగాహన అతన్ని సమర్థుడైన ఉపన్యాసకునిగా తీర్చిదిద్దింది.

శరీరకష్టాన్ని తలవొంపుగా భావించే పనికిమాలిన సంస్కృతి అమెరికా యువతరంలో కనిపించదు. తీరిక సమయాల్లో విద్యార్థులుగూడా ఏదోవొక పని కుదిరించుకుని ఖర్చులకు సంపాదించుకుంటారు. అట్లాంటా పాఠశాలలో చదివే రోజుల్లో 'అట్లాంటా జర్నల్' అనే పత్రికను పంపకంజేసే కుర్రానిగా లూథర్ పని జేశాడు. బుకర్ టి వాషింగ్టన్ హైస్కూల్లో చేరినతరువాత తీరికసమయం కొరవడింది. అందువల్ల, సెలవుల్లో పనిజెయ్యటానికి వొక కర్మాగారాన్ని చూసుకున్నాడు. కూలీలుగా నలుపూ తెలుపూ జాతులు రెంటినీ అనుమతించే కర్మాగారమది. అక్కడ పనిజేసే సమయంలో లూథర్ దృక్పథం వికసించింది. దగాపడుతున్నది కేవలం నల్లవారు మాత్రమే కాదనీ, శ్రమదోపిడికి నిరుపేదలైన తెల్లవారు మినహాయింపు కాదనీ అతనికి కనువిప్పు కలిగింది. దాంతో, బాల్యంనుండి తెల్లజాతిమీద పెంచుకున్న ద్వేషం సడలింది.

అవి రెండో ప్రపంచయుద్ధం నడుస్తున్న దినాలు. చాలాకాలందాకా ఆ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోలేదు. కానీ, 1941 డిసెంబర్‌లో అమెరికా పడమటితీరాన్నుండే పెరల్ హార్బర్‌మీద నిష్కారణంగా జపాన్ దాడిచేసి, విధ్వంసం సృష్టించింది. ఇక యుద్ధంలో ప్రవేశించక అమెరికాకు తప్పిందిగాదు. ఆ సందర్భంలో, అర్హత కలిగిన కిందితరగతి విద్యార్థులను కాలేజిల్లో చేర్చుకునే వసతి ప్రభుత్వం కల్పించింది. దీంతో లూథర్‌కు అనుకోని అవకాశం చేతికి చిక్కింది. హైస్కూలు చదువు పూర్తికాకముందే, 1944లో మూర్‌హౌస్ కళాశాలకు జరిగిన ప్రవేశపరీక్షలో లూథర్ కింగ్ ఉత్తీర్ణుడైనాడు. అది తన తండ్రీ తాతలు చదివిన కళాశాల. ఎలాగైనా అందులో సీటు పొందాలనే పట్టుదలతో కృషిజేసి, మంచి మార్కులతో అర్హత సంపాదించాడు.

కాలేజిలో చేరేముందు, దాదాపు వందమంది సహాధ్యాయులతో కలిసి, మూర్‌హౌస్ కాలేజీకి అనుబంధంగా నడిచే సిమ్స్‌బరీ పొగాకు కార్ఖానాలో పని జేసేందుకు వెళ్ళాడు లూథర్. అది మొదటి ప్రపంచయుద్ధసమయంలో కనెక్టికట్ రాష్ట్రంలో ఏర్పాటైన కార్ఖానా. వేసవి సెలవుల్లో విద్యార్థులు అక్కడ పనిజేసి అంతోఇంతో సంపాదించుకోటానికి అనుమతిస్తారు. అంతటి సుదీర్ఘకాలం ఇంటికి దూరంగా గడపడం లూథర్ కది మొదటిసారి. ఆ యాత్ర తన జీవితాన్ని ఎంతో మార్చేసిందని లూథర్ కింగ్ అభిప్రాయం.

వాషింగ్టన్ డి.సి. దాటి ఉత్తరంగా పోతే, అక్కడ తెలుపూనలుపూ జాతిభేదం కనిపించదు. "ఇలాటిది ఉంటుందని నేను కలలోగూడా అనుకోలేదు. నేను స్వేచ్ఛగా ఎక్కడైనా తిరగొచ్చు, ఎక్కడైనా కూర్చోవచ్చు. బహిరంగస్థలాల్లో వాళ్ళూవీళ్ళూ అనే భేదమేలేదు. తెల్లవాళ్ళూ నల్లవాళ్ళూ ఒకే చర్చిలో కలిసి ప్రార్థన చేసుకుంటారు. నా జాతిమనిషి ఎంతపెద్ద రెస్టారెంటులోనైనా నిరాటంకంగా ప్రవేశించి, నలుగురితో కలిసి భోంచెయ్యొచ్చని నేనెప్పుడూ ఊహించనైనాలేదు." అంటూ తండ్రికి రాసిన ఉత్తరంలో లూథర్ కింగ్ ఆశ్చర్యపోతాడు.

అమెరికాదేశంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలు రెండు భిన్నమైన ప్రపంచాలు. పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన ప్రాంతం ఉత్తరాది. ప్రపంచ వాణిజ్యంలో అప్పటికే ఘనాపాటిగా నిలిచింది. అక్కడి నాగరికత వేరు, ఆ ఇంగ్లీషు యాస వేరు. ఆ యాసను దక్షిణాదివారు 'యాంకీ భాష' అంటారు. ఉత్తరాదివాళ్ళను యాంకీలని సంబోధిస్తారు. సంపూర్ణంగా వ్యవసాయంమీద బ్రతికేది దక్షిణాది. భాష ఇప్పటికీ యూరప్ యాసలో ఉంటుంది. అభిప్రాయాలూ, అలవాట్లూ గతకాలపు భూస్వాములకు దీటుగా ఉంటాయి. పుట్టుకతో మనుషులంతా సమానులనే సిద్ధాంతాన్ని దక్షిణాదిలో ఆమోదించరు. అందువల్ల, నల్లజాతితో కరచాలనంగూడా దిగజారుడుగా జమగడతారు. ఈ వాతావరణంలో పెరిగిన లూథర్‌కింగుకు ఉత్తరాది స్వేచ్ఛ వింతవింత అనుభూతులు కలిగించింది. ఉత్తరాదిలో ఉన్నన్నిరోజులూ తను మరో లోకంలో విహరిస్తున్న ఉత్సాహంతో గడిచిపోయింది.

సెలవులు కాగానే విద్యార్థులంతా స్వగ్రామాలకు వెనుదిరిగారు. అట్లాంటా చేరడానికి వాళ్ళు వాషింగ్టన్‌లో రైలు మారాలి. వాషింగ్టన్ రైల్వేస్టేషన్‌లో దిగగానే లూథర్‌కు తననెవరో ఆకాశంనుండి కిందికి తోసినట్టనిపించింది. హఠాత్తుగా అమెరికాకు తను పరాయివాడైనాడు. వేరువేరు వెయిటింగ్‌రూములూ, నీగ్రోలకోసం

విడదీసిన రైలుపెట్టెలు సాక్షాత్కరించాయి. సెలవుల్లో అనుభవించిన స్వేచ్ఛ నడిదారిలో చేజారిపోయింది. రైలుకు చిట్టచివర తగిలించిన 'జిమ్ క్రో' పెట్టెకు చేరుకోగానే గుండెలు పిండినట్లయింది. వేరుపాటు పద్ధతిపట్ల అదివరకు ఎన్నడూ ఎరుగనంత జుగుప్స అతని లేతమనసులో ఏర్పడింది. జిమ్ క్రో రైలుపెట్టె తన పుట్టుకను వెక్కిరిస్తున్నట్టు కనిపించింది.

'జిమ్ క్రో' అనే పదం గుర్తుకురాగానే గుండెల్లో కత్తి దిగినంతగా మార్టిన్ విలవిలలాడాడు. అది దక్షిణాది సంగీతరూపకాల్లో విధిగా కనిపించే హాస్యపాత్ర. నల్లటి రంగు పులిమి, నటుణ్ణి నీగ్రోలా తయారుచేస్తారు. సమానత్వానికి నీగ్రోలు అర్హులుకారని వెల్లడించడం ఆ పాత్ర కర్తవ్యం. అంతర్యుద్ధం రోజుల్లో, వినోదంకోసం తెల్లజాతి సృష్టించుకున్న ఈ పాత్ర, కాలక్రమంలో నల్లజాతిని కించపరిచే సాంకేతిక పదంగా ప్రాచుర్యం పొందింది. ఆ సాంప్రదాయాన్ని అనుసరించి, రైలుకు చివర్లో నల్లజాతికోసం తగిలించిన రైలుపెట్టెను 'జిమ్ క్రో'బోగీగా వ్యవహరిస్తారు.

మానసికంగా గాయపడిన లూథర్‌కు మూర్‌హౌస్‌కాలేజి వాతావరణం కాస్తా ఉపశమనాన్ని సమకూర్చింది. కాలేజిలో ప్రవేశించేనాటికి అతని వయసు పది హేనేళ్ళు. గుచ్చిగుచ్చి ప్రశ్నించే లూథర్‌కు, తృప్తికరమైన జవాబులు దొరికే ఖజానాలాగా మూర్‌హౌస్ కాలేజి ఉపయోగపడింది. అక్కడ ఏ విషయమైనా దాపరికంలేకుండా చర్చించొచ్చు. జీతాలకు ప్రభుత్వంమీద ఆధారపడిన ప్రొఫెసర్లు అందులో లేనందున, జాతులసమస్యమీద విపులంగా తెలుసుకునే అవకాశం అతనికి దొరికింది.

జాతులమధ్య హెచ్చుతగ్గులు, పేదరికం వంటి సామాజిక అంశాలు అప్పటికే లూథర్ ఆలోచనను ఆక్రమించాయి. తీరికసమయాల్లో చదవటానికి ఏరుకునే పుస్తకాలుగూడా ఆ కోవకు చెందినవే. అలాటి పుస్తకాల్లో హెన్రీ డేవిడ్ థోరో రచించిన 'సహాయ నిరాకరణ' అతనికి అందుబాటయింది. దుర్మార్గమైన వొక విధానాన్ని ఎదిరించడంలో సహాయనిరాకరణ ప్రాముఖ్యత అతనికి వింతగా కనిపించింది. ఆ పుస్తకాన్ని పదేపదే చదివాడు. ఎన్నిసార్లు చదివినా అందులో కొత్తదనం కనిపించేది. అతనికి తెలీకుండానే, థోరో అభిప్రాయాల ప్రభావం లూథర్‌ను బలంగా తాకింది.

జాతుల సమానత్వంకోసం పాటుబడే ధ్యేయంతో పనిజేస్తున్న సామాజిక సంస్థలో లూథర్ సభ్యుడైనాడు. ఎన్.ఎ.ఎ.సి.పి. మూర్‌హౌస్ విద్యార్థిశాఖకు

అనతికాలంలోనే అధ్యక్షుడైనాడు. ఆ హోదాలో, జార్జియారాష్ట్రంలోని అంతర్ కళాశాల కౌన్సిల్‌కు తరచు హాజరయ్యేవాడు. నీగ్రోల సమస్యలమీద పోరాడుతున్నది కేవలం నీగ్రోలే కాదనీ, ఈ బృహత్తర ప్రణాళికలో ఎంతోమంది తెల్లవారు, ముఖ్యంగా యువకులు, భాగస్వాములుగా ఉన్నారనీ, అప్పుడుగాని అతనికి తెలిసిరాలేదు. పరిచయాలు పెరిగేకొద్దీ ఆ మిత్రుల నిజాయితీమీద అతనికి నమ్మకం కుదిరింది.

సమాజసేవలో నిమగ్నం కావాలనే అభిలాష లూథర్‌కు చిన్నప్పుడే ఏర్పడింది. డాక్టరో, లాయరో ఐతే ప్రజలకు ఎక్కువగా అందుబాటులో ఉండొచ్చని అతని భావన. మతబోధకుడుగూడా ప్రజలకు సన్నిహితుడేనని అతని తండ్రి మైకేల్ అభిప్రాయం. పాస్టర్‌వృత్తి తీసుకోమని ఒత్తిడి చెయ్యకపోయినా, తండ్రి మనసు ఆవైపే లాగుతూందని లూథర్‌కు తెలుసు. ఈ విషయంగా ఏ అభిప్రాయం వెల్లడించంది తల్లి. పిల్లలు దేన్ని ఇష్టపడితే ఆ మార్గంలో పోనివ్వాలంటుం దామె. పూజాకార్యక్రమాల్లో అప్పుడప్పుడు తండ్రికి సహాయపడ్డాడేతప్ప, పాస్టర్ కావాలనే ఉద్దేశం లూథర్‌కు లేదు. అతనితో చాలా సన్నిహితంగా మెదిలే సహాధ్యాయుడు వాల్టర్ మెకాల్ మతబోధనకు మొగ్గుచూపడంతో, లూథర్ ఆలోచన డోలాయమానంలో పడింది.

ఈలోపుగా, డా.బెంజమిన్-ఇ-మేస్ తో లూథర్‌కు చనువు ఏర్పడింది. మూర్‌హౌస్ కళాశాలకు మేస్ ప్రధాన అధ్యాపకుడు. ఆయన ఆ కాలేజిలో పనిజేయడాని కొచ్చిన మొట్టమొదటి పి.హెచ్‌డి. స్కాలరు. దిగజారిపోయిన మూర్‌హౌస్ కాలేజి ప్రతిష్టను పునరుద్ధరించిన సమర్థుడు. 1938లో ప్రచురింపబడిన 'నీగ్రో గాడ్' పుస్తకరచయిత. భారతదేశంలో పర్యటించి గాంధేయ సిద్ధాంతాన్ని ఆకలింపు చేసుకొచ్చిన సంస్కర్త. వీటికితోడు, ఆయన మతబోధకునిగా వృత్తి కొనసాగిస్తున్నాడు. చర్చి ఉపన్యాసాల్లో సామాజిక చైతన్యాన్ని మిళితం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందనీ, ఆ పని అమెరికన్ చర్చిల్లో జరగడంలేదనీ ఆయన ఆవేదన. "భయపడటం మానుకున్నరోజు అణగారినజాతి స్వేచ్ఛను పొందుతుంది" అంటాడాయన. సామాజిక సేవలో చర్చికుండే పాత్ర తేలికైంది కాదని ఆయన మూలంగా లూథర్‌కు తెలిసొచ్చింది.

లూథర్‌ను తీర్చిదిద్దిన వ్యక్తుల్లో డా.జార్జ్ కెల్సీ మరొకడు. ఆయనగూడా పి.హెచ్‌డి. పొందిన స్కాలరే. తత్వశాస్త్రంలో పండితుడు. 'మతము, తాత్విక చింతన' అనే అంశంమీద పాఠాలు చెబుతాడు. మతారాధకుడేగానీ ఛాందసవాది

కాదు. బైబిల్‌ను విమర్శనాత్మకంగా వివరించడంలో ప్రజ్ఞాశాలి. సందేహాలను తీర్చుకోటానికి లూథర్ తరచు ఆయన ఇంటికి వెళ్ళేవాడు. బైబిల్‌మీద చర్చి ప్రసంగాల్లో విన్నదానికీ, కాలేజిలో తెలుసుకున్నదానికీ ఎంత వ్యత్యాసముందో లూథర్‌కు అర్థమైంది. శాస్త్రీయ విజ్ఞానాన్ని సనాతన గ్రంథాలతో సమన్వయించే పరిజ్ఞానం డా.కెల్సీ మూలంగా లూథర్‌కు కరతలామలకమైంది.

చర్చిలకు పాస్టర్లుగా నియమితులౌతున్న వ్యక్తులంతా దాదాపు నిరక్షరాస్యులే. బైబిల్‌ను చెప్పడంలోనూ, అర్థంచేసుకోవడంలోనూ చోటుజేసుకునే పొరబాట్లకు కారణం వారి అజ్ఞానం. మూఢభక్తిగల శ్రోతలు గురువులు చెప్పిందాన్నే స్వీకరిస్తారు. ప్రజల్లో మతవిశ్వాసం ప్రబలంగా ఉన్నందున, ప్రార్థనా సమావేశాలకు తండోప తండాలుగా జనం హాజరౌతారు. కానీ, వాళ్ళను చైతన్యపరిచే సామర్ధ్యం పూజారుల ప్రసంగాల్లో ఏకోశానా కనిపించదు. మతబోధనతో సర్వేశ్వరుని సేవతోపాటు సమాజానికిగూడా సేవజేసే అవకాశముందని లూథర్ మనసు నిదానంగా అంగీకరించింది. కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహిస్తే, గౌరవంలో ఏ ఇతర వృత్తికీ పాస్టర్ వృత్తి తీసిపోదని చివరకు నిర్ధారించుకున్నాడు.

# యవ్వనం

1948 జూన్‌లో లూథర్ డిగ్రీచదువు పూర్తయింది. ఆలోపుగా, డాక్టరో లాయరో కావాలనే ఉబలాటం మాసిపోయింది. పాస్టర్‌గా స్థిరపడాలనే అభిప్రాయం దాదాపు ఖరారైందిగానీ, అంతటితో చదువు మానెయ్యాలనిలేదు. మాస్టర్ డిగ్రీ సంపాదించాలనే కోరిక అతన్లో బలంగా పాతుకుపోయింది. పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌కు పెన్సిల్వేనియా రాష్ట్రంలోని 'క్రోజర్ ఆధ్యాత్మిక కళాశాల' తనకు తగిన విద్యాసంస్థగా ఎన్నుకున్నాడు. అది తన అధ్యాపకులైన బెంజమిన్ మేస్, జార్జ్ కెల్సీలను తీర్చిదిద్దిన కళాశాల.

అందుకు లూథర్ తండ్రి వొకపట్టాన అంగీకరించలేదు. పైచదువు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పాస్టర్ కావాలనుకున్నాక పైచదువుతో పనిలేదని మైకేల్ అభిప్రాయం. ఆ రోజుల్లో డిగ్రీ పూర్తిజేసిన పాస్టర్లే అబ్బురం. చర్చికి హాజరయ్యే పాటకజనానికి బైబిల్‌నుండి నాలుగు ముక్కలు ఏకరువు పెట్టేందుకు అంతోఇంతో అక్షరజ్ఞానంతో సరిపుచ్చేది ఆనాటి అవసరం. మాస్టర్ డిగ్రీతో ఆ పనిలో దిగాలను కోవడం వెర్రితనంకింద జమగట్టాడు మైకేల్. మరో అనుమానంగూడా మైకేల్ మనసులో లేకపోలేదు. చాలా దూరంలోవుండే ఉత్తరాదిరాష్ట్రం పెన్సిల్వేనియా. ఉత్తరాది స్వేచ్ఛా వాతావరణం తన కొడుకును ఇదివరకే మచ్చిక చేసుకుందని అతనికి తెలుసు. ఆ వాతావరణానికి అలవాటుపడిన మనిషి చదువైపోగానే ఇంటికి తిరిగొస్తాడనే నమ్మకం లేదు. మాస్టర్ డిగ్రీ పూర్తైతే అక్కడే ఉండిపోటానికి కావలసినన్ని అవకాశాలు ఎవరికైనా తరుముకొస్తాయి.

కానీ, లూథర్ లక్ష్యం అదిగాదు. బ్రతుకుతెరువుకైతే ఈ చదువు చాలని తనకూ తెలుసు. నీగ్రో మనస్తత్వమే నీగ్రోను ఎదక్కుండా అడ్డుకుంటుందనే అపవాదును వమ్ముచెయ్యాలనేది అతని పట్టుదల. అవకాశమిస్తే ఏవొక్కడు తెల్లజాతికి తీసిపోడని నిరూపించాలనేది అతని ఆరాటం. ఏ నీగ్రో 'జిమ్ క్రో'గా మిగిలిపోరాదు. ఆ స్థాయిదాటి వీలైనంత దూరం వెళ్ళిపోవాలి. యువకునిగావున్న రోజుల్లో ఇదే ఆవేదన అతని తండ్రిలోగూడా ఉండేవుంటుంది. కాకపోతే, పాస్టర్‌గా పనిజేస్తూ, పెళ్ళయిన తరువాత కాలేజిలో చేరే అవసరమేముంది?

ఎలాగో నచ్చజెప్పి తండ్రిని ఒప్పించాడు లూథర్. 1948 సెప్టెంబర్‌లో, పంతొమ్మిది సంవత్సరాల వయసుతో, క్రోజర్ థియొలాజికల్ కళాశాల ప్రాంగణంలో

సగర్వంగా కాలుమోపాడు.

లూథర్ కుతూహలానికి తగినంత మేత దొరికే దివానం క్రోజర్ కళాశాల. అది పుస్తకాలతో నిండిన గ్రంథాలయానికీ, విజ్ఞానంతో పండిన అధ్యాపకులకూ నిలయం. సందేహాలతో దగ్గరికొచ్చిన ఏ విద్యార్థికైనా సరైన దారి చూపడంలో అక్కడి ప్రొఫెసర్లకు విసుగూలేదు, విరామంలేదు.

ఆ వాతావరణంలో లూథర్ అరమరికలు లేకుండా ఇమిడిపోయాడుగానీ, ఎంత గింజుకున్నా వదలని గిలి* అతన్ని చివరిదాకా వెంటాడింది. కాలేజీ మొత్తానికి నీగ్రో విద్యార్థులు కేవలం పదకొండుగురు. తెల్లవారితో కలిసి తరగతిలో కూర్చోవడం అతనికి అదే మొదటి అనుభవం. తెల్లజాతి బుర్రలో నీగ్రోల అలవాట్లమీద కొన్ని స్థిరమైన అభిప్రాయాలున్నాయని అతనికి తెలుసు. నీగ్రోలకు పరిశుభ్రత పాటించే అలవాటుండదనీ, సోమరిపోతులనీ, గొంతు చిరిగిపోయేంత బిగ్గరగా మాట్లాడు కుంటారనీ, పిల్లలు జడుసుకునేంత పెద్దగా పగలబడి నవ్వుతారనీ వారి అభిప్రాయం. అందువల్ల, ముస్తాబు చేసుకోవడంలో మితిమీరిన జాగ్రత్త లూథర్‌కు అలవాటైంది. క్లాసుకు చేరడం వొక్క నిమిషం ఆలస్యమైనా, అందరూ తననే గమనిస్తున్నారనే గిలితో కుంచించుకుపోతాడు.

ఆధ్యాత్మిక విజ్ఞానంతోబాటు సామాజిక సిద్ధాంతాలనుగూడా లోతుగా పరిశీలించడానికి లూథర్ పూనుకున్నాడు. ప్లాటో, అరిస్టాటిల్ వంటి అనాది మేధావుల మొదలు రూసో, కార్ల్ మార్క్స్ వరకుండే సిద్ధాంతకర్తల రచనలను కుదురుగా అధ్యయనం చేశాడు. సిద్ధాంతాల్లో ఎంత భిన్నత్వమున్నా, అందరూ ఏకీభవించే విషయ మొకటుందని అతని దృష్టిలో పడింది. పేదరికం, జీవనాధారం వంటి సామాజిక అంశాలకు ముసుగేసి, తమ ప్రబోధాన్ని అంతరాత్మలకే పరిమితంజేసే ఏ మతమైనా మృతప్రాయమైందనీ, అది భూస్థాపితం కావడానికి ఎంతోకాలం పట్టదని నిస్సందేహంగా అతడు తేల్చుకున్నాడు.

కానీ, ఎంత దేవులాడినా, తన ఆంతర్యాన్ని వేధిస్తున్న సామాజిక సమస్యలకూ, తన నరాల్లో జీర్ణించిన మతవిశ్వాసానికీ తృప్తికరమైన సమన్వయం లూథర్‌కు దొరకలేదు. ఆధ్యాత్మిక గ్రంథాలు పరలోకానికి ప్రాముఖ్యత నిస్తూంటే, మార్క్సిజానికి భౌతికసంపదే పరమార్థం. ఆత్మకు నైతికత ఎంత అవసరమో, జీవితానికి భౌతిక సంపద అంతే అవసరం.

---

*గిలి: తనను లోకువగా చూస్తున్నారేమో ననే అనుమానం

ఒకరోజు, హోవర్డ్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు డా.మోర్డెకాయ్ జాన్సన్ ఉపన్యాసం వినటానికి లూథర్ ఫిలడెల్ఫియా వెళ్ళాడు. ఆధ్యాత్మిక సిద్ధాంతంమీద ప్రఖ్యాతుడైన పండితుడు జాన్సన్. ఇటీవలే ఆయన భారతదేశం పర్యటించివచ్చాడు. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీని గురించి జాన్సన్ చేసిన ప్రసంగం లూథర్‌ను ఉత్తేజంతో నింపింది. గాంధీకి సంబంధించిన పుస్తకాలు కొనటానికి లూథర్ హుటాహుటి బజారుకు పరిగెత్తాడు. దొరికినన్ని పుస్తకాలు సేకరించి చదవడం మొదలెట్టాడు.

గాంధీ పేరును అదివరకు చాలాసార్లు విన్నాడుగానీ, ఆయన సిద్ధాంతం గురించి లూథర్‌కు అవగాహనలేదు. 'సత్యాగ్రహం' అంటే ఏమిటో ఇప్పుడు తెలుసుకున్నాడు. 'ఒక చెంపమీద కొడితే రెండో చెంప చూపించు' అనే మాటల ఆంతర్యం అర్థంచేసుకున్నాడు. సిద్ధాంతాన్ని పుస్తకాలకు పరిమితం చెయ్యకుండా, భారతదేశంలో ఆ విధాన్నాన్ని గాంధీజీ స్వయంగా అమలుజేసిన తీరు లూథర్‌ను ఆకట్టుకుంది. 'నీ విరోధులను ఆదరించు' అనే జీసెస్ ప్రవచనం వ్యక్తులమధ్య జరిగే సంఘర్షణకు జవాబు కావచ్చుగానీ, జాతులమధ్య జరిగే సంఘర్షణకు చాలదనే అభిప్రాయం ఇదివరకు అతనికుండేది. భారతదేశంలో అహింసావిధానం సాధించిన ఫలితాలు అతని పాత అభిప్రాయాన్ని తలకిందులు చేసేశాయి.

క్రోజర్ విద్యాభ్యాసం లూథర్‌కు తృప్తికరంగా ముగిసింది. 1951 మార్చిలో తన మాస్టర్ డిగ్రీని ప్రథమశ్రేణిలో పూర్తిజేశాడు. అనేక ఉత్తరాది విద్యాలయాలనుండి ఉద్యోగానికి ఆహ్వానిస్తూ వర్తమానాలు అందుతున్నాయి. ఐతే, అప్పుడే ఉద్యోగంలో చేరే ఉద్దేశం అతనికి లేదు. బోస్టన్ యూనివర్సిటీలో చేరి, డా. ఎడ్గర్ బ్రైట్‌మన్ మార్గదర్శకత్వంలో డాక్టరేట్ సాధించాలనేది అతని తపన.

తండ్రితో అనుమతి పొందడం లూథర్‌కు ఇప్పుడొక సమస్యగాదు. అట్లాంటా నగరమంతా లూథర్ ప్రయోజకత్వాన్ని మెచ్చుకుంటూంటే తలిదండ్రులు లోలోపల పొంగిపోతున్నారు. అడిగిందే తడవుగా అతని కోరిక చెల్లిస్తున్నాడు తండ్రి. అడక్కుండానే కొడుక్కోసం కొత్త చెవర్లే కారును కొన్నాడు. తలిదండ్రుల ఆశీర్వాదంతో, కొత్త చెవర్లే కారులో, 1951 సెప్టెంబర్‌లో లూథర్‌కింగ్ బోస్టన్ యూనివర్సిటీలో పి.హెచ్‌డి. విద్యార్థిగా నమోదయ్యాడు. 'మతము, ఆధ్యాత్మికత' అనే అంశంమీద పరిశోధన మొదలెట్టాడు.

అనుకున్న పంథాలో జీవితం సాగుతున్నందుకు లూథర్ మనసు తేలికపడింది. క్రోజర్‌లో వేసుకున్న పునాది బోస్టన్ చదువును అతనికి సులభతరం చేసింది.

కాలక్షేపానికి కోరినంత తీరుబాటు దొరికింది. వసంతాలు పూసే వయసుగాబట్టి చుట్టూ అమ్మాయిలు చేరుతున్నారు. పొందికైన శరీరం, చిరునవ్వుతో కళకళలాడే అతని ముఖం నల్లమ్మాయిలనే కాకుండా తెల్లమ్మాయిలనుగూడా ఆకర్షించింది. హద్దులుమీరని చనువుతో అందరికీ మంచి మిత్రుడుగా మసలుకున్నాడు లూథర్. ఈదశలో అతనికి మధురగాయని కొరెట్టా స్కాట్‌తో సహవాసం కలిసింది.

లూథర్‌లాగే చదువుకోసం దక్షిణాదినుండి బోస్టన్ కొచ్చిన యువతి కొరెట్టా స్కాట్. అలబామా రాష్ట్రంలో మేరియన్ పేరుగల పల్లెటూరు ఆమె స్వగ్రామం. జార్జియా అలబామాలు ఇరుగుపొరుగు రాష్ట్రాలు. కింగ్ కుటుంబంతో పోలిస్తే ఆమెది పేదకుటుంబమనే చెప్పొచ్చు. సంగీతంలో పట్టా పొందటానికి బోస్టన్ 'న్యూ ఇంగ్లండ్ కన్సర్వేటరీ'లో స్కాలర్‌షిప్ సహాయంతో చదువుతూంది. తండ్రి ఓబియా స్కాట్ వొకప్పుడు రైతు. వ్యాపారంమీది మోజుతో పెట్రోల్‌బంకుకు చిన్న కిరాణాకొట్టు జతజేసి నడుపుతున్నాడు. అదనంగా కోళ్ళఫారాలూ, కోతమిషన్లవంటి ఏవేవో వ్యాపకాలకోసం ఎప్పుడూ తాపత్రయపడుతుంటాడు. అతన్తో వ్యాపారం మాన్పించటానికి తెల్లమనుషులు చెయ్యని ఆటంకమంటూలేదు. ఇంటిని తగలబెట్టారు. కొత్తగా కొన్న కోతమిషన్ను తగలబెట్టారు. కానీ, ఓబీ మొండిమానవుడు. దేనికీ బెదరకుండా వ్యాపారం కొనసాగించాడు. అతని భార్య బెర్నిస్ మంచి గాయని. ఆమెద్వారా కూతురు కొరెట్టాకు సంగీతం సంక్రమించింది.

కొరెట్టా లూథర్‌ల తొలికలయిక అచ్చంగా పెళ్ళిచూపుల పక్కీలో జరిగింది. బోస్టన్‌లో చేరిందిమొదలు లూథర్‌కు పెళ్ళిచేసుకోవాలనే కోరిక చిగురించింది. భాగస్వామినిఎన్నుకునే ప్రయత్నాలు మనసులోనే మొదలెట్టాడు. తెలిసిన అమ్మాయి లందరిని బేరీజు వేసుకున్నాడు. ఏవొక్కరు నచ్చలేదు. ఎడతెగని ఆలోచనతో బుర్ర వేడెక్కింది. సలహాకోసం చిన్ననాటి స్నేహితురాలు మేరీ పావెల్‌ను ఆశ్రయించాడు.

"నీ ఎరుకలో అందమైన అమ్మాయి లెవరైనా ఉన్నారా?"

"బోలెడుమంది. మా కాలేజిలో కొరెట్టా స్కాట్ అనే అమ్మాయుంది. ఆమైతే నీకు సరిపడే జోడని అనుకుంటున్నాను."

కొరెట్టాను ఫోనులో కలిపింది.

"మీ గురించి మేరీ గొప్పగా చెప్పింది. అభ్యంతరం లేకుంటే మీతో కలవాలనుకుంటున్నాను."

కొరెట్టా సరేనంది.

“ఎక్కడికైనా వెళ్ళి భోంచేద్దాం. నేనొచ్చి మిమ్మల్ని తీసుకెళతాను. నాకు కారుంది. ఆకుపచ్చ చెవర్లే కారు. రేపు ఏడుగంటలకు రానా?”

మరుసటిరోజు ఇద్దరూ కలిశారు. చాలాసేపు మాట్లాడుకున్నారు. అనుకోకుండా వాళ్ళ సంభాషణ జాతివివక్ష, పేదరికం తదితర సాంఘికసమస్యల వైపు మళ్ళింది. అభిప్రాయాల్లో వారిమధ్య ఊహించనంత సామ్యం కనిపించడం లూథర్‌ను ఆశ్చ ర్యంలో ముంచింది.

“నల్లోల్లంటే చులకనభావం ఉత్తరాదిలో తక్కువేంలేదు. కాకపోతే పైకి కనిపించనివ్వరు. ఒకవిధంగా చూస్తే దక్షిణాదే నయం. ఉన్నదేదో బహిరంగంగా తెలిసిపోతుంది.” అంది కొరెట్టా.

ఆ తరువాత వాళ్ళిద్దరూ లెక్కలేనన్నిసార్లు కలుసుకున్నారు. ఏడాది పైగా వొకరినొకరు అర్థంచేసుకున్నారు. పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. తల్లికి ఫోన్ చేసి, సమాచారాన్ని ఇంటికి చేరేశాడు లూథర్.

బండి మరోసారి గతుకుల దారిలో ప్రవేశించింది. కొరెట్టా కుటుంబంనుండి అడ్డంకులు అంతగా ఎదురవలేదుగానీ, లూథర్ తండ్రి పెనరెక్క వేశాడు. పొరుగు రాష్ట్రంతో సంబంధం చేసేకంటే, అట్లాంటా సంబంధం దగ్గరగా ఉంటుందని మైకేల్ ఆలోచన. పిల్లనివ్వటానికి అట్లాంటాలోని సాంప్రదాయ కుటుంబాలెన్నో ముందుకొస్తున్నాయి. తన స్థాయికి తగిన కుటుంబంతో వియ్యమందాలని మైకేల్ కోరిక.

ఇది ఇలా నలుగుతుండగా, బోస్టన్‌లో జరిగిన మరో సంఘటన లూథర్ మనసును మరింత గాయపరిచింది. అతన్ని బిడ్డలా ఆదరించే ప్రొఫెసర్ డా. బ్రైట్‌మన్ హఠాత్తుగా మరణించాడు. ఈ దెబ్బలనుండి కోలుకోటానికి లూథర్‌కు కొంత సమయం పట్టింది. ఈ లోపల కాలేజిచదువు తగ్గుముఖం పట్టింది. ప్రథమ శ్రేణినుండి క్లాస్‌రూం మార్కులు రెండూ మూడూ శ్రేణులకు దిగజారిపోయాయి.

లూథర్ పరిస్థితి తెలుసుకున్న తలిదండ్రులు హుటాహుటి బోస్టన్ చేరు కున్నారు. కొడుకును సముదాయించారు. కొరెట్టాతో అన్నివిషయాలు నిర్మొగమాటంగా మాట్లాడారు. చివరకు, వాళ్ళిద్దరి వివాహానికి ఆమోదం తెలిపి, ఇంటికి తిరిగొచ్చారు. 1953 ఏప్రిల్లో ఎబనేజర్ చర్చి వేదికనుండి కొరెట్టా లూథర్‌ల నిశ్చితార్థం ప్రకటిం చారు. బరువు దిగిన గుండెలతో, ఒత్తిడి తొలగిన మెదడుతో లూథర్ తన ఫైనల్

పరీక్షలు బాగా రాశాడు. 1953 జూన్ 5వ తేదీన విజయవంతంగా పి.హెచ్‌డి. పూర్తిజేశాడు.

1953 జూన్ 18వ తేదీన, వధువు స్వగృహంలో కొరెట్టా లూథర్‌ల వివాహం నిరాడంబరంగా జరిగింది. హనీమూన్‌కోసం కొత్తదంపతులు మేరియన్ టౌనుకు కారులో చేరుకున్నారు. ఆ టౌన్లోని హోటలన్నీ తెల్లవారివే. దిగడాని కెవ్వరూ చోటివ్వలేదు. చివరకు, దహనసంస్కారాలకు ఉపయోగించే చిన్న కుటీరంలో వాళ్ళ తొలిరాత్రి గడిచిపోయింది.

మరుసటిరోజు అట్లాంటా వచ్చేశారు. ఆ ఆదివారం లూథర్ తండ్రి ఆర్భాటంగా విందు ఏర్పాటుచేశాడు. సొంతింట్లో కొద్దిరోజులు గడిపి కొరెట్టా లూథర్‌లు బోస్టన్‌కు తిరుగు ప్రయాణం కట్టారు. కొరెట్టా డిగ్రీ ఇంకా పూర్తికావలసివుంది. లూథర్‌కు థీసిస్ సమర్పించే పని ఇంకా కొదవుంది. ఇవి పూర్తయిందాకా బోస్టన్‌లో ఉండాలనుకున్నారు. నార్తాంప్టన్ వీధిలో వొక అపార్ట్‌మెంటు అద్దెకు తీసుకుని అందులో కాపురం చేరారు.

# ఉద్యోగం

చీకూచింతా లేకుండా కాలేజి నడవల్లో దర్జాగా తిరిగే సదుపాయం ముగిసింది. ఇక సొంతకాళ్ళమీద నిలబడే ఏర్పాట్లు చేసుకోవాలి. ఉద్యోగం పిలుపులు మీదమీద అందుతున్నాయి. విద్యాలయాలూ పిలుస్తున్నాయి, చర్చీలూ పిలుస్తున్నాయి. పాస్టర్ కావాలనేదే లూథర్ కోరిక. కానీ, అధ్యాపకవృత్తివైపు అప్పుడప్పుడు చెవి పీకుతూంది. దానికితోడు, విద్యాలయాలనుండి వస్తున్న ఆహ్వానాలు చాలా ఆకర్షణీయంగా కనిపించాయి. ఐనా, ఆ ఉద్యోగాల్లో మానసిక సంతృప్తి దొరుకుతుందనే నమ్మకం అతనికి కలగడంలేదు.

ఇంతలో మాంట్గోమెరీ నగరంలోని 'డెక్స్టర్ అవెన్యూ బాప్టిస్ట్ చర్చి'నుండి అతనికో ఉత్తరం అందింది. ప్రస్తుతం అక్కడ పాస్టర్గా ఎవరూ లేరట. లూథర్ ఆ ప్రాంతానికి రావడం తటస్థిస్తే, తమ చర్చిలో వొక సమారాధన నిర్వహించాలని ఆ చర్చికమిటీ అభ్యర్థించింది. గొప్ప చరిత్రగలిగిన సంస్థ డెక్స్టర్ అవెన్యూ చర్చి. వారి ఆహ్వానమే వొక గౌరవం. క్రిస్టమస్ సెలవుల్లో అట్లాంటా వస్తున్నాననీ, జనవరిలో వొక ఆదివారం అక్కడికి రాగలననీ లూథర్ జవాబిచ్చాడు.

1954 జనవరిలో వొక శనివారంరోజు అట్లాంటానుండి మాంట్గోమెరీకి లూథర్ బయలుదేరాడు. జాతీయరహదారిమీద కారులో నాలుగ్గంటల ప్రయాణం. అదివరకు మాంట్గోమెరీ మీదుగా చాలాసార్లు ప్రయాణించాడుగానీ, ఆ నగరంలో విడిదిచేసే అవసరం అతనికి ఎప్పుడూ కలుగలేదు. అలబామా నదివొడ్డున నిర్మించిన అందమైన రాజధాని నగరం మాంట్గోమెరీ. అమెరికా సంయుక్తరాష్ట్రాల్లోవుండే అతిపురాతన పట్టణాల్లో అదొకటి. శిల్పసౌందర్యానికేగాక, చారిత్రిక ప్రాముఖ్యతతో ప్రసిద్ధిపొందిన పట్టణం. బానిసవిముక్తి మానిఫెస్టోగా అబ్రహాం లింకన్ 1861లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైనప్పుడు, విముక్తిని వ్యతిరేకించే దక్షిణాదిరాష్ట్రాలు ఫెడరల్ ప్రభుత్వంనుండి విడిపోయి, 'కాన్ఫెడెరేట్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' పేరుతో సొంతప్రభుత్వాన్ని స్థాపించుకున్నాయి. ఆ కొత్తప్రభుత్వానికి అధ్యక్షుడైన జెఫర్సన్ డేవిడ్ 1861 ఫిబ్రవరి 18వ తేదీన ఇదే నగరంలో ప్రమాణం స్వీకరించాడు. కాన్ఫెడరసీ పతాకం రెపరెపలాడిన మొట్టమొదటి తావు మాంట్గోమెరీ.

పొద్దుక్రుంకే సమయంలో డెక్స్టర్ అవెన్యూ చేరుకున్నాడు లూథర్. అతనికోసం ఎదురుచూస్తున్న మిత్రుడు సాదరంగా ఆహ్వానించి, విడిది ఏర్పాటు

చేశాడు. మరుసటిరోజు ఉదయం ఆరాధనా కార్యక్రమం. లూథర్ మనసు ఆందోళనపడింది. ప్రార్థనా సమావేశాలూ, ప్రసంగాలూ అతనికి కొత్తనిగాదు. తండ్రితో కలిసి, తండ్రి లేకుండాగూడా ఎబనేజర్ చర్చిలో వాటిని ఎన్నోసార్లు నిర్వహించాడు. కానీ, ఈ సందర్భం వేరు. తానొక పరీక్షను ఎదుర్కొంటున్నానన్న స్పృహ అతన్ని కంగారుపెట్టింది. దేవునిమీద భారంవేసి నిద్రకు ఉపక్రమించాడు.

ఆదివారం ఉదయం డెక్స్టర్ ప్రార్థనామందిరం జనంతో కిటకిటలాడింది. 'సంపూర్ణ జీవితానికుండే విస్తృతి' అనే అంశంమీద లూథర్ ప్రసంగించాడు. శ్రోతల్లో కనిపించే ఆసక్తి అతన్ని ఉత్తేజితుని చేసింది. కార్యక్రమం ముగిసినతరువాత చర్చికమిటీ సభ్యులు లూథర్‌తో కలిశారు. 'పాస్టర్‌గా ఎన్నుకుంటే, రావటానికి అభ్యంతరం లేదుగదా' అంటూ విచారించారు. అది తనకొక గౌరవంగా భావించి ఆలోచిస్తానని లూథర్ జవాబిచ్చాడు.

లూథర్‌ను పాస్టర్‌గా నియమించడానికి డెక్స్టర్ చర్చికమిటీ ఏకగ్రీవంగా ఆమోదించి, అతనికి తెలియజేసింది. లూథర్ సందిగ్ధంలో పడ్డాడు. వెంటనే సమాధానం పంపలేకపోయాడు. జాతివివక్షతో కుతకుతలాడే దక్షిణాదిలో తదుపరి జీవితమంతా గడపడానికి మనసు వెనకాడింది. అక్కడి వేరుపాటు జీవితాన్ని సహించలేకనే కొరెట్టా బోస్టన్ చేరింది. భార్యాభర్తలిద్దరు రోజుల తరబడి తర్కించుకున్నారు. ఏ వాతావరణాన్ని ఇద్దరూ చీదరించుకున్నారో, అదే వాతావరణంలో తమ సంతానాన్ని పడెయ్యటానికి మనసొప్పలేదు. సమస్యను దాటేసి దూరంగా పారిపోవడం పిరికితనమని మరోవైపు అంతరాత్మ గిలగిలలాడింది. ఔనన్నా కాదన్నా అది వారికి పుట్టినగడ్డ. ఎంత నరకమైనా జన్మభూమిమీద మానవులకు మమకారం తీసిపోదు.

''దక్షిణాది నా ఇల్లు. అక్కడ లోపాలుండొచ్చు. అంతమాత్రాన ఇంటిని వదిలెయ్యలేం. చిన్నతనంలో వెంటాడిన సమస్యలకు ఏదోవొక పరిష్కారం కని పెట్టాలని నా ఆరాటం. దక్షిణాదిలో జాతివివక్ష లోతుగా పాతుకుపోయింది. ఇతర ప్రాంతాల్లో విద్యనార్జించిన నీగ్రోలు అక్కడికి తిరిగొచ్చి, తమ శక్తియుక్తులనూ, పరిచయాలనూ దక్షిణాది కోసం వినియోగించాలేగానీ, ఆ అన్యాయానికి ప్రేక్షకులుగా ఉండిపోగూడదు. నలుగురితో సమానంగా తిరిగే సంస్కృతి చేజారితే జారనీగాక, అనుక్షణం చర్మం రంగును గుర్తుజేసే జిమ్‌క్రో వాతావరణం చుట్టుముడితే ముట్టనీగాక, రాబోయే కాలంలో దక్షిణాదిలో జరగబోయే మార్పులకు నేను సాక్షిగా నిలవాలి.'' అనుకున్నాడు లూథర్.

యూనివర్సిటీకి డాక్టోరల్ థీసిస్‌ను సమర్పించే పని ఇంకా పూర్తికాలేదనీ, అంతవరకు పూర్తికాలం పనిజెయ్యటానికి వీలుండదనీ డెక్స్టర్ కమిటీకి లూథర్ తెలియజేశాడు. సెప్టంబరు వరకు పూర్తికాలం పనిజేసే అవసరంలేకుండా, నెలకోసారి వచ్చిపోయేందుకు కమిటీ సమ్మతించింది.

1954 మే 17వ తేదీన, అమెరికా సుప్రీంకోర్టునుండి ఆఫ్రోఅమెరికన్ పౌరులు ఎన్నటికీ మరువలేని తీర్పు వెలువడింది. పాఠశాలల్లో జాతివివక్ష రాజ్యాంగవిరుద్ధమనీ, అందుకు పాల్పడటం నేరమనీ తీర్మానించింది. దక్షిణాది వెళ్ళేందుకు సిద్ధపడిన లూథర్ దంపతులను ఈ తీర్పు మరింత ప్రోత్సహించింది. పదిరోజుల్లో మాంట్గోమెరీ చేరుకుని డెక్స్టర్ అవెన్యూ బాప్టిస్టు చర్చి పాస్టర్‌గా, లూథర్ తన మొట్టమొదటి ప్రార్థనాసమావేశాన్ని నిర్వహించాడు.

కొరెట్టాకు మాంట్గోమెరీ కొత్తగాదు. ఆమె స్వగ్రామం 'పెర్రీ' అక్కడికి ఎనభైమైళ్ళు. వచ్చీరాగానే పరిచయస్తులందరినీ కలిసింది. తెల్లవారి ఇళ్ళల్లోనూ స్వేచ్ఛగా తిరిగిన మనిషికి నల్లవాడలకు మాత్రమే పరిమితం కావలసిరావడం మొదట్లో కష్టమేసింది. రోజులు గడిచేకొద్దీ క్రమంగా సర్దుకుపోయింది.

లూథర్ థీసిస్‌ను బోస్టన్ యూనివర్సిటీ ఆమోదించింది. అతడు డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ అయ్యాడు. 1954 సెప్టంబర్ 1 నుండి డెక్స్టర్ అవెన్యూ చర్చికి పూర్తికాలం పాస్టర్‌గా లూథర్ బాధ్యతలు స్వీకరించాడు. మాంట్గోమెరీలో అడుగు బెట్టింది మొదలు, చర్చి బాధ్యతలేగాక సామాజిక సమస్యల మీదగూడా దృష్టి సారించాడు. ఎన్.ఎ.ఎ.సి.పి. లో సభ్యుడుగా నమోదైనాడు. అందులో సభ్యులుగా చేరమని తెలిసినవాళ్ళందరినీ ప్రోత్సహించాడు. ప్రార్థనకొచ్చే భక్తులందరిని ఓటర్లుగా నమోదుచేయడంలో శ్రద్ధ తీసుకున్నాడు. ఈ కార్యక్రమాలవల్ల జొయాన్ రాబిన్సన్, రూఫస్ లూయిస్, ఇ డి నిక్సన్, రోసా పార్క్‌లు లూథర్‌కు సన్నిహితులైనారు. జొయాన్ రాబిన్సన్ అలబామా స్టేట్ కాలేజిలో ప్రొఫెసరు, మహిళా రాజకీయ సమాఖ్య అధ్యక్షురాలు. రూఫస్ లెవిస్ ఇదివరకు అలబామా రాష్ట్ర ఫుట్‌బాల్ కోచ్‌గా పనిజేశాడు. వాళ్ళిద్దరూ 'సోషియల్ అండ్ పొలిటికల్ యాక్షన్ కమిటీ'లో సభ్యులు. నిక్సన్, రోజాపార్క్స్‌లు ఎన్.ఎ.ఎ.సి.పి. కి ఆయువుపట్లు. 1955 మార్చి 2వ తేదీన క్లాడెట్టా కోవిన్ అనే మహిళను, బస్సులో తెల్లవారిసీటు ఆక్రమించిందనే ఆరోపణమీద అరెస్టుచేసిన సందర్భంలో, నగర మేయర్‌ను చీకాకుపెట్టిన కమిటీలో ఆ నలుగురూ సభ్యులే.

'అలబామా కౌన్సిల్ ఆన్ హ్యూమన్ రిలేషన్స్' అనే మరోసంస్థ లూథర్‌ను ఆకర్షించింది. జాతివివక్షను రూపుమాపాలంటే ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనేది ఆ సంస్థ ధ్యేయం. సభ్యత్వం పెద్దగా లేకపోయినా, ఉన్నవరకు పట్టుదలతో పనిజేసే కార్యకర్తలు. చేరిన కొద్దినెలలకే లూథర్ దానికి ఉపాధ్యక్షుడైనాడు. ఎన్.ఎ.ఎ.సి.పి.లో సభ్యుడుగా ఉంటూనే లూథర్ ఈ సంస్థలో చేరడం కొంత వివాదాన్ని లేవదీసింది. జాతివివక్షను ఎదుర్కోటానికి చట్టమే శరణ్యమనేది ఎన్.ఎ.ఎ.సి.పి. విధానం. చైతన్యం కలిగించడమే మార్గమని నమ్మేది హ్యూమన్ రిలేషన్స్ కౌన్సిల్. కానీ, అంతపెద్ద సమస్యను ఏవొక్క కోణంనుండో ఎదుర్కోవడం చాలదని లూథర్ అభిప్రాయం. రెండుమార్గాలను చాకచక్యంగా సమన్వయించి అనతికాలంలోనే వివాదానికి తెరదించాడు.

మరుసటి ఏడాది లూథర్ దంపతులు వొక ఆడపిల్లకు అమ్మానాన్నలయ్యారు. ఆ పిల్ల పేరు 'యొలాండా డెనిసీ.'

# ఉద్యమం

"నిన్న రోజాపార్క్స్‌ను అరెస్టు చేశారు." నింపాదిగా సమాచారం అందించాడు నిక్సన్. అంత పొద్దున్నే అతడు రావడంలోనే అలాటిదేదో జరిగుంటుందని అనుమానించాడు లూథర్.

"దేనికి?" ఆతృతగా అడిగాడు.

"మామూలే. బస్సులో తెల్లోడికి సీటివ్వలేదని." ఆ వృద్ధుని ముఖంలో దిగులు, అసహనం పెనవేసుకుని కనిపించింది.

ఆ ముందురోజు, అంటే 1955 డిసెంబర్ 1వ తేదీన, ఒక సిటీబస్సులో శ్రీమతి రోజాపార్క్స్ ప్రయాణం చేస్తూంది. రిజర్వుచేసిన సీట్లకు వెనుకవరుసలో కూర్చోనుంది. రిజర్వుచేసిన సీట్లన్నీ నిండిపోయాయి. ఆ తరువాతి మెట్టులో వొక తెల్లజాతీయుడు బస్సెక్కాడు. అతనికోసం రోజాపార్క్స్‌ను సీటు ఖాళీచెయ్యమన్నాడు డ్రైవరు. ఆమె వీలుపడదని చెప్పింది. చట్టాన్ని ఖాతరు చెయ్యలేదని ఆమెను అరెస్టు చేశారు. తెలిసినవెంటనే నిక్సన్ వెళ్ళి జామీనుమీద విడిపించుకొచ్చాడు.

"నాకు ఓపిక చచ్చిపోయింది. ఏదోవొకటి చేస్తే తప్ప ఈ తెల్లోళ్లకు తెలిసిరాదు." అన్నాడు నిక్సన్. ఎవరికైతే చచ్చిపోదు? ప్రతినిత్యం తన జాతిమీద జరిగే దౌర్జన్యాలను ఏళ్ళతరబడి చూస్తూంటే ఎవరికైనా చచ్చిపోతుంది. మాంట్గోమెరీ బస్సుడ్రైవర్ల ప్రవర్తన మానవత్వంగల ఏ మనిషికైనా రక్తం మరిగేలా చేస్తుంది. నీగ్రోను వెనక్కు జరగమని చెప్పడం సాధారణ భాషలో సాధ్యమైనా, వాళ్ళు వాడేది బూతులభాషే. జరగడంలో ఏకొంత ఆలస్యమైనా వాడేది దుడ్డుకర్రలే. బాదుడుతో ప్రయాణికుల ప్రాణాలుతీసిన డ్రైవర్లుగూడా కొందరున్నారు.

"నిజమే. ఏదోవొకటి చేస్తేతప్ప పరిస్థితి మారేట్టులేదు." లూథర్ అంగీకరించాడు.

"సిటీబస్సుల్ను బహిష్కరిద్దామని నా ఆలోచన."

రైల్వేపోర్టర్‌గా వుంటూ, పోర్టర్ల యూనియన్ను సమర్థవంతంగా నిర్వహించిన అనుభవశాలి ఇ డి నిక్సన్. ఎన్.ఎ.ఎ.సి.పి.లో సీనియర్ సభ్యుడేగాక, ఆ సంస్థకు

---

* మెట్టు: station, stop ఉదా: బండ్ల మెట్టు, బస్సుల మెట్టు

నగరశాఖ అధ్యక్షునిగానూ, రాష్ట్ర అధ్యక్షునిగానూ పనిజేసిన వ్యక్తి.

"దారిలో అబెర్నెథీతో మాట్లాడొచ్చాను. బస్సుల్ని బహిష్కరిస్తే బావుంటుందని ఆయనగూడా అంటున్నాడు."

విజ్ఞత కలిగిన మతబోధకుడు ఫాదర్ రాల్ఫ్ అబెర్నెథీ. మాంట్గోమెరీ ఫస్ట్ బాప్టిస్ట్ చర్చిలో పూజారి. నీగ్రో సమాజంలో ఆదరాభిమానాలు సంపాదించిన యువకుడు. లూథర్ వెంటనే అబెర్నెథీకి ఫోన్ చేశాడు. ముగ్గురూ అర్థగంటసేపు ఫోన్‌లోనే సంప్రదించుకున్నారు. కొంతమంది నగర ప్రముఖులనూ, మతబోధకులనూ పిలిపించి సాయంత్రమే వొక సమావేశం జరపడం ఉత్తమమని ముగ్గురికీ తోచింది. డెక్స్టర్ చర్చిని సమావేశస్థలంగా నిర్ణయించారు. ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి.

సాయంకాలం సమావేశానికి దాదాపు నలభైమంది ప్రముఖులు హాజరయ్యారు. సిటీ బస్సులను బహిష్కరించడం సబబైన కార్యక్రమమని ఏకగ్రీవంగా తీర్మానించారు. 'బస్సులో సీటివ్వలేదనే కారణంగా నిన్న మరో నీగ్రో మహిళను అరెస్టుచేశారు. నిరసనగా డిసెంబర్ 5వ తేదీ సోమవారం సిటీబస్సులను బహిష్కరించండి. పనికి పోవాలన్నా, బడికి పోవాలన్నా, మరెందుకైనా సరే, బస్సులో ఎక్కొద్దు. గమ్యం చేరడానికి టాక్సీ తీసుకోండి. శక్తి చాలకపోతే నలుగురూ కలిసి వొకబండి మాట్లాడుకోండి. కుదరకపోతే నడిచైనా వెళ్ళండి. బస్సు మాత్రం ఎక్కొద్దు. సోమవారం సాయంత్రం 7 గంటలకు హోల్ట్ వీధి బాప్టిస్ట్ చర్చిలో బహిరంగ సమావేశం జరుగుతుంది. ప్రతివొక్కరు తప్పకుండా హాజరుకండి.' అనే సందేశంతో కరపత్రాలు తయారయ్యాయి. 3వ తేదీ పొద్దున్నే వాడలన్నిటికి చేరుకున్నాయి.

ఉద్యమానికైతే పిలుపిచ్చారుగానీ, ప్రజల సహకారం ఎంతవరకుంటుందో అంతు చిక్కడంలేదు. పనితావుకు చేరాలంటే పన్నెండు మైళ్ళకు పైగా ప్రయాణం చేయవలసిన కూలీలుగూడా కొందరున్నారు. ఈ ప్రయత్నాన్ని ఎద్దేవాచేస్తూ తెల్లపత్రికల్లో వార్తలూ, వ్యాసాలూ అప్పుడే మొదలయ్యాయి. ఎంత ఉగ్గబట్టుకున్నా నాయకుల గుండెల్లో గుబులు పొరాడుతూనేవుంది. తమ పిలుపుకు అరవైశాతం నీగ్రోలు స్పందించినా చాలనే ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. నాలుగోతేదీ రాత్రి లూథర్ కంటికి కునుకైనా పట్టలేదు. ఏంజరుగుతుందో ఏమోనన్న ఆందోళనతో మనసు వికలమైంది.

ఐదోతేదీ ఉదయం అంచనాలు తారుమారయ్యాయి. కాఫీ తాగుతూ లూథర్ వంటగదిలో ఉన్నాడు. "మార్టిన్, మార్టిన్, తొందరగా ఇలారా" అనే కొరెట్టా

కేకకు ఉలికిపడి లేస్తూ బయటికొచ్చాడు. కిటికీలోనుండి కొరెట్టా వీధిలోకి చూస్తూవుంది. ఆమె ముఖంలో ఆనందం తాండవిస్తూంది. నిదానంగా నడుస్తున్న సిటీబస్సును వేలితో చూపిస్తూ, ''ఖాళీ'' అంది చిరునవ్వుతో. లూథర్ వీధిలోకి తొంగిచూశాడు. నిజమే, అది ఖాళీగా పోతూంది. ఆ మార్గంలో అది మొదటిబస్సు. పాచిపనికి వెళ్ళే నీగ్రోలతో ప్రతిరోజూ అది కిటకిటలాడేది.

రెండో బస్సుకోసం వాళ్లిద్దరూ ఆత్రుతగా ఎదురుచూస్తూ అక్కడే కూర్చున్నారు. పదిహేను నిమిషాల్లో అదిగూడా వచ్చింది. మొదటిదానికిమల్లే ఖాళీగా దాటిపోయింది. తరువాత మూడోబస్సు వచ్చింది. ఇద్దరు తెల్లప్యాసింజర్లు తప్ప అందులోగూడా ఎవరూ లేరు. ఉత్సాహం పట్టుకోలేక కారుకోసం పరిగెత్తాడు లూథర్. మిగతా రూట్లు ఎలావున్నాయో చూడటానికి కారులో బయలుదేరాడు. నగరమంతా తిరగ్గా అతని కంటబడిన నీగ్రో ప్యాసింజర్లు ఎనిమిదే ఎనిమిదిమంది. ఆశించింది అరవైశాతమైతే దక్కిన ఫలితం నూటికి నూరుపాళ్ళు.

అదేరోజు కోర్టులో రోజాపార్క్స్ కేసుపై విచారణ ముగిసింది. జుల్మానా, కోర్టుఖర్చులు కలిపి పద్నాలుగు డాలర్లు అపరాధంగా విధించారు. శిక్షలు వేయడం పరిపాటేగానీ, ఈ తీర్పులో వొక కొత్తదనముంది. ఇదివరకు ఇలాటి కేసులను క్రమశిక్షణారాహిత్యంగా చూపించి శిక్షలువేస్తుండేవారు. సూటిగా 'వేరుపాటు' చట్టంకింద కోర్టులో శిక్షవిధించడం ఇదే ప్రథమం. అపీలు చెయ్యడానికి రోజాపార్క్స్ సిద్ధపడింది.

విచారణ పూర్తవగానే, లూథర్, నిక్సన్, అబెర్నేథీ తదితర నాయకులమధ్య తదుపరి కార్యక్రమాన్ని గురించి తర్జనభర్జన జరిగింది. ఒకవైపు ఉద్యమం మొదలైంది. దాని బాధ్యతలు మీదేసుకునే సంస్థ ఇంతవరకు పుట్టలేదు. ఆ లోటు పూడకుంటే సాయంకాలం జరగే సభ నిరుపయోగంగా మారుతుంది. నిరసనలూ, ఆందోళనలూ ఎన్.ఎ.ఎ.సి.పి. పరిధిలోకి రావు. అందువల్ల, ఒక ప్రత్యేకసంస్థను జరూరుగా ఏర్పాటుచేసుకోవాలి. దానికోసం తక్షణం ఇక్కడికి చేరుకోమని మిగతా మిత్రులకు కబురుచేశారు.

మధ్యాహ్నం మూడుగంటలకు పెద్దలందరూ ప్రోగయ్యారు. ఉద్యమాలు నడిపించటానికి ప్రత్యేకసంస్థ అవసరాన్ని ప్రతివొక్కరు గుర్తించారు. కొత్తసంస్థకు పలురకాల పేర్లు సూచించారు. చివరకు, అబెర్నెథీ ప్రతిపాదించిన 'మాంట్గోమెరీ ఇంప్రూవ్‌మెంట్ అసోసియేషన్ (ఎం.ఐ.ఎ.)' పేరును ఏకగ్రీవంగా ఆమోదించారు.

అధ్యక్ష స్థానానికి లూథర్ పేరును రూఫస్ లూయిస్ ప్రతిపాదించాడు. సభికులంతా హర్షధ్వానాలతో బలపరిచారు. క్షణంలో ఎన్నిక పూర్తయింది.

కార్యవర్గం పేర్లు బయటికి తెలీకుండా గోప్యంగా ఉంచాలని కొందరు ప్రతిపాదించారు. దానిమీద సుదీర్ఘంగా చర్చ జరిగింది. ''ఇంకా మనకు లేకితనం పోలేదు. పేర్లు బయటికి తెలీకపోతే ప్రజల్లో నమ్మకం కుదరదు. ధైర్యం లేదనుకుంటే ఇప్పుడే మానుకుందాం. ఉందనుకుంటే మగవాళ్లమని నిరూపించుకుందాం. ఎంత గోప్యంగా ఉంచినా, రేపో ఎల్లుండో మన పేర్లన్నీ తెల్లోళ్లకు తెలిసిపోతాయి. ఈ దాగుడుమూతలతో చులకన కావడంతప్ప వొరిగేదేముండదు. నిలబడగలమో లేదో ఇప్పుడే తేలిపోవడం మంచిది.'' అంటూ నిక్సన్ తెగేసి మాట్లాడటంతో వివాదం ముగిసింది.

మీదటి కార్యక్రమం గురించి చర్చ మొదలయింది. ఊహకు అందనంత భారీగా ప్రజలనుండి మద్దతు దొరికినందుకు పెద్దలందరూ ఉప్పొంగిపోయారు. ఇక దీన్ని ఆపేయాలా లేక కొనసాగించాలా? ఏవో కొన్ని కోరికలు నెరవేరిందాకా కొనసాగించాలని కొందరన్నారు. ''ఇప్పటికేదో మర్యాద దక్కింది. బార్లుబార్లు సాగితే ప్రజలు తట్టుకోలేరు. తట్టుకోలేక వొకరొకరే జారిపోతే నవ్వులపాలౌతాం. సత్తా చూపించాలనుకున్నాం, చూపించాం. ఇంతటితో ఆగిపోతే ఐపు* చెడకుండా గట్టెక్కుతాం.'' అనేది మరికొందరి వాదన. వింటూంటే అదీ నిజమే ననిపించింది చాలామందికి. ఎటూ తేల్చుకోలేక నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. సాయంత్రం బహిరంగ సమావేశం ఎలాగూ ఉందిగాబట్టి, అక్కడ కనిపించే వాతావరణాన్నిబట్టి తరువాతి కార్యక్రమం ఆలోచిద్దామనుకున్నారు.

సాయంత్రం హోల్ట్‌వీధిలో రాకపోకలు స్తంభించాయి. జనంతో సభాస్థలం కిటకిటలాడింది. జనసముద్రం ఈదుకుంటూ వక్తలు వొక్కరొక్కరే వేదిక దాపుకు చేరుకున్నారు. కలాలతో, కెమెరాలతో జాతీయపత్రికారంగం వేదికచుట్టూ మొహరించి ముట్టడికి తయారుగావుంది. ఆ వేదికనుండి ఆ రోజు, ఎం.ఐ.ఎ. అధ్యక్షునిగా, మాంట్గోమెరీ ఉద్యమానికి గమ్యం నిర్దేశించే బాధ్యత డా. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ది. ఒక్కరోజు బహిష్కరణతో ఉద్యమాన్ని మొక్కుబడిగా ముగించాలనే ఆలోచన జనంలో ప్రజ్వలించే ఉద్రేకంతో ఆవిరావిరై గాలికి తేలిపోయింది.

లూథర్ కింగ్ తన ప్రసంగాన్ని ప్రారంభించాడు. డిసెంబర్ 1వ తేదీన

* ఐపు: appearing to be on upper hand.

రోజాపార్క్స్‌కు జరిగిన అవమానాన్ని సభకు వివరించాడు. ''సోదరులారా! ఎంతటి ఓర్పుకైనా వొక హద్దుంటుందని మీకు తెలుసు. ఎల్లకాలం ఏ మనిషీ ఉక్కుపాదంకింద నలగలేడు. ఎల్లకాలం ఏ మనిషీ గుండెలు చీల్చే అవమానాన్ని సహిస్తూ కూర్చోలేడు. ఎల్లకాలం ఏ మనిషీ అంతం కనిపించని నిరాశలో ప్రయాణం సాగించలేడు. కన్ను పొడుచుకున్నా కనిపించని కటికచీకట్లో ఏ మనిషీ అనంతంగా అగచాట్లపాలు కాలేడు. ఓర్పు నశించే రోజొకటి తప్పకుండా వచ్చేస్తుంది.

''సోదరులారా! మనం చేస్తున్నది తప్పని ఎంతమాత్రం భావించొద్దు. మనం చేస్తున్నదే తప్పైతే, ఈ దేశం సుప్రీంకోర్టు చేసింది తప్పౌతుంది; అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం తప్పౌతుంది; ఏసుక్రీస్తు ఈ భూమ్మీద అవతరించడం తప్పౌతుంది; సర్వేశ్వరుడైన భగవంతుడే తప్పౌతాడు. మనం చేస్తున్నది ధర్మాన్ని నాలుగుపాదాలా నడిపించే ప్రయత్నం; మనం చేపట్టింది న్యాయాన్ని ధారాపాతంగా ప్రవహించేలా చేసే కార్యక్రమం.

''మిత్రులారా! ఇది మన ఐకమత్యాన్ని కాపాడుకోవలసిన తరుణం. న్యాయమైన మన కోర్కెలు సాధించుకోటానికి ఐకమత్యమే ఆయుధం. అనాదినుండి మీ మనసులో పాతుకుపోయిన పిరికితనాన్ని ఆలస్యం చెయ్యకుండా పారదోలండి. మన మొకరికి భయపడే అవసరం లేదు. మనం చేస్తున్నది చట్టసమ్మతమైన కార్యక్రమం. నిరసన తెలియజేయడం తప్పని అమెరికా ప్రజాస్వామ్యం ఇదివర కెప్పుడూ శాసించలేదు. నిరసన తెలిపే హక్కు మన సొంతం.

''మనం, అంటే ఈ దేశంలో పౌరహక్కులకైనా నోచుకోని అభాగ్యనీగ్రోలం, ఎంతో కాలంనుండి బంధీలుగా బ్రతుకుతున్నాం. ఇంకొక్క క్షణమైనా ఆ బానిస బ్రతుకును సహించలేని స్థితికి ఇప్పుడు చేరుకున్నాం. సహచరులారా! నా ప్రసంగాన్ని ముగించేముందు మీకొక విషయాన్ని గుర్తుచేయడం నా విధి. మనం మన కార్య క్రమానికి భగవంతుణ్ణి మార్గదర్శిగా చేసుకోవాలి. ప్రతి కదలికలోనూ మనం క్రిస్టి యన్లగా నిరూపించుకోవాలి. అలా చేస్తూనే మరొక్కవిషయం ఈ సందర్భంగా మనం దృష్టిలో ఉంచుకోవాలి. వాత్సల్యమొక్కటే రథాన్ని నడపలేదు. ఇరుసుకు మరోవైపు మరో చక్రముంది. దాని పేరు ధర్మం.

''ఇప్పుడు మనం ప్రయోగిస్తున్న పరికరాలు ధర్మానికి సంబంధించినవి. నచ్చజెప్పడమనే పరికరాన్ని ఇదివరకే ప్రయోగించాం. ఇప్పుడు 'ఒత్తిడి' అనే పరికరాన్ని వాడుకుంటున్నాం. ఇది విజ్ఞతతో కూడుకున్న ప్రయోగం, చట్టం

సమ్మతించే ప్రయోగం.

"ఈ ప్రస్థానంలో మనకు ఏఏ అవాంతరాలు ఎదురౌతాయో చెప్పలేం. ఏ కష్టమైనా ఎదురవనీగాక, ఈ క్షణంనుండి ఐకమత్యం చెడకుండా ముందుకు నడవాలనే దీక్షతో మనం ఇంటికి తిరిగెళ్ళాలి. 'ఒకప్పుడు ఈ నగరంలో నీగ్రోలు, నల్లటి చర్మం గొర్రెబొచ్చులాటి ఉంగరాల జుత్తుండే నీగ్రోలు, న్యాయంకోసం సాహసోపేతంగా నిలబడి, మానవ నాగరికతకు కొత్తరక్తం ఎక్కించారు' అంటూ చరిత్రపుస్తకాల్లో నిలిచిపోయేలా మనం ముందుకు నడవాలి."

చప్పట్లతో ఆకాశం మారుమోగింది. వెర్రి ఆవేశమేతప్ప, ఆక్షణంలో వారు తీసుకుంటున్న నిర్ణయం అంతర్జాతీయ ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని అక్కడున్న ఏవొక్కరికీ తెలీదు. మొండి పట్టుదల తప్ప, ఈ ప్రకంపనాలు భూగోళాన్నంతా కుదిపేస్తాయని వాళ్ళెవరూ ఊహించుకోలేదు.

సభికుల ఆమోదంకోసం మూడు కోర్కెలతో వొక తీర్మానాన్ని రాల్ఫ్ అబెర్నెథీ ప్రతిపాదించాడు. 1. నీగ్రో ప్రయాణికులతో బస్సుడ్రైవర్లు వినయంగా ప్రవర్తిస్తారని హామీ ఇవ్వాలి. 2. ముందుగా ఎవరొస్తే వారికే సీటుండే ప్రాతిపదికన, నీగ్రోలు వెనుకనుండి ముందుకూ, తెల్లవాళ్ళు ముందునుండి వెనక్కూ సీట్లను ఆక్రమించే నియమాన్ని పాటించాలి. 3. అధికసంఖ్యలో నీగ్రోలు ప్రయాణించే మార్గాల్లో నీగ్రోలను డ్రైవర్లుగా నియమించాలి. మిన్నుముట్టే కరతాళధ్వనులతో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

ఆనంద కెరటాల్లో తేలిపోతూ ఉద్యమనాయకులు ఇళ్ళకు చేరుకున్నారు.

# సన్నాహం

తాటాకు చప్పుళ్ళకు బెదిరే కుందేలుగాదు తెల్లజాతి దురహంకారం. రేపోమాపో అధికారులు దిగొస్తారని ఆశించేందుకు వీల్లేదు. నీగ్రో నాయకత్వం దీర్ఘకాల పోరాటానికి సమాయత్తం కావాలి. అన్నిటికంటే ముందు, రాకపోకలకు ప్రత్యామ్నాయ సదుపాయం వెదుక్కోకుంటే ప్రజల్లో నైతికపతనం మొదలవుతుంది. పోరాటానికి నాయకత్వమంటే ముచ్చటేసే కిరీటం కాదని లూథర్‌కు మరుసటిరోజే బోధపడింది. సహచరుల సహాయంతో నీగ్రోలు నడిపే టాక్సీకంపెనీలను సంప్రదించాడు. బస్సుఛార్జీలకు సమానమైన రేట్లకు కూలిజనాన్ని తరలించేలా వొప్పించాడు.

ఈ ప్రయత్నాల్లో రేయింబవళ్ళు లూథర్‌కు చేదోడుగా నిలిచిన మిత్రుడు రాల్ఫ్ అబెర్నెథీ. ఉద్యమంకోసం ఆ యిద్దరు నిద్రాహారాలు మానేశారు. కార్యమాలను క్రమబద్ధం చెయ్యటానికి సబ్‌కమిటీలను రూపొందించాలని లూథర్ సంకల్పించాడు. ఆయా కార్యక్రమాలకు అనువైన సభ్యులతో రవాణా, ఆర్థిక, ఆహ్వాన సంఘాలు ఏర్పాటయ్యాయి. అత్యవసర సమయాల్లో అధ్యక్షునికి సలహాలిచ్చే కోర్‌కమిటీగూడా ఏర్పడింది. ఒకటిరెండు రోజుల కృషితో పరిస్థితులు గాడిలో పడినట్టు కనిపించింది.

8వ తేదీన సంప్రదింపులకు ఆహ్వానిస్తూ నగరమేయరునుండి పిలుపొచ్చింది. పన్నెండుగురు సభ్యులతో ఎం.ఐ.ఎ. వొక సంప్రదింపుల బృందాన్ని ఎన్నుకుని, సిటీ హాలుకు పంపించింది. 'మీ బృందానికి నాయకుడెవ'రని నగరమేయరు గేల్ నీగ్రో ప్రతినిధులను ప్రశ్నించాడు. సభ్యులందరూ కళ్ళతో లూథర్‌ను చూపించారు. 'సరే. ఇలా ముందుకొచ్చి నీ వాదన వినిపించు' అన్నాడు లూథర్‌తో.

ఎదుటిపక్షంలో కనిపించే ముఖాలన్నీ తెల్లజాతి ఉగ్రవాదులవని లూథర్ గమనించాడు. సమస్య సామరస్యంగా తెగుతుందనే నమ్మకం వాళ్ళను చూడగానే వదిలేసుకున్నాడు. ఐనా, సంప్రదింపులు చెడగొట్టుకున్నారనే అపవాదు తమమీద మోపుకోవడం మంచిదిగాదు. హుందాగా తన వాదన సమావేశానికి వినిపించాడు. నీగ్రోల ప్రతిపాదన వేరుపాటు చట్టాలకు వ్యతిరేకమని ఎదుటిపక్షం వాదించింది. తమ ప్రతిపాదన ఆ చట్టాల పరిధిలోకే వస్తుందని లూథర్ విశదం చేశాడు. బస్సుకంపెనీల వకీలు 'జాక్ క్రెన్షా' కరుడుగట్టిన తీవ్రవాది. సూది మోసేంత వెసలుబాటుకైనా అతడు చోటివ్వలేదు. వాదన పెరిగేకొద్దీ నగరపాలక సభ్యులు క్రెన్షాకు లొంగిపోతున్నారు. సయోధ్య కుదిరే సంకేతం దరిదాపుల్లో కనిపించలేదు.

ఇంతలో నగరమేయరు కల్పించుకుంటూ, 'వర్షం మొదలైతే, తొలిరోజే నీగ్రోలంతా బస్సులకోసం పరిగెడతా'రని వ్యాఖ్యానించాడు. 'కాలం వృధాకాకుండా మన చర్చలు ఇంతటితో ముగిస్తే బావుంటుంది' అన్నాడు లూథర్. సమావేశం ముగిసింది.

మరుసటిరోజు వర్షం కురిసింది. నీగ్రోలెవరూ బస్సులకోసం ఆరాటపడలేదు.

చర్చల సందర్భంలో, 'చట్టం విధించిన కనీసఛార్జీలను టాక్సీవాళ్ళు తగ్గించడం గూడా నేరమే. ఐనా మేము పట్టించుకోలేదు' అన్న పోలీసు కమిషనర్ మాటలను లూథర్ తేలిగ్గా తీసుకోలేదు. అదొక ప్రమాద హెచ్చరికగా స్వీకరించాడు. ప్రైవేటు వాహనాలను సేకరించి సిద్ధంగా ఉంచుకోవడం ఎందుకైనా మంచి దనుకున్నాడు. ఆ సాయంత్రం జరిగిన విస్తృతసమావేశంలో కార్లఓనర్ల సహకారం అర్థించాడు. కారు యజమానుల్లో నూటయాభైమందికి పైగా అప్పటికప్పుడే ముందుకొచ్చారు. ఐచ్ఛికంగా ముందుకొచ్చిన యజమానుల పేర్లూ, చిరునామాలూ, టెలిఫోన్ నెంబర్లూ, వారి వాహనాలు ఖాళీగావుండే సమయాలూ తదితర వివరాలను రవాణాకమిటీ సేకరించింది. వాహనాలు నడిపేందుకు ఖాళీగావున్న డ్రైవర్లు ముందుకొచ్చారు. ఉద్యోగం చేస్తున్న డ్రైవర్లుగూడా తమ తీరికవేళల్ను కేటా యించటానికి సిద్ధపడ్డారు.

లూథర్ ఊహించిన ప్రమాదం 9వ తేదీ మధ్యాహ్నం రంగంలో ప్రవేశించింది. కనీస ఛార్జీలు వసూలు చెయ్యకపోతే నేరంగా పరిగణిస్తామని పోలీసు కమిషనర్ నుండి టాక్సీకంపెనీలకు తాకీదు ముట్టింది. చౌకగా టాక్సీల్లో పనితావులకు చేరుకునే సదుపాయానికి  ఆ తాకీదు ముగింపు పలికింది.

నిమిషాల్లో స్వచ్ఛంద సేవలకు కబురుచేసింది ఎం.ఐ.ఎ. రవాణాకమిటీ. వెంటనే ప్రైవేటు వాహనాలు రంగంలో దిగిపోయాయి. ఆ సాయంత్రం జరుగబోయే ప్రార్థనాసమావేశాల్లో మరికొన్ని కార్లకోసం పిలుపివ్వడానికి నీగ్రో చర్చిలన్నీ అంగీక రించాయి. ఈసారి గూడా ఊహాతీతమైన స్పందన లభించింది. కార్లకూటమికి జమపడిన వాహనాల సంఖ్య దాదాపు మూడువందలకు చేరుకుంది.

వాహనాలను సేకరించడం వొకెత్తైతే, వాటిని సద్వినియోగం చేసుకోవడం మరో ఎత్తు. రద్దీనిబట్టి వాటికి రూట్లను కేటాయించాలి; రాకపోకల సమయాన్ని క్రమబద్ధం చెయ్యాలి; డ్రైవర్ల డ్యూటీలను నియంత్రించాలి; ఇలాటి సమస్యలకు తోడు, అనుకోకుండా జరిగే అవాంతరాలకు జవాబు సిద్ధంగా ఉంచుకోవాలి. అతితక్కువ వ్యవధిలో రవాణా వ్యవస్థను ఇంత సమర్థవంతంగా ఎం.ఐ.ఎ. నిర్వహి

స్తుందని తెల్లజాతివారు ఊహించలేదు. ఏళ్ల తరబడి బస్సు కంపెనీలను సతమతం జేసిన చిక్కుముడులు, రెండుమూడురోజుల పరిశ్రమతో నల్లజాతీయులు తేలిగ్గా విప్పేయడం వారికి దిగ్భ్రాంతి కలిగించింది.

నీగ్రోల వాదన సమంజసమని సమర్థించిన తెల్లవాళ్లుగూడా దక్షిణాదిలో లేకపోలేదు. సంఖ్య తక్కువైనా, అంకితభావంలో ఎవ్వరికీ తీసిపోని సహృదయులు గూడా కొందరున్నారు. అలాటివారిలో ఎ.డబ్ల్యు.వెస్ట్, జొయాన్ రాబిన్సన్ అనే యువతుల సేవలను నల్లజాతి ఆజన్మాంతం మరిచిపోలేదు. నిరసనోద్యమానికి మద్దతుగా పురప్రముఖులను కూడేసే ప్రయత్నం మొదలు, అన్నింటా శ్రీమతి వెస్ట్ భాగస్వామి. పొద్దుతోపాటు తన ఆకుపచ్చ కాడిలాక్ కారుతో ఆమె ప్రత్యక్ష మౌతుంది. ఆ పూట కర్తవ్యం ముగించుకుని, నియమం తప్పకుండా ప్రయాణి కులకోసం సాయంత్రం తిరిగొస్తుంది.

విసుగూ విరామాలెరుగని మనిషి శ్రీమతి జొయాన్స్ రాబిన్సన్. అహింసా విధానాన్ని రక్తంలో జీర్ణించుకున్న మహిళ. సంస్థలో జరిగే ప్రతి సమావేశంలో పాల్గొంటుంది; సంస్థ తీసుకునే ప్రతి నిర్ణయానికీ సహకరిస్తుంది. ఉద్యమం తరువాత 'ఎం.ఐ.ఎ. న్యూస్ లెటర్' ప్రారంభించగానే ఆమె సంపాదకురాలిగా బాధ్యతలు స్వీకరించింది.

ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొనకపోయినా, సానుభూతిని ప్రకటించి నైతిక బలాన్ని అందించిన తెల్లవారిలో శ్రీమతి జూలియట్ మోర్గన్ సాహసం ప్రశంసనీయం. ఉద్యమాన్ని వారంరోజులు గమనించిన తరువాత ఆమె 'అడ్వైర్టైజర్' పత్రికకు వొక లేఖ రాసింది. ''మార్నీ యుద్ధం* తరువాత చరిత్రలో టాక్సీలు నిర్వహించిన మహత్తరమైన పాత్ర గత వారంరోజులుగా మాంట్గోమెరీలో కనిపిస్తూంది. ఐతే, ఆనాడు ప్యారిస్‌ను రక్షించిన 'టాక్సీ క్యాబ్' సైనికుల ఉద్రేకానికీ, మన నీగ్రోపౌరుల ఉద్రేకానికీ తేడా కనిపిస్తుంది. టాక్సీలో వెళ్ళనీ, కాలినడకన వెళ్ళనీ, మన నీగ్రోపౌరుల ఆవేశంలో మహాత్మాగాంధీ ఉప్పుసత్యాగ్రహానికి నడచిన ఆనవాళ్ళు కనిపి స్తున్నాయి'' అంటూ ఆ లేఖద్వారా గాంధీ పేరు అలబామాలో ప్రాకిపోయేలాచేసింది. ఐతే, ఆ ఉత్తరం రాసిన మూల్యాన్ని ఆమె తన ప్రాణాలతో చెల్లించవలసివచ్చింది. సున్నిత మనస్తత్వంగల శ్రీమతి మోర్గన్ తెల్లజాతి చీదరింపులు భరించలేక 1957 వేసవిలో ఆత్మహత్య చేసుకుంది.

---

*మార్నీ యుద్ధం: అధ్యాయం చివర్లో ఇచ్చిన వివరణ చూడండి.

మోర్గన్ ఉత్తరం వెలువడిన మూడురోజులకు హెలెల్ గోస్ అనే మరో తెల్లవనిత రాసిన ఉత్తరం అదే పత్రికలో ప్రచురించబడింది. ఆ ఉత్తరంలో ఆమె ''నేనెంత ఛార్జీ చెల్లించానో అంతే ఛార్జీ చెల్లించి, నేను సీట్లో కూర్చుని ప్రయాణం చేస్తుంటే, కేవలం జాతిభేదం కారణంగా మరోమనిషి ఖాళీసీటులోనైనా కూర్చునే అర్హతలేకుండా నిలుచుని ప్రయాణించడం చూస్తూ, మానవత్వం కలిగిన ఏ మనిషైనా ఆనందిస్తాడంటే నేను నమ్మలేను'' అంటూ ప్రకటించింది.

నాయకుల కృషి ఎంతైనా ఉండొచ్చుగానీ, ఉద్యమానికి ఊపిరిపోసేది ప్రజల చైతన్యమే. రోజులు గడిచేకొద్దీ నీగ్రోజనంలో పట్టుదల పెరుగుతూ వచ్చింది. సంస్థ చేసిన రవాణాసౌకర్యంతో నిమిత్తం లేకుండా కాలినడకతో ఉద్యమానికి దోహదం చేసిన నీగ్రోలు వందల్లో ఉన్నారు. పత్రికావిలేకర్లను దాటుకుంటూ వొక ముసలమ్మ పనితావు నుండి కాలినడకన ఇంటికి బయలుదేరింది. ఆ దారినే వస్తున్న కారుడ్రైవరు బండిని నిలబెట్టి, ''నానమ్మా, నడిచే అవసరంలేదు. కార్లో కూర్చో. ఇంటిదగ్గర దిగబెడతా'' నన్నాడు. వద్దని చేత్తో వారిస్తూ, ''నేను నాకోసం నడవడంలేదు. నా కొడుకులకోసం, మనవళ్ళకోసం నడుస్తున్నా'' నంటూ దాటిపోయింది.

నగర మేయరు పిలుపుమేరకు, డిసెంబర్ 17న, బస్సుకంపెనీల యజమానులూ, తెల్లజాతి ప్రతినిధులతో మరో సమావేశం జరిగింది. ఆ సమావేశంలో తెల్లజాతి ప్రతినిధులు లూథర్‌మీద విరుచుకుపడ్డారు. సమస్య తెగకుండా అడ్డుపుల్ల వేస్తున్నది అతడేనంటూ రెచ్చిపోయారు. ఊపిరాడక లూథర్ అవాక్కైనాడు. అప్పుడు అబెర్నెథీ లేచి లూథర్‌ను ఆదుకున్నాడు. ''ఆగండి. మీరు అనవసర విషయాలమీద రాద్ధాంతం చేస్తున్నారు. లూథర్ మాట్లాడుతన్నది అతని వ్యక్తిగత హోదాలో కాదు. అతడు మా బృందానికి నాయకుడు. అతడు చెప్పింది మా సమిష్టి అభిప్రాయం.'' అంటూ అడ్డుకున్నాడు. సమావేశం ముగిసింది. ఒట్టిచేతులతో నీగ్రోప్రతినిధిబృందం ఇంటికి తిరిగొచ్చింది.

''చేతులు ముడుచుకుని కూర్చుంటే చేతగానోళ్ళ మనుకుంటారు. పదిమందిని వేసేస్తేగానీ సమస్య తెగదు. తెల్లోళ్ళకు తెలిసొచ్చే భాష అదొక్కటే'' అనేవారు తయారౌతున్నారు. ''వాళ్ళు ఊరుకుంటే సరే. వాళ్ళేదైనా చేస్తేమాత్రం నేను ఊరుకోలేను'' అనేవాళ్ళు మరికొందరయ్యారు. అటువైపు ఏదోవొక ఘర్షణకోసం ప్రతిపక్షం ఎదురుచూస్తూంది. ఏ చిన్నగలాటా జరిగినా ఎదుటివారికి చేజేతులా

అవకాశం కల్పించినట్టౌతుందని లూథర్‌కు తెలుసు. సాయుధబలగాలు రంగంలో దిగితే నష్టపోయేది నీగ్రోలే. అందుకు చోటివ్వడం లూథర్‌కు సుతరామూ ఇష్టంలేదు. ప్రేమతత్వంతో ఎదుటివారి అంతరాత్మలను జాగృతం చెయ్యాలనేది ఎం.ఐ.ఎ. ఆదర్శం. అహింసాయుతంగా పోరాటం నడపడం ఎం.ఐ.ఎ. విధానం. ''మా ఉద్యమానికి ఆత్మను సమకూర్చింది ఏసుక్రీస్తైతే, విధానాన్ని సమకూర్చింది మహాత్మాగాంధీ'' అంటాడు మార్టిన్ లూథర్ కింగ్.

నల్లజాతి ఉద్రేకాలను నియంత్రించడంలో అద్భుతమైన పాత్రను పోషించాడు లూథర్. ''కత్తిమీద ఆధారపడి బ్రతికేవాడు కత్తితోనే అంతమౌతాడని నేను చెబుతున్న మాట కేవలం ప్రచారంకోసం కాదు. అది నా ప్రగాఢ విశ్వాసం. తప్పని పరిస్థితుల్లో హింసను భరిద్దాం. అంతేగానీ, హింసతో ప్రతీకారం తీర్చుకోవడం మనకు తగనిపని. ఎట్టి పరిస్థితుల్లోనూ మన చేతులు హింసతో మలినం కానీగూడదు'' అంటూ ఒకటికి పదిసార్లు నచ్చజెప్పి, ఉద్యమాన్ని అహింసామార్గంలో తుదకంటా నడిపించాడు.

అధికార పక్షం అమ్ములపొదిలో అమోఘమైన గుప్తాయుధం 'పుకారు.' దాన్ని వెలికితీసి జనంలోకి వదిలింది మాంట్గోమెరీ తెల్లనాయకత్వం. ఈ నాయకుడు ఇంత లంచం తీసుకున్నాడంటే, ఆ నాయకుడు అంతకంటె తక్కువేం తినలేదని పుకార్లను ప్రసారం చేసింది. లూథర్ కింగ్ సరికొత్త కాడిలాక్ కారు మొన్ననే కొన్నాడని ప్రచారం చేయించింది.

మరోవైపు, విభజించి పాలించే రాజనీతిని ముమ్మరం చేసింది. తెల్లదొరల్లో కొందరు పనిగట్టుకుని నీగ్రోనాయకులతో ఇళ్ళకొచ్చి కలుసుకున్నారు. 'ఇలాటివి జరిగితే నీ చేతిమీద జరగాలి. ఇంత వయసుండి, మీ తెగలో ఇంత పలుకుబడుండి, నాయకత్వం కుర్రకారు చేతికి వదలడం బాగాలేదు' అంటూ సీనియర్లలో అసూయలు రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు. 'ఆ లూథర్ కింగ్ ఏదీ తెగనివ్వడు. నీబోటివాళ్ళు నాయకులైతే ఇది ఎప్పుడో తెగిపోయుండేది' అంటూ యువకులకు చక్కలిగింతలు పెడుతున్నారు.

ఫలానావాడు కాళ్ళులేకుండా నడుస్తున్నాడంటే, ఆ ఫలానావాడే తన కాళ్ళను తడిమి చూసుకునేంత నమ్మకం కలిగిస్తాయి పుకార్లు. అలాగే లూథర్‌కుగూడా తనవల్లే సమస్య మొండికేసిందేమోననిపించింది. అనుకున్నది సాధించడం ప్రధానంగానీ, అది ఎవరి చేతుల్లో జరిగినా హర్షణీయమే. తామసంతో అడ్డునిలిచేకంటే,

తప్పుకుని దారిచెయ్యడం విజ్ఞత కలిగినవారి కర్తవ్య మనుకున్నాడు. రాజీనామాకు సిద్ధపడి, ఎం.ఐ.ఎ. కార్యవర్గంతో సమావేశమయ్యాడు.

“ఉద్యమం మొదలై నెలరోజులు దాటింది. ఇంతవరకు పరిష్కారం కంటికి కనిపించలేదు. నా పోకడవల్ల ఫలితం దూరమవడం మన ఆశయాన్ని దెబ్బతీస్తుంది. ఒకవ్యక్తి మూలంగా ఉద్యమానికి హాని జరగడం సహించరానిది. సేవ చెయ్యాలంటే కుర్చీకి అంటిపెట్టుకునే అవసరం లేదు. పదవిలో లేకున్నా, నేను ఎప్పటిలాగే మీతోపాటు శక్తివంచనలేకుండా కృషి చేస్తాను. దయవుంచి నా రాజీనామా స్వీకరించండి.” - లూథర్ ప్రతిపాదించాడు.

ఒక్క పెట్టున, అన్నివైపులనుండి సభ్యులు అతన్ని వారించారు. అతని పనితీరు అందరికీ నచ్చిందన్నారు. ప్రత్యర్థుల పన్నాగాలకు బేలుపోయే బలహీనత తమకెవ్వరికీ లేదని స్పష్టం చేశారు. లూథర్ నాయకత్వంమీద సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. లూథర్ మనసు తేలికపడింది. ప్రత్యర్థివర్గానికి నోరు పిడచగట్టింది.

చివరి ప్రయత్నంగా, 1956 జనవరి 22వ తేదీ ఆదివారం, నగరపాలకమండలి తన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. ప్రముఖ నీగ్రోనాయకులు కొందరు నగర కమిషనర్లతో సంప్రదింపులు జరిపినట్టూ, ఒప్పందం కుదుర్చుకున్నట్టూ పత్రికలకు వార్తను విడుదల చేసింది. ఆ ప్రకటన గురించి శనివారం సాయంత్రమే లూథర్‌కు సమాచారం అందింది. తన వీపుచాటున ఏదైనా జరిగిందేమోనని అనుమానించాడు. కార్యవర్గ సభ్యులందరితో చకచకా ఫోన్లుజేసి మాట్లాడాడు. ఎక్కడా లొసుగు కనిపించలేదు. అందరూ కలిసి ఆరాతీయడం మొదలెట్టారు. అసలువిషయం రాత్రి పదకొండు గంటలకు బయటబడింది. ముగ్గురు మతగురువులను పిలిపించుకుని నగరకమిషనర్లు మాట్లాడింది వాస్తవమే. ఐతే, ఆ ముగ్గురూ ప్రముఖులూ కాదు, ఎం.ఐ.ఎ. సంస్థ సభ్యులూ కాదు. అదంతా నీగ్రోజనాన్ని మోసగించడానికి పన్నిన పన్నాగం. ఏదోవిధంగా పదిమందైనా బస్సెక్కేలా చేస్తే, నీగ్రోల పట్టుదల సడలుతుందని తెల్లవారి ఆశ.

ఉదయం పత్రికల్లో రాబోయే వార్త బూటకమని ప్రజలకు తెలీకపోతే ఉద్యమానికి గండి పడుతుంది. హడావుడిగా బయలుదేరాడు లూథర్. మిత్రలందరినీ కలిశాడు. ఇంటింటికీ ఆ రాత్రే సమాచారాన్ని చేరెయ్యడానికి కార్యకర్తలను పురమాయించాడు. కొంతమంది కార్యకర్తలను వెంటదీసుకుని తనుగూడా స్వయంగా

పనిలో దిగిపోయాడు. రాత్రిక్లబ్బులూ, సారాకొట్లవంటి ప్రదేశాలనుగూడా వదలకుండా జనాన్ని హెచ్చరించాడు. అలాటి ప్రదేశాలను చూడటం అతనికది మొట్టమొదటిసారి.

తెల్లవారిందాకా ఎం.ఐ.ఎ. కార్యకర్తలు పడిన శ్రమ ఫలించింది. యధావిధిగా బస్సుల బహిష్కరణ కొనసాగింది.

---

**మార్నీ యుద్ధం:** మొదటి ప్రపంచయుద్ధం రోజుల్లో, ఫ్రాన్సు దేశాన్ని ఆక్రమించటానికి దాడిజేసిన జర్మనీ సైన్యాల ధాటికి తట్టుకోలేక, ఫ్రెంచ్-బ్రిటిష్ సంయుక్త సేన వెనక్కు తగ్గింది. 1914 సెప్టెంబర్ 5వ తేదీకి జర్మనీ సైన్యాలు మార్నీ నది ఒడ్డునున్న ఫ్రెంచి రాజధాని నగరం ప్యారిస్‌ను సమీపించాయి. దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడే సంయుక్త సేనకు జర్మనీ సైనిక పంక్తిలో ఒకచోట సందు ఏర్పడినట్టు అకస్మాత్తుగా సమాచారం అందింది. ఆ బలహీనతను సొమ్ము చేసుకుంటే తప్ప ప్యారిస్‌ను రక్షించడం సాధ్యపడదు. ఆ బలహీనత ఏర్పడిన ప్రదేశానికి ఆగమేగాలమీద సైనికులను తరలించే ప్రయత్నంలో ప్యారిస్‌లోని కారు డ్రైవర్లు తోడుపడి, 600 కార్లను శరవేగంతో కిందికీ మీదికీ నడిపి, తమ వంతుగా 6000 మంది సైనికులను యుద్ధరంగానికి అందించారు.

# ప్రతీకారం

పెత్తనం చెలాయించే వర్గం తుదకంటా పోరాడకుండా తన ప్రత్యేక హక్కులను అంతతేలిగ్గా వదులుకోదు. ప్రజాస్వామ్యం ముసుగులో దోబూచులాడటం ఇక చెల్లదని తెల్లవారికి తేలిపోయింది. పోలీసు యంత్రాంగంనుండి వత్తిడి పెంచింది. ప్రైవేటు వాహనాలను ఎక్కడబడితే అక్కడ ఆపేయడం, తనిఖీల పేరుతో జాప్యం చెయ్యడం పోలీసులకు రోజువారీ కార్యక్రమమైంది. కనిపించిన తప్పులకూ ఊహించిన తప్పులకూ డ్రైవర్లమీద కేసులు బనాయించారు. లైసెన్సులు రద్దు చేస్తారనే భయం పట్టించారు. దీంతో చాలామంది డ్రైవర్లు పనినుండి తప్పుకున్నారు. వాహనాల సంఖ్యగూడా బలహీనపడింది. పోరాటం ఎంతవరకు నిలుస్తుందో తెలియని అయోమయంలో పడ్డారు నీగ్రోనాయకులు.

అది 1956 జనవరి 26. చర్చికార్యాలయంలో తొందరగా పని ముగించుకుని ఇంటికి తిరిగొస్తున్నాడు లూథర్. కారులో అతన్తోపాటు రాబర్ట్ విలియమ్స్ అనే స్నేహితుడూ, చర్చి కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీమతి లిల్లీ థామస్ ఉన్నారు. ఆవైపుగా వచ్చే ప్యాసింజర్లు ఎవరైనావుంటే వెంట తీసుకుపోయే ఉద్దేశంతో ప్రయాణికులుండే ప్రదేశానికి అతడు కారును పోనిచ్చాడు. అక్కడ జనం గుంపులు గుంపులుగా నిలబడి ఉన్నారు. నలుగురైదుగురు పోలీసుజవాన్లు డ్రైవర్ల లైసెన్సులు తనిఖీచేస్తూ, ప్రశ్నలతో వేధిస్తున్నారు. లూథర్ కారు ఆగగానే వొకజవాను దగ్గరికొచ్చాడు. డ్రైవింగ్ లైసెన్సు చూపమన్నాడు. బండి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ చూపమన్నాడు. 'లూథర్ కింగంటే వాడే' నని వెనకుండే జవాను పక్కజవానుతో చెబుతుంటే వినిపిస్తూనేవుంది. తతంగం పూర్తికాగానే లూథర్ బయలుదేరాడు.

గుంపును దాటుకుని పదిగజాలు రాగానే, మోటారుసైకిళ్ళలో ఇద్దరు జవాన్లు కారును వెంబడిస్తున్నట్టు అద్దంలో కనబడింది.

''చూడు ఎలా వెంటబడ్డారో.'' విలియమ్స్‌తో అన్నాడు లూథర్.

''ట్రాఫిక్ రూల్స్ జాగ్రత్తగా గమనిస్తూ నడుపు.'' అన్నాడు విలియమ్స్.

ప్యాసింజర్లను దించడానికి రోడ్డువారగా కారాపాడు లూథర్. ఇంతలో వొక జవాను కారుముందుకొచ్చి అడ్డంగా మోటారుబైకు నిలబెట్టాడు. ''లూథర్ కింగ్. కిందికి దిగు. ఇరవయ్యైదు మైళ్ల స్పీడ్ జోన్‌లో ముప్పైమైళ్ళ వేగంతో నడిపినందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను.'' అన్నాడు. లూథర్ కిందికిదిగి కారును విలియమ్స్‌కు

అప్పగించాడు. జరిగిన విషయం కొరెట్టాకు చెప్పమన్నాడు. అంతలో గస్తీ తిరగే పోలీసుకారు అక్కడికొచ్చి ఆగింది. అందులోనుండి దిగిన పోలీసులు లూథర్‌ను నఖశిఖపర్యంతం సోదా చేశారు. పూర్తికాగానే కారులో ఎక్కించుకుని బయలుదేరారు.

జనసంచారంలేని రోడ్లవెంట పోలీసువాహనం పరిగెడుతుంటే, తనను తీసుకుపోతున్నది జైలుకేనా అనే సందేహం లూథర్‌లో ఉదయించింది. మరేదైనా చెడ్డ ఉద్దేశంతో ఉన్నారేమో ననిపించి కంపించిపోయాడు. సిటీజైలు గేటుముందర కారు ఆగిందాకా అతని మనసు నెమ్మదించలేదు. 'ఆ క్షణంలో నాకు జైలే సురక్షితమైన స్వర్గంగా కనిపించిం'దని ఆ తరువాత అతడు మిత్రులతో చెప్పుకున్నాడు.

అతడు జైలంటే ఏమిటో ఎరుగని మనిషి. లోపల అడుగు పెడుతూనే అంతా వింతగా కనిపించింది. జైలరు ఏవేవో ప్రశ్నలడిగి, జవాబులన్నీ పెద్ద పుస్తకంలో ఎక్కించుకున్నాడు. అతని వస్తువులన్నీ స్వాధీనం చేసుకుని డిపాజిట్ ఖాతాలో నమోదుచేశాడు. అతన్ని వెంటదీసుకుని, వొక కంపుగొట్టే ఇరుకుగది దగ్గర ఆగాడు. ఇనుపచువ్వల తలుపు తెరిచి లోపలికి నడవమన్నాడు.

జనంతో నిండుకున్న గదిలో మెల్లిగా అడుగేశాడు లూథర్. అతన్ని గుర్తుపట్టిన వొకరిద్దరు ఆహ్వానం పలుకుతూ కేకేశారు. అందులో వొకతడు టీచరు. ఆ ఇద్దరినీ ఉద్యమమే లోపల నెట్టింది. మిగతా ఖైదీలంతా నేరంజేసి వచ్చినోళ్ళు. జైలు ప్రజాస్వామ్యం ఉద్యమకారులనూ, మామూలు ఖైదీలనూ వేరువేరుగా చూడదుగానీ, తెల్లోళ్లనూ నల్లోల్లనూ వేరువేరు గదుల్లో ఉంచుతుంది.

కాస్సేపటికి లూథర్‌ను జైలరు పిలిపించాడు. చూస్తే అతని వేలిముద్రలు తీసుకోటానికి అక్కడ సన్నాహాలు జరుగుతున్నాయి. ఐదునిమిషాలు ఆలస్యమైతే ఆ పని జరిగుండేదే. అంతలో రాల్ఫ్ అబెర్నెథీ అక్కడికొచ్చాడు. తన జామీనుమీద లూథర్‌ను విడుదల చెయ్యమని అడిగాడు.

"మంచిది. ఆ బాండు విలువకు సరిపడే ఆస్తి నీకుందని కోర్టులో రాయించుకురా." అన్నాడు జైలరు.

"సాయంత్రం ఆరున్నర గంటలయింది. ఇప్పుడు కోర్టు ఎక్కడుంటుంది?"

"తొందరేముంది. రేపు తీసుకురా."

"పోనీ, పూచీకతుకు డబ్బుకడితే సరిపోతుందా?"

జైలరు తల గోక్కుంటూ, అయిష్టంగా, "సరిపోతుంది" అన్నాడు. డబ్బు తీసుకొచ్చే ప్రయత్నంలో అబెర్నెథీ బయటకు వెళ్ళాడు.

ఈలోపు, జైలుముందు వందల సంఖ్యలో జనం గుమిగూడడం జైలరు గమనించాడు. కంగారుగా వేలిముద్రల గదిలో దూరి లూథర్‌ను బయటికి లాక్కొచ్చాడు. సొంత పూచీకతుమీద అప్పటికప్పుడు విడుదలచేసి బయటికి పంపించాడు.

మరుసటిరోజంతా పరామర్శల వెల్లవతో లూథర్ డస్సిపోయాడు. వేల సంఖ్యలో సానుభూతిపరులు ఇంటికొచ్చి పలకరించి పోతున్నారు. దూర ప్రాంతాలనుండి ఆత్మీయులు ఫోన్లు చేస్తున్నారు. అనవసరమైన ఈ అరెస్టుతో తెల్లవారు మరింత నష్టపోయారు. నల్లజాతి ఐకమత్యాన్ని మరోసారి కట్టుదిట్టం చేశారు. ప్రైవేటు వాహనాల కూటమిలో మొదలైన సంక్షోభాన్ని అనాలోచితంగా సవరించారు. కష్టాలకు ఓర్చుకునే పట్టుదల నీగ్రోల్లో పెరిగేలా చేశారు.

పని తెమిలేవేళకు బాగా పొద్దుపోయింది. పడుకోవటానికి లేచాడు లూథర్. భార్యా కూతుర్లు అప్పటికే మంచి నిద్రలో ఉన్నారు. వాళ్ళ నిద్రకు భంగం రాకుండా అతడు నెమ్మదిగా మంచంమీద కూర్చున్నాడు. ఫోన్ గలగలా మోగింది. లేచి ఫోన్ అందుకున్నడు. రిసీవర్ చెవికి ఆనిందోలేదో, అంతలోనే అవతలిగొంతు కస్సున లేచింది. ''నల్లనాకొడకా! జాగ్రత్తగా విను. నీతో మాకు చాలైంది. మాంట్గోమెరీకి ఎందుకొచ్చానా అని దిగులుపడే రోజు నీకు దగ్గరపడింది. వారం తిరగకముందే నువ్వు మా తడాఖా చూస్తావు.'' జవాబివ్వకుండా లూథర్ ఫోన్ పెట్టేశాడు.

అలాటి బెదిరింపులు వినడం అతనికి కొత్తగాదు. పదిపదిహేను రోజులుగా ప్రతిరాత్రీ ఒకటిరెండు ఫోన్లు అలాటివి అందుతున్నాయి. కానీ, ఈ రోజెందుకో ఆ గొంతులోని కాఠిన్యం ప్రత్యేకంగా తోచింది. ప్రతీకారంకోసం పడగవిప్పిన త్రాచు పాము బుస అందులో వినిపించింది. ఆ హెచ్చరిక ఎవరిదో లూథర్‌కు తెలుసు. అతని వెన్నెముకలో చలి ప్రాకింది.

అది 'కు క్లక్స్ క్లాన్' హెచ్చరిక. తెల్లజాతి దురహంకారుల హింసావాదసంస్థ కు క్లక్స్ క్లాన్. నీగ్రోల ఆస్తులు తగలబెట్టడం, కొట్టి హింసించడం, హత్యలు చెయ్యడం ఆ సంస్థ ఆశయం. అంతర్యుద్ధంలో ఓడిపోయిన దక్షిణాది తెల్లజాతి ఆక్రోశంనుండి మొలకెత్తిన విషబీజమది. ఫెడరల్ సైన్యాల ధాటికి తట్టుకోలేక, 1864లో కేంద్రప్రభుత్వానికి దక్షిణాదిరాష్ట్రాల కూటమి లొంగిపోయింది. కేంద్ర ప్రభుత్వ విధానాలను శిరసావహించటానికి తలొగ్గింది. ఐతే, ఆ అంగీకారం మానసిక పరివర్తన ఫలితంగాదు. లొంగుబాటుదారుడు విజేతకు ప్రదర్శించే నమ్రత. బానిసల

విముక్తి కేంద్రప్రభుత్వ విధానం. తమ చెప్పుచేతల్లో మెలగుతూ, తమ పనిముట్లలో భాగంగా ఉండిన నీగ్రోలను విముక్తిజేసి, ఫెడరల్ సైన్యాలు శిబిరాలకు తరలించడం చూస్తున్న దక్షిణాది తెల్లజాతికి గుండెల్లో మంటలు చెలరేగాయి. కానీ, ఆపడం తమ చేతుల్లో లేదు. చేతగానివాడి అక్కసు బలహీనుని మీదికి మరలడం సహజం. అందువల్ల, ఓడిపోయిన తెల్లజాతి ఆగ్రహం శిబిరాలకు చేరిన నీగ్రోల మీదికి మరలింది. కసి తీర్చుకోటానికి ఒక రహస్యసంస్థ ఏర్పడింది. దాని పేరే 'కు క్లక్స్ క్లాన్.' తెల్లటి దుస్తుల్లో దయ్యాలకు మల్లే వేషం వేసుకుని చీకటివేళల్లో నీగ్రోలను చెల్లాచెదురు చెయ్యడం మొదలు, శిబిరాలను తగులబెట్టడం, ఒంటరిగా దొరికిన నీగ్రోలను దారుణంగా హింసించి చంపేయడం దాని కార్యక్రమం.

అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా పడకదగ్గరికి చేరుకున్నాడు లూథర్. ప్రశాంతంగా నిద్రపోతున్న భార్యాకూతుర్ల ముఖాల్లోకి చూశాడు. యోకీ! ఏ అమాయకపు చిరునవ్వుకోసం తను అహర్నిశలూ తపిస్తాడో ఆ యోకీ తనకిక లేదా? ప్రతి చర్యలో సహధర్మచారిణిగా జీవితాన్ని పంచుకుంటున్న కొరెట్టా తనకు శాశ్వతంగా దూరంకానుందా? ఏమో, వాళ్ళు తనకు దూరమౌతారో లేక తానే వారికి దూరమౌతాడో ఎలా తెలుస్తుంది? లూథర్‌కు తల తిరిగిపోయింది. నెమ్మదిగా లేచి వంటగది చేరుకున్నాడు. కాఫీ కలుపుకుని ఆలోచిస్తూ కూర్చున్నాడు. 'బయట పడాలి; ఈ సాలెగూడునుండి బయటపడాలి; కానీ, పిరికిపందలా కనిపించకుండా బయటపడాలి' అనుకున్నాడు. అంతలో అతని అంతరాత్మ నిదురనుండి ఉలిక్కిపడి లేచింది. 'ఏమిటీ దిగజారుడుతనం లూథర్! నువ్వు తప్పుకుంటే మిగతావాళ్లు నిలుస్తారా? ఈ లంపటం మాకెందుకనుకోరా? నీ చేతులతో పెంచిన మొక్కను నువ్వే నరికేస్తావా? ఇదేనా నీ ఆదర్శం? బెదిరింపులకే బెంబేలు పడిపోతే, ఇక నువ్వు జీవితంలో సాధించేదేముంటుంది?' అంటూ గద్దించింది. లూథర్ మోకాళ్ళ మీద కూర్చుని కళ్ళు మూసుకున్నాడు. 'ప్రభూ! ఏమైంది నాకు? ఎందుకిలా దిగజారిపోతున్నాను? నా పిరికితనాన్ని పోగొట్టు ప్రభూ. నా మనసుకు శక్తిని ప్రసాదించు' అంటూ ప్రార్థించాడు. విద్యుల్లతతో వెలిగినట్టు గదంతా వెలుతురుతో నిండిపోయి, లూథర్‌కు మిరుమిట్లు కమ్మింది. 'మార్టిన్ లూథర్! లే. ధర్మంకోసం తలవంచకుండా నిలబడు. న్యాయాన్నీ, సత్యాన్నీ కాపాడు. నీకు అండగా నేనున్నాను.' - మేఘగర్జన వంటి మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

మరుసటిరోజు ప్రార్థనా సమావేశంలో, ''ఏదోవొకరోజు రక్తపుమడుగులో

నా శవం మీకు కనిపిస్తే కనిపించనీగాక, హింసామార్గంలో మీరు ప్రతీకారం తీర్చుకోవడాన్ని నేను సహించలేను. ఇంతవరకు మీరు ఏ క్రమశిక్షణతో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారో అదే క్రమశిక్షణ, ఏ హుందాతనంతో మీరు వ్యవహరిస్తున్నారో అదే హుందాతనం, చిరకాలం నిలుపుకోవాలి'' అనే మాటలు అనాలోచితంగా లూథర్ నోటినుండి వెలువడ్డాయి. శ్రోతలందరూ వొకరకమైన నిశ్శబ్దంలో మునిగిపోయారు.

రెండురోజుల తరువాత, అంటే జనవరి 30 సోమవారం సాయంత్రం, అబెర్నేథీతో కలిసి సమారాధనలో పాల్గోటానికి లూథర్ 'ఫస్ట్ బాప్టిస్టు చర్చి'కి వెళ్ళాడు. దగ్గర్లోవుండే వొక స్నేహితురాలిని తోడుతీసుకుని కొరెట్టా ఇంట్లోనే ఉండిపోయింది. చంటిపాపను వెనగ్గదిలో నిద్రపుచ్చి, స్నేహితురాళ్ళిద్దరూ హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సమయం తొమ్మిదిగంటలా పదిహేను నిమిషాలు. దభిల్లుమని ఏదో ఇటుకదిమ్మెలాటి పదార్థం వరండాలో పడిన శబ్దం వినిపించింది. ఇద్దరూ చంటిపిల్ల గదివైపుకు పరుగులు తీశారు. పెద్ద ప్రేలుడుతో ఇళ్ళంతా గడగడలాడింది. ఇంటి ముందుభాగం ఎక్కడిదక్కడ కూలిపోయింది. ఇందాకా ఆడవాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్న హాలు గాజుపెంకులతో నిండిపోయింది. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పిపోయింది. ప్రేలుడు హోరు తగ్గగానే టెలిఫోన్ గలగలా మోగింది. కొరెట్టా నిబ్బరంగా వెళ్ళి రిసీవర్ అందుకుంది. ఆమె ధైర్యానికి స్నేహితురాలు ఆశ్చర్యపోయింది.

''కొరెట్టా మాట్లాడుతున్నాను.''

''తెలుసులేవే. అది నా పనేనని చెప్పటానికే ఇప్పుడు ఫోన్ చేశాను. లంజల్లారా! మీరు ప్రాణాలతో బయటపడటం నాకు బాధేస్తూంది.'' అంది అవతలి వైపునుండి వొక ఆడగొంతు.

సమావేశంలోవున్న సభ్యులు ఏదో ఆందోళనగా బయటికీ లోపలికీ తిరుగడం, గుసగుసలాడుకోవడం లూథర్ గమనించాడు. ఉండబట్టలేక విషయమేమిటని అబెర్నేథీని అడిగాడు. జరిగినదాన్ని అబెర్నేథీ చెవిలో చెబుతూంటే లూథర్ చెక్కుచెదరలేదు. భార్యాకూతుర్లకు ఏమైనా ప్రమాదం జరిగిందేమోనని వాకబు చేశాడు. లేదని తెలీగానే లేచి నిలబడి శ్రోతలతో, ''ఎవరూ ఆవేశపడొద్దు. ఎదుటివాడు రెచ్చగొడితే మనం రెచ్చిపోవడమంటే, ఎదుటివాడు కోరుకునేదే మనం చేసిన ట్టౌతుంది. మన విధానాలను మనం నమ్ముకుందాం. అహింసామార్గం వదలకుండా

మన ప్రయాణాన్ని కొనసాగిద్దాం.''అన్నాడు. శ్రోతలతో సెలవు తీసుకుని ఇంటికి బయలుదేరాడు.

లూథర్ ఇంటిముందు గుంపులుగుంపులుగా జనం ప్రోగౌతున్నారు. రాకపోకలకు అంతరాయం కలక్కుండా జనాన్ని రోడ్డుపక్కలకు తొలగించే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారు. జనం పోలీసును ఖాతరు చెయ్యడంలేదు. 'నేను కదలను. మీ తెల్లజాతి ఎప్పుడూ మమ్మల్ను పక్కలకే నెడుతూంది. నీ దగ్గరా రివాల్వరుంది, నా దగ్గరా రివాల్వరుంది. నువ్వో నేనో ఇప్పుడే తేల్చుకుందాం రా' అంటూ వొక నీగ్రోయువకుడు పోలీసుజవానుకు ఎదురుతిరిగాడు. నిమిషనిమిషానికీ గుంపు పెరిగిపోతూంది. విడతలు విడతలుగా అదనపు పోలీసుబలగాలు ఆ తావుకు చేరుకుంటున్నాయి. లూథర్ కారు దిగంగానే జనం పక్కకు సర్దుకుంటూ దారిచేశారు. చాలామంది చేతుల్లో ఆయుధాలుండటం లూథర్ గమనించాడు. అతడు నేరుగా కొరెట్టా, యోకీలుండే వెనకగదికి దారితీశాడు. కొరెట్టా ముఖంలో ఏమాత్రం కంగారు కనిపించకపోవడం అతనికి తృప్తి కలిగించింది. కుదుటపడిన మనసుతో లూథర్ గదినుండి బయటికొచ్చాడు.

డైనింగ్‌రూములో నగర మేయర్ గేల్, పోలీసు కమిషనరూ, పత్రికా విలేఖర్లూ లూథర్‌కోసం ఎదురుచూస్తూ నిలబడ్డారు. అతని రాకకు ముందే వాళ్ళంతా అక్కడికి చేరుకున్నారు. లూథర్ దగ్గరికిరాగానే అందరూ తమ సంతాపాన్ని ప్రకటించారు. ''ఇలాటి సంఘటన మన నగరంలో జరగడం దురదృష్టం.'' అన్నాడు మేయరు. ''ఇప్పుడు విచారించి లాభమేముంది? ఇదంతా మీ బహిరంగ ప్రకటనల పర్యవసానమే.'' అన్నాడు లూథర్ వెంటుండే మిత్రుడు.

ఇంటిబయట క్షణక్షణానికీ ఉద్రిక్తత పెరిగిపోతూంది. ఆలస్యంచేస్తే పరిస్థితి అదుపు తప్పుతుంది. గబగబా లూథర్ వరండాలోకి నడిచాడు. అతన్ని చూడగానే జనసమూహం నిశ్శబ్దమైంది.

''స్వజనులారా! మనకు చట్టంమీద, శాంతిమీద నమ్మకముంది. ఉద్రేకాలకు పోవడం మనకు తగదు. ఉద్రేకంతో ఏ పనికీ మీరు పూనుకోవద్దు. మీ ఆయుధాలను బయటికి తీయొద్దు. కత్తితో జీవించేవాడు కత్తితోనే అంతమౌతాడు. అది భగవంతుడు చెప్పిన మాట. మనం హింసను ప్రబోధించడంలేదు. శత్రువునైనా ఆదరించాలనేది మన ధ్యేయం. మీ శత్రువులను ఆదరించండి. వాళ్ళతో మంచిగా ప్రవర్తించండి. మీరు వాళ్ళను ద్వేషించడంలేదనీ, ప్రేమిస్తున్నారనీ వాళ్ళు తెలుసుకునేలా చేయండి.

"ఈ బహిష్కరణోద్యమం నా వొక్కడివల్ల మొదలైందిగాదు. నడపమని మీరంతా కోరితే నడుపుతున్నాను. నన్ను ఆపినంత మాత్రాన ఈ ఉద్యమం ఆగుతుందనుకోవడం వెర్రితనమని ఈ లోకానికి తెలియనివ్వండి. నన్ను ఆప గలరేమోగానీ ఈ ఉద్యమాన్ని ఆపడం ఎవరితరం కాదు. మనం చేపట్టిన కార్య క్రమంలో ధర్మముంది. అందువల్ల, దేవుడు మనవైపున్నాడు."

లూథర్ ప్రసంగం ముగియగానే జనం 'ఆమెన్(తథాస్తు)'అంటూ ప్రతిధ్వ నించారు. 'దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు', 'మేమంతా నీతోనేవున్నాం' అనే కేకలు జనంనుండి వినిపించాయి. మనుషుల ముఖాల్లో క్రోధం తొలగిపోయింది. కన్నీటితో ఇళ్ళకు తిరుగుముఖం పట్టారు. అందరూ వెళ్ళిపోయిన తరువాత, ఆ రాత్రి తలదాచుకోటానికి లూథర్ కుటుంబం వొక స్నేహితుని ఇంటికి చేరుకుంది.

టివి వార్తల్లో జరిగింది తెలుసుకున్న కొరెట్టా తండ్రి ఓబియా స్కాట్ రాత్రికిరాత్రే పరిగెత్తుకొచ్చాడు. కొద్దిరోజులపాటు కూతురును, మనుమరాలిని తనతో తీసుకుపోతా నన్నాడు. క్లిష్టసమయంలో భర్తను వదిలివెళ్ళడానికి కొరెట్టా ససేమిరా అంది. మరుసటి రోజు లూథర్ తలిదండ్రులుగూడా మాంట్గోమెరీ చేరుకున్నారు. ఇకమీదట సాయుధ అంగరక్షకుని వెంటదీసుకోవడం మంచిదనీ, ఇంటికి సాయుధ కాపలాదారును ఏర్పాటు చెయ్యడంగూడా అవసరమని శ్రేయోభిలాషులందరు మూకుమ్మడిగా లూథర్‌ను ఒత్తిడి చేశారు. ఒత్తిడి తట్టుకోలేక, అంగరక్షకునికోసం లూథర్ పోలీసుకు దరఖాస్తు చేశాడు. ఆ దరఖాస్తును పోలీసులు తిరస్కరించారు.

ఆ మరుసటిరోజు, అంటే ఫిబ్రవరి 1వ తేదీన, ఇ.డి.నిక్సన్ ఇంటిని ప్రేల్చివేసే ప్రయత్నం గూడా జరిగింది. అదృష్టవశాత్తు ఆ ప్రేలుడువల్ల ఎవరికీ హాని జరగలేదు.

# ఉపశమనం

విధ్వంసక చర్యలతో తెల్లజాతి పాముకున్నదేమీ లేకపోగా, ఉద్యమానికి అంతర్జాతీయ ప్రాముఖ్యతను ఆర్జించిపెట్టింది; డా. మార్టిన్ లూథర్ కింగ్‌ను ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతుణ్ణి చేసింది. నేల నాలుగు చెరగులనుండి మాంట్గోమెరీ ఉద్యమానికి సహకారం, సానుభూతి వెల్లువగా ప్రవహించేలా చేసింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్ తదితర యూరోపియన్ దేశాలనుండేకాక, ఇండియా, జపాన్ మొదలైన ఆసియాదేశాలనుండిగూడా విరివిగా విరాళాలు అందుతున్నాయి. నిధులను అలబామా బ్యాంకుల్లో నిలువచేస్తే ఆ రాష్ట్రప్రభుత్వంతో ప్రమాదమని ఎం.ఐ.ఎ. నాయకులకు తెలుసు. అందువల్ల, వాటిని ఇతర రాష్ట్రాల్లోవుండే బ్యాంకుల్లో జమజేశారు. ఆ నిధులతో కార్లకూటమికి కొన్ని వ్యానులు ఖరీదుచేశారు. వాటిని ఎం.ఐ.ఎ. పేరుతో కాకుండా, వేరువేరు చర్చిల పేర్లతో రిజిస్టర్ చేయించారు.

మాంట్గోమెరీ పోరాటం అనుసరించే కొత్తవిధానం అమెరికన్ మేధావివర్గంలో ఆసక్తిని రేకెత్తించింది. ఆ అంశంమీద ఉపన్యసించమని అనేక సంస్థలు లూథర్‌ను ఆహ్వానిస్తున్నాయి. వాటిల్లో అతన్ని ఆకర్షించింది 'ఫిస్క్ విశ్వవిద్యాలయం'వారి ఆహ్వానం. అది టెన్నెసీరాష్ట్ర రాజధాని నాష్‌విల్లీలో ఉంది. పదిరోజులపాటు తమ క్యాంపస్‌లో విడిదిచేసి, విద్యార్థులతో గోష్ఠి నిర్వహించమని వాళ్ళు అడుగుతున్నారు. నీగ్రో విద్యార్థుల్లో చైతన్యం పెంచటానికి అది మంచి అవకాశం. ఆమోదించమని సలహా ఇచ్చారు ఎం.ఐ.ఎ. మిత్రులు.

ఈలోగా, తెల్లనాయకత్వంమీద బస్సు కంపెనీల ఒత్తిడి రెట్టింపయింది. బస్సులు ఖాలీగా తిప్పబట్టి రెండు నెలలైంది. లాభం మాట అటుంచి, ఖర్చులకైనా గిట్టుబాటు కావడంలేదు. బయటబడే మార్గంకోసం తెల్లనాయకత్వం తీవ్రంగా అన్వేషణ ప్రారంభించింది. బహిష్కరణలను నిషేధిస్తూ ఆ రాష్ట్రప్రభుత్వం అనాదిలో చేసిన చట్టమొకటి వారి చేతికిదొరికింది. దాన్ని ఆధారం చేసుకుని, బస్సుల బహిష్కరణ చట్టరీత్యా నేరమని 1956 ఫిబ్రవరి 9వ తేదీన నగర అటార్నీ పత్రికలకు ప్రకటన జారీచేశాడు.

రాబోయే ఉపద్రవానికి అదొక సంకేతం. చట్టపరమైన దాడికి నగరపాలకులు సంకల్పించినట్టు ఆ ప్రకటన సూచిస్తూంది. అదే బాటలో ఎదురుదాడి చేయాలని నీగ్రో నాయకత్వం నిర్ణయించింది. మరుసటిరోజు, ఐదుగురు మహిళలతో, బస్సుల్లో

వేరుపాటు విధానాన్ని నిర్దేశించే అలబామా చట్టాలు రాజ్యాంగవిరుద్ధమని జిల్లాకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేయించింది. అవతలివైపు, నగరపాలకసంస్థ తన కేసును 'గ్రాండ్ జూరీ'కి సమర్పించింది. కేసులో వివరించిన సమాచారాన్నిబట్టి, నేరం జరిగిందో లేదో ప్రాథమికంగా నిర్ణయించే వ్యవస్థ గ్రాండ్ జూరీ. కేసును పరిశీలించటానికి ఫిబ్రవరి 13వ తేదీన గ్రాండ్ జూరీ సమావేశమైంది.

రాసిబోసినట్టు సమస్యలు కట్టెదుట కనిపిస్తూంటే, ఊరు విడిచివెళ్ళడం లూథర్‌కు మనసొప్పలేదు. నాష్‌విల్లీ ప్రయాణం రద్దు చేసుకుందామనుకున్నాడు. అందుకు ఎం.ఐ.ఎ. మిత్రులు సమ్మతించలేదు. ఈ వ్యవహారాలు తాము చూసుకోగలమనీ, పరిణామాలు ఎప్పటికప్పుడు ఫోన్‌ద్వారా తెలియజేస్తామనీ హామీ ఇచ్చారు. భార్యా కూతుర్లను అట్లాంటా పంపించి, లూథర్ నాష్‌విల్లీ బయలుదేరాడు.

గ్రాండ్ జూరీకున్న పద్దెనిమిది సభ్యుల్లో పదహేడుగురు తెల్లవారు. మిగిలిన వొక్కడు తెల్లవారికి తలూపే నీగ్రో. వారంరోజుల తర్జనభర్జన తరువాత, బహిష్కరణ నేరమని గ్రాండ్ జూరీ ఖరారుచేసింది. 89మంది నీగ్రో నాయకులను కుట్రదారులుగా నిర్ణయించి అరెస్టుచేయడానికి అనుమతించింది. ఈ విషయం తెలియజేస్తూ ఫిబ్రవరి 21 రాత్రి రాల్ఫ్ అబెర్నెథీ లూథర్‌కు ఫోన్ చేశాడు. ''అరెస్టులు రేపు ఉదయం మొదలౌతాయి. నాది మొదటి పేరు'' అన్నాడు నిశ్చలంగా. ''నేను ఇప్పుడే వచ్చేస్తున్నాను. రేపు నీతో ఉంటాను.'' అన్నాడు లూథర్.

వెంటనే నాష్‌విల్లీ వదిలి, భార్యనూ కూతురునూ తీసుకొచ్చేందుకు లూథర్ అట్లాంటా చేరుకున్నాడు. అరెస్టు కావడానికి లూథర్ మాంట్గోమెరీ తిరిగెళ్ళడం అతని తండ్రికి ఇష్టంలేదు. నచ్చజెప్పటానికి అట్లాంటాలోని నీగ్రోప్రముఖులను ఇంటికి పిలిపించాడు. వాళ్ళల్లో లూథర్ ఎంతగానో గౌరవించే మూర్‌హౌస్ కాలేజి అధ్యక్షుడు డా.మేస్ గూడా ఉన్నాడు. ''మాంట్గోమెరీ పోకుండా ఆగలేను. నా స్నేహితులనూ సహచరులనూ వొకవైపు అరెస్టుచేసి జైల్లో తోస్తూంటే, పట్టనట్టు ఇక్కడ కూర్చోవటం పిరికితనానికి పరాకాష్ట. నావాళ్ళను వదులుకోవడంకంటే, పదేళ్ళు జైల్లో ఉండడమే నాకు సంతోషం. వెనకడుగు వేసే పొలిమేర నేను దాటిపోయాను'' అన్నాడు లూథర్ వాళ్ళతో. అతని అభిప్రాయాన్ని మేస్ సమర్థించాడు. మిగతా పెద్దలుగూడా సబబేనని తలాడించారు. కొరెట్టా, యోకీలను వెంటదీసుకుని మాంట్గోమెరీకి లూథర్ బయలుదేరాడు. తండ్రి మైకేల్‌గూడా అతన్ని అనుసరించాడు.

సిటీ జైలుముందు కనిపించిన వాతావరణం లూథర్‌ను ఆశ్చర్యంలో ముంచింది. ఆరోజది జైలులా లేదు; వినోద యాత్రికుల కేంద్రలా మారిపోయింది. అరెస్టు కావటానికి జనం గుంపులుగుంపులుగా ఎగబడుతున్నారు. ఎవ్వరి ముఖంలో భయమనేది కనిపించడమేలేదు. తన పేరు జాబితాలో ఉందోలేదో తెలుసుకోటానికి వారికైవారు అమీనా దగ్గరికి చొరబడుతున్నారు. పేరు లేదని చెప్పగానే చిన్నబుచ్చు కుంటున్నారు. అరెస్టన్నా జైలన్నా వొకప్పుడు గజగజలాడిన నీగ్రోలు వీళ్ళేనా! సగర్వంగా లూథర్ జైలు కార్యాలయంలో ప్రవేశించాడు. వెళ్ళగానే అతని వేలిముద్రలు తీసుకున్నారు. ఖైదీ నెం.7089 అనే బోర్డు మెడకు వేలాడదీసి ఫోటో తీయించారు. లూథర్ చర్చి సభ్యుల్లో వొకతడు జామీను మొత్తాన్ని చెల్లించి అతన్ని బయటికి తీసుకొచ్చాడు. మరుసటిరోజు, మెడకు తగిలించిన ఖైదీబోర్డుతో లూథర్ ఫోటో దేశవిదేశీ పత్రికలన్నిట్లో ప్రత్యక్షమైంది. దక్షిణాది తెల్లజాతి ప్రవర్తనను యావత్ ప్రపంచం చీదరించింది. లూథర్‌ను లొంగదీయటానికి తెల్లజాతి చేసిన మరో ప్రయత్నం ఘోరంగా విఫలమై, అతని కీర్తి అంతర్జాతీయంగా మరింత పెరిగేలా చేసింది.

ముద్దాయిలమీద కోర్టు విచారణ మార్చి 19వ తేదీ ప్రారంభమైంది. తిరునాలకు తరలినట్టు జనం కోర్టు దగ్గరికి చేరుకున్నారు. ఉత్తరాదిలో పేరుమోసిన డిఫెన్సు లాయర్లు నీగ్రోల తరఫున కేసు నడపటానికి హాజరయ్యారు. వాళ్ళ సామర్థ్యంముందు ప్రాసిక్యూషన్ శక్తియుక్తులు పేలవంగా మారిపోయాయి. నాలుగు రోజులపాటు విచారణ కొనసాగింది. ఎం.ఐ.ఎ. పక్షాన 28మంది డిఫెన్స్ సాక్షులను విచారి స్తున్నప్పుడు ప్రాసిక్యూషన్ అడ్వొకేట్లూ, నగర మేయరూ తలదించుకున్నారు. భర్తను పోగొట్టుకున్న స్టెల్లా బ్రూక్ అనే నీగ్రోవనిత బోనెక్కింది. అడుగుమోపడానికి తావులేని రద్దీలో, తన పైసలు వాపసిస్తే బస్సు దిగుతానని ఆమె భర్త డ్రైవరును డిమాండ్ చేశాడు. డ్రైవరు పోలీసులను పిలిపించాడు. పోలీసులొచ్చి అతన్ని పిట్టకుమల్లే కాల్చేశారు. మార్థా వాకర్ అనే మరో మహిళ తన భర్తకు పట్టిన గతి వివరించింది. అతడు కళ్లులేని కబోది. నిదానంగా బస్సు దిగుతున్నాడు. పూర్తిగా దిగకముందే డ్రైవరు తలుపు మూసేశాడు. కాలు తలుపుసందున ఇరుక్కుపోయింది. కేకలేస్తున్నా పట్టించుకోకుండా బస్సు ముందుకు నడిచింది. ఇలా ఒక్కొక్క సాక్షి బోనెక్కి జరిగిన ఘాతుకాలు వివరిస్తున్నప్పుడు వినేవారి గుండెలు బరువెక్కాయి.

మార్చి 22న ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. తీర్పు చెప్పటానికి

న్యాయమూర్తి యూజెన్ కార్టర్‌కు పదినిమిషాలైనా పట్టలేదు. రాష్ట్ర చట్టాన్ని ముద్దాయిలు అతిక్రమించారని తీర్మానిస్తూ శిక్షలు ప్రకటించాడు. లూథర్‌కు ఐదువందల డాలర్ల జుల్మానా, కోర్టు ఖర్చులూ శిక్షగా విధించాడు. అపరాధం చెల్లించని పక్షంలో 386 రోజులు కఠిన కారాగారశిక్ష అనుభవించాలన్నాడు. హింసను అరికట్టడానికి లూథర్ చేస్తున్న ప్రయత్నానికి నజరానాగా అతనికి అతితక్కువ శిక్ష విధించానని పేర్కొంటూ న్యాయమూర్తి తన ఉదారత చాటుకున్నాడు. కొందరు మిత్రులు అప్పటికప్పుడే నీగ్రో నాయకులకు జామీన్లు సమకూర్చారు. అపీలు చేస్తున్నామని పిటిషన్ దాఖలుచేసి ముద్దాయిలు బయటికి నడిచారు.

ఆ తీర్పు తెల్లజాతికి శాసనపరమైన గెలుపు. కానీ, నైతికవిజయం నీగ్రోల పరమైంది. 'ఎక్కేదే లేదురా, తెల్లోల్ల బస్సుల్లో ఇక ఎక్కేదే లేదురా' అని పాడుకుంటూ, కోర్టుహాలునుండి బయటికొస్తున్న నాయకులకు బయటున్న నీగ్రో జనాలు స్వాగతం పాడారు. శిక్షపడిన నేరస్తులుగా కాక, పోరు గెలిచిన వీరుల్లా నాయకులు తలెత్తుకుని ఇళ్ళకు బయలుదేరారు. విచారణ వివరాలు పత్రికల్లో చదివిన ఎంతోమంది తెల్లజాతీయుల్లో నీగ్రోలపట్ల సానుభూతి మొలకెత్తింది.

శత్రుశిబిరాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణలా, మాంట్గోమెరీ ఉద్రిక్తతకు కొద్దిరోజుల విరామం దొరికింది. ఆ సమయంలో, నీగ్రో పోరాటానికి సైద్ధాంతిక చట్రాన్ని రూపొందించే పనిలో నీగ్రో నాయకత్వం నిమగ్నమైంది. గాంధేయ విధానాన్నీ, క్రిస్టియానిటీనీ, యూరోపియన్ మానవతావాదాన్నీ ఆధారంగా తీసుకుని, నీగ్రో ఉద్యమానికి లూథర్ కింగ్ ఒక సైద్ధాంతిక పునాదిని తయారుజేశాడు. ఈ కసరత్తులో బేయర్డ్ రస్టిన్, ఫాదర్ గ్లీన్ ఇ స్మైలేల అమూల్యమైన సహకారం లూథర్‌కు లభించింది.

బేయర్డ్ రస్టిన్ న్యూయార్క్ నివాసి. పౌరహక్కుల పోరాటంలో కాకలుదీరిన యోధుడు. గాంధేయ విధానంలో అనేక నిరసనలు నిర్వహించిన అనుభవశాలి. కానీ, ఒకప్పుడు అతడు కమ్యూనిస్టుగా ఉండటం, ఆ తరువాత స్వలింగసంపర్కం ఆరోపణమీద శిక్ష అనుభవించటం వంటి చరిత్ర అతన్ని వివాదాస్పద వ్యక్తిగా తయారుజేసింది. ఫిబ్రవరిలో మాంట్గోమెరీ నాయకులను అరెస్టుచేస్తున్న సమయాన అతడు మాంట్గోమెరీలో దిగాడు. మాంట్గోమెరీ ఉద్యమానికుండే ప్రాముఖ్యతను అతడు పసిగట్టాడు. అందులో పాల్గొనాలనే ఆసక్తితో అక్కడికి చేరుకున్నాడు. అతని రాక ఎం.ఐ.ఎ. నాయకులకు కొండంత బలాన్నిచ్చింది. కానీ, వారం

తిరగకముందే అతడు తిరుగుముఖం పట్టక తప్పలేదు. స్థానిక నీగ్రోలను బయటివారు రెచ్చగొడుతున్నారనీ, మాంట్గోమెరీ నీగ్రోనాయకులు కమ్యూనిస్టులతో చేతులు కలుపుతున్నారనీ విమర్శలు మొదలయ్యాయి. బయటివారి జోక్యాన్ని సహించేదిగాదు దక్షిణాది సమాజం. లుకలుకలు చోటుచేసుకోకముందే రస్టిన్‌ను వాపసుపంపడం క్షేమమని ఎం.ఐ.ఎ. నిర్ణయించింది.

'ఫెలోషిప్ ఆఫ్ రికన్సీలియేషన్' సంస్థలో ఫాదర్ గ్లీన్-ఇ-స్మైలే కార్యదర్శి. ఆ సంస్థ తరఫున ఫిబ్రవరి నెలాఖరులో అతడు మాంట్గోమెరీ వచ్చాడు. ఆయన తెల్లజాతీయుడు. గాంధేయ విధానాన్ని క్షుణ్ణంగా ఆకలింపుచేసుకున్న మేధావి. అతని సాంగత్యంవల్ల అహింసావిధానం పట్ల లూథర్ అవగాహన మరింత పెరిగింది. బయటివారి జోక్యాన్ని దక్షిణాది తెల్లజాతి ఎంతగా ఏవగించుకుంటుందో స్మైలేకి బాగా తెలుసు. అందువల్ల, మాంట్గోమెరీలో అతడుగూడా ఎక్కువరోజులు నిలువలేదు.

వేరుపాటు విధానం నిర్దేశించే అలబామా చట్టాలు చెల్లవని ఎం.ఐ.ఎ. దాఖలు చేసిన పిటిషన్ 1956 మే 11వ తేదీన జిల్లాకోర్టు ముగ్గురు న్యాయమూర్తుల బెంచీముందు విచారణ కొచ్చింది. వాదనలో నగరపాలకసంస్థ అడ్వొకేట్లు అడుగడుగునా తడబడ్డారు. ఊపిరాడని పరిస్థితిలో, 'బస్సుల్లో ఇప్పుడు అమలౌతున్న వేరుపాటును తొలగిస్తే అదుపుచేయలేనంత హింసాకాండ ప్రజ్వరిల్లుతుం'దనీ, 'కాబట్టి, శాంతిభద్రతల పరిరక్షణకు వాటిని కొనసాగించడం మంచి'దనీ కోర్టుకు నివేదించారు. న్యాయమూర్తి రైవెస్ కలుగజేసుకుంటూ, "ఒకమనిషి నేరం చెయ్యకుండా అరికట్టడానికి మరో మనిషి హక్కులను హరించక తప్పదని మీ ఉద్దేశమా?" అంటూ అడిగిన ప్రశ్నకు వారిదగ్గర సమాధానంలేదు. జూన్ 5వ తేదీన జిల్లాకోర్టు తీర్పు వెలువడింది. 'బస్సుల్లో వేరుపాటు విధానాన్ని నిర్దేశించే అలబామారాష్ట్ర శాసనాలూ, స్థానిక చట్టాలూ రాజ్యాంగవిరుద్ధం. అందువల్ల అవి చెల్లవు' అంటూ జిల్లాకోర్టు వాటిని రద్దుచేసింది. సుప్రీంకోర్టులో అపీలు చేసినంతవరకు ఈ తీర్పు అమలుకాకుండా నగరపాలకసంస్థ 'స్టే' తీసుకుంది.

ఓడినకొద్దీ మూర్ఖునికి పట్టుదల పెరగడం సహజం. ప్రైవేటు వాహనాల కూటమిని ఇరుకున పడేస్తే నీగ్రోలు కాళ్ళబేరానికి వస్తారని తెల్లనాయకులు నిర్ణయించారు. ఆ వాహనాలకు భీమా రద్దుచేయమని ఇన్స్యూరెన్స్ కంపెనీలను ఒత్తిడిచేశారు. సెప్టంబర్ 15వ తేదీనుండి కార్లకూటమిలో పాల్గొనే వాహనాల పాలసీలను రద్దు చేస్తున్నట్టు భీమా కంపెనీలు ప్రకటించాయి. గట్టెక్కే మార్గాలగురించి

ఆ రంగంలో అనుభవమున్న మిత్రులతో లూథర్ సంప్రదించాడు. లండన్‌కు చెందిన లాయిడ్స్ ఇన్స్యూరెన్స్ కంపెనీని ఒప్పించడానికి తన పరపతినంతా వినియోగించాడు. ఆ కంపెనీ ముందుకురావడంతో భీమా సమస్య సుఖాంతమైంది.

దీంతో తెల్లజాతినాయకత్వం ఇంకా రెచ్చిపోయింది. కార్ల కూటమిని ఏదోవిధంగా విచ్ఛిన్నం చెయ్యాలని సంకల్పించింది. న్యాయమూర్తి కార్టర్ ఎల్లప్పుడూ తమవైపే గాబట్టి, చట్టపరంగా దెబ్బతీయడం చాలాతేలిక. ఐతే, కూటమివల్ల నగరానికి జరుగుతున్న నష్టం ఏముందని దావాలో చూపించాలి? వెదికితే బోలెడన్ని నష్టాలు కనిపించాయి. ప్రధానంగా కార్ల కూటమితో నగరవీధులు అల్లరిగా తయారయ్యాయని చూపించాలనుకున్నారు. ఎం.ఐ.ఎ. నాయకులు లైసన్సులేని వ్యాపారం చేస్తున్నారని చూపెట్టాలనుకున్నారు.

కార్లకూటమి రద్దైతే మొదలు నరికిన చెట్టులా ఉద్యమం కూలిపోతుంది. కడుపు చేత్తోబట్టుకుని ప్రతిరోజూ పదిపన్నెండు మైళ్ళు కాలినడకతో పనితావుకు చేరుకోవడం మాటలుకాదు. ఎలా బయటపడాలో నీగ్రో నాయకత్వానికి పాలుపోలేదు. జిల్లాకోర్టులో స్టేకోసం ప్రయత్నించారు. దొరకలేదు. దాంతో, చేతులెత్తేసి భగవంతునిమీద భారం మోపారు. నవంబర్ 13వ తేదీ మంగ్లవారం, కార్టర్ కొలువులో, నగరపాలకసంస్థ దావామీద విచారణ జరుగుతుందని తాఖీదులు చేతికందాయి.

చెలరేగే మానసిక కల్లోలాన్ని అదుపుచేసుకుంటూ, సోమవారం సాయంత్రం ప్రార్థనాసమావేశంలో, తలమీద పడబోయే పిడుగుపాటును సున్నితంగా శ్రోతలకు చేరవేశాడు లూథర్. "రాబోయేది చిమ్మచీకట్లు కమ్మిన కాళరాత్రి. కానీ, ఏ చీకటైనా సూర్యోదయంతో పటాపంచలౌతుంది. దేవుడు మనవైపే ఉన్నాడనే అచంచల విశ్వాసంతో మనం ఇంతకాలం పోరాటాన్ని నడుపుకొచ్చాం. గతంలో ఎదురైన కష్టాలనుండి ఊహించని రీతిలో గట్టెక్కడం మన విశ్వాసాన్ని బలపరిచింది. అదే విశ్వాసంతో, అదే పట్టుదలతో మనమిప్పుడు ముందుకు నడవాలి." అంటూ ధైర్యమిచ్చాడు.

మంగ్లవారం ఉదయం కోర్టులో విచారణ ప్రారంభమైంది. ఎం.ఐ.ఎ. తోబాటు కొన్ని చర్చిలనూ, వ్యక్తులనూ కలిపి దావాలో కచ్చిదారులుగా చేశారు. కార్ల కూటమివల్ల నగరపాలనకు జరిగిన నష్టానికి వాల్లంతా పరిహారం చెల్లించాలని కోర్టును అభ్యర్థించారు. మధ్యాహ్నం పన్నెండు గంటలవరకు సర్కారు వకీల్ల వాదన ధాటీగా నడిచింది. చిన్న విరామం ప్రకటించి న్యాయమూర్తి దిగిపోయాడు.

ఆ సమయంలో, ఉన్నట్టుండి ఏదో సంచలనం జరిగిన వాతావరణం కోర్టుగదిని ఆవరించింది. నగర మేయరునూ, కమిషనర్లనూ వెనగ్గదిలోకి పిలిపించారు. సర్కారు వకీల్లు వాళ్ళను వెంబడించారు. పత్రికా విలేఖర్లు బయటికీ లోపలికీ హడావుడిగా తిరుగుతున్నారు. 'ఏదో అడ్డం తిరిగినట్టుంది' అనుకుంటున్నారు నీగ్రో నాయకులు. ఇంతలో, రెక్స్ థామస్ అనే విలేఖరి లూథర్ దగ్గరికొచ్చి, ''ఇదిగో మీరు ఎదురుచూస్తున్న తీర్పు'' అంటూ వొక కాగితం అందించాడు.

లూథర్ కళ్ళు ఆత్రుతగా అక్షరాలవెంట పరిగెత్తాయి. ''బస్సుల్లో వేరుపాటును విధిస్తున్న అలబామా రాష్ట్ర శాసనాలూ, స్థానిక చట్టాలూ రాజ్యాంగవిరుద్ధమని ముగ్గురు న్యాయమూర్తుల జిల్లాకోర్టు ఇచ్చిన తీర్పుతో ఏకీభవిస్తూ ఈరోజు సుప్రీంకోర్టు తన తీర్పును ప్రకటించింది. దీనిమీద ఎలాటి వాదనలూ వినడానికి సుప్రీంకోర్టు తిరస్కరించింది. 'జిల్లాకోర్టు తీర్పుతో ఏకీభవిస్తున్నాం' అనే వొకేవొక్క వాక్యంతో విచారణ ముగించింది.''

లూథర్ వొక్క ఉదుటున లేచి మిత్రలదగ్గరికి పరుగుతీశాడు. అబెర్నెథీ, నిక్సన్, కొరెట్టాలు వొకేచోట కనిపించారు. క్షణాలమీద ఈ వార్త నీగ్రోలోకంలో ప్రాకిపోయింది. 'దేవుడు వాషింగ్టన్ డి.సి. నుండి పలికాడు' అన్నాడు అక్కడేవున్న వొక నీగ్రో.

సంక్షిప్త విరామం తరువాత కోర్టు తిరిగి ప్రారంభమైంది. యధావిధిగా వకీల్లు వ్యవహారంలో దిగిపోయారు. అనవసరమైన తతంగాన్ని నిర్వహిస్తున్నామని ఇరుపక్షాలకూ తెలుసు. ఐనా, జీవంలేని వాదన సాయంత్రందాకా సాగింది. వాదనలు ముగిసిన రెండు నిమిషాల్లో తీర్పు వెలువడింది. కార్ల కూటమిని నిషేధిస్తూ న్యాయమూర్తి కార్టర్ తాత్కాలిక ఉత్తరువు జారీచేశాడు. అతని తీర్పు ఎలావుంటుందో అందరికీ ముందే తెలుసుగాబట్టి, దాన్నిగురించి ఎవరూ పట్టించుకోలేదు.

తదుపరి చర్యకోసం ఎం.ఐ.ఎ. కార్యవర్గం అత్యవసరంగా సమావేశమైంది. ఉద్యమం ఎప్పుడు ఎలా విరమించాలి అనే అంశంమీద నిర్ణయం తీసుకోటానికి మరుసటిరోజు సాయంత్రం విస్తృత సమావేశానికి పిలుపునిచ్చింది. వీలైనంతమంది అందులో పాల్గొనేలా చేసేందుకు, ఏకకాలంలో రెండు ప్రదేశాల్లో సమావేశం నిర్వహించాలనీ, మగ్గంలో కండెబోటులాగా నాయకులు ఇటూఅటూ తిరుగుతూ రెండు సమావేశాల్లోనూ పాల్గొనాలనీ నిర్ణయించింది. అధికారికంగా ఉద్యమాన్ని విరమించి, సుప్రీంకోర్టు తీర్పు మాంట్గోమెరీకు చేరిందాకా బస్సుల్లో ఎక్కగూడదనే

ప్రతిపాదన సభ ఆమోదానికి ప్రవేశపెట్టాలని సలహాసంఘం సిఫారసు చేసింది.

చాలారోజుల తరువాత, ఆ రోజు రాత్రి కు క్లక్స్ క్లాన్ నుండి లూథర్‌కు మళ్ళీ ఫోనొచ్చింది. ''నీగ్రోలు బస్సుల్లో ఎక్కబోతున్నారుగదా, ఎవరైనా ముందు సీట్లల్లో కూర్చున్నారో మీ సంగతులింతే. ఒకే రాత్రి యాభై ఇళ్ళను తగిలేస్తాం. అందులో నీదీ వొకటి.''

''చూడండి. అలాటి పనులతో సమస్యలు పరిష్కారం కావు.''

లూథర్ వాక్యం పూర్తికాకముందే, ''నోరు మూయరా నల్లనాకొడకా. లేదంటే ఇప్పుడేవచ్చి నిన్ను బుడగలా పేల్చేస్తాం'' అంది అవతలి గొంతు.

మరుసటి దినం జరిగిన విస్తృత సమావేశానికి జనం తండోపతండాలుగా హాజరయ్యారు. అధికార ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆ రాత్రి నీగ్రో నివాసప్రాంతాల్లో కు క్లక్స్ క్లాన్ భారీ ప్రదర్శన నిర్వహించింది. చిత్రమేమిటంటే, చట్టరీత్యా నిషేధింపబడిన ఆ సంస్థ అలబామాలో బహిరంగంగా తిరుగుతుంది. వాళ్ళ కార్యక్రమం రేడియోలో మునుముందే ప్రచారమౌతుంది. క్లాన్ దిగకముందే ఆ ప్రాంతంనుండి పోలీసులు తప్పుకుని, వాళ్ళ స్వైరవిహారానికి అవకాశం కల్పిస్తారు.

సాధారణంగా, క్లాన్ రాకను ప్రకటించగానే నీగ్రోలు ఇళ్ళల్లో దాక్కుని, తలుపులూ కిటికీలూ మూసేసి, దీపాలు ఆర్పేస్తారు. చంపుతారనే భయంతో వాళ్ళకువాళ్ళే చచ్చిన వాడితో సమానమౌతారు. కానీ, ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. దయ్యాల్లా వేషం వేసుకున్న క్లాన్ సభ్యులు దాదాపు నలభై వాహనాల్లో దిగి వీధివెంట నడుస్తున్నా, ఒక్క తలుపైనా మూసుకోలేదు, ఒక్క దీపమైనా ఆరిపోలేదు. పైపెచ్చు, సర్కస్ ప్రదర్శన తిలకిస్తున్నట్టు ఆరుబయట చూస్తూ నిలుచున్నారు నీగ్రోలు. దిక్కుతోచని క్లాన్ సభ్యులు సందుల్లోబడి జారుకున్నారు.

తెల్లజాతికి తెలిసిన నీగ్రో వేరు, ఇప్పుడు వారితో వ్యవహరిస్తున్న నీగ్రో వేరు. ఈ విషయాన్ని తెలుసుకోలేక వాళ్ళు తప్పుమీద తప్పు చేస్తున్నారు. తెల్లమనిషి ఏది కోరితే అది చేసే నీగ్రో, తెల్లమనిషి కోప్పడితే గజగజలాడే నీగ్రో వాళ్ళ జ్ఞాపకంనుండి తొలగిపోలేదు. కానీ, ఇప్పుడు వాళ్ళతో ఢీకొంటున్నది సరికొత్త నీగ్రో; భయం తీరిన నీగ్రో!

మారిన పరిస్థితులకు అనుకూలంగా మానసిక సర్దుబాటు జరగకపోతే, సాధించిన ఫలితంకంటే చేజార్చుకునే ప్రయోజనాలు అధికంగా ఉంటాయి. గెలిచిన

వర్గంలో పొగరు చేరుతుంది; ఓడినవారిలో ఆక్రోశం పెరుగుతుంది. ఈ మనోవైకల్యాన్ని ఇరుపక్షాల్లో అదుపు చెయ్యాలి. లేకపోతే ఘర్షణలు చెలరేగుతాయి. సుప్రీంకోర్టు తీర్పు మాంట్గోమెరీ చేరేలోపల, ఈ తర్ఫీదు కార్యక్రమాన్ని చేపట్టాలని లూథర్ ప్రతిపాదించాడు. "ఇది ధర్మానికీ ప్రజాస్వామ్యానికీ లభించిన విజయం. అంతేగానీ, నీగ్రోల విజయంగా, తెల్లవాళ్ళ అపజయంగా భావించగూడదు. ప్రయాణాలు మొదలైన తరువాత, బస్సుల్లో రొమ్ము విరుచుకు ప్రవర్తించడం తప్పొతుంది. అహంకారాన్ని దేవుడు క్షమించడు. తెల్లజాతి అహంకారం ధర్మవిరుద్ధమైనప్పుడు నల్లజాతి అహంకారంగూడా ధర్మవిరుద్ధమే. అందువల్ల, మనం హెచ్చులకు పోకుండా, ఖాళీ దొరికినచోట నమ్రతగా కూర్చోవాలి." అని, ప్రతిరోజూ తను స్వయంగా నిర్వహించే సమావేశాల్లో లూథర్ నీగ్రోలను కొత్త వాతావరణానికి సమాయత్తం చేశాడు.

డిసెంబర్ 20వ తేదీన సుప్రీంకోర్టు తీర్పు మాంట్గోమెరీ చేరుకుంది. 1956 డిసెంబర్ 21న, అంటే, 381 రోజుల బహిష్కరణ తరువాత, మాంట్గోమెరీ నీగ్రోలు బస్సుల్లో ఎక్కబోతున్నారు. ఆ కార్యక్రమం తనతో ప్రారంభంకావాలని కోరుకున్నాడు లూథర్. 21వ తేదీ ఉదయం 5.45 గంటలకు, అబెర్నెథీ, నిక్సన్, స్మైలేలను వెంటదీసుకుని, ఇంటినుండి లూథర్ బస్సుమెట్టకు బయలుదేరాడు. కెమెరాలు వాటి పని మొదలెట్టాయి. ప్రశ్నలతో విలేఖర్లు వెంటబడ్డారు. కొద్దినిమిషాల్లో మొదటి బస్సొచ్చి మెట్టదగ్గర ఆగింది. తలుపు తెరుచుకుంది. లూథర్ బస్సులో అడుగెట్టగానే డ్రైవరు చిరునవ్వుతో ఆహ్వానిస్తూ -

"డా. కింగ్‌గారు మీరే ననుకుంటా."

"ఔను."

"ఈరోజు మీరు మా బస్సులో ఎక్కడం మా అదృష్టం."

"ధన్యవాదాలు."

లూథర్ ముందుసీట్లో కూర్చున్నాడు. అతని పక్కన స్మైలే కూర్చున్నాడు. అది జాతుల విలీకరణకు సంకేతం. అందరూ ఎక్కిన తరువాత బస్సు బయలుదేరింది. తరువాతి స్టేషన్‌లో తెల్లవారి ప్రాంతాలగుండా నడిచే బస్సుకు మారారు. బస్సెక్కిన తెల్లవారిలో చాలామంది, ఏమీ జరగనట్టు, ఖాళీగా కనిపించిన సీట్లల్లో సర్దుకున్నారు. మరికొందరు ముందుసీట్లలో నీగ్రోలను చూసి కంగారుపడ్డారు. కూర్చుంటే నీగ్రోకు వెనకవైపు కూర్చోవడమో, లేదంటే నిలుచుని ప్రయాణం చెయ్యడమో తప్పని

పరిస్థితి కొందరికి మింగుడుపడలేదు. ఖాళీసీట్లున్నా నిలుచుని ప్రయాణిస్తున్న వొక ముసలాయనను కూర్చోమని ఎవరో సలహా ఇవ్వగా, 'చావనైనా చస్తానుగానీ, నీగ్రో వెనకసీటులో కూర్చో'నని తెగేసి జవాబిచ్చాడు. ఇటువంటి వైషమ్యాలు తప్పిస్తే, విలీకరణ మొదటిరోజు సాఫీగా నడిచింది.

ఫలితమైతే దక్కిందిగానీ, ఇందులో చిన్న కొతుకు లేకపోలేదు. సంవత్సరానికి పైగా నల్లజాతీయులు పడిన కష్టానికి దక్కిన ఫలితంగాదిది; కోర్టుతీర్పు మూలంగా చేతికి దొరికిన అవకాశం మాత్రమే!

# బీభత్సం

మాంట్గోమెరీ వాతావరణం నివురుగప్పిన నిప్పులా మారిపోయింది. గెలిచిన వారు బహిరంగంగా సంతోషించటానికి జంకుతున్నారు. ఓడినవారు కోలుకోటానికి ప్రయత్నిస్తున్నారు. ఏదోవిధంగా వ్యాపారం తిరిగి మొదలైనందుకు బస్సు యజమానులు ఊపిరైతే పీల్చుకున్నారుగానీ, రెండో కంటికి తెలియనంత రహస్యంగా పీల్చుకున్నారు.

పలకరించేవారికి తొనక్కుండా జవాబిస్తున్నాడే తప్ప, లూథర్ మనసు ప్రశాంతంగా లేదు. అతని అంతరంగాన్ని పెద్ద వెలితి ఆక్రమించింది. నిర్వహించిన ఉద్యమానికి ఫలితమేమో దక్కిందిగానీ, ఇది తన వ్రతానికి ప్రతిఫలంగా అందుకున్న వరదానంగాదు; కనీవినీ ఎరుగనంత సుదీర్ఘమైన సమ్మెకాలంలో చెప్పలేనంత యాతనకు గురైన నీగ్రోజనాల సహనానికి ప్రతీకగా సంక్రమించిన ఫలితంగాదు; తెల్లజాతి దురహంకారుల అంతరాత్మలో మొలకెత్తాలని ఆశించిన మానవత్వానికి ఇది సంకేతంగాదు; కేవలం చట్టపరమైన వ్యాజ్యానికి పర్యవసానం. విజయం చాటున దాగిన ఈ మర్మాన్ని అతడు సులభంగా పసిగట్టాడు. తొలిరోజు స్వయంగా బస్సులో ప్రయాణించాలని తాను తీసుకున్న నిర్ణయం ఎన్నోరకాల విమర్శలనుండీ, నీగ్రోప్రజల నిరుత్సాహంనుండీ ఉద్యమాన్ని రక్షించింది. ఆ ప్రయాణం ప్రచార సాధనాల్లో హోరెత్తినందువల్ల, ఆలోచన పరిపరివిధాల పరిగెత్తకుండా నీగ్రోల మనసుకు మత్తెక్కించింది.

యాంత్రికంగా పక్కమీద చేరిన లూథర్‌కు రెప్ప వాలలేదు. నిన్నామొన్నా జరిగిన సంఘటనలన్నీ తెరమీద ప్రదర్శిస్తున్నట్టు కళ్ళముందు కనిపిస్తున్నాయి- తెల్లజాతీయులు నివసించే వీథులమీదుగా లూథర్ కూర్చున్న బస్సు పయనిస్తూంది. మెట్టమెట్ట దగ్గర ప్రయాణికులకోసం బస్సు ఆగుతూంది. తెల్లజాతి ఆడామగా బస్సులో ఎక్కుతున్నారు. ఒకటిరెండు సందర్భాల్లో తప్ప, ముందువరుససీటులో కూర్చున్న నీగ్రోను ఎవరూ ఈసడించలేదు. గమనించీ గమనించనట్టు దాటుకుని వెనక్కు వెళుతున్నారు. అరుదుగానైనా, కొందరి పెదవులమీద చిరునవ్వు కనిపించింది. ఇది మానసిక పరివర్తనకు సంకేతంగాదా? మానసిక పరివర్తన మూకుమ్మడిగా జరిగే ప్రక్రియగాదు. ఉద్యమం మొదలెట్టగానే భారతదేశంలో గాంధీజీ ఆశయాలు ఫలించాయా? అప్పుడప్పుడే బారట్లా పుచ్చుకుని ప్రవేశించిన

యువకుడిని పళ్ళూడిన తరువాతగానీ బోసినవ్వుల తాతాజీగా భారతదేశం గుర్తించలేదు.

- ఔను. ఇదొక సుదీర్ఘ పోరాటం. మొక్కనాటిన మరునాడే పండ్లను ఆశించడం అవివేకమౌతుంది. నిన్నటి ఉద్యమం గాంధేయమార్గంలో తొలిమజిలీ. అతిచిన్న మజిలీ. వందలాది మహానగరాలతో సువిశాలమైన అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో ఈ మాంట్గోమెరీ ఏపాటిది? అహింసావిధానాన్ని ఆవిష్కరించటానికి ఇదొక పరిశో ధనాగారంగా అవకాశమిచ్చిందేతప్ప, ఇదే సర్వస్వంగాదు.

లూథర్ మనసు కాస్తా నిమ్మళించింది. తదుపరి కార్యక్రమం గురించి ఆలోచించడం మొదలెట్టింది. ఉద్యమాన్ని దక్షిణ అమెరికా రాష్ట్రాలన్నిటికీ విస్తరిం చడం కర్తవ్యంగా అతనికి తోచింది. ఆ ఆలోచనలనుండి అతడు పూర్తిగా తేరుకోక ముందే కిటికీ అద్దాలనుండి తొలిపొద్దు గదిలో ప్రవేశించింది.

అదే రాత్రి, అటువైపు తెల్లజాతి శిబిరంలోనూ కునుకులేదు. దర్జాగా ముందు సీట్లో కూర్చుని, తెల్లదొరల వీధులమీదుగా వొక నీగ్రో సజావుగా బస్సులో ప్రయాణిం చడం టి.వి.లో చూస్తూంటే రేకెత్తిన గాయంమీద పొడికారం చల్లినట్టుంది. తెల్లజాతి అభిజాత్యం దెబ్బతిన్న త్రాచుపాములా బుసగొట్టింది.

- దీన్ని సహిస్తే తెల్లజాతి మర్యాద మంటలో కలవడానికి పెద్దగా సమయం పట్టదు. ఈ సంకరసంస్కృతిని మొగ్గలోనే గిల్లేయాలి. నల్లజాతిలో జంకు తీరిపో తూంది. నిర్లక్ష్యంచేస్తే వీపులమీదికెక్కి కూర్చుంటుంది.

- ఆరోజు, 13 నవంబర్ మంగ్లవారంరోజు, గత్యంతరంలేక నీగ్రోనాయకులు మోచేతులమీద ప్రాకుతూ లొంగిపోయే తరుణంలో, సుప్రీంకోర్టు తీర్పు పిడుగు పాటులా దెబ్బతీసింది. నోటి కందిన బలిపశువు కట్లు తెగి పారిపోయింది. దాన్ని వదిలేసి ఊరుకుంటే కొమ్ములు పెంచుకుంటుంది. కేంద్రప్రభుత్వం దృష్టిలోపడని పద్ధతుల్లో దాన్ని అదుపులోకి తెచ్చుకోవాలి.

- తమకు తాముగా నల్లజాతీయులు ముందుసీట్లు వదులుకునేలా చేసే ఎత్తుగడలను వితర్కించడంలో తెల్లజాతి దురహంకారులగ్గూడా తెల్లవారింది.

తదుపరి ప్రయాణానికి కొత్తదారి కనిపించగానే లూథర్‌లో ఉత్సాహం ఉరకలు వేసింది. ఉదయాన్నే అబెర్నెథీకి ఫోన్ చేశాడు. ఇద్దరూ కలిసి దక్షిణాది మతగురువులందరితో ఫోన్‌లోనే సంప్రదించారు. అన్నివైపులనుండి అనుకూల స్పందన లభించింది. నల్లజాతి నాయకులంతా కాకమీదున్నట్టు మిత్రులిద్దరికి అర్థమయింది. జాగుచేయడం మంచిదిగాదని వాతావరణం హెచ్చరించింది. వీలైనంత

త్వరలో దక్షిణాది మతగురువుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలనుకున్నారు. 1959 జనవరి 10 వ తేదీని అందుకు ముహూర్తంగా నిర్ణయించారు.

ఈ సమావేశం మాంట్గోమెరీలో జరిపేకంటే, అట్లాంటా నగరాన్ని వేదికగా చేసుకోవడం అన్నివిధాలా అనుకూలమని అబెర్నెథీ, లూథర్‌లు భావించారు. ఏర్పాట్లకోసం లూథర్ తండ్రి కింగ్ సీనియర్‌తో చర్చించారు. అటువంటి సమావేశానికి ఆతిథ్యమివ్వడం ఎబనేజర్ చర్చి గౌరవంగా భావిస్తుందని జవాబొచ్చింది. ఆహ్వానితులందరికి చకచకా సమాచారాన్ని చేరవేశారు లూథర్, అబెర్నెథీలు. రాబోయే కాలంలో ఈ సమావేశం అమెరికన్ నీగ్రోల అహింసాపోరాటానికి సువిశాలమైన రంగస్థలం కాబోతుందని ఆ మిత్రులిద్దరు ఊహించటానికి భయపడ్డారు.

సమావేశం ఏర్పాట్లలో సీనియర్ కింగుకు చేదోడుగా ఉండటానికి లూథర్ అబెర్నెథీలు వొకరోజు ముందే అట్లాంటా చేరుకున్నారు. పగలంతా పనులతోనూ, పరిచయస్తులను కలవటంతోనూ గడిచిపోయింది. అలసటతో ఒళ్లుమరచి నిద్రలో మునిగిన మిత్రులను అర్థరాత్రివేళ టెలిఫోన్ రొద నిద్రనుండి లేపింది. ఆవలినుండి వినిపించిన గొంతు అబెర్నెథీ భార్య 'జానిటా'ది. నిశిరాత్రి సమయంలో పిలుస్తూందంటే జరగరానిదేదో జరుగుంటుందని లూథర్ అనుమానించాడు. మాట్లాడటం ముగించి తిరిగొస్తున్న అబెర్నెథీ ముఖంలో ఆ కవళికలు స్పష్టంగా కనిపించాయి.

''ఏం జరిగింది?''

''ఇంటిమీద డైనమైట్లతో దాడి జరిగింది. మరో రెండుమూడు చోట్లనుండి ప్రేలుళ్ళు వినిపించాయట. ఎక్కడైవుంటుందో చెప్పలేకపోతూంది.''

''ఇంట్లో ఎవరికీ అపాయం జరగలేదుగదా?''

''దేవుని దయవల్ల అందరూ క్షేమంగావున్నారు.''

మాట పూర్తికాకముందే మరోసారి టెలిఫోన్ గలగలా మోగింది. ఫస్ట్ బాప్టిస్ట్ చర్చి ప్రేలిపోయిందని జానిటా కబురుచేసింది. అంటే, అబెర్నెథీ ఇంటినే కాకుండా, అతని చర్చినిగూడా ధ్వంసం చేశారన్నమాట!

తాము లేకున్నా దక్షిణాది నాయకుల సమావేశం నిరాటంకంగా జరిగేందుకు తగిన ఏర్పాట్లుచేసి, పదవతేదీ ఉదయాన అబెర్నెథీ లూథర్‌లు మాంట్గోమెరీకి తిరుగుముఖం పట్టారు. విమానాశ్రయంనుండి నేరుగా అబెర్నెథీ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే జనం తండోపతండాలుగా ఆ ప్రదేశాన్ని కమ్ముకున్నారు. తొక్కిసలాట నివారించేందుకు పోలీసులు పురితాళ్ళతో బ్యారికేడ్లు నిర్మించారు. అబెర్నెథీ

ఇంటి వసారా ఆనవాళ్ళులేకుండా కూలిపోయి కనిపిస్తోంది.

అబెర్నెథీని చూడగానే అతని భార్యకు ప్రాణం లేచొచ్చింది. భయం తాలూకు ఛాయలు ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కంగారుపడిందే తప్ప, పూర్తిగా బెంబేలెత్తిన తడబాటు ఆమె మాటల్లో కనిపించలేదు.

దాడులకు గురైన మిగతా ప్రదేశాలను చూడటానికి లూథర్ బయలుదేరాడు. గతరాత్రి మొత్తం నాలుగు చర్చిలమీద దాడి జరిగింది. వాటిల్లో రెండు పూర్తిగా కూలిపోయాయి. మిగతా రెండూ ఘోరంగా దెబ్బతిన్నాయి.

దక్షిణాది నాయకుల సమావేశం అట్లాంటాలో ప్రారంభమైంది. చివరి పాదంలోనైనా ఒకసారి ముఖం చూపించిరావడం మంచిదని, ఆ మధ్యాహ్నం లూథర్ అట్లాంటా చేరుకున్నాడు. అతని రాక ఆ సభలోవారికి ఎంతో ఉత్సాహం చేకూర్చింది. అహింసావిధానం పట్ల అంకితభావం కలిగిన వ్యక్తులు దాదాపు వందమంది సమీకృతమైన సమావేశమది. ఆనాటి తీర్మానంతో అది 'దక్షిణాది నాయకుల సమాఖ్య'గా పోరాటరంగంలో ప్రవేశించింది. తరువాత ఇదే సంస్థ 'దక్షిణాది క్రిస్టియన్ లీడర్ల సమాఖ్య' (Southern Christian Leadership Conference)గా రూపాంతరం చెందింది. ఆ సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షునిగా లూథర్ కింగును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాల్ఫ్ అబెర్నెథీ మొదటి కోశాధికారిగా ఎన్నికైనాడు.

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ తక్షణం దక్షిణాదిని సందర్శించడం అవసరమని సమాఖ్య అభిప్రాయపడింది. వచ్చి, ఏదోవొక దక్షిణాది నగరంలో బహిరంగ సభ నిర్వహించి, సుప్రీంకోర్టు తీర్పును దేశప్రజలందరూ చట్టంగా గౌరవించాలని తెల్లజాతికి ఉపదేశించాలి. సొంత గడ్డమీద పరిష్కారంకాకుండా మిగిలిపోయిన పౌరహక్కులసమస్య, అమెరికాను అంతర్జాతీయంగా ఇరకాటంలో పడేస్తోందని వివరించాలి. ఐసెన్‌హోవర్ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న అధ్యక్షుడు. ఆయన జోక్యంతో దక్షిణాది ఉద్రిక్తత సడలుతుందని సమాఖ్య ఆశించింది. ఈ విషయాలను ఉటంకిస్తూ, దక్షిణాది నాయకుల సమాఖ్య అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ జోక్యాన్ని తంతిద్వారా అభ్యర్థించింది.

నాలుగురోజులు తలిదండ్రులతో ఆహ్లాదంగా గడిపి ఇంటికి తిరిగొచ్చిన లూథర్‌ను మాంట్గోమెరీలో చోటుచేసుకున్న పరిస్థితులు తీవ్రంగా క్రుంగదీశాయి. ప్రేలుళ్ళను సాకుగా చూపించి నగరపాలకసంస్థ బస్సులు తిరగకుండా పూర్తిగా ఆపేసింది. నగరపెద్దలు బస్సు పర్మిట్లను శాశ్వతంగా రద్దుచేయాలని యోచిస్తున్నట్టు

పుకార్లుగూడా వినిపిస్తున్నాయి. ఒనగూరిన ప్రయోజనం పట్టుమని పదినాళ్ళైనా దక్కకుండా చేజారింది. తిరిగి అవి మొదలయ్యేలా చూడాలంటే మరో సుదీర్ఘపోరాటం తప్పదని లూథర్‌కు తెలుసు. దీనికితోడు, రకరకాల కరపత్రాలతో కొత్తతరహా యుద్ధం మొదలెట్టింది ఎదుటిపక్షం. వీటి ప్రభావం నీగ్రోలమీద ఏమేరకు పనిచేస్తూందో అంచనావేయడం సులభంగాదు.

దిగులు ముసిరిన మనసుతో ఆనాటి సాయంకాలపు ప్రార్థనాసమావేశానికి హాజరయ్యాడు లూథర్. మనసులో దాగిన ఆవేదన ప్రార్థన మధ్యలో పెల్లుబికింది. ‘‘ప్రభూ! స్వేచ్ఛకోసం మాంట్గోమెరీలో జరిగిన పోరాటం కారణంగా నీ బిడ్డల్లో ఏవొక్కరు బలికాగూడదు. నాకు చనిపోవాలని లేదు; కానీ, ఎవరోవొకరు బలికాక తప్పనప్పుడు, అది నేనే కావాలని కోరుతున్నాను’’ అంటూ ఎలుగెత్తి రోదిస్తూ ముందుకు వాలిపోయాడు. ‘కాదు, కాదు’ అనే ప్రతిస్పందన సభికుల్లో హోరెత్తింది. ఇద్దరు సహచరులు సాయంపట్టి లూథర్‌ను లేవనెత్తారు. వాళ్ళ భుజాలమీద కాస్సేపు సేదతీరి, లూథర్ కుర్చీలో కూర్చున్నాడు.

దీన్ని పిరికితనంగా చిత్రీకరిస్తూ, మరుసటిరోజు వార్తాపత్రికలు ఈ సంఘటనను చిలువలుపలువలుగా ప్రచారంజేశాయి. ఐనా, అనుకోని విధంగా అవి లూథర్‌కు బలాన్ని సమకూర్చాయి. ఈ పోరాటంలో తుదకంటా అతని వెంటే నడుస్తామని మాటివ్వడానికి మరుసటిరోజు లూథర్ ఇంటిముందు జనం బారులుతీరింది. పగటి వేళలకు పరిమితమై తిరిగేలా బస్సుసర్వీసులు ఆ మరుసటిరోజు మొదలయ్యాయి. సంచలనాలు జరక్కుండా కొద్దిరోజులపాటు మాంట్గోమెరీ చల్లబడింది.

జనవరి 28 తెల్లవారుఝామున మరోవిడత దాడులతో మాంట్గోమెరీ కుతకుతలాడింది. ఒకచోట బస్టాండు, మరోచోట సర్వీసు స్టేషను దాడిలో ధ్వంసమయ్యాయి. బహుశా పొరపాటున కావచ్చు, గిరాటేసిన మరోబాంబు ఆస్పత్రిలో పనిజేసే వొక వృద్ధుని ఇంట్లో ప్రేలింది. పన్నెండు డైనమైట్ చువ్వలు కట్టగా చుట్టిన నాటు బాంబొకటి లూథర్ వసారాలో పొగలు కక్కుతుండగా చూసి తొలగించారు. అదృష్ట వశాత్తు ఆ దాడుల్లో ఏవొక్కరు గాయపడలేదు. ఆ సమయంలో లూథర్ కుటుంబం ఇంట్లో లేదు. స్నేహితుల ముచ్చట్లతో నడిరాత్రిదాకా గడిపిన లూథర్, ఒక స్నేహితుని ఇంట్లో నిలిచిపోయాడు. ఆ ముందురోజే అతని భార్యాకూతుర్లు అట్లాంటా వెళ్ళారు.

నగరం అరాచకంగా మారిపోయిందనే విమర్శల వెల్లువ నగరపాలకులను కల్లోలపరిచింది. నేరస్తులకోసం గాలింపు మొదలెట్టారు. ఆచూకీ తెలిపినవారికి

నాలుగువేల నగదు బహుమతి ప్రకటించారు. ఈ దాడులకు సంబంధించి, ఏడుగురు తెల్లవారిని అదుపులోకి తీసుకున్నారని జనవరి 31 ఉదయాన వెలువడిన వార్త నల్లజాతీయులను ఆశ్చర్యంలో ముంచింది.

అరెస్టైన ఏడుగురూ నేరాన్ని అంగీకరిస్తూ అటార్నీ జనరల్ ఎదుట సంతకాలు చేశారు. ఐనా, వాళ్ళు నిరపరాధులనీ, ఖాలీపడిన కోశాగారాన్ని నింపుకోటానికి ఇదంతా ఎం.ఐ.ఎ. పన్నిన పన్నాగమనీ, డిఫెన్సులాయర్లు రెండురోజులపాటు నిర్విరామంగా వాదించారు. మూడవరోజు లూథర్‌కింగును బోనెక్కించి, తలతిక్క ప్రశ్నలతో గంటసేపు వేధించారు. అవసరమైనన్ని సాక్ష్యాధారాలూ, నేరాన్ని ఒప్పు కుంటూ ముద్దాయిలిచ్చిన వాంగ్మూలాలూ ఉండిగూడా, నేరం రుజువు కాలేదంటూ వాళ్ళను విడుదల చేసింది కోర్టు. న్యాయం మరోసారి తీవ్రంగా గాయపడింది.

శిక్షనుండి తప్పించుకున్నా, జరిగిన తతంగం తీవ్రవాదులకు ఒక హెచ్చరికగా పనిజేసింది. శాంతిభద్రతల సమస్య మాంట్గోమెరీలో కాసింత చక్కబడింది. మరుసటి వారంలో నగరపాలకులు బస్సుసర్వీసులను యధాస్థితికి పునరుద్ధరించారు. జాతివివక్ష విడనాడి, అన్నిజాతులవారు యధేచ్ఛగా ప్రయాణం చేస్తున్నారు. విలీకరణవల్ల, ఛాందసవాదులు భయపడినట్టు, ఆకాశం బ్రద్దలూ కాలేదు, భూమి తలక్రిందులూ కాలేదు.

# ఉత్సాహం

ప్రపంచ ప్రఖ్యాతి గడించిన అమెరికన్ మాసపత్రిక 'టైమ్' ఫిబ్రవరి సంచిక మాంట్గోమెరీ పోరాటాన్ని ముఖచిత్ర వ్యాసంగా ప్రచురించడంతో, లూథర్ ప్రాధాన్యతకు అదనపు హంగు సమకూరింది. అదే నెలలో, కొత్తగా స్వరాజ్యం సాధించిన 'ఘనా'దేశం నుండి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనటానికి ఆహ్వానం అందుకున్న కొద్దిమంది అమెరికన్ పౌరహక్కుల నాయకుల్లో లూథర్‌గూడా వొకడు కావడం అతని ప్రతిష్టను తారాస్థాయికి తీసుపోయింది.

ఘనాదేశపు ఆహ్వానం ముందుగా ఊహించిందిగాదు. గాంధీ మహాత్ముని భారతదేశం చూడాలనేది లూథర్ కోరిక. భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1956 లో అమెరికా పర్యటించటానికి వచ్చినప్పుడు, లూథర్ కింగును కలవాలనే అభిలాష వ్యక్తంజేశాడు. లూథర్‌ను వీలైనంత త్వరలో భారతదేశం పిలిపించే అవకాశాలు పరిశీలించమని రాయబారులకు అప్పగించాడు. ఈ విష యాన్ని తెలియజేస్తూ భారతదేశంలో అమెరికా రాయబారిగా పనిజేస్తున్న ఛెస్టర్ బౌల్స్ నుండి లూథర్‌కు ఉత్తరం అందింది.

"భారతదేశాన్ని సందర్శించాలనేది నా చిరకాల వాంఛ. చిన్నతనంనుండిగూడా తూర్పుదేశాలంటే నాకెంతో ఆకర్షణ. ఆ ఏనుగులూ, పులులూ, ఆ దేవాలయాలూ, పాములవాళ్లూ, జానపదకథల్లోలాగా తారసపడే రకరకాల పాత్రలు నాలో ఆసక్తిని రేకెత్తించేవి. అదీగాక, మన మాంట్గోమెరీ పోరాటానికి అహింసామార్గాన్ని చూపెట్టిన వెలుగురేఖ భారతదేశపు మహాత్మాగాంధీ" - లూథర్ కింగ్.

'నువ్వు ఎంతగానో ఆరాధించే గాంధీజీ సాధించిన ఫలితాలను స్వయంగా చూసిరావడం మంచిద'ని లూథర్ మిత్రులంతా పోరాటం ముగిసినప్పటినుండి ప్రోత్సహిస్తున్నారు. ఇంతలో ఘనానుండి ఆహ్వానమందింది. 'ఐవరీ కోస్ట్' గా పిలువబడుతూ, బ్రిటన్‌కు వలసదేశంగా ఉండిన ఆఫ్రికా భూభాగం ఘనా. 1957 మార్చి 6 వ తేదీన స్వాతంత్ర్యం పొందబోతూంది. కాబట్టి, అది తేలిగ్గా తోసెయ్యడానికి వీలులేని ఆహ్వానం.

బ్రిటిష్ వలసాధిపత్యంనుండి బయటపడటానికి ఘనాలో జరిగిన పోరాటం సామాన్యమైంది కాదు. లెక్కలేనన్ని అవాంతరాలను ఎదిరించి, చివరకు ఎన్‌క్రూమా నాయకత్వంలో స్వరాజ్యం సంపాదించింది. ఎన్‌క్రూమా ఉన్నతవర్గంలో పుట్టిన

బిడ్డడు గాదు; పాటక దంపతుల సంతానం. మిషనరీల సహాయంతో బడిచదువు పూర్తిజేసి అమెరికా చేరుకున్నాడు. పెన్సిల్వేనియా లింకన్ యూనివర్సిటీలో మత సిద్ధాంతాల అధ్యయనంమీద పట్టా పుచ్చుకున్నాడు. కొంతకాలం ఫిలడెల్ఫియాలో మతబోధకుడుగా పనిజేసి, ఆ తరువాత అదే యూనివర్సిటీనుండి మాస్టర్ డిగ్రీ సాధించాడు.

స్వదేశం తిరిగొచ్చి స్వాతంత్రోద్యమంలో చేరిన ఎన్క్రూమో జీవితం ఎన్నో ఒడిదుడుకులకు లోనయింది. గోల్డ్‌కోస్ట్ యునైటెడ్ పార్టీ అతన్ని బయటికి గెంటేసింది. ఎన్క్రూమో నిరుత్సాహపడకుండా సొంతపార్టీని స్థాపించి ఆశయసాధనకు పూనుకున్నాడు. జైలుశిక్ష విధించి పాలనాయంత్రాంగం అతన్ని కారాగారంలో నిరవధికంగా నిర్బంధించింది. ఐనా, ఎన్క్రూమో పోరాటం ఆగిపోలేదు. జైలునుండే అతడు ఉద్యమాన్ని నిర్వహించాడు. జైల్లోవున్న తమ నాయకుని ప్రధానమంత్రిగా ఎన్నుకుని ఎన్క్రూమోపార్టీ సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుజేసింది. అడ్డుకోవడం ఇక సాధ్యపడదని తెలుసుకున్న బ్రిటిష్‌ప్రభుత్వం ఐవరీ కోస్టు స్వాతంత్ర్యానికి అంగీకరించింది. కొత్తగా ఏర్పాటయ్యే స్వతంత్రదేశానికి ప్రధానమంత్రిగా జైలునుండి ఎన్క్రూమో విడుదలయ్యాడు.

విశిష్ట అతిథుల సరసన ఆసీనుడై, ఘనా స్వాతంత్ర్యవేడుకలను వీక్షిస్తున్నాడు లూథర్. ప్రేమదేవత పురుషాకారం ధరించినంత మనోహరంగా కనిపించే నీగ్రో యువకుడొకడు వేదికమీదికి ప్రవేశించి, మైకు దగ్గర నిలుచున్నాడు. ''ఇప్పటినుండి మనది బ్రిటిష్ వలస దేశం కాదు. సర్వసత్తాక ప్రతిపత్తిగల స్వతంత్రదేశం.'' అంటూ ప్రకటించాడు. మిన్నుముట్టే హర్షధ్వానాలమధ్య బ్రిటిష్ పతాకం నెమ్మదిగా దిగిపోయింది. జండాకర్రమీదికి కొత్తగా రూపొందిన ఘనా పతాకం రెపరెపలాడుతూ ఎగబ్రాకింది.

లూథర్ కళ్ళు చెమ్మగిల్లాయి. ఆ పతాకం ఎన్నెన్నో త్యాగాలకు ప్రతిఫలం. ఈ శుభదినంకోసం ఆ ప్రజలు కొన్ని దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్నారు. ఇంతకాలానికి ఆ నల్లజాతీయుల ఆకాంక్ష నెరవేరింది. అదిగూడా, అహింసాయుత పోరాటమార్గంలో నెరవేరింది. అహింసాయుత పోరాటంపట్ల లూథర్ విశ్వాసం ఇప్పుడు కొండంతగా పెరిగింది.

ఖైదీలకిచ్చే టోపీని తలలమీద ధరించి, ఖైదీ దుస్తుల్లో ముస్తాబై, ఘనా ప్రధాని ఎన్క్రూమో తన మంత్రివర్గ సహచరులతో వేదికమీద కూర్చోవడం లూథర్‌కు

ఎంతగానో నచ్చింది. తద్వారా, న్యాయంకోసం జైలుకెళ్ళడం నామోషీ కాదనే సందేశాన్ని ఆయన ప్రపంచానికి అందిస్తున్నాడు. బలవంతుల పిడికిట్లో నలిగిపోయే పీడిత ప్రజానీకానికి అదొక ప్రేరణ.

తిరుగుప్రయాణంలో లూథర్, కొరెట్టాలు రోమ్, ప్యారిస్, లండన్ వంటి మహానగరాలను సందర్శిస్తూ న్యూయార్క్ చేరుకున్నారు. అక్కడ ఫిలిప్ రాన్డాల్ఫ్, రాయ్ విల్కిన్స్ వంటి అనుభవజ్ఞులతో భవిష్యత్ కార్యక్రమాన్ని చర్చించారు. మే 17 దగ్గరలో ఉంది. అది అమెరికన్ పౌరహక్కుల నాయకులకు అపురూపమైన రోజు. దాన్ని పండుగదినంగా అలవాటు చేయడానికి ఆ నాయకులు సంకల్పించారు. మూడేళ్ళక్రితం అమెరికన్ సుప్రీంకోర్టు తన చిరస్మరణీయమైన తీర్పును వెలవడించిన రోజది. 'సదుపాయాలు సమానంగా కల్పించి విడిగా ఉంచడం తప్పులేదనే వాదనలో అంతర్లీనంగా ఉండేది వేరుపాటు వాదమే. జాతి కారణంగా వొక బిడ్డను వేరుచేయడమంటే, రాజ్యాంగం కల్పిస్తున్న సార్వజనీన స్వేచ్ఛను ఆ బిడ్డకు తిరస్కరించినట్టౌతుంది' అంటూ 1954 మే 17 వ తేదీన సుప్రీంకోర్టు విద్యాలయాల్లో వేరుపాటు విధానాన్ని రద్దుచేసింది.

విస్తృతస్థాయిలో ఈ అంశాన్ని చర్చించడానికి డెబ్భైమంది పేరుమోసిన అమెరికన్ పౌరహక్కుల నాయకులు రాజధాని నగరమైన వాషింగ్టన్ డి.సి.లోని మెట్రోపాలిటన్ బాప్టిస్టు చర్చిలో ఏప్రిల్ 5 న సమావేశమయ్యారు. సుప్రీంకోర్టు తీర్పుకు మూడవ వార్షికోత్సవ సందర్భంగా ఆ నగరంలోని 'లింకన్ మెమోరియల్' వద్దకు భారీఎత్తున తీర్థయాత్ర నిర్వహించాలని తీర్మానించారు.

జాతివివక్షకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుకు మూడవ వార్షికోత్సవం సందర్భంగా, పౌరహక్కులను ప్రేమించే అమెరికన్ ప్రజలందరూ మే 17వ తేదీన వాషింగ్టన్‌లోని లింకన్ మెమోరియల్‌కు తీర్థయాత్రగా తరలిరావాలని ఆ సమావేశం పిలుపునిచ్చింది. తరలివచ్చే జనాలను ప్రోత్సహించటానికి, సభలో ప్రసంగించే అగ్రనాయకుల జాబితానుగూడా ప్రకటించింది. లూథర్ కింగ్ ప్రసంగాన్ని వినాలనే కూతూహలం వేలాది దాక్షిణాత్యులను ఉరకలు వేయించింది. దీనికితోడు, వాల్టర్ రీథర్ వంటి బలమైన కార్మికనేతల సహకారంతో, ఆ యాత్రలో పాల్గొన్న ప్రజల సంఖ్య ముప్పైవేలకు మించింది. అంతమంది నీగ్రోలు ఒకేప్రదేశంలో గుమిగూడడం అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రలో అది ప్రథమం. ఆ సమావేశంలో తెల్లజాతీయులు గణనీయమైన సంఖ్యలో పాల్గనడం మరో విశేషం.

వివిధ రంగాలలో ప్రఖ్యాతులైన నీగ్రోలతో సభావేదిక అలరించింది. ప్రజా హక్కుల పోరాటంలో కాకలుతీరిన యోధునిగా పేరుబడిన ఫిలిప్ రొడాల్ఫ్ అధ్యక్షస్థానాన్ని స్వీకరించాడు. నాయకుల ప్రసంగాలతో, కొరెట్టా గానమాధుర్యంతో సభ ఉద్రూతలూగింది. సభాసదులు అత్యంత కుతూహలంతో ఎదురుజూసే లూథర్ ప్రసంగం కాసింత ఆలస్యంగా మొదలయింది.

వక్తగా లూథర్‌కింగ్ ఎంత అనుభజ్ఞుడైనా, ఒక జాతీయవేదికనుండి ప్రసంగించడం అతనికి ఇదే తొలిసారి. ఆనాటి సుప్రీంకోర్టుతీర్పుకున్న ప్రాముఖ్యతను వివరిస్తూ ఆతడు తన ప్రసంగాన్ని నింపాదిగా ప్రారంభించాడు. 'సమానులు కావచ్చుగానీ, వాళ్లు పరాయివాళ్ళ'నే ప్లెస్సీ సిద్ధాంతానికి ఈ తీర్పు చరమగీతిని పాడిన విషయం ప్రస్తావించి, లూథర్ ప్రసంగం ఓటుహక్కు ప్రాముఖ్యతమీద కేంద్రీకరించింది.

చెప్పుకోటానికైతే అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో పౌరులందరికి ఓటుహక్కుంది. వాస్తవంలో అది లక్షలాది దాక్షిణాత్యులకు అందుబాటులో లేదనే విషయం ప్రపంచానికి తెలీదు. దక్షిణాదిలో ఆ ఓటుహక్కులేని దౌర్భాగ్యులందరూ నీగ్రోలే. దక్షిణాది రాష్ట్రాల స్థానికసంస్థలు వాళ్ళకు ఓటరుగా నమోదయ్యే అవకాశం కలిగించకుండా నయాన్నో భయాన్నో, నీగ్రోలను దూరంగా ఉంచగలుగుతున్నాయి.

''ఓటర్ల నమోదు కార్యక్రమంలో నీగ్రోలను అడ్డుకోటానికి ఎన్ని కుయుక్తులు సాధ్యమో, వాటన్నిటినీ ప్రయోగిస్తున్నారు. అంటే, పవిత్రమైన ఓటుహక్కుకు అడ్డుతగిలి అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని మంటలో కలుపుతున్నారు.

''నాకు ఓటుహక్కు కావాలి. నిరాటంకమైన ఓటుహక్కు నాకుండాలి. ఓటుహక్కు ఉంటేనే ప్రజాస్వామ్యంలో నేను బ్రతికున్నట్టు లెఖ్ఖ. ఓటుహక్కు ఉంటేనే నాకు అభిప్రాయమంటూ వొకటున్నట్టు లెఖ్ఖ. అది లేనప్పుడు, ప్రజాస్వామ్యం తరఫున వెల్లడించే ఏ అభిప్రాయమూ నాదిగాదు. అది నాపేరుమీద మరెవరో తయారుజేసింది. ఏ చట్టాన్ని రూపొందించడంలో నాకు ఆవగింజంత ప్రమేయం లేదో, ఆ చట్టానికి లోబడి బ్రతకడమంటే, నేనొక ప్రజాస్వామిక పౌరునిగా బ్రతికినట్టు కాదు. ఎవరో చేసిన శాసనానికి తలొగ్గి తిరుగాడే కీలుబొమ్మ నౌతాను.''

లూథర్ ప్రసంగం పదునెక్కింది. అది శ్రోతల గుండెల్లో లోతుగా దిగటం మొదలెట్టింది.

''మాకు ఓటుహక్కు కల్పించండి; అప్పుడు, ప్రాథమికహక్కులకోసం

చీటికిమాటికి కేంద్రప్రభుత్వాన్ని చీకాకుపరిచే అవసరం మాకుండదని విన్నవిస్తున్నాం.

"మాకు ఓటుహక్కు కల్పించండి. అప్పుడు, లించింగ్ విధానాన్ని* రద్దు చెయ్యమని కేంద్రప్రభుత్వాన్ని వేధించే అవసరం ఇంకెంతమాత్రం మాకుండదు. ఓటు బలంతో దక్షిణాదిరాష్ట్రాల శాసనాలను మాకుమేముగా రచించి, ముసుగులో దాగిన హింసాపరుల కిరాతకత్వాన్ని స్వయంగా తుదముట్టిస్తాం.

"మాకు ఓటుహక్కు కల్పించండి; విశాలహృదయులైన సభ్యులతో దక్షిణాది శాసనసభలను భర్తీచేస్తాం. న్యాయమనే మానిఫెస్టోకు అంకితమైన సభ్యులతో పవిత్రమైన శాసనసభాభవనాలు నిండేలా చేస్తాం.

"మాకు ఓటుహక్కు కల్పించండి; ధర్మాన్ని ఆచరించే న్యాయమూర్తులతో, దయాదాక్షిణ్యాలు కలిగిన న్యాయమూర్తులతో దక్షిణాది న్యాయస్థానాలను నింపుతాం. మానవత్వంతోపాటు దైవాంశ కలిగిన గవర్నర్లను దక్షిణాదికి నియమిస్తాం.

"మాకు ఓటుహక్కు కల్పించండి; అలజడులకు తావులేని అహింసా మార్గంలో, ఈర్ష్యాద్వేషాలకు తావులేని సోదరత్వంతో, 1954 మే 17 సుప్రీంకోర్టు తీర్పును ఆచరణలోకి తీసుకొస్తాం."

లూథర్ గొంతు వసంతకాలపు ఘనాఘనంలా గర్జించింది.

"ఎటుపోవాలో తేల్చుకోవలసిన కూడలిలో ఇప్పుడు మన ప్రజాస్వామ్యం నిలబడిపోయింది. సరైన మార్గాన్ని ఎన్నుకోటానికి నిజాయితీ కలిగిన నాయకత్వం కావాలి; ప్రజాస్వామ్యంపట్ల అంకితభావం కలిగిన నాయకత్వం కావాలి; సమస్యలను ముఖాముఖి ఎదిరించే సాహసోపేతమైన నాయకత్వం కావాలి.

"..... ఈ లక్షణాలు కలిగిన నాయకత్వం ఇంతవరకు వొక్క ఫెడరల్ న్యాయవ్యవస్థలో తప్ప మరెక్కడా కనిపించడంలేదు. నీగ్రోల హక్కుల గురించి ఫెడరల్ న్యాయస్థానాలు చూపెట్టినంత చొరవ జాతీయ పాలనా విభాగంగానీ, శాసనసభావిభాగంగానీ చూపెట్టివున్నట్టైతే, జాతివివక్షతో కలుషితమైన సమాజంనుండి జాతులన్నీ అన్నదమ్ముల్లా జీవించే ఉమ్మడి సమాజానికి నడిపించే మార్పు ఒడిదుడుకులు లేకుండా ఏనాడో పూర్తైవుండేది. వాషింగ్టన్ జోక్యంకోసం మాటిమాటికీ ఎదురుజూసే వృధాప్రయాస మాకు తప్పిపోయుండేది.

"..... నిజాయితీ కలిగిన నాయకత్వం కొరత ఏదోవొక రాజకీయపార్టీకి

*లించింగ్ విధానం: అభియోగాన్ని విచారించకుండా నీగ్రోలను శిక్షించే విధానం. వర్జీనియాలో విలియం లించ్ పేరుగల వొక కెప్టన్, తన సొంతకోర్టుద్వారా ఉరిశిక్షలుగూడా విధించి అమలుపరిచాడు. అందువల్ల ఈ పద్ధతికి అతని పేరొచ్చింది.

పరిమితమై లేదు. ధర్మానికి ద్రోహం చెయ్యడంలో రెండుపార్టీలూ సమానంగా తూగుతున్నాయి. ద్వేషంతో నిండిన దక్షిణాది నియంతలకు దాసోహమై ప్రజాస్వామ్యానికి డెమోక్రాట్లు ద్రోహం చేస్తుండగా, ఉత్తరాది అప్రజాస్వామిక వామపక్ష వంచనాశిల్పులకు లొంగి రిపబ్లికన్లు ద్రోహం చేస్తున్నారు. మాటల్లో రక్తపోటు, చేతల్లో రక్తహీనత ఈ మనుషులకు రివాజు.

" . . . . . నిజాయితీ కలిగిన నాయకత్వంతో అవసరమున్న మరో చోటు ఉత్తరాది ఉదారవాద సంస్థలు. ఇప్పుడు కావలసింది స్వచ్ఛమైన ఉదారవాదం; నిజాయితీతో కూడిన ఉదారవాదం. ఉత్తరాదిసంస్థల్లో ప్రస్తుతం మనకు కనిపిస్తున్నది ఇటువంటి ఉదారవాదం కాదు. ఇరుపక్షాలకూ సానుభూతి చూపే కరుకులేని ఉదారవాదం. ఇరుపక్షాలను సమానంగా చూడాలనే మోజుతో చివరకు ఏపక్షానికీ చెల్లకుండాబోయిన ఉదారవాదం. పరిస్థితులను సమీక్షించడం తప్ప ఆచరణకు దిగలేని ఉదారవాదం. అటు వేడిగానూ కాకుండా, ఇటు చల్లగానూ కాకుండా, గోరువెచ్చగా తయారైన ఉదారవాదం.

"సాహసవంతమైన నాయకత్వం అవసరమైన మూడవచోటు దక్షిణాది మాడరేట్లది. దురదృష్టవశాత్తు, సంకుచిత మనస్తత్వం కలిగిన అభివృద్ధినిరోధకులనుండి ఆవిర్భవించిన రాజకీయనాయకత్వం దక్షిణాదికి దాపురించింది. . . . . . . ద్వేషాన్ని రెచ్చగొట్టడం ద్వారా ఈ వ్యక్తులు అధికారాన్నీ, ప్రాముఖ్యతనూ చేజిక్కించుకున్నారేగానీ, వీరి సంఖ్య చాలా చిన్నది. విశాలహృదయం కలిగిన మాడరేట్ల సంఖ్య దక్షిణాదిరాష్ట్రాల్లో బయటికి కనిపిస్తున్నదానికంటే చాలా పెద్దదిగావుంది. కానీ, అధికారంలో ఉన్నవారు తమను సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పాతాళానికి తొక్కేస్తారనే భయంతో వాళ్ళంతా నోరు మెదపటానికి జంకుతున్నారు. పిరికితనానికి పాతరవేసి, ఈ సంధికాలంలో ధైర్యంగా నాయకత్వం చేపట్టే స్థోమత భగవంతుడు వారికి ప్రసాదించుగాక!

"సాహసవంతమైన నాయకత్వం అవసరమైన నాల్గవచోటు నీగ్రోల్లోనే ఉందని చెప్పకుండా ముగించడం పొరబాటౌతుంది. సాహసమేగాదు, సహనమూ విజ్ఞతా కలిగిన నాయకత్వం నీగ్రోల తక్షణావసరం. ఉద్రేకాలను రెచ్చగొట్టే నాయకత్వం తెల్లవారికి ఎలా పనికిరాదో, నల్లవారికిగూడా అదేవిధంగా పనికిరాదు. క్లిష్టమైన సమస్యలతో సతమతమయ్యే ఇలాటి సందర్భాల్లో గమ్యంలేని ఉద్రేకాలకు తావుండదని మనం గ్రహించాలి. . . . 'నల్లజాతి అధిపత్యం' అనే తప్పుడు సిద్ధాంతానికి మనం ఎట్టి పరిస్థితిలోనూ తలవొగ్గ గూడదు. తెల్లజాతివారిని ఓడించడమో, అవమానించడమో మన ధ్యేయంగాదు; వారి మైత్రినీ, సౌహార్ద్రతనూ

సంపాదించి, మానవులంతా అన్నదమ్ముల్లా కలసిమెలసి జీవించడానికి యోగ్యమైన సమాజాన్ని స్థాపించడం మన ధ్యేయం.''

భగవంతుని ప్రార్థనతో, జేమ్స్ వెల్డన్ జాన్సన్ గేయంతో లూథర్ ప్రసంగం ముగిసింది. ఆ వాగ్ధాటి ప్రవాహంలాగా శ్రోతలను మోసుకుపోయింది. 'తథాస్తు' నినాదంతో ఆకాశం ప్రతిధ్వనించింది.

ఆరోజు లింకన్ మెమోరియల్ నుండి లూథర్ చేసిన ప్రసంగం అన్నివైపులా ప్రకంపనాలు సృష్టించింది. నీగ్రోలు ఓటర్లుగా నమోదయ్యేందుకు ప్రోత్సహించే కార్యక్రమాన్ని దక్షిణాది క్రిస్టియన్ నాయకుల సమాఖ్య తన ప్రధాన బాధ్యతగా స్వీకరించింది. చర్చకోసం రావాలనుకుంటున్నామని మే 15 న వైస్‌ప్రెసిడెంట్ నిక్సన్‌కు లూథర్ వ్రాసిన లేఖకు సమాధానంగా జూన్ 13వ తేదీన వైట్‌హౌస్‌లో సమావేశం ఏర్పాటయింది. ఆ సమావేశానికి వెళ్ళేలోగా, తనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చెయ్యడానికి సిద్ధమైన చికాగో యూనివర్సిటీ, మూర్‌హౌస్ కళాశాలలు స్నాతకోత్సవాలకు హాజరయ్యాడు లూథర్. మూర్‌హౌస్ కాలేజి డాక్టరేట్ ప్రధానంజేసే సందర్భంలో, ''చరిత్రహీనులుగా కోట్లాది ప్రజానీకం కాలగర్భంలో కలిసిపోతూంటే, వ్యక్తిత్వం నిలుపుకున్న మానవులు అప్పుడప్పుడు చిరంజీవులై ప్రకాశించే ఉదాహరణల్లో ఇదొకటి'' అంటూ లూథర్‌ను అతని చిన్ననాటి గురువు డా.మేస్ అభినందించాడు.

# గతుకుల ప్రయాణం

నిర్ణీత సమయానికి వైట్‌హౌస్‌లో వైస్‌ప్రెసిడెంట్ నిక్సన్, లూథర్‌ల సమావేశం మొదలయింది. లూథర్‌కు సహాయకుడిగా రాల్ఫ్ అబెర్నెథీ, నిక్సన్‌కు సహాయకుడిగా అతని లేబర్ కార్యదర్శి, చర్చలో పాల్గొన్నారు. లూథర్ ఘనా ప్రయాణానికి సంబంధించిన మెచ్చుకోలు మాటలకూ, దేశంలోని సమస్యల పైపై ప్రస్తావనకూ చర్చ పరిమితం చెయ్యాలనేది నిక్సన్ యోచన. ఉపాధ్యక్షుణ్ణి దక్షిణమెరికా సమస్యమీదికి తీసుకురావాలని లూథర్ ప్రయత్నం. దక్షిణాది పర్యటనకు ఉపాధ్యక్షుడు విముఖం కాదుగానీ, అది నీగ్రోనాయకుల ఒత్తిడిమీద జరిగినట్టు కనిపించడం అతనికి సుతరామూ ఇష్టంలేదు. ఎదుటివారికి ఎక్కడా పట్టు దొరక్కుండా బహు చమత్కారంగా సంభాషణ నడపడంలో పేరుమోసిన నేత నిక్సన్. రెండుగంటలసేపు అందాపొందకుండా మాట్లాడి సమావేశాన్ని ముగించాడు. ప్రచారానికి తప్ప మరో ప్రయోజనం సమకూర్చని సమావేశం ముగించుకుని లూథర్, అబెర్నెథీలు ఇంటిదారి పట్టారు.

పోరాటం జరక్కుండా హక్కులు సులభంగా ఊడిపడవని నీగ్రోనాయకులు మరోసారి ధృవీకరించుకున్నారు. "ఓటుహక్కుకోసం అమెరికా పౌరులు వంతులు వంతులుగా చేసిన అవిశ్రాంత పోరాటమే మనదేశ చరిత్ర. మొదట్లో ఆస్తిలేని పౌరులకు ఓటుహక్కు ఉండేదిగాదు. సాయుధ సైనికులు స్వాతంత్ర్యంకోసం ఎంత భీకరంగా పోరాటం చేశారో దానికి తీసిపోకుండా ఓటులేని పేదప్రజలు చట్టం పరిధిలో పోరాడి ఆ హక్కును సాధించుకున్నారు. ఆ తరువాత, తమకుగూడా ఓటును సాధించుకునే సమయం ఆసన్నమైందని ఆడవారు గుర్తించారు. ప్రభుత్వ కార్యాలయాలు దద్దరిల్లేలా వనితల కంఠస్వరం పెరిగింది. స్వగృహాలుగూడా ఉద్యమానికి నెలవులైనాయి. ఏ త్యాగానికీ వెనుకాడకుండా వాళ్ళు ఓటుహక్కు సాధించుకున్నారు. ఇక పోరాటం చెయ్యవలసిన వంతు నీగ్రోలది." అంటూ ప్రోత్సహించాడు లూథర్.

అతి కొద్దికాలంలో అనంతంగా పెరిగిన లూథర్ ప్రతిష్ఠ, నీగ్రో ఉద్యమం విస్తరించటానికి దోహదం చేసినా, అతని వ్యక్తిగత జీవితానికి ఇబ్బందికరంగా మారింది. "నేను అడుగెట్టిన ప్రతి పట్టణంలో, వీళ్ళూవాళ్ళూ అనే తేడా లేకుండా,

అన్నిజాతులవారూ నన్ను ఆదరాభిమానాలతో ముంచెత్తుతున్నారు. ఏ సభలో మాట్లాడినా, స్థలాభావం వల్ల వేలాదిమంది వాపసు వెళుతున్నారు. ఆటోగ్రాఫులకోసం చుట్టుముట్టే జనసముద్రంనుండి బయటపడటానికి మిత్రుల సహాయం అవసర మౌతూంది. 'మీరు డా. లూథర్ కింగే కదా?' అంటూ వెంటబడే జనాన్ని తప్పిం చుకుని ఏ నగరంలోనూ పదిగజాలు నడవలేకపోతున్నాను.'' అంటూ ఏకాంతం కరువైన తన జీవితాన్ని తలపోసుకుని అతడు వాపోయాడు.

ఆ మేరకైతే కొంతవరకు సహించొచ్చుగానీ, లోకం దృష్టి ఆ హద్దుల్లో నిలవదు. ప్రఖ్యాత నాయకుని ప్రతి కదలికమీదా భూతద్దం పడుతుంది. అతని చొక్కా మడతలు సైతం లెఖ్ఖగట్టి పత్రికలు ప్రకటిస్తాయి. వెల్లవేసిన గోడమీద ఎంత చిన్నమరకైనా కొట్టొచ్చినట్టు ఎలా దృష్టిని ఆకర్షిస్తుందో, కీర్తికాంతిలో నిలిచిన నాయకుల జీవితంగూడా అలా మారిపోతుంది.

రోజుకొక సంచలనం సృష్టించడం ఎంతటి నాయకునికైనా చేతగాదు. కానీ, ఏదోవొక సంచలనంకోసం ప్రతినిత్యం ఎదురుజూడటం సమాజానికి అలవాటు. దాంతో, నాయకునిపట్ల నిష్కారణమైన అసంతృప్తి, నిరాశలు క్రమంగా చోటు చేసుకుంటాయి.

కలవటానికొచ్చే జనసంఖ్య పెరిగేకొద్దీ, కలిసిన వ్యక్తికి కేటాయించే సమయం చిన్నదౌతుంది. కొన్ని సందర్భాల్లో కొందరికి కలుసుకునే అవకాశమే దొరక్కపోవచ్చు. ఆహూతుల హోదానుబట్టి సమయాన్ని కేటాయించడం తప్పనిసరి కావచ్చు. దాంతో, హోదాల తారతమ్యం వివాదాస్పదమౌతుంది. సామాన్యులకు అందుబాటులో లేడనే అపవాదు విస్తరిస్తుంది.

కీర్తికి ప్రబలమైన శత్రువు అసూయ. అది ఎక్కడినుండో కాదు, సొంత భుజం నుండే మొలకెత్తుతుంది. సన్నిహితుడు నా సాన్నిహిత్యంవల్లే ఇతని హోదా పెరిగిందనుకుంటాడు. సలహాదారుడు నా సలహాలవల్లే ఇతనికి పేరొచ్చిందని భావించుకుంటాడు. భాగస్తుడు తన భాగస్వామ్యం ఇతనికి సొమ్మౌతూందని ముఖం నలుచుకుంటాడు. సేవకుడు తన సేవలవల్లే ఇతనికి సర్వస్వం అందుతూందని నీలుక్కుంటాడు.

ఈ ఝుంఝూటంలో తగులుకున్న లూథర్‌కు రంగనాథన్ దివాకర్ రాక చెప్పలేనంత ఉపశమనం కలిగించింది. రంగనాథన్ దివాకర్ గొప్ప పండితుడు. మహాత్మా గాంధీ ముఖ్య అనుచరుల్లో వొకడు. మూడురోజులపాటు మాంట్గోమెరీలో

ఉండటానికి అతడు భారతదేశంనుండి అతిథిగా విచ్చేశాడు. నైరాశ్యంలోకి దిగజారుతున్న లూథర్‌ను అతని సహవాసం ఒడ్డున పడేసింది. గాంధేయ విధానాలను కొత్తకోణంనుండి అవగాహన చేసుకునే అవకాశం కలిగించింది.

'స్వయంగా కష్టనిష్ఠురాలు స్వీకరించే నాయకత్వంమీద ప్రజల విశ్వాసం నిలుస్తుంది. గాంధీజీ కారాగారానికి జంకలేదు. బ్రిటిష్ పాలకులు ఎంతకాలం ఉంచితే అంతకాలం జైల్లో ఉన్నాడు. ఉప్పుసత్యాగ్రహంలో 218 మైళ్ళు కాలినడకన ప్రయాణం సాగించాడు. ఆయన భోంచేసింది భారతదేశంలో ఏ నిరుపేదకైనా దొరికేంత సామాన్యమైన ఆహారం. ధరించింది నిరాడంబరమైన దుస్తులు. అవిగూడా స్వయంగా వడికిన నూలుతో తయారైనవి. అందువల్ల, భారతప్రజానీకం ఆయన్ను తమలో వొకడిగా స్వీకరించింది. నిప్పుల్లో దూకమంటే దూకటానికి సిద్ధపడింది. ఆయనలో స్వార్థం, ప్రలోభం ఎత్తిచూపించే అవకాశం ప్రత్యర్థులకు దొరకలేదు'

'మహాత్మునిలా నేను బ్రతగ్గలనా?' - ఇది లూథర్‌లో ఉదయించిన ప్రశ్న. మాంట్గోమెరీ ఉద్యమం నడిచే రోజుల్లో, వాహనాలను కొన్నింటిని లూథర్ సొంతం చేసుకున్నట్టు పుకారొచ్చింది. ప్రజలు దాన్ని నమ్మకపోయినా, అతనికి మాత్రం ఆత్మక్షోభ కలిగించింది. బస్సు బాయ్‌కాట్ రోజుల్లో తనుగూడా కాలినడకన కార్యక్రమం నడిపుంటే బావుండేదేమో ననిపించింది లూథర్‌కు. ఉద్యమకారులకు ప్రోత్సాహాన్ని ఇవ్వడమేగాక, అది నగరపాలకులు తొందరగా దిగివచ్చేందుకు అస్త్రంలా పనిజేసుండేది. జైలుకు పంపించారు. కానీ, రెండుగంటలైనా అతడు జైల్లో ఉండలేదు. అలాటి అవకాశాన్ని ఇకమీదట వదులుకోరా దనుకున్నాడు లూథర్. జామీన్లు నిరాకరించి జైల్లో గడపటానికి సన్నద్ధుడైనాడు.

చీకటిరాత్రులను సాగదీసే సమ్మెటలాగా సెప్టెంబర్ నెల ప్రవేశించింది. దానితొలిరోజుల్లో వొక మెరుపు తళుక్కుమనడంతో నీగ్రోనాయకుల్లో ఆశలు చిగురించాయి. ఏ కారణం చేతనో అమెరికా సంయుక్తరాష్ట్రాల సెనేట్ వొక పౌరహక్కుల బిల్లును ఆమోదించింది. అది కోరలు తీసిన బిల్లు. ఐనా, కాటేసేలా కనిపిస్తుందని ఆశ. అది గొంతే లేని బిల్లు. మీదికి దూకేలా కనిపిస్తే చాలని తృప్తి. పౌరహక్కులకు ఎక్కడెక్కడ విఘాతం కలుగుతూందో విచారించటానికి ఆ బిల్లువల్ల వొక కమిషన్ ఏర్పాటౌతుంది. విఘాతం కలిగిందని ఖచ్చితంగా రుజువైన సందర్భాల్లో, 'స్టే' మంజూరుచేసే అధికారం కోర్టులకు దఖలుపడుతుంది.

ఆ ఆశ పట్టుమని పదిరోజులైనా నిలువలేదు. ఆ బిల్లును వెక్కిరిస్తూ,

అర్కన్సాస్ రాష్ట్రంలోని లిటిల్ రాక్ హైస్కూల్లో జరిగిన సంఘటన ప్రపంచాన్ని దిగ్భ్రాంతిలో ముంచింది.

పౌరహక్కుల బిల్లుకు సాక్షికంగా తన విధేయతను ప్రదర్శించటానికి లిటిల్ రాక్ యాజమాన్యంతో నగరమేయరు వొక ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం ప్రకారం పదిమందికి మించకుండా నీగ్రో విద్యార్థులను స్కూల్లో చేర్చుకోవాలి. కానీ, అర్కన్సాస్ గవర్నర్ ఓర్విలే ఫ్యాబస్‌కు అది సహించరానిదైంది. అడ్మిషన్లకు వొకరోజు ముందే 270 మంది భద్రతాదళ సైనికులను హైస్కూల్ ఆవరణకు తరలించాడు. నీగ్రో విద్యార్థులు చేరటానికి వచ్చినప్పుడు అల్లర్లు జరిగే అవకాశాన్ని నివారించటానికి ముందుజాగ్రత్త చర్య తీసుకుంటున్నట్టు ప్రకటించాడు. అందరికీ అది సబబుగానే తోచింది. కానీ, అతని ఆంతర్యం వేరు; లోపాయికారిగా సిపాయిలకు జారీచేసిన ఆదేశాలు వేరు.

అడ్మిషన్‌కు అర్హతపొందిన తొమ్మిదిమంది నల్లవిద్యార్థులను తొలిరోజు తీసుకురావద్దని తలిదండ్రులను స్కూలుబోర్డు హెచ్చరించింది. వాళ్ళు ఆగిపోయారు. మరుసటిదినం, ఇద్దరు తెల్లజాతి మతగురువులనూ, మరో ఇద్దరు నల్లజాతి మతగురువులనూ వెంటదీసుకుని ఆ తొమ్మిదిమంది విద్యార్థులు స్కూలు ఆవరణలో ప్రవేశించారు. సిపాయిలు వాళ్ళను అడ్డగించి, బయటికి గెంటేశారు. అక్కడున్న తెల్లజాతి పిన్నలూ పెద్దలూ నీచాతినీచమైన మాటలతో ఆ విద్యార్థులపైనా, వెంటవచ్చిన మతగురువులపైనా బూతులవర్షం కురిపించారు. ఈ సన్నివేశం సమూలంగా కెమెరాల కెక్కింది. కత్తిరింపులు లేకుండా ప్రపంచవ్యాప్తంగా టి.వి.ల్లో ప్రసారమైపోయింది. కెమెరాలు బొంకవుగాబట్టి, అమెరికా ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిపోయింది.

అదీగాక, ఈ ఘటనతో వొక రాష్ట్రప్రభుత్వం కేంద్ర శాసనంమీద బాహాటంగా సవాలు విసిరింది. ఉపేక్షిస్తే పరిస్థితులు ఎంతకు దారితీస్తాయో చెప్పలేం. అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ దక్షిణాది రాష్ట్రమైన టెక్సస్‌కు చెందినవాడు. దక్షిణాది మనోభావాలు బాగా ఎరిగినవాడు గాబట్టి, ప్రత్యక్ష చర్యకు వెంటనే పూనుకోకుండా పదిహేను రోజులు అర్కన్సాస్ గవర్నరుతోనూ, నగరమేయరుతోనూ సంప్రదింపులు కొనసాగిస్తూ కాలం వెల్లబుచ్చాడు. ఈ నాన్పుడు వ్యవహారం చివరకు ఫెడరల్ కోర్టు జోక్యంతో తెగిపోయింది. కోర్టు ఆదేశాలకు తలొగ్గి, భద్రతాదళాలు హైస్కూలు ఆవరణనుండి ఉపసంహరించాయి.

సెప్టంబర్ 23 వ తేదీన, దొడ్డిదారిలో నీగ్రోవిద్యార్థులు స్కూల్లో ప్రవేశించిన వర్తమానం బయటికి పొక్కింది. రెచ్చిపోయిన తెల్లజాతి అల్లరిమూకలు స్కూలు భవనాన్ని ముట్టడించాయి. అదుపుచేయటానికి పంపబడిన 150 మంది స్థానికపోలీసులు ప్రేక్షకులయ్యారు. నల్లవిద్యార్థులకు ప్రమాదం జరక్కుండా స్కూలుకమిటీ సభ్యులు వాళ్ళను రహస్యంగా ఇళ్ళకు చేర్పించారు. ఆందోళనతో నగరమేయరు సహాయంకోసం టెలిఫోన్‌లో ఫెడరల్ ప్రభుత్వాన్ని అర్థించాడు. బలగాలను సమకూర్చటానికి బదులు, ప్రజలు శాంతిభద్రతలకు భంగం కలిగించ కుండా ఇళ్ళకు తిరిగివెళ్ళాలనే ప్రకటనతో అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ సరిపుచ్చాడు.

సెప్టంబర్ 24 న గూడా తెల్లజాతి గూండాలు లిటిల్ రాక్ హైస్కూలును చుట్టుముట్టి, ఫెడరల్ ప్రభుత్వ సత్తాకు సవాలుగా నిలిచారు. దక్షిణాదిపట్ల మనసులో ఎంత మెతకదనమున్నా, ప్రత్యక్ష చర్యకు పూనుకోక ఐసెన్‌హోవర్‌కు తప్పలేదు. పదకొండు వందలమంది ప్యారాట్రూపర్లను హుటాహుటి అర్కన్సాస్‌కు పంప డంతోపాటు, స్థానికంగావున్న భద్రతాదళాలమీద రాష్ట్రప్రభుత్వ పెత్తనం రద్దుజేసి, వాటిని కేంద్రం అధీనంలోకి తీసుకున్నాడు. అంతర్యుద్ధం ముగిసిన 1864 తరువాత కేంద్రబలగాలు దక్షిణాదిలో దిగటం అదే ప్రథమం. తాను తీసుకున్న చర్య జాతుల వివక్షపట్ల సానుభూతితో కాదనీ, సైనికదళాల శిఖరాగ్రనేతగా దేశంలో శాంతిభద్రతలు కాపాడే బాధ్యత మాత్రమే స్వీకరించాననీ ఐసెన్‌హోవర్ సంజాయిషీ ఇచ్చుకున్నా, అది దక్షిణాది తెల్లజాతి దురహంకారులకు సంతృప్తి కలిగించలేదు. దక్షిణాది విచ్చలవిడితనాన్ని సకాలంలో అణిచివేశాడనే అభిప్రాయం ఉత్తర అమెరికాలోనూ కలగలేదు. ఏ పక్షాన్నీ తృప్తిపరచలేని వృథా ప్రయాసగా ఐసెన్‌హోవర్ చర్య చరిత్రలో నిలిచిపోయింది.

# అపాయం

"స్వాతంత్ర్యం ప్రకటించుకున్న తొలిరోజునుండి ఇప్పటిదాకా, జాతుల సమస్యమీద, మానసికరోగిలాగా అమెరికా ద్వంద్వ మనస్తత్వంతో ప్రవర్తిస్తూంది. దీంతో అమెరికన్ సమాజం రెండు విడిభాగాలుగా నిట్టనిలువున చీలింది. ఒక భాగంలో ప్రజాస్వామ్యం గర్వించదగిన స్థాయిలో నడుస్తుండగా, తతిమా భాగంలో ప్రజాస్వామ్యానికి పూర్తిగా విరుద్ధమైన విధానం కొనసాగుతూంది. జన్మత మానవులంతా సమానమనే సిద్ధాంతం మీద స్థాపించబడిన ప్రజాస్వామ్యంలో జాతివివక్ష, వేరుపాటు విధానాలు నమ్మశక్యంగాని వాస్తవాలు." - మార్టిన్ లూథర్ కింగ్.

నల్లజాతి పుట్టుకే నీచమైందనే నిందను వందలసంవత్సరాలుగా నీగ్రోలు ఓర్చుకున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గడిచిన మూడునాలుగు దశాబ్దాల్లో సమాజం అనేక మార్పులకు చోటిచ్చింది. రెండు ప్రపంచయుద్ధాల ఆటుపోట్లు ప్రపంచాన్ని పెనుమార్పులకు గురిచేశాయి. వీటికితోడు అమెరికాలో సంభవించిన ఆర్థికమాంద్యం ఆ సమాజాన్ని అతలాకుతలం చేసింది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో బావిలో కప్పలా పొలం పనులకు కట్టుబడిన నీగ్రోలకు మోటారువాహనాల విస్తరణవల్ల, కొత్త ఉపాధేకాక, బయటి ప్రపంచంతో పరిచయం పెరిగింది. పరిశ్రమల విజృంభణ నగరాలవైపుకు కూలీలుగా వలసలను ప్రోత్సహించింది. మారిన ఈ పరిస్థితులవల్ల నీగ్రోకు ఆర్థిక సామర్థ్యం పెరిగింది; చదువుపట్ల ఆసక్తి పెరిగింది; మానసిక వికాసం పెరిగింది.

"పెరిగిన స్వాభిమానం నీగ్రోను రెండవశ్రేణి పౌరునిగా ఉండనివ్వడంలేదు. నలుగురితోపాటు ప్రథమశ్రేణి పౌరుడుగా ఎదిగేవరకూ ఏ పోరాటానికైనా, ఎన్ని త్యాగాలకైనా అతన్ని ఉసిగొలుపుతూంది. ఇది మాంట్గోమెరీ పోరాటంలో దాగిన అసలు కథ." అంటాడు లూథర్. ఈ అసలుకథను అక్షరరూపంలో పెట్టాలనుకున్నాడు. అతని పుస్తకరచన గురించి తెలుసుకున్న ప్రచురణ సంస్థలు దాన్ని అచ్చువేయించటానికి ఎగబడ్డాయి. నచ్చిన సంస్థను ఎంపికజేసి వొప్పందం చేసుకున్నాడు లూథర్.

ఓటర్ల నమోదును ప్రోత్సహిస్తూ ఎస్.సి.ఎల్.సి. చేపట్టిన ప్రచారకార్యక్రమం ముమ్మరంగా సాగిపోతూంది. లూథర్ పలుకుబడివల్ల, అమెరికాలో గాంధేయ

విధానానికీ, అహింసావాదానికీ క్రమంగా ప్రాచుర్యం పెరుగుతూంది. ఇటీవల తెల్లజాతి మేధావివర్గంనుండి లూథర్‌కు పలుకుతోడు దొరుకుతూంది. ప్రశంసలు కురిపించే ఉత్తరాలు కుప్పలుతెప్పలుగా చేరుతున్నాయి. ఇదివరకు భారతదేశంలో అమెరికన్ రాయబారిగా పనిజేసిన ఛెస్టర్ బౌల్స్‌నుండి ఇటీవల లూథర్‌కు వొక ఉత్తరం అందింది. పదవీవిరమణ వల్ల ఆయనిప్పుడు అమెరికాలోనే ఉన్నాడు.

"ఈ సందిగ్ధ పరిస్థితిలో, గాంధేయ విధానాన్ని ఏదోవొక రూపంలో మన సమాజానికి అన్వయించడం చాలా అవసరం. ఆ అవసరం రోజురోజుకూ పెరుగుతూంది." అంటూ, అప్పట్లో లూథర్‌ను జవహర్‌లాల్ నెహ్రూతో కలపటానికి తాను చేసిన ప్రయత్నం సాగనందుకు ఛెస్టర్ బౌల్స్ విచారం వెలుబుచ్చాడు. భారతదేశాన్ని తప్పనిసరిగా సందర్శించమని అతడు సలహా ఇచ్చాడు. 'గాంధీ స్మారక నిధి' నుండి తనకు అందిన ఆహ్వానాన్ని లూథర్‌కు ఆ ఉత్తరం మరోసారి గుర్తుజేసింది.

రాయ్ విల్కిన్స్, ఫిలిప్ రాన్డాల్ఫ్ తదితర పౌరహక్కుల నాయకులతో కలిసి, 1958 జూన్‌లో ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్‌ను కలిశాడు లూథర్. అధ్యక్షుని స్పందన ఎలావుంటుందో వాళ్ళకు ముందే తెలుసు. "దేశం ఎన్ని సమస్యలు ఎదుర్కొంటూందో మీబోటి పెద్దలకు తెలియందిగాదు. ఒకవైపు లెబనాన్, మరోవైపు అల్జీరియా, ఇంకాఇంకా ఎన్నో అంతర్జాతీయ సమస్యలతో సతమతమౌతున్నాం. ఇప్పట్లో జాతుల విలీనం జరగాలని ఇంటివైపు చూస్తూ కూర్చుంటే, బయట ఏమౌతుందో ఆలోచించండి." అనే సమాధానంతో సమస్యను దాటవేశాడు. అంతర్జాతీయ సమస్యల కిచ్చినంత ప్రాధాన్యత అమెరికన్ ప్రభుత్వం జాతీయ సమస్యల కివ్వదని మరోసారి గుర్తించిన నీగ్రోనాయకులు చెవులూపుకుంటూ తిరిగొచ్చారు.

తీరిక కొరవడి, పూనుకున్న రచనను పూర్తిజేయడం లూథర్‌కు కష్టమయింది. త్వరగా ముగించమని ప్రచురణకర్తలు ఒత్తిడి చేస్తున్నారు. మిగతా కార్యక్రమాలకు కొద్దిపాటు విరామం ప్రకటించి పుస్తకాన్ని ఆగస్టుకు పూర్తిజేసి, 'స్ట్రైడ్ టూవర్డ్స్ ఫ్రీడమ్' అనే పేరుతో ప్రచురణకు అందించాడు. ముద్రణ పూర్తిజేసుకుని అది ఆ నెలలోనే విడుదలకు సిద్ధమైంది. లూథర్ ఆటోగ్రాఫులతో పుస్తకాన్ని విడుదల చెయ్యాలని ప్రకాశకుల అభిలాష. అందుకోసం న్యూయార్క్ నగరంలోని హార్లెమ్ స్టోరుకు రమ్మని పిలుస్తున్నారు. వారం పదిరోజుల్లో వస్తానని లూథర్ మాటిచ్చాడు.

సెప్టంబర్ 3వ తేదీన, ఒక వ్యాజ్యంలో సాక్ష్యమిచ్చే పనిమీద, లూథర్,

కొరెట్టా, అబెర్నెథీలు కోర్టు దగ్గరకి వెళ్ళవలసివచ్చింది. లూథర్ కనబడగానే అక్కడున్న పోలీసుజవాన్లు నిష్కారణంగా బూతులు తిట్టడం మొదలెట్టారు. ఇంతలో వొక పోలీసు అధికారి దూసుకుంటూ వచ్చి, లూథర్ చేతిని వడదిప్పి పట్టుకుని, ఒల్లంతా సోదాచేసి, 'ఇప్పుడు నాచేతిలో దొరికావ్ రారా' అంటూ వ్యాన్‌లో తోశాడు. వ్యాను జైలువైపుకు నడిచింది. పూచీకతుమీద సంతకం చేయించుకుని, జైలు అధికారులు లూథర్‌ను వాపసు పంపించారు. పనిలేకుండా కోర్టు ఆవరణలో తిరుగాడుతూ, బయటికి వెళ్ళమన్న పోలీసు అధికారి ఆజ్ఞలను ధిక్కరించాడనే ఆరోపణతో లూథర్‌మీద కేసు నమోదుచేశారు. వారం తరువాత, మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. అతనికి పది డాలర్ల జుల్మానా విధించారు. చెల్లించని పక్షంలో పద్నాలుగురోజులు జైల్లో ఉండమన్నారు. జైల్లో ఉండటానికే లూథర్ సిద్ధమయ్యాడు. కానీ, అతనికి తెలీకుండా ఎవరో జుల్మానా చెల్లించారు. చెల్లించింది ఎవరోగాదు, పోలీసు కమిషనర్ క్లేడే సెల్లర్స్. 'దీన్నిగూడా తన స్వార్థానికి ఉపయోగించుకునే అవకాశం వాడికి ఇవ్వగూడదు' అంటూ, జేబినుండి డబ్బుతీసి జుల్మానా చెల్లించాడు.

సెప్టంబర్ 20న లూథర్ హార్లెమ్‌లోని బ్లూమ్‌స్టీన్ పుస్తకాలకొట్టులో కూర్చుని, తన తొలిరచన మొదటి పేజీలో తలవంచుకుని సంతకాలు చేస్తున్నాడు. ప్రతులకోసం ఆత్రుతగా ఎదురుజూసే పాఠకులు అతని చుట్టూ క్రిక్కిరిసిపోయారు. ఆ రద్దీలో, వెనకవైపునుండి ఒక ఆడగొంతు వినిపించింది-

''మార్టిన్ లూథర్ కింగంటే నువ్వేనా?''

''ఔను.'' తలెత్తకుండానే జవాబిచ్చాడు లూథర్.

అంతే; అతని రెక్కల సందున ఎనిమిదంగుళాల కత్తి దూరిపోయింది.

ఊపిరి బిగబట్టి, కదలిక లేకుండా ఉన్నపాటున విగ్రహంలా కూర్చుండిపోయాడు లూథర్. ఆడవాళ్ళ గగ్గోలుకుగానీ, కెమెరాలతో చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఫొటోగ్రాఫర్ల హడావుడికిగానీ అతడు చలించలేదు. తొందరపడి కత్తిని శరీరంనుండి బయటికి లాగితే ప్రమాదమని తెలిసినవారు, దాన్నెవరూ తగలకుండా కాపలా కాశారు. ఆగమేగాలమీద ఆంబులెన్స్ వచ్చింది. హార్లెమ్ ఆస్పత్రికి లూథర్‌ను తరలించారు.

పొడిచింది వొక నీగ్రోవనిత. పేరు ఇజోలా వేరీ కర్రీ. విచారించగా ఆమె పిచ్చిదని తేలింది. ఆమె పట్టుకొచ్చిన కత్తి, పుస్తకాల షాపుల్లో పేపర్లు చింపుకునేదైనందున, ఆమె ఉద్దేశాన్ని అక్కడున్నవారు అనుమానించలేదు.

ఆపరేషన్‌కు చాలాసేపు పట్టింది. కత్తి మొన ప్రధాన రక్తనాళమైన అయోర్టాను తాకుతున్నందున, కత్తిని తొలగించటానికి రొమ్మును తెరచిపట్టడం అవసరమైంది. “నీ అదృష్టం మంచిది. పొరపాటున తుమ్మేవుంటే నీ రక్తమే నిన్ను ముంచేసుండేది.” అంటూ శస్త్రచికిత్స చేసిన డా.మేవార్డ్ ఆ తరువాత లూథర్‌కు వివరించాడు. “అదంతా దైవసంకల్పం. న్యాయంకోసం నేను పోరాటం మొదలెట్టినప్పటినుండి ఆయన నన్ను విడువలేదు.” అన్నాడు లూథర్.

మరుసటిరోజు వార్తాపత్రికల్లో, “ ‘హచ్’మని తుమ్మివుంటే లూథర్ ఐపోయుండేవాడు” అనే శీర్షికతో సర్జన్ చెప్పిన వివరాలను ప్రకటించారు. సానుభూతి, శుభాకాంక్షలు అందిస్తూ లూథర్‌కు చేరుతున్న ఉత్తరాల ప్రవాహంలో, వైట్ ప్లెన్స్ హైస్కూలునుండి వొక బాలిక రాసిన ఉత్తరం లూథర్ మనసుకు హత్తుకుంది. “ప్రియమైన డా.కింగ్ గారికి - నేను వైట్ ప్లెన్స్ హైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాను. నేను తెల్లజాతి బాలికనని చెప్పుకోవడం అప్రస్తుతం కావచ్చు. మీ కష్టనష్టాలు పత్రికల్లో చదివాను. మీరు తుమ్మనందుకు చెప్పలేనంత సంతోష పడుతున్నానని తెలపడానికి ఈ ఉత్తరం రాస్తున్నాను.” అంది ఆ బాలిక.

# తీర్థయాత్ర

"ఇతరదేశాలు ఎన్నైనా చూసే అవకాశం నాకు కలగొచ్చుగాక, వాటికి నేను వెళ్ళేది పర్యాటకునిగా మాత్రమే. కానీ, భారతదేశానికి నేను యాత్రికునిగా వచ్చాను. ఇది గాంధీ పుట్టిన దేశం. ఈ శకానికి సంబంధించిన వ్యక్తుల్లో మహోన్నతుడు గాంధీ మహాత్ముడు." - కొత్తఢిల్లీలో విమానం దిగి, భూమిమీద కాలుమోపగానే లూథర్ కింగ్ నోటంటా వెలువడిన మాటలివి.

గాయంనుండి కోలుకున్న తరువాత హార్లెమ్ ఆస్పత్రినుండి లూథర్‌ను ఇంటికి తీసుకెళ్ళేందుకు అనుమతించారు. విధులకు ఇప్పుడిప్పుడే హాజరు కావడంమంచిదికాదనీ, ఇంకా కొంతకాలం విశ్రాంతి అవసరమనీ డాక్టర్లు సలహా ఇచ్చారు. పనిలేకుండా ఇంట్లో కూర్చోడంకంటే శిక్ష మరొకటుండదు. ఈ గడువులో భారతదేశం చూసొస్తే బావుంటుందనే ఆలోచన లూథర్‌కు కలిగింది.

"బయలుదేరాలనుకున్న ప్రతి తడవ ఏదోవొక ఆటంకం ఏర్పడుతూ వచ్చింది. ముందుగా ఖరారైన ఘనా పర్యటన వొకసారి అడ్డుతగిలింది. 'స్ట్రయిడ్ టూవర్డ్స్ ఫ్రీడం' అనే నా రచనను పూర్తిచేయమని ప్రచురణకర్తలనుండి వచ్చిన వొత్తిడి మరోసారి అడ్డుగా నిలిచింది. ఆ తరువాత శ్రీమతి ఇజోలా-వేరే-కర్రీ సంఘటన. సెప్టంబర్ శనివారం మధ్యాహ్నం, హార్లెమ్ పుస్తకాల షాపులో కూర్చుని, పుస్తకాలమీద ఆటోగ్రాఫ్ చేస్తున్న నన్ను, ఉత్తరాలు తెరవడానికి ఉపయోగించే జపాన్ కత్తితో పొడిచి, నా ప్రయాణ ప్రణాళికనేగాక, మిగతా అన్ని కార్యక్రమాలనూ ఆమె చిందరవందర చేసింది."

జబ్బుమనిషిని ఒంటరిగా పంపించలేక, తోడుగా ఉండటానికి కొరెట్టా ప్రయాణ మయింది. మిత్రుడు ప్రొఫెసర్ లారెన్స్ రెడ్డిక్‌ను గూడా వెంట తీసుకెళ్ళాలని లూథర్ కోరిక. అలబామా విశ్వవిద్యాలయంలో రెడ్డిక్ చరిత్ర అధ్యాపకుడుగా పనిచేస్తున్నాడు. 'క్రూసేడర్ విథౌట్ వయొలెన్స్' పేరుతో లూథర్ కింగ్ జీవితచరిత్రను ప్రచురించిన రచయిత ప్రొఫెసర్ రెడ్డిక్. 'గాంధీతో నేరుగా పరిచయమున్న వ్యక్తులు నిన్ను పరిశీలించి, నీ గురించీ, మాంట్గోమెరీ ఉద్యమాన్ని గురించీ ఇవ్వబోయే తీర్పు, నీ జీవితానికి సిసలైన పరీక్ష' అనేది రెడ్డిక్ అభిప్రాయం.

పర్యటన ఖర్చుల్లో అత్యధిక భాగం 'అమెరికన్ ఫ్రండ్స్ సర్వీస్ కమిటీ' ద్వారా 'క్రిష్టఫర్ రేనాల్డ్ ఫౌండేషన్'వారు భరించారు. తమవంతు సహాయంగా మిగతా

మొత్తాన్ని 'సదరన్ క్రిస్టియన్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్'వారూ, 'మాంట్గోమెరీ ఇంప్రూవ్‌మెంట్ అసోసియేషన్'వారూ ఏర్పాటుచేశారు.

''చూడటానికి మూడు జతల కళ్లతో, వినడానికి మూడు జతల చెవులతో, మా ముగ్గురం కలిసి వొక బృందంగా ఏర్పడ్డాం.'' - లూథర్ కింగ్.

1959 ఫిబ్రవరి 3వ తేదీ అర్ధరాత్రి, విమానంలో న్యూయార్క్‌నుండి ఆ బృదం బయలుదేరింది. దారిలో ప్యారిస్‌లో దిగినప్పుడు, రెడ్డిక్ స్నేహితుడు రిచ్చర్డ్ రైట్‌ను కలుసుకుంది. నీగ్రో సమస్యమీద యూరప్‌లో తాజా ప్రతిస్పందనల గురించి అతడు వివరించడమే గాకుండా, ఉత్తమమైన ఫ్రెంచి వంటకాలను వాళ్ళకు రుచి చూపించాడు. పొగమంచు మూలంగా స్విడ్జర్లెండులో అందుకోవలసిన విమానం తప్పిపోయి, చుట్టుదారిలో, రెండురోజులు ఆలస్యంగా వాళ్ళు భారతదేశం చేరు కున్నారు.

గాంధీ స్మారక నిధి ప్రముఖులనుండి ఆ బృందానికి ఘనస్వాగతం లభించింది. పత్రికా విలేకర్లతో, ఫొటోగ్రాఫర్లతో వాళ్ళ ఢిల్లీ ప్రవేశం కోలాహలంగా సాగింది. ఆ ఉదయం దేశాధ్యక్షుడు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో తేనీటివిందులో పాల్గొన్నారు. ఆ తరువాత మహాత్మాగాంధీ సహచరుల ఆతిథ్యంలో సాయంకాలందాకా గడిపారు.

''అతిథిగా విచ్చేయమని అందిన ఆహ్వానాలన్నిటిని మన్నించటానికి మాకు సమయం చాలిందిగాదు. దాదాపు ప్రతి గడప మాకోసం ఎదురుజూస్తున్నట్టు కనిపించింది. వెళ్ళిన ప్రతిచోటా ఆదరాభిమానాలతో మమ్మల్ను ముంచెత్తారు. బహుశా, మా చర్మం రంగువల్ల కలిగిన సోదరభావం ఆ ఆప్యాయతకు కారణం కావచ్చు. సామ్రాజ్యవాదంపైనా జాతివివక్షపైనా మేము చేస్తున్న ఉమ్మడి పోరాటం అన్నిటినీ మించిన అనుబంధం.'' - మార్టిన్ లూథర్ కింగ్.

సాయంత్రం లూథర్ బృందం ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కలిసింది. లూథర్‌ను గురించీ, మాంట్గోమెరీ బస్సుల బహిష్కరణ గురించీ నెహ్రూకు తెలిసిన సమాచారం వాళ్ళను దిగ్భ్రాంతి పరిచింది. కులవివక్షను రూపుమాపటానికి భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలనూ, కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించిన పేద దేశంగా తాము ఎదుర్కొంటున్న సవాళ్ళనూ ఆయన వాళ్ళకు విశదీకరించాడు.

అణగారిన కులాలవారికి విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో కల్పించిన రిజర్వేషన్ల గురించి ప్రస్తావిస్తూ, ''అదిగూడా వివక్షే గదా?'' అని అడిగాడు ప్రొఫెసర్ రెడ్డిక్. ''కావచ్చు. కానీ, ఎన్నో తరాలనుండి జరిగిన అన్యాయానికి పరిహారంగా మేము

అనుసరిస్తున్న విధానమిది.'' అన్నాడు నెహ్రూ.

''తల మునకలుగా ఉండే సమస్యల గురించి భారతదేశ నాయకులకు స్పష్టమైన అవగాహన ఉంది. వాటిని ఎదుర్కోవటానికి వారు సాహసంతో కృషి చేస్తున్నారు. ఇందులో అభిప్రాయభేదాలు లేకపోలేదు. దేశాన్ని ఆధునీకరించాలనీ, పాశ్చాత్యదేశాల పద్ధతిలో తక్షణం పారిశ్రామీకరణ ప్రవేశపెట్టాలనీ కొందరి వాదన. అగమ్యగోచరంగావుండే ఆర్థిక పరిస్థితినుండి బయటపడాలంటే విదేశీ పెట్టుబడులనూ, విదేశీ పరిశ్రమలనూ ఆహ్వానించక తప్పదని వారంటారు.

''మరోవైపు మరికొందరు, బహుశా అధికసంఖ్యాకులు, పాశ్చాత్యీకరణ వెంట దాని భౌతికవాద సంస్కృతీ, పీకలు తెగ్గోసుకునే పోటీతత్వం, వ్యక్తుల్లో సంకుచితత్వం ప్రవేశిస్తాయని వాదిస్తున్నారు. యాంకీ డాలర్లకోసం ప్రాకులాడితే భారతదేశం తన ఆత్మను కోల్పోతుందని వారంటారు. ఉద్యోగాలు సంపాదించగలిగిన కొద్దిమందికి మాత్రమే భారీపరిశ్రమలవల్ల జీవనస్థాయి పెరుగుతుందనీ, అత్యధికులైన మిగతా ప్రజానీకాన్ని అవి మరింత దిగజార్చుతాయనీ వాదిస్తున్నారు.

''ఒక మేధావిగా, ప్రభుత్వాన్ని నిర్వహించే బాధ్యతను మోస్తున్న వ్యక్తిగా, జవహర్‌లాల్ నెహ్రూ, ఈ రెండు తీవ్రవాద ధోరణులకు మధ్యేమార్గాన్ని అనుసరిస్తున్నట్టు కనిపిస్తుంది. పారిశ్రామీకరణ కొంతవరకు తప్పదని మాతో మాట్లాడుతున్న సందర్భంగా ఆయన వెల్లడించాడు. ఐతే, దాని దుష్టపరిణామాలమీద ప్రభుత్వం శ్రద్ధగా కన్నేసి వుంచాలనీ, అలా చేయగలిగినప్పుడు లోపాలను చాలావరకు నిరోధించవచ్చుననీ ఆయన అభిప్రాయం.

''మరోవైపు, గ్రామీణప్రాంతాల్లో నూలు వడకడం, బట్టల నేత తదితర చేతి వృత్తులకు నెహ్రూ చేయూతనిస్తున్నాడు. దీనివల్ల స్థానికులకు వీలైనంత స్వేచ్ఛ, స్వావలంబన కలుగుతున్నాయి.'' - లూథర్ కింగ్.

మరుసటి రోజు వాళ్ళు రాజ్‌ఘాట్‌లోని గాంధీ సమాధిని దర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఒక దుండగుని తూటాకు గాంధీజీ బలికావడం గుర్తుకురాగానే లూథర్ మనసు వికలమైంది. ''గాంధీవంటి మనుషులను ఈలోకం ఎందుకు ద్వేషిస్తుందో అర్థంగాదు. ఏసుక్రీస్తును ద్వేషించింది; అబ్రహాం లింకన్ను ద్వేషించింది. అలాగే ఈయనగూడా ద్వేషానికి బలయ్యాడు. నలభైకోట్ల ప్రజానీకాన్ని ఉత్తేజపరిచి, ఒక తాటిమీద నడిపి, దేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకుని ప్రాణాలను సాటి హిందూసోదరుడే పొట్టన పెట్టుకున్నాడు. అహింసావాదాన్ని మనసా, వాచా, కర్మణా

ఆచరించిన రుషి, ఒక హింసావాది చేతిలో నేలకొరిగాడు. కానీ, ఏ హత్యతోనూ చరిత్ర ఆగిపోలేదు. కాలం మహాపురుషులను కంటూనేవుంది.'' అనుకున్నాడు. జీసెస్‌లాగే మహాత్ముడుగూడా శుక్రవారం రోజే చనిపోవడం లూథర్‌కు వొకింత ఆశ్చర్యం కలిగించింది. లింకన్‌లాగే గాంధీగూడా నిలువునా చీలిన దేశానికి చికిత్సకు పూనుకోవడం వల్లే మరణించడంలో సామ్యం కనిపించింది. ''గాంధీమీద తూటాలు పేల్చిన వ్యక్తి ఖూనీచేసింది గాంధీనిగాదు, మానవత్వాన్ని.'' అనుకున్నాడు. అబ్రహాం లింకన్ చనిపోగానే ఆయన కార్యదర్శి చేసిన ప్రకటన లూథర్‌కు జ్ఞాపకమొచ్చింది. 'ఇప్పుడు లింకన్ చిరంజీవి' అన్నాడు ఆ కార్యదర్శి. ''గాంధీగూడా చిరంజీవి''- ఆత్మగతంగా అనుకున్నాడు లూథర్.

దాదాపు ఐదువారాల పర్యటనలో ఢిల్లీతోపాటు కలకత్తా, మదరాసు, బొంబాయి వంటి ప్రధాన నగరాలేగాక, అనేక ఇతర పట్టణాలనూ, చారిత్రిక ప్రదేశాలనూ సందర్శిస్తూ లూథర్‌బృందం భారతదేశాన్ని విస్తారంగా పర్యటించింది. ఆ అనుభవాలను క్రోడీకరిస్తూ లూథర్ అంటాడు -

''ప్రజల్లో ఎక్కువశాతం పేదవారు. సగటు ఆదాయం సంవత్సరానికి డెబ్బై డాలర్లకంటే తక్కువ. ఐనా, తలకు చుట్టుకునే రుమాళ్లూ, ట్రౌజర్లకు మారుగా పురుషుల వొంటిమీద గాలికి రెపరెపలాడే ధోవతులూ, స్త్రీలు ధరించే పూలపూల చీరెలూ ఎంతో కనువిందుగా కనిపిస్తాయి. చాలామంది భారతీయులు సగం పాశ్చాత్య, సగం జాతీయ దుస్తుల్లో కనిపిస్తారు.

''అమెరికాలో గృహవసతి కొరత పెద్దగా ఉందని మనం ఆందోళన పడుతుంటాం. కానీ, భారతదేశాన్ని ఉదాహరణగా తీసుకుంటే, వొక్క బొంబాయిలోనే దాదాపు ఐదు లక్షలమంది రాత్రివేళల్లో వీధుల్లో పడుకుంటారు. వాళ్ళంతా అనాథలూ, నిరుద్యోగులూ, సగం ఉద్యోగులూ. చుట్టచుట్టిన పడకను పదాతిసైనికుల్లా మోసుకుంటూ, చీకటి పడగానే ఏ ఫుట్‌పాత్ మీదనో, రైల్వే స్టేషన్‌లోనో, మూతవేసిన షాపుల ముంగిట్లోనో దాన్ని పరుచుకుని ఆరాత్రి గడిపేస్తారు.

''ఆహారం కొరత మరీ దారుణం. ముప్పూటలా అన్నానికి నోచుకున్నవాళ్లు ముప్ఫై శాతమైనా లేరు. 1930 లో మనకు సంభవించిన ఆర్థికసంక్షోభం రోజుల్లో 'దేశంలో మూడింట వొకవంతుకు సరైన నీడగానీ, తిండిగానీ, బట్టగానీ లేదని' మనం వాపోయాం. ఈనాటి భారతదేశంలో దాన్ని మూడింట రెండువంతులని చెబితే ఇంచుమించు సరిపోతుంది.

''నిరుద్యోగం ఎంత ఎక్కువగావుందో, పాక్షిక ఉపాధి అంతకంటే ఎక్కువగావుంది. డెబ్బైశాతం భారతీయ జనాభాను వ్యవసాయకూలీలుగా చెబుతారు. రుతువులూ తదితర కారణాలతో ఏర్పడే పరిస్థితులవల్ల సంవత్సరంలో రెండువందల రోజులైనా వారికి పని దొరుకుతుందనే నమ్మకంలేదు. రోడ్లుపట్టుకుని తిరిగే నిరుద్యోగులు ప్రతి పట్టణంలో కనిపిస్తారు.

''పేదరికంవల్ల భారతదేశంలో ఎన్నో అనర్థాలు జరుగుతుండవచ్చు; కానీ, నేరాల సంఖ్యమాత్రం చాలా తక్కువ. ఇందులోనే భారతీయుల ఆధ్యాత్మికత ప్రతిబింబించేది. వారు నిరుపేదలు; తిండికి లేదు, బట్టకులేదు; ఐనా, దానికోసం వొకరితోవొకరు కుమ్ములాడుకోరు. వాళ్లు చాలా నెమ్మదస్తులు. మాటల్లోగానీ, చేతలల్లోగానీ వొకరినొకరు నొప్పించుకోరు. అన్నిరోజులు మేము బసచేస్తే, పిడికిళ్లతో గుద్దులాడటం కనిపించింది ఒకేవొకసారి.

''భారతదేశంలోగూడా అంటరానితనముంది. అమెరికాలో దీన్ని 'జాతి' అంటూంటే, భారతదేశంలో 'కులం' అంటారు. రెండుచోట్లానూ ఇది కొందరు మనుషులను తక్కువ వాళ్లుగా, వారి అర్హత చిన్నదిగా చూడటమే.

''జాతివివక్షను నిర్మూలించడంలో అమెరికా సాధించిన పురోగతికంటే, అంటరానితనాన్ని నిర్మూలించడంలో భారతదేశం సాధించిన ప్రగతి ఆశ్చర్యకరం, ఆనందదాయకం. ఇరుదేశాల్లోనూ ఈ దురాచారాన్ని నిషేధిస్తూ జాతీయశాసనాలున్నాయి (అమెరికాలో సుప్రీంకోర్టు తీర్పులే కేంద్ర శాసనాలుగా వర్తిస్తాయి). కానీ, ఒకేతరహా సమస్య మీద భారతదేశం సాధించినదానికీ అమెరికా సాధించినదానికీ చాలా వ్యత్యాసముంది. భారతదేశ నాయకత్వం తన నైతికబలాన్ని చట్టానికి దన్నుగా నిలబెట్టింది. ప్రధాని మొదలు గ్రామపంచాయతీ సభ్యునివరకు అంటరానితనం నేరమని వారు బహిరంగంగా ప్రకటించగలరు. అదే అమెరికాలోనైతే, పైస్థాయి అధికారులుగూడా జాతివివక్షా నిర్మూలనకు నైతిక సహకారం ఇవ్వలేరు. పైగా, దక్షిణాదిలో కొందరు ఉద్యోగులు జాతివివక్షను కాపాడుతున్నామని గర్వంగా చెప్పుకుంటారు. భారతదేశంలో ఇది ఊహించడానికైనా లేదు.

''అదీగాక, గాంధీ, అంటరానితనాన్ని కేవలం మాటల్లో వ్యతిరేకించడంగాక, చేతల్లో చూపించాడు. అదివరకు అంటరానివారికి ప్రవేశంలేని దేవాలయాల్లోకి, అతన్ని స్వయంగా చేత్తో పట్టుకుని లోపలికి తీసుకుపోయాడు. దీనికి సాదృశం చూపాలంటే,

అమెరికా అధ్యక్షుడు ఐసెన్హోవర్ ఒక నీగ్రోబాలుణ్ణి చేత్తో పట్టుకుని 'లిటిల్ రాక్' సెంట్రల్ హైస్కూలుకు తీసుకెళ్లాలి.

"అమెరికాకు తెలియనైనా తెలియని మరో మహోద్యమం భారతదేశంలో సాగుతూంది. భూసంస్కరణ ధ్యేయంగా కలిగిన ఈ ఉద్యమాన్ని 'భూదాన్' అంటారు. భారతదేశ ఆర్థిక సామాజిక స్వరూపానికి బలవంతంగాకాక, ఐచ్ఛికంగా మార్పు తీసుకొచ్చి సమస్యను పరిష్కరించడం దీని ఆదర్శం.

"సన్యాసం స్వీకరించిన వినోభా భావే, అమెరికాలో విద్యాభ్యాసం చేసిన మహామేధావి జయప్రకాశ్ నారాయణ్లు భూదాన కార్యకర్తలకు నాయకులు. ప్రజలు సొంతకాళ్లమీద నిలబడేలా చేయడం వారి ధ్యేయం. అందుకు వారు చేపట్టిన కార్యక్రమం- భూమిలేని నిరుపేదలకు తమ జాగీర్లనుండి కొంత భూమిని దానమిచ్చేలా భూస్వాములకు నచ్చజెప్పి ఒప్పించడం."

కంటికి ఇంపైన ప్రదేశాల్లో కేప్-కామరిన్ ప్రపంచంలోనే అరుదైన దృశ్యంగా లూథర్ అభివర్ణించాడు. భారతదేశానికి దక్షిణ కొసగావున్న ఆ ప్రదేశంలో మూడు జలరాసులు - తూర్పున బంగాళాఖాతం, పడమర అరేబియా సముద్రం, దక్షిణంనుండి హిందూ మహాసముద్రం - ఒకటిగా కలుస్తాయి. ఒకవైపు సముద్రంలో మునిగే సూర్యబింబం, మరోవైపు సముద్రంనుండి ఎగసే చంద్రబింబం ఒకేసారి కళ్ళకు కనిపిస్తాయి.

పట్టణాలే కాకుండా గతుకుల రోడ్లంటా మోటారువాహనాల్లో గ్రామీణ ప్రాంతాలను గూడా లూథర్బృందం పరిశీలించింది. ప్రదేశాలన్నీ తిరిగిన తరువాత, లూథర్ తన అవగాహన సింహావలోకనం చేసుకుంటూ-

"వ్యక్తిగతంగా ఈ పర్యటన నామీద ఎంతో ప్రభావం చూపింది. గాంధీ జన్మభూమిలో, గాంధీ కుమారులతోనూ మనవళ్లతోనూ తదితర బంధువులతోనూ ముచ్చటించడం, గత స్మృతులను ఆయన సహాధ్యాయులు మననం చేసుకుంటూంటే వినడం, ఆయన ఆశ్రమాన్ని సందర్శించి, ఆయన జ్ఞాపకార్థం నెలకొల్పిన ఎన్నో సంస్థలను తిలకించడం, రాజ్ఘాట్లోని ఆయన సమాధికి పూలగుచ్ఛాన్ని సమర్పించడం ఎంతో అద్భుతమైన అనుభూతి. స్వాతంత్ర్యంకోసం చేసే పోరాటంలో అణగారిన ప్రజానీకానికి అహింసావిధానం ఎంతో శక్తివంతమైన ఆయుధమని మరింత దృఢంగా నమ్ముతూ నేను భారతదేశంనుండి తిరిగొచ్చాను. అహింసావిధానం సాధించిన అద్భుత ఫలితాలను కళ్లతో చూడటం అమోఘం. సాయుధపోరాటం తరువాత

సాధారణంగా కనిపించే కక్షలూ, ద్వేషాలూ భారతదేశంలో ఎక్కడా కనిపించవు. కామన్‌వెల్త్‌లో బ్రిటిష్‌వారికీ భారతీయులకూ మధ్య సమాన ప్రతిపత్తితో కూడిన అన్యోన్యత ఏర్పడింది. లొంగుబాటు అనేది నైతిక ఆధ్యాత్మిక ఆత్మహత్యకు నడిపిస్తుంది. హింసామార్గం చావగా మిగిలిపోయినవారిలో ద్వేషాన్నీ, చంపినవారిలో పశుత్వాన్నీ రెచ్చగొడుతుంది. అహింసామార్గంవల్ల సౌభ్రాతృత్వం వెల్లివిరిసే సమాజం లభిస్తుంది.

"భారతదేశంలో మహాత్మాగాంధీ ఆధ్యాత్మికంగా ఇప్పటికీ బ్రతికేవున్నాడు. స్వాతంత్ర్యపోరాటం జరిగే సమయంలో ఆయన శిష్యుల్లోనే కొంతమందికి ఆయన విధానాలపట్ల అపోహలుండేవి. కానీ, ఇప్పుడు చూస్తే, స్థాయిలో ఆయన దరిదాపులకు చేరగలిగిన వ్యక్తి వొక్కరైనా కనబడరు. మనసప్పగించి పరిశీలించిన ఏ దార్శనికునికైనా గాంధీ వొక మహోన్నతమైన వ్యక్తిగానేగాక, ఆ దేశ ప్రజాజీవితంపైనా, ప్రభుత్వ విధానాలపైనా చెరగని ముద్రగా నిలిచిపోయినట్టు స్పష్టంగా గోచరిస్తుంది." - అంటూ మననం చేసుకున్నాడు.

ఆత్మీయులను విడిచివెళుతున్నంత బాధతో లూథర్, కొరెట్టా, రెడ్డిక్‌లు మార్చి 10వ తేదీన ఢిల్లీ విమానాశ్రయంనుండి స్వస్థలానికి బయలుదేరారు.

# ఇంటిపోరు

కఠినమైన పరీక్షలో మొదటిస్థానం సంపాదించిన విద్యార్థిలాగా లూథర్ కింగ్ స్వదేశం తిరిగొచ్చాడు. మహాత్మాగాంధీ అనుచరులు తనపట్ల చూపెట్టిన ఆదరణ తన కార్యాచరణకు అభినందనగా భావించాడు. అక్కడ కొత్తగా నేర్చుకున్న అలవాట్లను తన దినచర్యలో కొనసాగించాలనుకున్నాడు. ఉదయం 6-30 గంటలకే నిద్ర లేస్తున్నాడు. శరీరంలో కొత్తశక్తి పారాడుతున్నంత ఉత్సాహంగా పనిజేస్తున్నాడు. పొద్దెంత గడిచినా పనులు పూర్తవకుంటే పడుకోవడం మానుకున్నాడు. వారానికొకరోజు 'మెడిటేషన్'లో ఉండాలనీ, మౌనవ్రతం పాటించాలనీ ప్రయత్నించాడు. "తెల్లవారి చూస్తే పని గుట్టలుగుట్టలుగా పేరుకుపోయేది. ఇక నాకు వీలుపడదని మానేశాను." అంటూ లూథర్ తన అశక్తతకు నొచ్చుకున్నాడు.

అదే సమయంలో, లూథర్ విధానాలకు సమాంతరంగా, ఉత్తర అమెరికాలో మరో సిద్ధాంతం తలెత్తింది. మాల్కం ఎక్స్ అనే నీగ్రోనాయకుడు దానికి మూల పురుషుడు. అతడు న్యూయార్క్ నగరంలోని హార్లెమ్ నివాసి. 1952లో ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. తెల్లజాతిని బెదరగొట్టి, నీగ్రోలందరిని ఒకచోటికి వలసజేర్చి, అమెరికా భూభాగంలోనే ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటుకావడం అతని ధ్యేయం.

"స్వాతంత్ర్యం, సమానత్వాలనేవి యాచించి తెచ్చుకునే పదార్థాలుగాదు. చేవతో సంపాదించుకునేవి" అంటాడు మాల్కం ఎక్స్.

ప్రాణానికి తెగించి సిద్ధాంతానికి కట్టుబడిన నాయకుడు మాల్కం. పట్టుదలకూ పరిశ్రమకూ రాక్షసుడు. రోజుకు నాలుగుగంటలకు మించి నిద్ర నెరుగడు. కంటబడిన ఏ సాహిత్యాన్నీ చదవకుండా వదలిపెట్టడు. శ్రోతలను తన దారికి పట్టుకురావడంలో లూథర్‌కు తీసిపోని వక్త. అతడు ప్రతిపాదించే 'ఇస్లాం రాజ్యా'న్ని పగటికలగా నీగ్రోసమాజం త్రోసిపుచ్చినా, అతని వాదనాశిల్పం యువతను ఆకట్టుకుంటూంది. ఒకసారి న్యూయార్క్‌లో లూథర్‌కు మాల్కం ఎక్స్ కలిశాడు. కానీ, పని ఒత్తిడి మూలంగా నిమిషం సేపటికి మించి వాళ్ళ పరామర్శ సాగిందిగాదు.

నిప్పుకు నెయ్యి తోడైనట్టు, దక్షిణాది రాష్ట్రాల్లో జరిగే కొన్ని సంఘటనలు మాల్కం వాదనకు బలాన్ని సమకూరుస్తున్నాయి. వాటిల్లో ప్రధానమైంది మిసిసిపి రాష్ట్రంలో ఇటీవల జరిగిన 'లించింగ్.' ఆటవికులైనా ఏవగించుకునేంత క్రూరంగా నీగ్రోలను హింసించి చంపేసే పద్ధతిని 'లించింగ్' అంటారు. ఏదోవొక నింద

మోపి అర్థరాత్రి నీగ్రోను మారుమూల ప్రాంతానికి ఎత్తుపోతారు. తెల్లవనితను మానభంగం చేశాడనేది అతనిమీద మోపే సర్వసాధారణ అభియోగం. చెప్పటానికి సాక్ష్యముండదు, విచారించటానికి న్యాయస్థానముండదు. నిందితుని చుట్టూ చేరిన ఉగ్రవాద తెల్లజాతీయులే చట్టమూ, కోర్టూ, దండనా. ఈ పద్ధతి వధింపులు మగ నీగ్రోలకే పరిమితంగాదు. చిల్లర నేరాలకు ప్రాణాలు కోల్పోయిన నీగ్రోయువతులు గూడా వందల్లో ఉన్నారు. మానభంగం వంటి పెద్దపెద్ద అభియోగాలకే గాక, దొంగతనం, సోమరితనం వంటి చిన్నచిన్న సాకులతోనూ లించింగ్ చెయ్యొచ్చు. చివరకు, ఓటరుగా నమోదు కావటానికి ప్రయత్నించడంగూడా లించింగుకు అర్హమైన నేరమే! దుడ్డుకర్రలతో బాదడం, కొరడాలతో చీరడం, కళ్ళు పొడవడం, కాళ్ళు నరకడం వంటి చిత్రహింసలు పూర్తయిన తరువాత, బడితెలతోనో బాకులతోనో తుపాకితోనో నిందితుని చంపేస్తారు. ఎంత బలమైన సాక్ష్యాలున్నా హత్యజేసిన కిరాతకులను దక్షిణాది రాష్ట్రాల న్యాయస్థానాలు శిక్షించటానికి పూనుకోవు. చివరకు, నేరానికి పాల్పడ్డామని ముద్దాయిలు బహిరంగంగా ప్రకటించినా ఖాతరు చెయ్యవు.

నాలుగేళ్ళ క్రితం, ఎమ్మెట్ టిల్ అనే పద్నాలుగేళ్ళ నీగ్రోబాలుణ్ణి, మిసిసిపి రాష్ట్రంలో, తెల్లయువతిని అదోరకంగా చూశాడనే మిషతో లించింగ్ చేయడం దేశాన్ని గగ్గోలు పరిచింది. ప్రపంచదేశాల ఎదుట అమెరికన్ ప్రజాస్వామ్యం పరిహాసం పాలయింది. నిజానిజాలు తెలుసుకోటానికి అమెరికన్ ప్రభుత్వం 'ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్'తో దర్యాప్తు జరిపించింది. లించింగ్‌లో చనిపోయిన నీగ్రోల నేరాలకు రుజువుల మాట అటుంచి, ఆరోపణలే లేని సందర్భాలు కొల్లలుగా ఉన్నాయని దర్యాప్తులో తేలింది.

ఇప్పుడు, 1959 ఏప్రిల్ 24 వ తేదీన, లూథర్ భారతదేశంనుండి తిరిగొచ్చి ఆరువారాలైనా కాకముందే, అదే మిసిసిపి రాష్ట్రంలో, మ్యాక్ పార్కర్ అనే మరో నీగ్రోయువకుణ్ణి లించింగ్ పద్ధతిలో చంపేయడం నల్లజాతి గుండెల్లో మంటలు రేపింది.

ఇలాటి చెదురుమదురు సంఘటనలు తీవ్రంగా పట్టించుకోదగ్గ ప్రాముఖ్యత గలవిగా అమెరికన్ ఫెడరల్ ప్రభుత్వం భావించడంలేదు. దాని మనసంతా ఇప్పుడు అంతర్జాతీయ 'డిటేట్ (detente)' మీద లగ్నమైవుంది. శత్రుశిబిరాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించుకునే విధానాన్ని ఫ్రెంచిభాషలో డిటేట్ అంటారు. సొంత భద్రతకోసం ఇప్పుడు అమెరికాకు దాంతో పనిబడింది. ఒకప్పుడు, ఏకైక పాలెగాడిగా ఎదగడానికి, ప్రాణికోటిని నామరూపాల్లేకుండా భస్మీపటలంజేసే అణుబాంబును

తయారుజేసింది తానే; కేవలం శక్తిని ప్రదర్శించటానికి, ఆపాటికే లొంగిపోయిన జపాన్‌మీద అణుబాంబును ప్రయోగించి ప్రపంచాన్ని దద్దరిల్లేలా చేసిందీ తానే. కానీ, తాడి తన్నేవాడికి తలదన్నేవాడు తయారయ్యాడు. అణుబాంబును మించిన హైడ్రొజన్‌బాంబు తయారీతో ఆరునెలలు తిరగకముందే సోవియట్ రష్యా అధ్యక్షుడు స్టాలిన్ పోటీదారునిగా బరిలో నిలబడ్డాడు.

ఇరుదేశాలు పోటాపోటీగా పెంచుకున్న అణ్వాయుధాలు ఇప్పటికే గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయి. వాటితో భూగోళంమీద జీవరాసి మిగలకుండా తుడి చేయటానికి నిమిషం చాలు. అది మినహాయింపులేని వినాశనం; చివరకు అమెరికా రష్యాలుగూడా భూమ్మీద మిగలవు. బాంబులతో ప్రపంచాన్ని బెదిరించాలనుకున్న అమెరికాకు ఇప్పుడు ఆత్మరక్షణకోసం తరుణోపాయం గత్యంతరమయింది. ఆ దేవులాటలో డిటేట్‌గా పిలువబడే పురాతన ఉపశమనం అమెరికన్ వైస్‌ప్రెసిడెంట్ నిక్సన్ చేతికి దొరికింది.

ఉద్రేకాలను నిగ్రహించమని ప్రపంచదేశాలకు హితబోధ చేసే అర్హత శాంతికాముకులుగా ప్రపంచం గుర్తించిన వ్యక్తులకే ఉంటుందిగానీ, అమెరికన్ ప్రభుత్వానికుండదు. అటువంటి వ్యక్తుల్లో లూథర్ కింగ్ ప్రథముడు గాబట్టి, డిటేట్ మీద అతని సంతకానికి ఎంత విలువుంటుందో నిక్సన్‌కు తెలుసు. అందువల్ల, 1959 మే 11 న వాషింగ్టన్‌లో జరుగబోయే శాంతికాముకుల సమావేశానికి రావలసిందిగా లూథర్‌ను స్వయంగా ఆహ్వానించాడు నిక్సన్. ఆ సందర్భంగా వాషింగ్టన్ వెళ్ళిన లూథర్, దేశరాజకీయాల్లో ప్రముఖపాత్ర పోషించే ఎంతోమంది ఉత్తరాది నాయకులను కలుసుకున్నాడు. వాళ్ళల్లో చాలామందికి దక్షిణాదిలో పౌరహక్కులకు జరుగుతున్న భంగపాటు గురించి అవగాహనే లేదని తెలిసి హతాశుడయ్యాడు.

మరోవైపు, తెల్లజాతి దురహంకారుల ఆగడాలు వంతులవారీగా కొనసాగుతూనే ఉన్నాయి. రెండునెలల కిందట పార్కర్ హత్యతో దక్షిణాదిలో చెలరేగిన మంటలు చల్లారకముందే, వర్జీనియా రాష్ట్రంలో సిగ్గుచేటైన మరో సంఘటన ప్రజాస్వామ్యాన్ని నివ్వెరపరిచింది. కేంద్ర శాసనానికి తలొగ్గి నల్లజాతి పిల్లలకు చదువు చెప్పేకంటే నామోషీ బ్రతుకు మరొకటి లేదని ప్రకటించి, ప్రిన్స్ ఎడ్వర్డ్ కంట్రీ స్కూల్ యాజమాన్యం తన యావత్తు విద్యాసంస్థలను మూసేసింది.

జరిగిన ప్రతి సంఘటన మనసులో ముల్లులా గుచ్చుకోవడమేగాక, 'మానసిక పరివర్తనతో మార్పు తీసుకురావా'లనే లూథర్ సిద్ధాంతాన్ని వెక్కిరించింది. మాంట్గో

మెరీ ఉద్యమంలో కనిపించిన పటిమ లూథర్ కింగులో ఇప్పుడు లోపించిందని చప్పరించేవాళ్ళు తయారయ్యారు. 'ఉపన్యాసాలూ ఊరేగింపులతో తెల్లవారదు' అంటూ పెదవి విరిచేవాళ్ళు కొందరయ్యారు. మాల్కం ఎక్స్ రూపొందించిన 'పగలో పుట్టిన పగ'అనే టి.వి. రూపకం సమకాలీన వాతావరణాన్ని మరింత కలుషితం జేసింది.

గిట్టనివారు ఎత్తిపొడిచినా, లూథర్ సిద్ధాంతంమీదగానీ, లూథర్ నాయకత్వం మీదగానీ దక్షిణాది క్రిస్టియన్ లీడర్ల సమాఖ్యకు విశ్వాసం సడలలేదు. అదిప్పుడు శాఖోపశాఖలుగా బలపడి, అట్లాంటా నగరాన్ని కేంద్రంగా చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అట్లాంటా నగరం దక్షిణాదిరాష్ట్రాల గరిమనాభి. నల్లజాతి సంపన్నులకూ మేధావులకూ ప్రసిద్ధి. ఎస్.సి.ఎల్.సి. ప్రధానకార్యాలయానికి అది అన్నివిధాలా అనుకూలమైన నగరం. కానీ, తరచు మూడువందల కిలోమీటర్లు పైకీకిందికీ ప్రయాణించడం సంస్థ అధ్యక్షుడైన లూథర్‌కు అదనపు ప్రయాస. అట్లాంటాకు మకాం మార్చమని సమాఖ్య కార్యవర్గం లూథర్‌ను తొందరపెట్టింది. కో-పాస్టర్‌గా పనిజేయటానికి రమ్మని ఎబనేజర్ చర్చి చాలాకాలంనుండి అడుగుతూనేవుంది.

అరుదైన స్థాయికి తన హోదాను పెంచిన మాంట్గోమెరీని విడవాలంటే లూథర్ మనసు విలవిల లాడింది. ఐదేళ్ళుగా అతనికి ఉపాధి కల్పించిన నగరమది. అహింసా మార్గాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించటానికి అనుకూలించిన జనానికి నివాసమది. అతని వాక్కే తమ నిర్ణయంగా ఉద్యమంలో క్రమశిక్షణ పాటించి, లూథర్‌ను ప్రపంచమంతా కొనియాడేలా చేసిన స్నేహితులు అక్కడున్నారు. అంధకారంలో కొట్టుమిట్టాడే ఆఫ్రికన్ అమెరికన్లకు ఆశాజ్యోతి వెలిగించిన సహచరులు అక్కడున్నారు. ఆ అనుబంధాన్ని తెంపుకోటానికి లూథర్ తటపటాయించాడు.

కానీ మకాం మార్చక తప్పదు. విశాల రంగస్థలం అతనికోసం ఎదురుజూస్తోంది. యావత్తు నీగ్రో సమాజానికీ అవసరమైన అతని వ్యవసాయం, అనురాగ బంధంలో ఇరుక్కుని మాంట్గోమెరీతో అంతం కాగూడదు. కంటితడి పెట్టుకున్న అభిమానులను లూథర్ ఓర్పుగా సముదాయించాడు. మొరాయించిన స్నేహితులను సమాధానపరిచాడు. 1960 ఫిబ్రవరి 1వ తేదీన సకుటుంబంగా లూథర్ అట్లాంటా నగరం చేరిపోయాడు.

# సుడిగుండం

అట్లాంటా చేరుకుంటే కాసింత తీరిక దొరుకుతుందని ఆశించిన లూథర్‌కు మునుపటికంటే పనిభారం పెరిగింది. తన చేతులమీదుగా స్థాపించిన దక్షిణాది క్రిస్టియన్ లీడర్ల సమాఖ్యను ఆర్థికంగా బలపరిచే బాధ్యత సంపూర్ణంగా లూథర్ భుజాలమీద మోసింది. ఇది మరోమనిషి పంచుకోగల బాధ్యతగాదు. లూథర్ ప్రసంగిస్తేనే జనం వింటున్నారు; లూథర్ మాటవెంటే జనం నడుస్తున్నారు; లూథర్ అడిగితేనే విరాళా లిస్తున్నారు. అందువల్ల, కాలికి బలపం కట్టుకుని దేశమంతా తిరగక లూథర్‌కు తప్పలేదు.

లూథర్ ఏ ధ్యాసలోవున్నా, అతడు సృష్టించిన ప్రకంపనాలు నీగ్రోలను తాకకుండా మానలేదు. సరిగ్గా లూథర్ అట్లాంటాకు నివాసం మార్చిన రోజు, యాదృచ్ఛికంగా దేశంలోని మరోమూల బ్రహ్మాండమైన విద్యార్థి ఉద్యమానికి బీజం పడింది. ఇందుకు కారకులు ఉత్తర కరోలినా రాష్ట్రంలోని గ్రీన్స్‌బరీ నగరంలో అగ్రికల్చర్ చదివే ఇద్దరు కాలేజి విద్యార్థులు. వాళ్ళేం పెద్ద రాజకీయాలు తెలిసిన యువకులు కాదు. కొనుగోలు కోసం తరచు వెళ్ళే వొక డిపార్ట్‌మెంటల్ స్టోరులో చూపే పక్షపాతం ఆ ఇద్దరు మిత్రులను ప్రత్యక్ష చర్యకు ప్రోత్సహించింది.

విడివిడి కౌంటర్లద్వారా పలురకాల సరుకులు విక్రయించే భారీదుకాణాన్ని అమెరికాలో డిపార్ట్‌మెంటల్ స్టోర్ అంటారు. అలాటి దుకాణాల్లో నల్లజాతీయులు ఏ కౌంటర్‌కైనా వెళ్ళొచ్చు, ఏ సరుకైనా కొనవచ్చు; కానీ, ఆహారపానీయాలమ్మే కౌంటర్ మాత్రం నల్లజాతికి నిషేధం. మిగతా కౌంటర్ల దగ్గర చెల్లుతున్న నల్లడాలరు ఆ ఒక్క కౌంటర్‌లో ఎందుకు చెల్లదో తేల్చుకోవాలనుకున్నారు ఆ మిత్రులు.

తేల్చుకోటానికి వాళ్ళొక గమ్మత్తైన విధానం అనుసరించారు. ప్రతిరోజూ స్టోరుకు వెళ్ళడం, కొట్టు మూసిందాకా ఆహారపానీయాలమ్మే కౌంటర్ దగ్గర నిశ్చలంగా కూర్చోవడం వాళ్ళకు తోచిన శైలి. 1960 ఫిబ్రవరి 1వ తేదీన వాళ్ళ బైఠాయింపు మొదలైంది. పక్షం రోజులు గడవకముందే అది ఉత్తర కరోలినా రాష్ట్రంలోని నగరాలన్నిటికి నెరుసుకుపోయింది. కేవలం నీగ్రోవిద్యార్థులే కాకుండా, వివక్షను వ్యతిరేకించే తెల్లవిద్యార్థులు గూడా ఆ నిరసన ప్రదర్శనలో చేరిపోయారు.

మరో నెలరోజులకు విద్యార్థుల నిరసన ఉత్తర కరోలినా సరిహద్దులు దాటి, పొరుగురాష్ట్రాల్లో ప్రవేశించింది. మార్చి మాసాంతానికి దాదాపు పద్నాలుగు దక్షిణాది నగరాల్లో ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకుంది. పోలీసు కిరాతకత్వానికీ, దురహంకారుల దుడ్డుకర్రలకూ విద్యార్థులు చలించలేదు. బైఠాయింపుల్లో పాల్గొంటున్న కారణంగా ఏ విద్యార్థినైనా కాలేజినుండి తొలగిస్తే, విద్యార్థులంతా మూకుమ్మడిగా తరగతులు బహిష్కరించి బయటికి నడిచారు. ఆ దశలో దక్షిణాది విద్యార్థులు కనబరచిన ఐకమత్యం విద్యార్థి ఉద్యమాల చరిత్రలోనే అపూర్వం.

అట్లాంటా యూనివర్సిటీ ఆవరణలో సమావేశమైన ఆ నగర విద్యార్థులు - ''నైతికంగానూ శాసనపరంగానూ ఏనాడో మాకు సంక్రమించిన హక్కులను అప్పుడింత అప్పుడింత గిల్లిగిల్లి వడ్డిస్తూంటే ప్రశాంతంగా ఎదురుచూస్తూ కూర్చో వడం మాకు చేతగాదు'' అంటూ తమ అభిమతాన్ని బాహాటంగా ప్రకటించారు.

ఎస్.సి.ఎల్.సి. సహకారం అర్థిస్తూ విద్యార్థులు లూథర్‌ను కలిశారు. అహింసా విధానాన్ని ఆచరిస్తున్నందుకు లూథర్ వాళ్ళను అభినందించాడు. కానీ, సమాఖ్యను రంగంలో దించటానికి అతడు సందేహించాడు. అట్లాంటా నగరపెద్దల స్వభావం అతనికి బాగా తెలుసు. ఎస్.సి.ఎల్.సి.ని వేలెత్తిచూపే అవకాశంకోసం వాళ్ళు పొంచేసుకుని కూర్చున్నారు.

లూథర్ తటపటాయింపు ఎల్లా బేకర్‌కు నచ్చలేదు. ఆమె సమర్థురాలైన కార్యకర్త. ఇదివరకు ఎన్.ఎ.ఎ.సి.పి కార్యదర్శిగా అనుభవం సంపాదించింది. ఇప్పుడు ఆమె ఎస్.సి.ఎల్.సి. కార్యదర్శి. చేతికి తీసుకోకుంటే, విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా మారేందుకు ఎంతోకాలం పట్టదని ఆమె హెచ్చరించింది.

ఎల్లా బేకర్ చొరవతో, ఏప్రిల్ 15 నుండి 17 వరకు, ఉత్తర కరోలినాలోని ర్యాలీ నగరంలో దక్షిణాది విద్యార్థిప్రతినిధుల సమావేశం ఏర్పాటైంది. సమావేశం ఖర్చులు సమాఖ్య భరించింది. 212 మంది విద్యార్థిప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రతినిధివర్గంలో జాతిభేదం లేకుండా తెలుపూ నలుపూ విద్యార్థులంతా హాజరయ్యారు. ఆ సమావేశాలకు మార్టిన్ లూథర్ కింగ్ ప్రధాన వక్త. 'అహింసను వొక ఎత్తుగడగా కాక, ఒక జీవన విధానంగా అనుసరించా'లనేది లూథర్ సందేశం.

చివరిరోజు మూడు ముఖ్యమైన తీర్మానాలను విద్యార్థుల సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోటానికి వెంటనే ఒక సంస్థను ఏర్పాటు చేసుకోవాలన్నది మొదటి తీర్మానం. జాతివివక్ష పాటించే దుకా

ణాల్లో కొనుగోళ్ళు బహిష్కరించేలా చేయడానికి దేశవ్యాప్తంగా ప్రయత్నిం చాలనేది రెండవ తీర్మానం. బెయిలు నిరాకరించి, జైల్లో కూర్చోటానికి వెనుకాడని అహింసాసైన్యాన్ని సేకరించాలనేది మూడవ తీర్మానం.

ర్యాలీ సభలు ముగిసిన మరుక్షణంనుండి, ముమ్మరమైన కార్యక్రమంలో ఎస్.సి.ఎల్.సి. మునిగిపోయింది. నిద్రాహారాలు లెక్కజెయ్యకుండా లూథర్ పనిజేస్తు న్నాడు. విద్యార్థులనూ, పౌరహక్కుల నాయకులనూ, కార్మికసంఘాలనూ కూడగట్టి సమన్వయించటానికి అతడు తన శారీరికసుఖాన్ని గాలికి వదిలేశాడు.

లూథర్ ప్రతి కదలిక తెల్లజాతి దురహంకారుల కన్నెర్రకు కారణమై ప్రతీకారాన్ని ఎదురుజూస్తూంది. అందులో భాగంగా మే 4 న అతిస్వల్పమైన నేరానికి డి-కాబ్ ప్రాంత పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. డి-కాబ్ కంట్రీ అనేది అట్లాంటా పట్టణానికి శివారు. ఆ ప్రాంతంలో నివసించే లిలియన్ స్మిత్ అనే తెల్లజాతి రచయిత్రిని కారులో ఇంటికి చేర్చి తిరిగొస్తున్నాడు లూథర్. పోలీసులు కారాపి లైసెన్సు చూపమన్నారు. అతని దగ్గరున్నది అలబామా రాష్ట్రం లైసెన్సు. దాన్ని జార్జియారాష్ట్ర లైసెన్సుగా మార్చుకోవలసిన అవసరమైతే ఉందిగానీ, ఎంతలోపల మార్చుకోవాలో గడువు నిర్ణయించే నిబంధనలు లేవు. అరెస్టు చేయ టానికి తగిన నేరం కాకపోయినా, అరెస్టుజేసి పోలీసులు కోర్టుకు అప్పగించారు. అదే కోర్టులో పనిజేసే వొక లాయరు లూథర్‌ను విడుదల చేయించి ఇంటికి పంపించాడు. వాస్తవానికి ఆ లాయరు తన క్లయింటు తరఫున నేరాన్ని అంగీక రించి, జుల్మానా వేయించి, బెయిలుమీద విడిపించాడు. కానీ, అతడు ఆ విషయాన్ని లూథర్‌కు చెప్పలేదు. అపరిచిత వ్యక్తి తనను ఆదుకోటానికి ముందుకొస్తే, బహుశా అతడు తన అజ్ఞాత అభిమాని కావచ్చు ననుకున్నాడు లూథర్. కేసు అతి స్వల్ప మైంది కావడంతో ఆ తరువాత అతడు దాన్నిగురించి పట్టించుకోలేదు. అదేకేసు రాబోయే కాలంలో పెద్ద కల్లోలాన్ని సృష్టిస్తుందనీ, అమెరికన్ అధ్యక్ష ఎన్నికలను నిర్ణయిస్తుందనీ ఏవొక్కరు అప్పుడు ఊహించలేదు.

తరువాత రెండురోజులకు దక్షిణాది విద్యార్థి ప్రతినిధుల రెండవ సమావేశం అట్లాంటా యూనివర్సిటీ క్యాంపస్‌లో మొదలయింది. ఇదివరకే నిర్ణయించిన విద్యార్థి పోరాట సంస్థను ఏర్పాటుచేయడం ఆ సమావేశాల కర్తవ్యం. అది ఎస్.సి. ఎల్.సి. కి అనుబంధ సంస్థగా ఉండాలా లేక స్వతంత్రంగా ఉండాలా అనే విషయంగా తర్జనభర్జన జరిగింది. చివరకు సమాఖ్య సహకారంతో పనిజేసే స్వతంత్ర సంస్థగా

ఉండాలని నిర్ణయించారు. దాన్ని 'స్టూడెంట్ నాన్‌వయొలెంట్ కోఆర్డినేటింగ్ కమిటీ (ఎస్.ఎన్.సి.సి.)' అనే పేరుతో పిలిచారు.

విద్యార్థి ఉద్యమం తాకిడి ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్‌ను కదిలించింది. సమస్యను రాష్ట్రప్రభుత్వాలమీద వదిలేసి, ఫెడరల్ ప్రభుత్వం ఎప్పటిలాగే ఉదాసీనంగా ఉండటానికి వీలుపడని సమయమది. ఏడాది చివర్లో అధ్యక్షస్థానానికి ఎన్నికలున్నాయి. పోటీలో తను లేకున్నా, తన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి గెలిచేలా చూడటం అతని బాధ్యత. గెలవటానికి తెల్లఓటుతోపాటు నల్లఓటుగూడా అవసరం. అందువల్ల, తాత్కాలికంగా పరిస్థితిని అదుపుచేసే రెండవ పౌరహక్కుల బిల్లుమీద అతడు 1960 మే 6 వతేదీన సంతకం చేశాడు. అది ఇరువైపులా తెగే కత్తి. జాతి కారణంగా ఓటుహక్కుకు ఆటంకం కలిగించే ఏ వ్యక్తినైనా శిక్షించే సంపూర్ణ అధికారంతో ఆ బిల్లు న్యాయస్థానాల చేతులను బలిష్టం చేసింది. రాష్ట్రప్రభుత్వాలు విధించిన నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను కఠినంగా శిక్షించే అధికారంగూడా ఆ బిల్లుద్వారా న్యాయస్థానాలకు సంక్రమించింది.

ఇరువర్గాలనూ సంతృప్తి పరచడానికి ఉద్దేశించిన ఐసెన్‌హోవర్ బిల్లును దక్షిణాది రాష్ట్రాల్లో ఏ వర్గం హర్షించలేదు. బిల్లు మొదటిభాగంతో తృప్తిపడి విద్యార్థులు ఉద్యమాన్ని విరమించనూలేదు; రెండవభాగానికి భయపడి బైఠాయింపులు మానుకోనూలేదు.

ఊపిరి సలపని కార్యక్రమాలతో సతమతమౌతున్న లూథర్‌ను ఇష్టాగోష్ఠికి రమ్మని న్యూయార్క్ గవర్నర్ రాక్‌ఫెల్లర్ కబురంపాడు. కబురుతోపాటు తన నివాసానికి లూథర్‌ను తెచ్చేందుకు తన ప్రత్యేక విమానం పంపించాడు. కాదనటానికి వీల్లేదు; కబురు పంపిన మనిషి కాదని తిప్పిపంపేంత అలుసైనోడు కాడు. సంపదకు ప్రపంచంలో అగ్రస్థానాన్ని ఆక్రమించిన కోటీశ్వరుడు రాక్‌ఫెల్లర్. అంతేగాక, దానధర్మాల్లో అతని చేతికి ఎముకలేదని ప్రతీతి. క్రైస్తవ మతసాంప్రదాయాలపట్ల మొక్కవోని విశ్వాసంగల సాత్వికుడు. రాజపోషకునిగా అనేక విద్యాసంస్థలను బ్రతికిస్తున్న సంస్కారి. లూథర్ సరేనంటే రాబోయే అధ్యక్ష ఎన్నికలకు అభ్యర్థిగా బరిలో దిగాలని అతని కోరిక. కానీ, రాజకీయాల్లో జోక్యానికి లూథర్ నిరాకరించాడు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనే తన కఠినవైఖరి ఆ సందర్భంలో లూథర్‌కు కాసింత నొప్పి కలిగించింది. రాక్‌ఫెల్లర్ మాత్రం అతని జవాబును సహృదయంతో స్వీకరించాడు. లూథర్ ద్వారా ఎస్.సి.ఎల్.సి. కి భారీ

మొత్తాన్ని విరాళంగా పంపించాడు.

లూథర్ ప్రతిష్టను తక్షణం దెబ్బతీయకపోతే కుదరదనున్నారు ప్రత్యర్థులు. తప్పుడు లెక్కలు చూపి, తన ఆదాయాన్ని కప్పిపుచ్చాడనే ఆరోపణతో లూథర్‌మీద మాంట్గోమెరీకోర్టులో కేసు దాఖలు చేయించారు. లూథర్ తల్లడిల్లి పోయాడు. అసలే గిలిమనిషి; ఆ దెబ్బకు కుదేలై కూలబడ్డాడు. మరుసటిరోజు ముఖ్యమైన సభలో ప్రసంగించటానికి అతడు చికాగో వెళ్ళవలసివుంది. తలెత్తుకుని నలుగురితో తిరగలేనని ప్రయాణం మానేశాడు. లూథర్ అంతగా కుప్పగూలడం కొరెట్టా అదివరకెప్పుడూ చూడలేదు. "నీది పిచ్చి ఆలోచన. ప్రజలకు నీమీద నమ్మకముంది. ఏ ఉద్దేశంతో అలబామా రాష్ట్రం ఈ పన్నాగం పన్నిందో అందరికీ తెలుసు"అంటూ ఆమె ఓదార్చింది. కాస్సేపటికి రాల్ఫ్ బన్నే అనే మిత్రుడు లూథర్ దగ్గరికొచ్చాడు. "చూడు మార్టిన్. మార్టిన్ లూథర్ కింగ్ మాట నమ్మాలా, అలబామా మాట నమ్మాలా అనే విషయానికొస్తే ప్రజలు లూథర్ కింగునే నమ్ముతారుగాని, అల బామాను కాదు. లే. చీకట్లు వాటంతట అవే విచ్చుకుంటాయి." అంటూ చికాగో బయలుదేరదీశాడు.

లూథర్ డబ్బు కాజేశాడంటే అతని ప్రత్యర్థులుగూడా నమ్మనిమాట నిజం. సంపాదనపట్ల అతడు ఏనాడూ వ్యామోహం చూపలేదు. చాటుమాటు సంపాదన మాట అలావుంచి, చట్టబద్ధమైన మార్గాలనుగూడా అతడు కాలదన్నాడు. అతని ఆదాయ వివరాలమీద 1958లోనే అలబామారాష్ట్రం పేచీకి దిగింది. కోర్టు వ్యాజ్యానికి ఇష్టపడని లూథర్, పదివేల డాలర్ల చెక్కును ప్రభుత్వానికి పూచీగా ఇచ్చున్నాడు. ఆ దినం మొదలు ఇంతదాకా అలబామా ఆదాయపన్నులశాఖ అతని అదనపు ఆదాయాన్ని నిరూపించనూలేదు, ఆ చెక్కును మార్చనూలేదు.

మాంట్గోమెరీ కోర్టులో మార్చి 26న విచారణ మొదలయింది. కోర్టుహాలంతా తెల్లమయమైపోయింది. జూరీగా ఏర్పాటైన సభ్యులందరూ నిఖారసయిన దక్షిణాది తెల్లదొరలు; నల్ల బలిపశువుకోసం ఆకలితో ఎదురుజూసే తెల్లన్యాయమూర్తి; మర్యా దస్తుల మెప్పుకోసం ఆత్రుతగా కాచుకున్న తెల్లప్రాసిక్యూటరు; వినోదం చూడటానికి కుర్చీలు ఆక్రమించిన తెల్లప్రేక్షకులు! అది కోర్టులా కాకుండా, క్రూరమృగాలు పొంచేసిన అడవిలా కనిపించింది లూథర్‌కు. అతని తరఫున వాదించటానికి న్యూయార్క్‌నుండి వచ్చిన హ్యూబర్ట్ డెలెనీ, చికాగోనుండి వచ్చిన విలియం మిన్గ్ అనే లాయర్లు తప్ప, కోర్టు ఆవరణలోకి నల్లపురుగునైనా చొరనివ్వలేదు.

మూడురోజులపాటు విచారణ కొనసాగింది. లూథర్ లాయర్లు తమ చాకచక్య మంతా వినియోగించి, లూథర్ ఆదాయాన్ని ఇంతవరకు ఇదమిత్థంగా తేల్చలేదని ఆదాయపన్నుల అధికారితో కక్కించారు. తేలని ఆదాయాన్ని ఆధారంచేసుకుని అభియోగం ఎలా నమోదుచేశారో సమర్థించలేక ప్రాసిక్యూషన్ చతికిలబడింది. మనసులో ఎంత ద్వేషమున్నా, ఆ పరిస్థితిలో లూథర్‌ను శిక్షించటానికి కోర్టు సాహసించలేకపోయింది. మే 28 న, విధిలేని పరిస్థితిలో లూథర్‌ను నిర్దోషిగా ప్రకటించింది.

# ఎన్నికలు

ఎన్నికల సందడి ఊపందుకుంది. 1960 నవంబర్ 8 పోలింగ్ తేదీగా ఖరారైంది. రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలు అధ్యక్ష పదవికి తమతమ అభ్యర్థులను ఏరుకోవటానికి కసరతు చేస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీలో వైస్‌ప్రెసిడెంట్ నిక్సన్‌కు దీటైన పోటీదారుడు లేడు. డెమొక్రాట్లలో లిండన్ జాన్సన్, హ్యూబర్ట్ హంఫ్రీ, జాన్ కెనెడీ, లేడీ రూస్వెల్ట్‌లు పోటీపడుతున్నారు.

అమెరికన్ రాజకీయపార్టీలకు ఓటు, డాలరు అనే రెండుమాటలు తెలిసొచ్చినంత బాగా ఇతర మాటలు తెలిసిరావు. కాబట్టి, నీగ్రో హక్కులపైన బేరం చేసుకోటానికి ఇదే మంచి తరుణం. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, పౌరహక్కులకు కట్టుబడతామని ఎన్నికల వేదికనుండి వాగ్దానం చేయించాలని లూథర్ కోరిక.

జూన్ మొదటివారంలో ఎస్.సి.ఎల్.సి. కార్యవర్గం సమావేశమైంది. రాజకీయ పార్టీలతో వాగ్దానం తీసుకోటానికి ప్రతిపాదించే అంశాలను చర్చించి, ఇరుపార్టీలకూ వాటిని అందజేసింది. అవి ఏ పార్టీకీ సులభంగా మింగుడుబడేవి కావని లూథర్‌కు తెలుసు. కానీ, దీనివల్ల, ఎవరు ఎలా స్పందిస్తారో బాహాటంగా తెలిసిపోతుంది.

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి నిక్సన్ స్వభావం లూథర్‌కు ఇదివరకే తెలుసు. తెగకుండా ముడిబడకుండా దాటేయడం అతని అలవాటు. లూథర్‌ను బుజ్జగించకపోతే నీగ్రోఓటు నష్టమౌతుందనే సంకోచం అతనికి లేదు. మతపరంగా అతడు ప్రొటెస్టెంటు. దాదాపు దక్షిణాది నీగ్రోలందరూ ప్రొటెస్టెంట్లే. పార్టీ ప్రచారకమిటీని కలిసి తన కోరికలు నివేదించుకోమని రిపబ్లికన్ పార్టీ కార్యదర్శి లూథర్‌కు జవాబు వ్రాశాడు.

డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్న జాన్ కెనెడీ గత రెండునెలలుగా లూథర్‌ను కలుసుకోటానికి ప్రయత్నిస్తున్నా, ఒకరికి తీరికున్నప్పుడు మరొకరికి వీలుచిక్కక వాయిదా పడుతూవచ్చింది. చివరకు జూన్ 23 న వారి సమావేశానికి సమయం కుదిరింది. కెనెడీ న్యూయార్క్ నివాసంలో గంటకుపైగా ఆ ఇద్దరూ ముఖాముఖి మాట్లాడుకున్నారు.

కెనెడీకి నీగ్రోలతో ఇదివరకు పెద్దగా పరిచయాలు లేవు. దక్షిణాది సమస్యల మీద అతనికి అవగాహన లేదు. ఆ లోపాన్ని దాపరికం లేకుండా లూథర్ ముందు వొప్పుకున్నాడు. లూథర్ వివరించిన దక్షిణాది నీగ్రోల పరిస్థితికి సానుభూతి తెలిపాడు.

త్వరలో పౌరహక్కుల సమస్యను మనసుపెట్టి అధ్యయనం చేస్తానన్నాడు. ప్రజాస్వామ్యాన్ని తు-చ తప్పకుండా అమలుచేయటానికి కేంద్రంలో పటిష్టమైన నాయకత్వం అవసరమని కెనెడీ అంగీకరించాడు. ఐసెన్‌హోవర్ హయాంలో అది లోపించడం నిజమే నన్నాడు.

సెనేటర్‌గా జాన్ కెనెడీ, 1957 లో ప్రవేశపెట్టిన పౌరహక్కుల బిల్లును వ్యతిరేకించిన విషయం లూథర్ గుర్తుచేశాడు. ''అదంతా గతం. అప్పుడు నాకు ఈ సమస్యలు అంతగా తెలీదు. కాలం మారింది. ఈసారి అవకాశమొస్తే అలా వుండను'' అన్నాడు కెనెడీ.

కెనెడీ కంటే లూథర్‌కు నిక్సన్ సన్నిహితుడు. క్రమం తప్పకుండా ఫోన్ చేసి కుశలమడిగేవాడు. అడపాదడపా సలహాలకోసం సంప్రదించేవాడు. కానీ, ఈ ఎన్నికలు మొదలైనప్పటినుండి, లూథర్ ఎవరో తెలీదన్నంత కొత్తగా వ్యవహరిస్తున్నాడు. ఆ అనుభవంతో, దొరల చిత్తం మాన్ల నీడ నిలకడైనవికావని లూథర్ తెలుసుకున్నాడు.

జూలై నెలలో, లూథర్, రాయ్ విల్సన్ తదితర పౌరహక్కుల నాయకులు ఎన్నికల అభ్యర్థులకోసం లాస్‌ఏంజిల్స్‌లో ఒక చర్చావేదిక నిర్వహించారు. రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులెవ్వరు దానికి హాజరుకాలేదు. డెమొక్రటిక్ పార్టీ నలుగురు నామినీల్లో ఇద్దరు తమ ప్రతినిధులను పంపించారు. హ్యూబర్ట్ హంఫ్రీ, జాన్ కెనెడీలు స్వయంగా హాజరయ్యారు. ''ఈ అధ్యక్షుడూ, ఉపాధ్యక్షుల కంటే, పౌరహక్కులను నేను సమర్థవంతంగా నిర్వహిస్తాను'' అనే ప్రకటనతో హంఫ్రీ ఆ సభను హర్షధ్వానాలలో ముంచాడు. కెనెడీ ప్రసంగం ప్రారంభంలో చప్పరింతలకు గురైనా, చివరిదశలో కోలుకుని సభాసదులను అలరించింది.

కెనెడీని తమ అభ్యర్థిగా డెమొక్రటిక్ పార్టీ ధృవపరిచిన తరువాత, జార్జ్‌టౌన్‌లోని తన నివాసంలో కెనెడీ మరోసారి లూథర్‌ను కలుసుకున్నాడు. విజయావకాశాల గురించి కెనెడీ బాగా నలుగుతున్నాడు. పౌరహక్కుల పట్ల తన నిబద్ధతను నిరూపించుకోటానికి ఏదోవొక నాటకీయమైన చర్యతో లోకం నిర్ఘాంతపోయేలా చేయాలనుకుంటున్నాడు. ఎస్.సి.ఎల్.సి. బోర్డు సమావేశానికో, విందుకో తనను ఆహ్వానించటానికి వీలౌతుందేమో లూథర్‌ను విచారించాడు. ''క్షమించండి. మాది రాజకీయాలతో ప్రమేయంలేని సంస్థ. ఇలాటి సమయంలో అలా పిలిచే అవసరం కలిగితే, వస్తాడో లేదో చెప్పలేంగానీ, మీతో పాటు

నిక్సన్నుగూడా పిలవాల్సివుంటుంది'' అన్నాడు లూథర్. అంతటితో కెనెడీ ఆ ప్రస్తావన వదిలేశాడు.

ఎన్నికల కోలాహలాన్ని ఖాతరు చెయ్యకుండా విద్యార్థుల బైఠాయింపులు కొనసాగుతున్నాయి. లూథర్ చొరవతో అక్టోబర్ నెల మధ్యకాలంలో విద్యార్థుల నాన్‌వయొలెంట్ కోఆర్డినేటింగ్ కమిటీ ప్లీనరీ సమావేశాలు అట్లాంటాలో ఏర్పాటయ్యాయి. లూథర్ అహింసామార్గం విద్యార్థుల విశ్వాసాన్ని సంపాదించింది.

ప్లీనరీ సమావేశాలు ముగిసిన మూడోరోజే, అంటే అక్టోబర్ 19 వ తేదీ, ఫల్టన్ కంట్రీ పోలీసులు లూథర్‌ను అరెస్టు చేశారు. డి-కాబ్ లాగే ఫల్టన్ కంట్రీ గూడా అట్లాంటా నగర శివారుప్రాంతం. ఆ ప్రాంతంలోని 'రిచ్'సూపర్ మార్కెట్‌లో ఆహారపానీయాల కౌంటర్ దగ్గర, వడ్డనకోసం వొత్తిడి చేశారనే అభియోగంమీద లూథర్‌నూ, అతనితోపాటు 280 మంది విద్యార్థులనూ అరెస్టు చేశారు. ముద్దాయిలంతా మూకుమ్మడిగా బెయిలు నిరాకరించి జైల్లో కూర్చున్నారు. అసలే ఎన్నికల సమయం; ఈ అలజడి ఎంతకు దారితీస్తుందో అర్థంగాక, నగర మేయరు హడావుడిగా ఆ వ్యవహారంలో జోక్యం చేసుకున్నాడు. ఉద్యమకారులు రెండునెలలు ప్రశాంతంగా ఉండాలనీ, ఆలోపు నగరపాలకులు ఉద్యమకారుల కోరికలను పరిశీలించి తగిన రీతిలో పరిష్కరించాలనీ ఒడంబడిక కుదిరింది.

ఒకవైపు సంధి చర్చలు సాగుతూండగానే, మరోవైపు లూథర్‌ను తనకు అప్పగించాలని కోరుతూ డి-కాబ్ కంట్రీ కోర్టు ఫల్టన్ జైలుకు తాఖీదు పంపింది. మే నెలలో డి-కాబ్ కోర్టు విధించిన బెయిలు నిబంధనల ప్రకారం, ఏడాదిరోజులపాటు లూథర్ ఏ చట్టాన్ని ఉల్లంఘించడమైనా నేరమౌతుందట. రిచ్ మార్కెట్లో అతడు చట్టాన్ని ఉల్లంఘించాడు కాబట్టి, అతన్ని విచారించేందుకు తనకు అప్పగించాలని డి-కాబ్ కోర్టు ఆజ్ఞాపించింది. పొలిమేర మారకుండా ఆపటానికి లూథర్ లాయర్లు ఐదురోజులపాటు నానా తంటాలు పడ్డారు. ఆ ప్రయత్నాలు నెరవేరలేదు. అక్టోబర్ 25 న, చేతులకు సంకెళ్ళు తగిలించి లూథర్‌ను డి-కాబ్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆస్కార్ మిఛెల్ ఎదుట లూథర్ వకీలు డోనాల్డ్ హాలోవెల్ ఎంత సమర్థవంతంగా వాదించినా ప్రయోజనం లేకపోయింది. రీడ్స్‌విల్లీ అనే మారుమూల గ్రామీణప్రాంతంలోని ప్రవాసకారాగారంలో నాలుగు నెలలు కఠినజీవితం గడిపేలా న్యాయస్థానం లూథర్‌కు శిక్ష విధించింది.

లూథర్‌మీద మోపింది రీడ్స్‌విల్లీ జైలుకు పంపేంత అభియోగంగాదు.

ఇది కేవలం ద్వేషంతో చెప్పిన తీర్పని అడ్వొకేట్ హాలోవెల్‌కు తెలుసు. ఇది న్యాయశాస్త్ర ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించిన తీర్పు. అందువల్ల, శిక్ష అమలుకాకుండా స్టే ఉత్తరువులు పొందడం గగనంగాదు. కాకపోతే వొకటిరెండు రోజుల అదనపు శ్రమ. కోర్టునుండి అతడు హుటాహుటి తన ఆఫీసు చేరుకుని, స్టే కోసం పిటిషన్లు తయారు చేసుకున్నాడు.

మరుసటిరోజు ఉదయం 8 గంటలకు లూథర్‌ను కలుద్దామని హాలోవెల్ డి-కాబ్ జైలుకు వెళ్ళాడు. లూథర్ ఇప్పుడు ఆ జైల్లో లేడని అతనికి తెలీదు. గతరాత్రే లూథర్‌ను పోలీసు వ్యానులో రీడ్స్‌విల్లీ తరలించారని తెలీగానే హాలోవెల్‌కు ముచ్చెమటలు పోశాయి. ఆ ప్రవాసకారాగారంలో లూథర్ అనుభవించే ఘోరమైన జీవితం గురించికాదు హాలోవెల్ ఆందోళన; నిర్మానుష్యమైన గతుకుల రోడ్లవెంట మూడువందల మైళ్ళు ప్రయాణించే వాహనాన్ని దారికాచి అటకాయించడం గిట్టనివాళ్ళకు తేలికైన పని.

ఒక్క ఊపులో హాలోవెల్ తన ఆఫీసుగది చేరుకున్నాడు. లూథర్ కుటుంబానికీ, ఎస్.సి.ఎల్.సి. కార్యాలయానికీ, పత్రికలూ తదితర మాధ్యమానికీ ఫోన్ ద్వారా గబగబా సమాచారాన్ని చేరేశాడు. ఒకవేళ కిందికోర్టు స్టేకి నిరాకరిస్తే, మరుక్షణమే సుప్రీంకోర్టును కదిలించటానికి వాషింగ్టన్ లోని వకీలు మిత్రులను సిద్ధంచేశాడు.

లూథర్ జ్ఞాపకాల్లో అది నరకయాతనకు సమానమైన ప్రయాణం. ‘‘తెల్లవారు ఝామున మూడుగంటలకు నన్ను కొట్టునుండి బయటికి లాక్కొచ్చారు. కరుడుగట్టిన నేరగాళ్ళకు తొడిగినట్టు, చేతులనుండి కాళ్ళదాకా సంకెళ్ళు బిగించారు. వ్యాన్‌లో ఎక్కించి, దాని సీట్ల నడుమనుండే కొక్కికి గొలుసులతో కట్టేశారు. దారి పొడవునా మాట్లాడే దిక్కే లేరు. జవాన్లు వాళ్ళల్లోవాళ్ళు మాట్లాడుకుంటున్నారేగానీ, నన్ను పలకరించిన పాపాన పోలేదు. దప్పిక తీర్చుకోటానికి మంచినీళ్ళైనా ఇవ్వలేదు. ఎక్కడికి పోతున్నామో, ఎంతసేపు ప్రయాణమో తెలీకుండా, ఆకలి దప్పులతో అల్లాడే వెత చావుకంటే భయంకరంగా ఉంటుంది.’’ అంటూ ఆ తరువాత లూథర్ విశదీకరించాడు.

లూథర్‌ను ప్రవాసజైలుకు తరలించిన వార్త కారుచిచ్చులా ప్రపంచానికి ప్రాకింది. శిక్ష విధించిన న్యాయమూర్తిని ప్రపంచమంతా చీదరించింది. సానుభూతీ మద్దతులు ప్రకటించే సందేశాలు దాదాపు ప్రతిదేశంనుండి ఎస్.సి.ఎల్.సి.

కార్యాలయాన్ని ముంచెత్తాయి. జోక్యాన్ని కోరుతూ వైట్‌హౌస్‌కు అందుతున్న తంతిసందేశాలకు ఫెడరల్ ప్రభుత్వం ఖంగుతినింది. పౌరహక్కుల వేదికలన్నీ ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశాయి. న్యాయవ్యవస్థ పునాదులు కూలుస్తున్న ఈ సంఘటనమీద వెంటనే దర్యాప్తు జరిపించాలని ఉత్తరాది గవర్నర్లూ, సెనెటర్లూ, ఇతర ప్రజాప్రతినిధులూ కేంద్రాన్ని ఒత్తిడి చేశారు. విధిలేని పరిస్థితుల్లో, తన స్వభావానికి విరుద్ధంగా, ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ ఒక బహిరంగ ప్రకటనకు సిద్ధమయ్యాడు.

> ''జాతివివక్ష సంకెళ్ళనుండి విడిపించి సమానహక్కులు సాధించటానికి శాంతియుతంగా పాటుబడుతున్న వ్యక్తిని, సంబంధంలేని, స్వల్పాతి స్వల్పమైన ఆరోపణ మీద జైలుకు పంపడం అన్యాయంగా నేను భావిస్తున్నాను. మార్టిన్ లూథర్ కింగును విడుదల చేయించటానికి ఏఏ చర్యలు అవసరమో వాటన్నిటిని తక్షణం తీసుకోమని అటార్నీ జనరల్‌ను ఇప్పుడే ఆదేశించాను.''

కానీ ఆ ప్రకటన వెలుగు చూడలేదు. దానివల్ల తన ఎన్నికకు హానిజరగడం తప్ప మేలుండదని నిక్సన్ అడ్డుకున్నాడు. దాంతో, అధ్యక్షభవనం నిశ్శబ్దమయింది.

జాన్ కెనెడీ ఆలోచన మరోకోణంలో పనిజేసింది. అతని రాజకీయ సలహాదారులు గూడా అందుకు సరే నన్నారు. వెంటనే అతడు కొరెట్టాకు ఫోన్‌జేసి సానుభూతి తెలిపాడు. లూథర్‌ను విడిపించటానికి తన పలుకుబడిని వినియోగిస్తానని ధైర్యం పలికాడు. అతని తమ్ముడు రాబర్ట్ కెనెడీ ఆ వెంటనే డి-కాబ్ న్యాయమూర్తికి ఫోన్‌జేసి, లూథర్ కింగుకు బెయిలు మంజూరు చేయటంలో అభ్యంతరమేమని విచారించాడు. అంతే; ఆ మరుసటిరోజు, అంటే అక్టోబర్ 27న, లూథర్ విడుదల కోసం హాలోవెల్ దాఖలుచేసిన పిటిషన్ను డి-కాబ్ న్యాయమూర్తి ఆమోదించాడు. విడుదల ఆదేశాలనూ, సమాఖ్య మిత్రులనూ వెంటదీసుకుని, లూథర్‌ను తీసుకొచ్చేందుకు నాలుగు విమానాల్లో రీడ్స్‌విల్లీ పరిగెత్తాడు హాలోవెల్. 'లూథర్ చిరకాలం జీవించాలి' అనే నినాదాల మధ్య జైలునుండి లూథర్ బయటికొచ్చాడు.

''ఇటువంటి సమయంలో నా కోడలికి ఫోన్‌జేసి ధైర్యం చెప్పడం సాహసంతో కూడిన పని. న్యాయమని తోచినదానికి వెనుకాడని సాహసి కెనెడీ'' అంటూ, లూథర్ తండ్రి సీనియర్ కింగ్ తన ప్రార్థనా సమావేశాల్లో ఘంటాపథంగా చాటించాడు.

జాన్ కెనెడీ సలహాదారుల్లో వొకడైన హ్యారీస్ ఊఫర్డ్, 'నిక్సన్ పోటీచేస్తున్నది మంచి హృదయంగల కెనెడీతో' అనే కరపత్రాలను కోట్లసంఖ్యలో ముద్రించి ఓటర్లకు పంచిపెట్టాడు. లూథర్ మాత్రం కెనెడీ పాత్రకు చంకలు గుద్దుకోలేదు. ధన్యవాదాలు తెలుపుతూ సాదాసీదాగా ఉత్తరం వ్రాశాడు. 'రాజకీయ చాతుర్యానికీ నిజమైన నైతికబాధ్యతకూ చాలా వ్యత్యాసముంది' అనే భావం అతని ప్రవర్తనలో ప్రతిబింబించింది. కానీ, అతని ప్రమేయం లేకుండానే అతని విడుదల కెనెడీ విజయంలో కీలకపాత్ర పోషించింది.

# స్వేచ్ఛా ప్రయాణం

కొత్తప్రభుత్వం గద్దె నెక్కింది. చిగురించిన ఆశలతో సగటు మనిషి ఎదురు చూశాడు. కొత్త అధ్యక్షుని సంతకానికి నోచుకునే మొదటి ఫైలుకోసం ప్రపంచమంతా ఆసక్తితో కాచుకుని కూర్చుంది. జాతిదురహంకారంతో కరుడుగట్టిన ముగ్గురు తెల్లవాళ్ళను దక్షిణాది ఫెడరల్ కోర్టుకు న్యాయమూర్తులుగా నియమిస్తూ కెనెడీ సంతకంతో బయటికొచ్చిన మొదటిఫైలు మానవతావాదులందరినీ దిగ్భ్రాంతిలో ముంచింది.

దొమ్మ ధైర్యంతో నిర్ణయాలు తీసుకోగల చేవ కెనెడీ ప్రభుత్వానికి లేదని లూథర్‌కు తెలుసు. స్వల్పాతిస్వల్పమైన ఆధిక్యతతో దక్కిన విజయం కెనెడీది. దురుసుగా దూసుకెళ్ళి దక్షిణాది తెల్లజాతికి దూరమైతే అడుగడుగునా అతని ప్రభుత్వానికి అడ్డంకులు తప్పవు. దానికి తోడు, ఐసెన్‌హోవర్ మొదలెట్టిన వియత్నాం యుద్ధం అతనికి వారసత్వంగా సంక్రమించింది. కెనెడీ ప్రమాణస్వీకారం చేసే నాటికే వియత్నాంయుద్ధంలో అమెరికా పీకలదాకా కూరుకుపోయి, అంతర్జాతీయంగా అమెరికా ప్రతిష్టకు అదొక సవాలుగా అడ్డొచ్చింది.

''అమెరిగా పౌరులైన నల్లజాతీయులు ఎదుర్కొనే సమస్యలకు సరికొత్త మార్గంలో పరిష్కారం చూపించే అవకాశం ఒక నూరేళ్ళ తరువాత ఈ కొత్తప్రభుత్వానికి లభించింది. ఆ కార్యక్రమాన్ని అంకితభావంతో మొదలెట్టే బాధ్యత ఈ ప్రభుత్వం మీదుంది. రెండున్నర కోట్ల అమెరికన్ జనాభా అభివృద్ధికి ఎవరోకొందరు మానవత్వంలేని మనుషులు కలిగించే అవరోధాలు నిరవధికంగా సహించటానికి వీలయ్యేవికావు'' అంటూ కెనెడీ ప్రభుత్వాన్ని పత్రికలద్వారా లూథర్ హెచ్చరించాడు.

ఇల్లు చక్కదిద్దుకోకుండా ఇతరదేశాల్లో పెత్తనంకోసం ప్రాకులాడే అమెరికా విధానాన్ని అక్కడి పౌరహక్కుల సంఘాలు ఆదినుండి వ్యతిరేకిస్తూనేవున్నాయి. దక్షిణాది సమస్యలను వాయిదా వెయ్యటానికి వియత్నాం గురించి ఏకరువు పెడితే వినిపించుకునే ధోరణిలో లేవు ఆ ప్రజాసంఘాలు. ఇక నీగ్రో ఉద్యమమందామా - బోలెడంతమంది నాయకులూ, సవాలక్ష సిద్ధాంతాలతో పలురకాల ఉద్రేకాలకు ఆలవాలంగా ఉంది. వాటిల్లో, ఉదాసీనంగా ప్రవర్తిస్తున్న ప్రభుత్వంపట్ల నిగ్రహం కోల్పోయిన మొదటి సంస్థ 'కాంగ్రెస్ ఆఫ్ రేసియల్ ఈక్వాలిటీ (CORE).' దీన్ని 'కోర్' అని గూడా పిలుస్తారు.

లూథర్ కింగ్ స్థాపించిన ఎస్.సి.ఎల్.సి. కంటే కోర్ సంస్థ బహు పురాతన మైంది. థోరో రచనలతోనూ, మహాత్మాగాంధీ అహింసా పోరాటంతోనూ ప్రభావితమైన విద్యార్థులతో 1942లోనే ఏర్పడిన సంస్థ ఇది. చికాగో పట్టణం దీనికి కేంద్రం. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మాగాంధీ అంచెలంచెలుగా అన్వయించిన ఎత్తుగడల ప్రాముఖ్యతను వివరించే 'హింసలేని సంగ్రామం' అనే కిషన్‌లాల్ శ్రీధరణి రచన ఈ సంస్థకు చోదకశక్తి. దీని సంస్థాపక సభ్యుల్లో బేయర్డ్ రస్టిన్ ప్రప్రథముడు.

1947 ఏప్రిల్లో, అంటే భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించటానికి నాలుగు నెలల ముందు, గాంధీ విధానాలు అమెరికా సమాజంలో ఎలా పనిచేస్తాయో చూడటానికి కోర్ సంస్థ ఒక తేలికపాటి కార్యక్రమాన్ని చేపట్టింది. వినటానికైతే తేలికపాటి ప్రయోగమేగానీ, వాస్తవంలో అది దక్షిణాది రాష్ట్రాల సాంప్రదాయానికి తూట్లుబొడిచే కార్యక్రమం. బస్సుల్లో ముందు సీట్లు తెల్లవాళ్ళకు వదిలేసి, వెనక సీట్లలో మాత్రమే నీగ్రోలు కూర్చోవాలనేది దక్షిణాది రాష్ట్రాల నియమం. సంస్థ సభ్యులైన తెల్లవాళ్ళను వెనక సీట్లలోనూ, నల్లవారిని ముందు సీట్లలోనూ కూర్చునేలా ఏర్పాటుజేసి, ఆ బస్సులతో దక్షిణాది రాష్ట్రాలు పర్యటించాలని కోర్ కమిటీ నిర్ణయించింది. ఆ ప్రయాణానికి 'జర్నీ ఆఫ్ రికంసీలియేషన్' అని నామకరణం చేసింది. ఆ ప్రయాణంలో దారి పొడవునా వాళ్ళుకు ఎదురైనవి అవమానాలూ ఇబ్బందులే. ప్రతి మజిలీలో ఆ ప్రయాణికులు అరెస్టులకూ శిక్షలకూ గురయ్యారు. ఈ విఘాతాల్లో, ఉత్తర కరోలినా కోర్టు వాళ్ళకు విధించిన శిక్ష ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోతగ్గది. హెన్రీ వైట్‌ఫీల్డ్ అనే న్యాయమూర్తి, ఆ ప్రయాణికుల్లోని నల్లజాతీయులకు నెలరోజుల జైలుశిక్ష విధిస్తూ, తెల్లజాతీయులకు మరో రెండునెలలు అదనంగా వడ్డించాడు. ''నల్లవారి కంటే, నల్లవారితో చేతులు కలిపి దక్షిణాది సాంప్రదాయాలను తల్లకిందులు చెయ్యాలని ప్రయత్నించిన తెల్లవారి నేరమే పెద్దది'' అంటూ ఆ న్యాయమూర్తి వ్యాఖ్యానించాడు. ఎదురైన కష్టాలనూ నష్టాలనూ సహనంతో స్వీకరించిన కోర్ సభ్యుల ప్రయాస వృధాగా పోలేదు. వాళ్ళ ప్రయాణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

కెనెడీ ప్రభుత్వం పస తేల్చటానికి ఇప్పుడుగూడా అదే తరహా కార్యక్రమాన్ని చేపట్టాలని కోర్ సంస్థ నిర్ణయించింది. 'స్వేచ్ఛా ప్రయాణం' పేరుతో, ఇదివరకటిలాగే నలుపూ తెలుపూ జాతీయులు సాంప్రదాయానికి విరుద్ధంగా కూర్చున్న బస్సులతో దక్షిణాది రాష్ట్రాల ప్రధాన రహదాల వెంట పయనించడం వారి సంకల్పం. వెంటనే

విద్యార్థుల కో ఆర్డినేషన్ కమిటీతో సంప్రదించి పథకాన్ని విశదీకరించారు. ముందు కొచ్చిన ఉద్యమకారులకు తమ 1947 అనుభవాలను పాఠాలుగా బోధించారు. తలపోసిన కార్యక్రమానికి మార్టిన్ లూథర్ కింగ్ ఆశీస్సులు సంపాదించారు. లూథర్ తన మద్దతును ప్రకటించడమే గాక, కార్యక్రమానికయ్యే ఖర్చును భరించేలా ఎస్.సి.ఎల్.సి. కార్యవర్గాన్ని ఒప్పించాడు. కోర్ కమిటీ, స్టూడెంట్స్ నాన్‌వయెలెంట్ కోఆర్డినేషన్ కమిటీ (SNCC), ఎస్.సి.ఎల్.సి. తదితర భావసామ్యం కలిగిన సంస్థలతో 'స్వేచ్ఛా ప్రయాణా'ల సమన్వయ కమిటీ ఏర్పాటయింది. మార్టిన్ లూథర్ కింగ్‌ను ఆ కమిటీకి అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఆ హోదాలో లూథర్ కింగ్ పనిచేయటానికి ఎస్.సి.ఎల్.సి. అంగీరించిందిగానీ, ఆ యాత్రల్లో లూథర్ భౌతికంగా పాల్గోటానికి అభ్యంతరం తెలిపింది. చివరకు, లూథర్‌ను మినహాయిస్తూ యాత్రను ప్రారంభించటానికి రంగం సిద్ధమైంది.

ఆరుగురు తెల్లవారూ, ఏడుగురు నీగ్రోలను వెంటదీసుకుని కోర్ సంస్థ డైరెక్టర్ జాన్ ఫార్మర్, 1961 మే 4వ తేదీన, వాషింగ్టన్ డి.సి. నుండి, రెండు బస్సులతో 'స్వేచ్ఛా ప్రయాణా'నికి బయలుదేరాడు. ఈ ప్రయాణాల మూలంగా కొంత ఉద్రిక్తత చెలరేగుతుందని కెనెడీ ప్రభుత్వానికి తెలుసు. ఆ బస్సులను అనుసరించి వెళ్ళేందుకు ఫెడరల్ ప్రభుత్వం తరఫున ఒక ప్రతినిధిని పంపించడం ద్వారా అల్లరిమూకల ఆగడాలను అదుపులో ఉంచగలమని ప్రభుత్వం ఆలోచించింది. ఆ విధిని జాన్ షీత్లర్ అనే ప్రతినిధికి అప్పగిస్తూ అటార్నీ జనరల్ రాబర్ట్ కెనెడీ ఆదేశాలు జారీచేశాడు. దక్షిణ కరోలినాలోని రాక్‌హిల్స్ వద్ద ప్రయాణికులకు మొట్టమొదటి ఆటంకం ఎదురైంది. ఇరవైమంది తెల్లజాతీయులు గుంపుగా చేరి, ప్రయాణికుల మీద దాడి మొదలెట్టారు. పోలీసులు అక్కడికి చేరుకునేలోపే ఇద్దరు ప్రయాణికులను గాయపరిచారు. బెంబేలు పడకుండా స్వేచ్ఛా ప్రయాణం ముందుకు సాగింది.

చిన్నచిన్న అవరోధాలు మినహా, పదిరోజుల వరకు ప్రయాణాలకు అంత రాయం కలుగలేదు. జార్జియా రాజధాని అట్లాంటా చేరిన స్వేచ్ఛాప్రయాణికులు, మే 14వ తేదీన రెండు విడివిడి దళాలుగా అక్కడినుండి బయలుదేరి, అలబామా రాష్ట్రంలోని బర్మింగ్‌హాం, మాంట్గోమెరీల మీదుగా మిసిసిపిరాష్ట్రం చేరుకోవాలను కున్నారు. బర్మింగ్‌హాం చేరడానికి అలబామాలో ప్రవేశించిన తొలిదళానికి రహదారిలో అనిస్టోన్ పట్టణం దగ్గర తీవ్రమైన ప్రతీఘాతం ఎదురయింది. దారికాచి ఎదురు చూస్తున్న రెండువందలమంది తెల్లజాతీయులు బస్సును చుట్టుముట్టి టైర్లు పగల

గొట్టారు. వాళ్ళ బారినుండి ఎలాగో బయటబడి ముందుకు సాగిన బస్సు, కొంత దూరం వెళ్ళిన తరువాత, టైర్లు మార్చుకోటానికి ఆగవలసి వచ్చింది. ఆలోపు కార్లతో వెంబడించిన ప్రత్యర్థులు బస్సును సమీపించి, పెట్రోలు బాంబులతో దాడి మొదలెట్టారు. ప్రయాణికులైతే చిన్నచిన్న గాయాలతో ప్రమాదాన్ని తప్పించుకున్నా, బస్సు మాత్రం నామరూపాలు లేకుండా తగులబడిపోయింది. తీరుబడిగా నేరస్థలానికి చేరిన పోలీసులు, ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

మరో గంట తరువాత ప్రయాణికుల రెండోదళం అదే మార్గంలో అనిస్టోన్ చేరుకుని, చెదిరిపోకుండా ఎదురుజూస్తున్న తెల్లమూకకు చిక్కింది. తెల్లోళ్ళు దౌర్జన్యంగా బస్సులో దూరి, స్వేచ్ఛా ప్రయాణికులను ముందుసీట్లనుండి లాగేసి వెనుక సీట్లలో కుక్కేశారు. ముందు సీట్లు వాళ్ళే ఆక్రమించి బస్సును కదిలించమని డ్రైవరును ఆదేశించారు. బస్సు బర్మింగ్‌హాం వైపు పరిగెత్తింది. ఆ బస్సుకోసం బర్మింగ్‌హాం శివార్లలో కుక్లక్స్‌క్లాన్ సభ్యులు ఎప్పుడెప్పుడాఅంటూ ఎదురుజూస్తున్నారు. బస్సు అక్కడికి చేరీచేరంగానే, స్వేచ్ఛాప్రయాణికులను బయటికి లాగి, రాళ్ళూ ఇనుప చువ్వలూ మొదలు రకరకాల మోటు పరికరాలతో చావబాదటం మొదలెట్టారు. అడ్డుకోటానికి పరిగెత్తుకుంటూ ముందుకొచ్చిన ఫెడరల్ ప్రభుత్వ ప్రతినిధి షీత్లర్‌ను మండుటెండలో తారురోడ్డుమీద కాళ్ళూచేతులూ పంగచాపి వెల్లకిల పడుకోబెట్టారు. ఈ కిరాతకం జరుగుతున్న ప్రదేశానికీ, ఆ ప్రాంతాన్ని పరిరక్షించే పోలీసు స్థావరానికీ ఓ రెండు భవంతులే అడ్డం. ఐనా, అరగంటసేపు మాడిన తరువాతగానీ ఫెడరల్ ప్రభుత్వ ప్రతినిధికి పోలీసుసాయం అందలేదు. ప్రాణాలు దక్కించుకుని పారిపోయిన స్వేచ్ఛాప్రయాణికులు విమానాశ్రయం చేరుకుని, సిద్ధంగావున్న విమానంలో న్యూఓర్లాన్స్ చేరుకున్నారు.

రహదారి వెంట తమ మానాన తాము ప్రయాణిస్తున్న బాటసారులను ఉద్దేశపూర్వకంగా అడ్డగించి, నిష్కారణంగా హింసించిన తెల్లజాతిదురహంకారుల దుశ్చర్యలకు దేశమంతా గగ్గోలు చెలరేగింది. అమెరికా ప్రభుత్వాన్ని ప్రపంచం పరిహసించింది. చిట్కా వైద్యంతో పుట్టకురుపు నయమౌతుందని తప్పుడు అంచనాకు దిగిన కెనెడీప్రభుత్వం నాలుక కొరుక్కుంది.

చెలరేగిన దుండగులూ, చేతగాని ప్రభుత్వం మధ్య స్వేచ్ఛాప్రయాణాలు కొనసాగించడం క్షేమమా కాదా అనే మీమాంసలో పడింది కోర్ కమిటీ. దౌర్జన్యానికి జడిసి యాత్రలు విరమిస్తే, అది ప్రజలకు తప్పుడు సంకేతాలను అందిస్తుందని కోర్ సభ్యుల్లో కొందరు మొండిగా నిలబడ్డారు. యాత్ర కొనసాగించాలనే పట్టుదలతో

అప్పటికే ఒక విద్యార్థిబృందం నాష్‌విల్లీ నుండి బర్మింగ్‌హాం చేరిపోయింది. భద్రతా కారణాల సొద్దుతో పోలీసులు ఆ బృందాన్ని అరెస్టుచేసి, అర్థరాత్రివేళ టెన్నిసీకి తరలించి రహదారి మీద వదిలేశారు. పట్టు సడలించకుండా ఆ విద్యార్థి బృందం పోలీసుల కళ్ళుగప్పి తిరిగి బర్మింగ్‌హాం చేరుకుంది.

వెనకడుగు వేస్తే, యువకుల్లో ఉరకలెత్తే పోరాటపటిమను నీరుగార్చిన నేరగాళ్ళుగా చరిత్రలో మిగిలిపోతామని కోర్‌కమిటీ భయపడింది. తక్షణం రంగంలో దిగి, బర్మింగ్‌హాం చేరిన విద్యార్థిబృందం మే 20వ తేదీన మాంట్గోమెరీ బయలు దేరటానికి మరో బస్సును ఏర్పాటుచేసింది. రక్షణ ఏర్పాట్ల విషయంగా ఈసారి ఫెడరల్ ప్రభుత్వంగూడా జాగ్రత్తలు పెంచింది. దారి పొడవునా బందోబస్తు ఏర్పాటు చెయ్యమని రాష్ట్రపోలీసుశాఖను అటార్నీ జనరల్ రాబర్ట్ కెనెడీ ఆదేశించాడు. ప్రతి పదిహేను మైళ్ళకూ ఒక పోలీసు వాహనం చొప్పున భారీ బందోబస్తు ఏర్పాటయింది. కానీ, ప్రయాణికులు సరిగ్గా మాంట్గోమెరీ ప్రవేశించే సమయంలో బస్సును వదిలేసి పోలీసులు తప్పుకున్నారు. అదే ప్రదేశంలో, దాదాపు మూడువందల బలగంతో, కర్రలూ ఇనుపచువ్వలూ బేస్‌బాల్ బ్యాట్లూ తదితర మోటు ఆయుధాలతో దారికాచి కుక్లక్స్‌క్లాన్ సిద్ధంగా ఎదురునిలిచింది. విచక్షణా రహితమైన దాడిలో చేయి విసరని దుండగీడు లేడు, గాయపడని ప్రయాణికుడు లేడు. ఒక నీగ్రోయాత్రికుని మీద కిరసనాయిల్ గుమ్మరించి నిప్పంటించిన విపత్తులో సమయానికి పోలీసులు రంగంమీదికొచ్చి ప్రాణాపాయం జరక్కుండా ఆదుకున్నారు.

ఫెడరల్ ప్రభుత్వం జారీచేసే ఆదేశాలకు దక్షిణాది రాష్ట్రాలిచ్చే విలువ ఏ మోతాదులో ఉంటుందో కెనెడీ ప్రభుత్వానికి ఇప్పుడు ప్రత్యక్షంగా అర్థమైంది. విషయం తెలిసిన వెంటనే ఏడువందలమంది సాయుధులతో కూడిన ఫెడరల్ రిజర్వు బలగాన్ని మాంట్గోమెరీకు తరలించాడు రాబర్ట్ కెనెడీ. ఆగమేగాలమీద మార్టిన్ లూథర్ కింగ్ గూడా మాంట్గోమెరీ చేరుకున్నాడు. జాతిదురహంకారుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ పురవీధుల్లో ఊరేగింపుకు పిలుపిచ్చాడు. లూథర్ నాయకత్వాన ఊరేగింపుగా నడిచిన నీగ్రోలు, సాయంకాలానికి ఫస్ట్ బాప్టిస్ట్ చర్చిలో బహిరంగ సభకు సమావేశమయ్యారు. ''మరో మనిషి నన్ను అభిమానించేలా చేయడం చట్టానికి సాధ్యం కాకపోవచ్చు; కానీ, మరోమనిషి నన్ను హింసించకుండా నిరోధించే శక్తి చట్టానికి తప్పకుండా ఉంటుంది.'' అంటూ, ఫెడరల్ ప్రభుత్వం పౌరహక్కుల చట్టాన్ని ప్రవేశపెట్టవలసిన తక్షణావశ్యకతను గురించి ఆవేశపూరితంగా లూథర్ ప్రసంగించాడు.

చీకటి ముసిరింది. ఆ సమావేశం ముగిసే సమయంగూడా సమీపించింది. అంతలోనే తెల్లమూకలు చర్చి భవనాన్ని నలువైపులనుండి మొహరించాయి. మూకను చెదరగొట్టడానికి ఫెడరల్ బలగాలు హోరాహోరీగా తలపడ్డాయి. ఐనా దుండగులు విసిరే పెట్రోలు బాంబులకు చర్చి కిటికీలు దద్దరిల్లుతున్నాయి. సమావేశమందిరంలో కిక్కిరిసిన సభ్యులు కంగారు పడకుండా ప్రార్థనకు ప్రోత్స హించాడు లూథర్ కింగ్. ఉక్కిరిబిక్కిరిగా కమ్ముకుంటున్న పొగలకు చెక్కుచెదర కుండా లూథర్ అనుయాయులు ప్రార్థనలో నిమగ్నమయ్యారు. నడిరేయి దాటేదాకా పోరాటం భీకరంగా కొనసాగింది. ఆ తరువాత దుండగులు విడతలు విడతలుగా తప్పుకున్నారు. వాతావరణం నెమ్మదించిన తరువాత చర్చిలో కూరుకుపోయిన బంధీలను సురక్షితంగా ఇళ్ళకు చేర్పించారు పోలీసులు. లూథర్‌ను అట్లాంటాకు తీసుకొచ్చారు. తెల్లవారేలోపే మరిన్ని ఫెడరల్ బలగాలు హెలికాప్టర్లతో మాంట్గోమెరీ చేరిపోయాయి.

మరోవైపు స్వేచ్ఛాబృందం సభ్యులు, చిరిగిన దుస్తులతో, విరిగిన ఎముకలతో, చిట్లిన చర్మంతో, కుదుములు గట్టిన వీపులతో, చూపరులకు కంటతడి పెట్టించే దీనావస్థలో ఉండిగూడా, తమ ప్రయత్నాన్ని విరమించటానికి ఇష్టపడలేదు. చితికిపోయింది వాళ్ళ శరీరమేగానీ గుండె నిబ్బరం కాదు. తమ ప్రణాళికకు అణుమాత్రం విఘాతం జరక్కుండా, అనుకున్న ప్రకారం మిసిసిపి రాజధాని జేక్సన్ చేరటానికి వాళ్ళు సన్నాహాలు మొదలెట్టారు. వారి బస్సువెంట హెలికాప్టర్లలో ఎగురుతూ రక్షణ కల్పించటానికి ఫెడరల్ బలగాలుగూడా సమాయత్తమయ్యాయి. జాతిదురహంకారుల క్రౌర్యానికి మిసిసిపి రాష్ట్రం ఇతర ఏ దక్షిణాది రాష్ట్రానికీ తీసిపోయేదిగాదు. రక్షణ ఏర్పాట్లను ఖాతరు చెయ్యకుండా దుండగులు అనేకచోట్ల దాడులకు ప్రయత్నించారు. అన్నిటినీ సహిస్తూ, మే 25వ తేదీన స్వేచ్ఛాప్రయాణం మిసిసిపి రాజధానికి చేరిపోయింది. చేరిన వెంటనే నగరపోలీసులు ప్రయాణికులను అరెస్టుచేసి జైలుకు తరలించారు.

దౌర్జన్యకారుల పైశాచికానికి ప్రతిఘటన లేకుండా తమ శరీరాలను స్వచ్ఛం దంగా సమర్పిస్తూ, అడుగు వెనక్కు వెయ్యకుండా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న ఉద్యమకారుల సాహసం అమెరికన్ సమాజానికి గగుర్పాటు కలిగించింది. స్వేచ్ఛా ప్రయాణికుల ఆదర్శాన్ని దేశం ప్రశంసించింది. రూబీ డోరిస్ అనే ఒక మహిళా విద్యార్థి 'స్టూడెంట్ వీక్లీ'కి వ్యాసం రాస్తూ - ''దేశంలో నైతిక విలువలు కలిగిన చైతన్యాన్ని ప్రేరేపించడమే అహింసావిధానం లక్ష్యమని మార్టిన్ లూథర్ కింగ్

ప్రవచించిన గమ్యాన్ని స్వేచ్ఛాప్రయాణికులు చేరుకున్నారు. పరిశుభ్రమైన దుస్తుల్లో, పదిమందికీ సమ్మతమైన ప్రవర్తనతో కొట్టు దగ్గరి కొచ్చిన నీగ్రోయువకుడు ఒక రొట్టెముక్క కొనడానికి అర్హుడు కాకపోవడం ఎంత సిగ్గుచేటైన వాతావరణమో బైఠాయింపు కార్యక్రమం ద్వారా దక్షిణాదికి తెలియజెప్పిన పంథాలోనే, రవాణా సౌకర్యాల్లో విచక్షణ పాటించడం అంతే సిగ్గుచేటని ఈ యాత్రలద్వారా తెలియ జెప్పినట్టైంది.'' అంటూ, స్వేచ్ఛాప్రయాణాలకూ లూథర్ విధానాలకూ మధ్యనున్న సైద్ధాంతిక సంబంధాన్ని ఉద్ఘాటించింది.

ఆత్మీయతలూ అసూయలూ కలబోసుకుని రూపొందిన మానవసమాజంలో ఉద్యమనాయకులకు దక్కేవి అభినందనలు మాత్రమే కాదు; ఆక్షేపణలు గూడా అదే మోతాదులో ఎదురౌతాయి. స్వేచ్ఛాప్రయాణాల ప్రణాళికను ప్రకటించినప్పుడు, వాటివల్ల ప్రయోజనమే ఉండదని విమర్శించిన పెద్దమనుషులు ఇప్పుడు గొంతు మార్చి, లూథర్‌ను ఉద్దేశించి, - ''మానవతా విలువలు పరిరక్షించే ప్రయోజనానికి, నీగ్రో జాతీయుల ప్రయోజనం పరిరక్షించే ప్రయోజనానికి, మన స్వేచ్ఛా ప్రయాణికులకు తోడుగా ఆ యాత్రలో నువ్వు స్వయంగా పాల్గొనవలసిన అవసరం ఎంతైనా ఉండింది. తనకు తాను సాహసించలేని త్యాగాలకు తన అనుయాయులను ప్రోత్సహించే నాయకుడెవడూ నిజాయితీపరు డనిపించుకోడు. నువ్వొక నకిలీ నాయకునివి. అనుచరులతో కలిసి కష్టాలు పంచుకోటానికి మహాత్మాగాంధీ ఏనాడు వెనకాడలేదు. ఈ అహింసా పోరాటానికి నువ్వు నిజమైన నాయకుని వనుకుంటే, ముందు వరుసలో నిలిచి స్వయంగా పోరాటాన్ని నడిపించు.'' అంటూ నిరసించారు.

''వ్యక్తిగత కారణాలు ఎన్నున్నా, ఈ యాత్రల్లో లూథర్ కింగ్ పాల్గొంటేనే బాగుండేదేమో'' ననుకునే సందేహవాదులూ కొందరున్నారు. ఐతే, ఇలాటి మనుషులు మరిచిపోయిన సంగతి మరొకటుంది. యాత్రల కార్యక్రమం నిర్వహించాలని కోర్‌కమిటీ సంకల్పించిన తొలిరోజుల్లో, అవి సంతరించుకోబోయే ప్రాముఖ్యత గురించి ఏవొక్కరికి ఖచ్చితమైన అంచనా దొరకలేదు. అనిస్టోల్ వద్ద జరిగిన ఘాతుకంతో ఆ ప్రయాణానికి అనూహ్యమైన ప్రచారంతోబాటు, అశేష ప్రజానీకం నుండి స్పందనగూడా లభించింది. ఆ దశలో ఏ నాయకుడు పాల్గొన్నా, ప్రచారం కోసం ప్రాకులాడుతున్నాడనే విమర్శ తప్పదు. ఊరుకుంటే జడుసుకున్నాడనే ఎగతాళీ తప్పదు. అనేక సందర్భాల్లో మనస్సాక్షి మీద ఆధారపడటం మినహా నాయకునికి గత్యంతరం కనిపించదు.

తలకో దారిగా నడుస్తున్న నీగ్రో నాయకుల నిందలకూ, ప్రశంసలకూ అతీతంగా, స్వేచ్ఛా ప్రయాణాల్లో పాల్గొనే ఔత్సాహికుల సంఖ్య గణనీయంగా పెరగడం మొదలెట్టింది. ఒకవైపు స్వేచ్ఛాప్రయాణాల్లో కట్టలు తెంచుకుంటున్న పట్టుదలా, మరోవైపు జాతివిద్వేషులు ప్రదర్శిస్తున్న మొండివైఖరులతో కెనెడీ ప్రభుత్వం గాబరాపడింది. ఉద్రేకాలు సడలించే ప్రయత్నాలతో రాబర్ట్ కెనెడీ రంగంలో దిగిపోయాడు. బస్సు ప్రయాణాల్లో జాతివివక్షను తొలగించే నిబంధనలు వెంటనే రూపొందించమని అతడు ఇంటర్‌స్టేట్ కామర్స్ కమిటీకి అప్పగించడమే కాకుండా, 'ఉడుకు చల్లారేందుకు అవసరమైన విరామం' ప్రకటించమని ఉద్యమ కారులను అభ్యర్థించాడు.

ప్రచారం, సమీకరణ, ఉద్యమం, ఆ తరువాత చర్చలకు అవకాశమివ్వడ మనే సోపానాలు గాంధేయవిధానంలోని ఎత్తుగడలని లూథర్‌కు తెలుసు. అందువల్ల, తదుపరి చర్యలకు అవకాశమిస్తూ, స్వేచ్ఛాప్రయాణాలను తాత్కాలికంగా విరమిం చడమే మంచిదని లూథర్ అభిప్రాయం. కానీ, నీగ్రో యువత అతని సలహాను పాటించే ధ్యాసలో లేదు.

అనుకున్నది సాధించటానికి ఏవొక్క అవకాశాన్నీ వదలకుండా వెదుకుతున్న కెనెడీ బృందానికి టిమ్ జెన్కిన్స్ అనే విద్యార్థినాయకుడు ఆసరాగా దొరికాడు. నేషనల్ స్టూడెంట్ అసోసియేషన్‌కు ఆ నీగ్రోకుర్రాడు ఉపాధ్యక్షుడు. అల్పసంఖ్యాక వర్గాల విషయాల్లో అధ్యక్షుడు కెనెడీకి సలహాదారుడైన హ్యారీస్ ఊఫర్డ్ ఆ కుర్రానితో సంప్రదింపులు నిర్వహించాడు. అసిస్టెంట్ అటార్నీ జనరల్‌గా పనిజేస్తున్న బర్క్ మార్షల్ గూడా ఆ మంతనాల్లో భాగస్వామి. స్వేచ్ఛాప్రయాణాల వాయిదా కోరడంలో నీగ్రో ఉద్యమాన్ని నీరుగార్చే దురుద్దేశం ప్రభుత్వానికి లేదనీ, ఆ విరామసమయం వృథా కాకుండా ఓటరు రిజిస్ట్రేషన్ వంటి మరో కార్యక్రమానికి పూనుకుంటే ప్రభుత్వానికి అభ్యంతరం ఉండదనీ, ఓటరు రిజిస్ట్రేషన్ కార్యక్రమానికి తమవంతు సహకారంగూడా ఉంటుందనీ ఆ విద్యార్థినాయకునికి కెనెడీ ప్రతినిధులు నమ్మకం కలిగించారు. ఓటరునమోదు కార్యక్రమానికి ఆర్థికసహాయం అదించే సేవాసంస్థలను టిమ్ జెన్కిన్స్‌కు పరిచయంజేశారు. ఈ పరిణామాలతో, స్వేచ్ఛాప్రయాణాలను ప్రస్తుతానికి విరమించి, ఓటరు నమోదు కార్యక్రమానికి పూనుకోవడంలోనే ప్రయోజనం మిక్కుటంగా ఉంటుందనే నమ్మకం జెన్కిన్స్‌కు బలపడింది. ఫలితంగా, 1961 జూన్‌లో, లోస్‌విల్లీలో జరిగిన ఎస్.ఎన్.సి.సి. సమావేశంలో అతడు యాత్రలకు

ప్రత్యామ్నాయంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతిపాదించాడు. విమర్శలూ ప్రతివిమర్శలతో సమావేశం అల్లకల్లోలంగా ముగిసింది. అధికార యంత్రాంగం చేసిన కుట్రే దీనికి కారణమేనే అపవాదు దాపరికం లేకుండా పిక్కటిల్లింది.

విద్యార్థుల మధ్య తలెత్తిన అపోహలను తొలగించడంలో జాప్యం జరిగితే ఉద్యమం చిలువలుపలువలుగా చెదిరిపోతుందని లూథర్ కలవరపడ్డాడు. ప్రమాదాన్ని నివారించటానికి విద్యార్థిసంఘాలతో ఎస్.సి.ఎల్.సి. సంయుక్త సమావేశాన్ని ప్రతి పాదించాడు. టెన్నెసీ రాష్ట్ర రాజధాని వేదికగా ఆగస్టు నెలలో ఆ సమావేశం ఏర్పాటయింది. భేదాభిప్రాయాలున్న విద్యార్థిబృందాలతో లూథర్ విడివిడిగా చర్చించాడు. ఓపికతో వారి వాదనలన్నీ మనసప్పగించి విన్నాడు. అందరినీ ఒకే మార్గంలో నడిపించడం అసాధ్యంగా తోచింది లూథర్‌కు. ఏ పంథానూ తోసిపుచ్చ కుండా అతడో రాజీమార్గాన్ని సూచించాడు. ఓటరు నమోదు వైపు మొగ్గుచూపే వర్గాలను తమకు నచ్చిన కార్యక్రమమే స్వీకరించమన్నాడు. స్వేచ్ఛాప్రయాణం ఆపరాదని వాదించే వర్గాలను అదే బాటలో కొనసాగమన్నాడు. లూథర్ నిర్ణయం ఏ వర్గాన్నీ తృప్తిపరచకపోయినా, ఏ వర్గాన్నీ నిరాశలో ముంచలేదు. మిశ్రమ స్పందనతో టెన్నెసీ సమావేశం విజయవంతంగా ముగిసింది.

సెలవులు సమాప్తమై, సెప్టంబర్‌లో విద్యాలయాలు ప్రారంభం కావడంతో ఉద్యమ తీవ్రత కాసింత పలుచబడింది. ఐనా, చాప చుట్టేసే ప్రయత్నాలకు పూనుకోకుండా కెనెడీ ప్రభుత్వం మాటమీద నిలబడింది. బస్సు ప్రయాణాల్లో జాతివివక్షను నిషేధిస్తూ రూపొందించిన నిబంధనలను సెప్టంబర్ 22వ తేదీన ఇంటర్‌స్టేట్ కామర్స్ కమిటీ అమలులోకి తీసుకొచ్చింది. ఆ సందర్భాన్ని వ్యాఖ్యా నిస్తూ అన్నాడు లూథర్ - ''సత్ఫలితాలను సాధించటానికి సదుద్దేశ మొక్కటే చాలదు. ఈ నిబంధనలు వాస్తవరూపం దాల్చేలా చూడటం ప్రభుత్వం బాధ్యత. ఇవి అమలయ్యేలా చూడటానికి మనంగూడా సమాయత్తం కావాలి.''

# ఎదురుదెబ్బ

ఆ ఎదురుదెబ్బ తగిలింది ఆల్బనీ పేరుండే ఓ మోస్తరు పట్టణంలో. జార్జియా రాష్ట్రపు నైరుతిలో, వ్యవసాయ దిగుబడులకు వాణిజ్యకేంద్రంగా ప్రాముఖ్యత సంతరించుకున్న జనావాసం ఆల్బనీ. ఆదివారం వదిలేసి మిగతా ఏ రోజైనా జనంతో కిటకిటలాడే పురవీధులు ఆ ఊరి ప్రత్యేకత.

అప్పుడెప్పుడో ఆల్బనీ ఓ మారుమూల బస్తీ. ఇప్పుడది ఆధునిక సౌక ర్యాలకు కొదవలేని అధునాతన నగరం. నాగరికత దిశగా పోల్చుకోలేనంత వేగంగా ఆల్బనీ ఎదిగిపోయింది గానీ, సాంస్కృతికంగా కనీసం వందసంవత్సరాల వెనకబాటు తనంలో కూరుకుపోయింది. నాగరికతకూ సంస్కృతికీ మధ్యనుండే తేడాను ప్రొఫెసర్ మెక్లేవర్ కంటే చక్కగా నిర్వచించిన శాస్త్రవేత్త మరొకరు లేరు. ''మనం ఉపయోగించే వాటిని తెలిపేది నాగరికత; మనమేమిటో తెలిపేది సంస్కృతి. జీవించటానికి మనం ఉపయోగించే పనిముట్లూ, యంత్రాలూ, నైపుణ్యాలూ మొదలైన సౌకర్యాల సమూహాన్ని నాగరికత అంటాం. మనం వేటికోసం బ్రతుకుతామో ఆ కళలూ, సాహిత్యం, మతం, నైతిక ప్రవర్తనల వంటి విలువల సమాహారాన్ని సంస్కృతి అంటాం.'' అంటాడు మెక్లేవర్.

ఆ దృష్టితో ఆల్బనీని పరిశీలిస్తే - ఆ నగరం బజార్లకు ఉత్తరంగా ఉండేది స్వర్గం; దక్షిణంగా ఉండేది నరకం. కరెంటు దీపాలూ, టెలిఫోన్ గలగలలూ, పోర్టికోలో మెట్టవేసిన కాడిలాక్ కార్లూ తదితర అధునాతన సౌకర్యాలతో నగరానికి ఉత్తరంగా కనిపించే సువిశాలమైన భవంతులన్నీ తెల్లోళ్ళవి. తుప్పుతో కుళ్లిపోయిన జింకురేకుల కప్పులతో, అడుగేస్తే దుమ్ములేసే మట్టిరోడ్ల సందులతో, ప్రాణమున్న మనిషినైనా వదలకుండా ముసురుకునే ఈగలతో, ఆ పట్నానికి దక్షిణంగా కనిపించే మురికికూపం నీగ్రోలది. ఆ ప్రాంతంలోని మిగతా అన్ని గ్రామాల్లో లాగే ఆల్బనీ ఊరిబయటగూడా పెద్ద చెట్టొకటుంది. ఉరితాటికి వ్రేలాడిన నీగ్రోల ఆక్రందనకు దాని కొమ్మలు నోరులేని సజీవ సాక్ష్యాలు. నల్లోడికి సంబంధించినంతవరకు అక్కడ ఫెడరల్ రాజ్యాంగం లేదు. తెల్లోడి నిర్ణయమే ఆ నగరం నీగ్రోలకు శాసనం. సంఖ్యాపరంగా నీగ్రోజనాభా ఎక్కువగావున్న గ్రామాల్లోగూడా వాళ్ళను మైనారిటీ లంటారు. ఆల్బనీ జనాభాలోనూ నీగ్రోల బలం నలభైశాతముంది. ఆ నలభైలో ఓటర్లుగా నమోదైన సంఖ్య పది శాతానికి మించరు. ఆ పదిలో గూడా

ఓటువేసే నీగ్రోలు పాతికశాతానికి మించరు. ఒదిగిమదిగి జీవించే నల్లజాతి నమ్మకస్తులు మాత్రమే ఓటింగులో పాల్గొంటారు.

ఎడారి గుట్టల్లో నాగజముడు పెరిగినట్టు, ఆ నికృష్టంలోనూ ఆర్థికంగా పెరిగిన నీగ్రోలు కొంతమంది లేకపోలేదు. వాళ్ళల్లో, నిద్రాహారాలు మానుకుని సొంత గూడు సంపాదించగలిగిన నీగ్రోలు కొందరైతే, అలౌకిక మానవయత్నంతో ధనికులుగా ఎదిగిన నీగ్రోలు మరికొందరు. ఆ సంపన్ననీగ్రోలు ఏ ఇతర విషయాల్లో జోక్యం చేసుకోని మర్యాదస్తులు. అందువల్ల, నల్లపిల్లలకోసం సొంత విద్యాలయాలు నడుపుకునేందుకు నగరపెద్దలు వాళ్ళను అనుమతించారు. ఎందుకైనా మంచిదని, వాటిని ఊరికి దూరంగా, స్మశానానికి ఆవలగా, వాగుకు వెలుపలిగా, ఉనికిని తెలుసుకునేందుకు వీలులేనంత దూరంగా అనుమతించారు. దక్షిణాది సాంప్రదాయాలను భంగపరిచే పోకడలేవీ వాటి గోడల్లో చొరబడకుండా కట్టుదిట్టం చేశారు.

కానీ, చేతికి చెమ్మ తగలకుండా గాలిలో కరిగొచ్చే తడిని అడ్డుకోవడం ఏ గోడలకూ వీలుపడదు. మాంట్గోమెరీలో బస్సు సీట్లకోసం నల్లజాతి చేసిన పోరాటంతో తడిసిన గాలి తెల్లజాతికి తెలీకుండానే ఆల్బనీ నల్లజాతిని చల్లగా తాకింది. పెద్దపెద్ద నగరాల సూపర్ మార్కెట్లలో నీగ్రో విద్యార్థులు చేపట్టిన బైఠాయింపు పోరాటాల సమాచారం నిశ్శబ్దంగా ఆల్బనీ నీగ్రోల చెవులకు సోకింది. 1961 సెప్టంబర్ 22వ తేదీన ఇంటర్‌స్టేట్ కామర్స్ కమిటీవారు రవాణా ఏర్పాట్లలో జాతివివక్షను నిషేధించారనే కబురు ఆల్బనీ గోడల్లో సునాయాసంగా దూరిపోయింది. నిర్జీవంగా మట్టిలో కూరుకున్న విత్తనం మొలకెత్తటానికి చాలినంత తేమతో ఆల్బనీ నీగ్రోల అంతరంగం పదునెక్కింది.

దీనికి తోడు, యాదృచ్ఛికంగా జరిగిన మరో ప్రత్యక్ష సంఘటన ఆల్బనీకి నిద్రమత్తు వదిలించింది. అదేమంటే - అట్లాంటాలోని ఐదుగురు స్నేహితులకు ఆల్బనీలోకి స్వేచ్ఛాప్రయాణం చెయ్యాలనిపించడం. నవంబర్ ఒకటవ తేదీన నలుగురు నీగ్రోలూ, ఒక తెల్లయువతి కలిసి బస్సెక్కే వాలకాన్ని అనుమానించి అట్లాంటా పోలీసులు ఆల్బనీని ముందస్తుగా హెచ్చరించారు. సాంప్రదాయానికి ఈనెపుల్లంత తేడా కనిపించినా ఓర్చుకోలేని సనాతనుడు ఆల్బనీ పోలీసు ఉన్నతాధికారి పిచ్చెట్. అతని పేరు వింటేచాలు, పిట్టలు గూడా నీళ్ళు ముట్టుకోవు. తక్షణం బస్సుమెట్టులో తగిన బందోబస్తు ఏర్పాటుచేశాడు. ఆల్బనీలో దిగగానే అప్రమత్తంగా పహరా కాస్తున్న పోలీసులను చూసి ఉద్యమకారులు అయోమయంలో

పడ్డారు. పోలీసు తాకిడి తగ్గేవరకూ ఆగిఉండడం ఎందుకైనా మంచిదని నిదానించారు. తమ రాకను తెలియజేస్తూ స్థానిక విద్యార్థులకు సమాచారం అందించారు. మరికొద్ది సేపటికి కొందరు స్థానిక విద్యార్థులు అతిథులతో కలుసుకున్నారు. అందరూ కలిసి 'తెల్లోళ్ళకు మాత్రమే' కేటాయించిన కాచుకోలు గది*లో ప్రవేశించి కుర్చీలను ఆక్రమించుకున్నారు. 'మర్యాదగా ఖాళీ చేస్తారా, లేక అరెస్టు చెయ్యమంటారా' అనే పోలీసు హెచ్చరికను ఆ యువకులు నిర్లక్ష్యం చేశారు. తప్పదుగాబట్టి పోలీసులు వాళ్ళను అదుపులోకి తీసుకున్నారు.

అంతే. అంతకంటే చెప్పుకోదగిన దుర్మార్గం అక్కడేమీ జరగలేదు. కానీ, ఆ చిన్న సంఘటనే ఆల్బనీని కుదిపేసింది. సరదాకోసం నడుపుకునే క్లబ్బుల్లాగా చాలాకాలంనుండి గురితప్పి మనుగడ సాగిస్తున్న నీగ్రోసంస్థల కుదుర్లను తాకింది. పొరపొచ్చాలు పక్కకు నెట్టి, ఆ సంస్థలన్నీ కలిసి 'ఆల్బనీ ఉద్యమం'పేరుతో ఆందోళన కొనసాగించటానికి తీర్మానించుకున్నాయి. నిజాయితీపరుడైన పెద్దమనిషిగా ప్రజల్లో మంచిపేరు సంపాదించిన డా.ఆండర్సన్‌ను ఆ ఉద్యమానికి అధ్యక్షునిగా ఎన్నుకున్నాయి.

ఒకవైపు, ఆల్బనీ ఉద్యమం ఎప్పుడు, ఎలా, ఎవరు అనే ఆలోచనలు పెద్దల్లో తెగకముందే, మరోవైపు ఆల్బనీ యూత్ కౌన్సిల్ సభ్యులైన ముగ్గురు నీగ్రోలు నవంబర్ 22వ తేదీన బస్టాండులో తెల్లవాళ్ళకు కేటాయించిన భోజనశాల ప్రవేశించి అరెస్టయ్యారు. అదే రోజు మధ్యాహ్నం మరో ఇద్దరు నల్లవిద్యార్థులు అదే నేరానికి పాల్పడి ఉద్దేశపూర్వకంగా అరెస్టుకు గురయ్యారు. ఆ ముద్దాయిల విచారణ డిసెంబర్ 11వ తేదీకి ఖరారైంది. ఏం చెయ్యాలో దిక్కుతోచక తట పటాయిస్తున్న ఆల్బనీ నాయకత్వానికి లూథర్ నేతృత్వంలోని ఎస్.సి.ఎల్.సి. తన సంపూర్ణ మద్దతును వాగ్దానం చేసింది.

ఇంతలో మరో ఉప్పెన ఆల్బనీని ముంచెత్తింది. ఈసారి అది రైలుపెట్టెలో ఆ నగరం చేరింది. డిసెంబర్ 10న, అట్లాంటా రైల్వేస్టేషన్‌లో, ఆల్బనీ వెళ్ళడానికి కూత వేస్తున్న బండిని అందుకుని, నలుగురు నీగ్రోలూ, ఐదుగురు తెల్లోళ్ళూ కలిసిన యువకుల గుంపొకటి, కండక్టరు అభ్యంతరాన్ని ఖాతరు చెయ్యకుండా తెల్లబోగీలో చేరిపోయింది. వెంటనే సమాచారాన్ని ఆల్బనీ పోలీసులకు చేరేశారు

---

* కాచుకోలు గది: Waiting room

రైల్వే అధికారులు. తగిన సిబ్బందితో పోలీసు కమిషనర్ పిచ్చెట్ స్వయంగా రైల్వే స్టేషన్‌కు బయలుదేరాడు.

పోలీసులకే గాకుండా, నగర నీగ్రోలకు గూడా రైలుయాత్రికుల వర్తమానం చేరిపోయింది. చూసేందుకు జనం తండోపతండాలుగా స్టేషన్ దగ్గరికి చేరుకుంది. పరాయి గ్రామస్థులైన తిరుగుబాటుదారులకు స్థానికులనుండి ఇంత పెద్దఎత్తున మద్దతు లభించడం పిచ్చెట్‌కు నచ్చలేదు. పైగా, మూగిన జనం అదుపు తప్పకుండా క్రమశిక్షణతో మెలగడం అతన్ని మరింత కుతకుతలాడించింది.

రైలు నెమ్మదిగా ప్లాట్‌ఫాం మీదికొచ్చి ఆగింది. ఆందోళనకారులు బోగీనుండి దిగి, తెల్లవారి వెయిటింగ్‌రూం వైపు నడిచారు. లోపలికి అడుగేయకుండా మర్యాదగా బయటికి నడవమని పిచ్చెట్ ఆజ్ఞాపించాడు. ఎదురు చెప్పకుండా ఆందోళనకారులు నిశ్శబ్దంగా స్టేషన్ బయటికి నడిచారు. ఏ గొడవ జరక్కుండా ప్రశాంతంగా కథ ముగియడం పిచ్చెట్‌ను మరింతగా రెచ్చగొట్టింది. ఒక్క అంగలో బయటికి దూకి, 'మీ అందరినీ అరెస్టు చేస్తున్నాను' అంటూ గావుకేక వేశాడు. యాత్రికులనూ, చూసేందుకొచ్చిన జనంనుండి ఇద్దరుముగ్గురు విద్యార్థులనూ అరెస్టుచేసి బందిఖానాకు పట్టుకెళ్ళాడు.

ఆ మరుసటిరోజే బస్సుమెట్టులో అరెస్టైన ఆందోళనకారుల విచారణ. దాదాపు నాలుగువందలమంది హైస్కూల్ విద్యార్థులు టౌన్‌హాలుకు ఊరేగింపుగా వెళ్ళి నగరపాలకులకు తమ నిరసన తెలియజేశారు. అరెస్టులో ఉన్నవారు చట్టం ప్రకారం ప్రవర్తించారే తప్ప నేరం చెయ్యలేదు గాబట్టి వారిని బేషరతుగా విడుదల చెయ్యాలనీ, ఇంటర్‌స్టేట్ కామర్స్ కమిటీ నిబంధనలను నగరంలో అమలుజేయాలనీ కోరుతూ ఉద్యమకమిటీ తరఫున డా.ఆండర్సన్ ఒక విజ్ఞాపన పత్రాన్ని మేయరుకు సమర్పించాడు. కోరికలు ఎంత సబబైనవైనా, నీగ్రోలవైపు మొగ్గుచూపే మనిషిగా అపవాదు తెచ్చుకోవడం దక్షిణాదిలో మేయర్లెవరూ చేయలేని సాహసం. ఆ విజ్ఞప్తికి జవాబు లేకపోగా, ప్రాణాలు తీస్తామని బెదిరించే ఉత్తరాలూ, ఫోన్ సందేశాలూ ఊపిరాడకుండా అందుకున్నాడు ఆండర్సన్.

మరోవైపు నిరసన ప్రదర్శనలు ఆల్బనీలో దినసరి కార్యక్రమాలయ్యాయి. డిసెంబర్ 15 నాటికి అరెస్టైన ఆందోళనకారుల సంఖ్య ఐదువందలు దాటింది. తదుపరి ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితిలో పడిన ఆండర్సన్‌కు అనుభవజ్ఞులైన నాయకుల అండదండలు అవసరమని తోచింది. ఆ రాత్రి మార్టిన్ లూథర్, అబెర్నె

థీలకు ఫోన్ జేసి తక్షణం అక్కడ వాలమని అభ్యర్థించాడు. డిసెంబర్ 16 సాయం కాలానికి లూథర్, అబెర్నెథీలు ఆల్బనీ చేరుకున్నారు. 'షిలో బాప్టిస్ట్ చర్చి'లో ఏర్పాటైన వారి సమావేశం జనంతో కిటకిటలాడింది.

''లోకువతనమనే గుండెకోత అనుభవించేవాడికే తెలుస్తుంది; అది చూచే వాడికి కనిపించేదిగాదు. బ్రతుకులోని ప్రతి అడుగునా ఆ పోటును భరిస్తున్నాడు ఈ దేశంలోని నల్లజాతీయుడు. నడుస్తున్నది వెలివేతలో, తింటున్నది వెలివేతలో; చదువుతున్నది వెలివేతలో, పొట్టపోసుకుంటున్నది వెలివేతలో; ప్రార్థిస్తున్నది వెలి వేతలో, ప్రాణాలు వదులుతున్నది వెలివేతలో. ఈ కించబాటు నల్లజాతి అంతరాత్మను నామరూపాలు లేకుండా నలిపేసింది. తనమీద తనకే ఏవగింపు కలిగేలా చేసింది. ఈ దౌర్భాగ్యానికి ఇప్పుడు ముగింపు మొదలయింది. ఇప్పుడు మొదలైన ఉద్యమంతో ఈ దీనావస్థకు ముగింపు దగ్గరపడింది. సోదరులారా! ఇక వెనకడుగు వేయకండి. సహనమనే ఆయుధంతోనే ప్రత్యర్థులను మనం ఓడిస్తున్నాం.'' అంటూ లూథర్ చేసిన ప్రసంగం ఆల్బనీ ఉద్యమానికి ఉత్తేజాన్ని ప్రేరేపించే నాయకత్వపు కొరత తీర్చింది. శ్రోతలనుండి ఎల్లువెత్తిన స్పందన ఆల్బనీ సీనియర్ నాయకత్వానికి ఊరట కలిగించింది.

ఆ రోజే తిరిగిరావలసిన లూథర్, అబెర్నెథీలను ఆ రాత్రి అక్కడే బసజేసి మరుసటి రోజు ఊరేగింపుకు నాయకత్వం నిర్వహించేలా ఒప్పించారు ఆండర్సన్ తదితర సీనియర్ నాయకులు. అదే వాళ్ళు జేసిన పెద్ద పొరపాటు గూడా. ప్రాముఖ్యతను చేజేతులా లూథర్‌కు అప్పగించడం అక్కడి యువకులకు సుతరామూ గిట్టలేదు. ''ఇది మన ఊరికి సంబంధించిన సమస్య. దీన్ని ఆ హద్దుల్లోనే నడిపితే మనకు గౌరవంగా ఉంటుంది. లూథర్ కాలుమోపితే దీని స్వరూపం మారిపోతుంది. దేశంలోని పత్రికలన్నీ ఇక్కడికి పరిగెత్తుకొస్తాయి. రాష్ట్రప్రభుత్వం హుషారై కూర్చుం టుంది. ఆఖరుకు ఇదొక జాతీయ సమస్యగా మారుతుంది. రేపు జరగబోయే చర్చలు వాయిదా పడతాయి'' అనేది యువనాయకుల వాదన. సీనియర్ నాయకులు, ముఖ్యంగా మతబోధకులు, ఈ వాదనతో ఏకీభవించలేదు. ''నాలుగు రోజులనుండి చర్చలు జరుపుతామంటున్నారు, వాయిదా వేస్తున్నారు. మనతో చర్చలకు కూర్చో డమే వాళ్ళకు ఇష్టమున్నట్టు లేదు. వాళ్ళు మెత్తబడాలంటే లూథర్ రాకతోనే మెత్తబడాలి'' అనేది సీనియర్ల వాదన. ఎటూ తేల్చుకోలేక కొంతమంది తటస్థులైనారు. మొత్తంమీద, తెరచాటైన ఆల్బనీ నల్లజాతి సంస్థల విభేదాలు మరోసారి రంగంలో ప్రవేశించాయి.

మరుసటి రోజు పరిస్థితి మొత్తం తల్లక్రిందులయింది. స్థానికుల్లో పొడజూపిన అనైక్యత తెల్లవారకముందే బహిరంగమైంది. నగరపాలకులు చర్చలకు నిరాకరించారు. ప్రదర్శనకు పూనుకుందామంటే, గుమిగూడిన జనం మూడు పాతికలైనా లేదు. యువకులుగానీ ఉద్యోగులుగానీ ఆ దరిదాపుల్లో కనిపించకుండా తప్పుకున్నారు. తిరిగి తిప్పలుబడి మరో రెండువందలమందిని సేకరించారు సీనియర్లు. రెండు గంటల పొద్దుందనగా, లూథర్ అబెర్నెథీల నాయకత్వంలో, విముక్తి గీతాలు ఆలాపిస్తూ ఊరేగింపు బయలుదేరింది. నడిదారిలో, నగరపాలకసంస్థను చేరుకునే కూడలిలో, తన సిబ్బంది యావత్తును సమీకరించి సిద్ధంగా నిలుచున్నాడు పోలీసు కమిషనర్ పిచ్చెట్. పోలీసు హెచ్చరికలను ఖాతరు చెయ్యకుండా ముందుకు కదిలింది ప్రదర్శన. లూథర్, అబెర్నెథీ, ఆండర్సన్‌లతో సహా, దాదాపు రెండువందల మందిని అరెస్టు చేశారు పోలీసులు.

‘‘నేను రిమాండులోనే ఉంటాను. శిక్ష విధించినా నేను జురిమానా చెల్లించను. నా క్రిస్టమస్ పండుగను మీ జైల్లోనే జరుపుకుంటాను. ఈ సందర్భంగా లక్షలాది మతవిశ్వాసకులు ఇక్కడికొచ్చి, నాతో కలిసి ఈ ఆల్బనీలోనే క్రిస్టమస్ వేడుకలు జరుపుకుంటారు.’’ అంటూ లూథర్ బహిరంగంగా ప్రకటించాడు. లూథర్, ఆండర్సన్‌లను ఆల్బనీలో ఉంచకుండా, పొరుగు మండలంలోని నమూనా జైలుకు తరలించారు పోలీసులు.

లూథర్ అరెస్టైనట్టు తెలియంగానే ప్రచార మాధ్యమాల సిబ్బంది ఆల్బనీని ముట్టడించింది. అది ఆల్బనీవాసులు ఇదివర కెన్నడూ ఎరుగని కోలాహలం. ఈ తాకిడికి నగరపాలకులతో పాటు కమిషనర్ పిచ్చెట్ గూడా కంగారుపడ్డాడు. లూథర్ ప్రదర్శించిన తెగువ నగరంలోని నల్లజాతిలో అవధులు దాటిన ఉత్తేజాన్ని ప్రేరేపించింది. ఆ మరుసటి రోజు పోటెత్తిన ప్రవాహం లాగా మతగురువులు ఆల్బనీ చేరడం మొదలెట్టారు. వాళ్ళల్లో తెల్లజాతి మతగురువులు గూడా గణనీయంగా ఉండటం మరో విశేషం.

తెల్లారింది మొదలు ఆందోళనకారుల ప్రదర్శనలతో ఆల్బనీ అతలాకుతలమయింది. అంతర్జాతీయ పత్రికా ప్రతినిధులను ఎదురుగా ఉంచుకుని నిగ్రహం కోల్పోకుండా ఉగ్గబట్టుకోవడం కమిషనర్ పిచ్చెట్‌కు కత్తిమీద సాములా తయారైంది. ఐనా, ఆ రోజు పిచ్చెట్ ప్రదర్శించిన సంయమనం చూపరులను ఆశ్చర్యంలో ముంచింది. నీరు చిమ్మే గొట్టాలను వాడలేదు; భాష్పవాయువు ప్రయోగించలేదు;

తూపాకీ తూటాలు దండుగ చేయలేదు; కానీ, కెమెరాలకు అందుబాటుగాని సందుల్లోకి ఆందోళనకారులను లాక్కెళ్ళి చితకబాదించాడు. ప్రధాన రహదారిలో ఎదురైన మర్యాదస్తులందరినీ సగౌరవంగా అరెస్టు చేయించాడు.

అరెస్టైనవారి సంఖ్య ఏడువందలు దాటింది. చుట్టుపక్కలున్న జైళ్ళనీ్న గుత్తకు తీసుకున్నా అరెస్టుకోసం ఎగబడే జనానికి చాలకొస్తున్నాయి. తమాయించుకో లేని చిక్కులో కూరుకుపోయారు నగరపాలకులు. మరోవైపు, ఈ పరిస్థితి స్థానిక నీగ్రో నాయకులకు గూడా తత్తరపాటు కలిగించింది. వాళ్ళు ఏదైతే జరగ్గూడ దనుకున్నారో అది వారి ప్రమేయం లేకుండానే జరిగిపోతూంది. లూథర్ కథానాయకుడై కూర్చున్నాడు. రేపోమాపో అతని ప్రతినిధులు రంగంలోకి దిగి నగరపాలకులతో ఒప్పందానికి ప్రయత్నిస్తారు. ఈలోగా, సమస్య తెగేలా చూడమని ఫెడరల్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తుంది. అంతర్జాతీయ ఖ్యాతిని లూథర్ గద్దలా తన్నుకుపోతాడు. దీన్ని ఏలాగైనా అడ్డుకోవాలని ఆల్బనీ ఉద్యమంలోని ఒకవర్గం ఒట్టేసుకుని పట్టుబట్టింది. సంప్రదింపులకోసం రహస్యంగా నగరపాలకులకు రాయబారం పంపించింది.

నీగ్రోలతో చర్చలకు ఇష్టపడని సంఖ్య నగరపాలకుల్లో అప్పుడెంతుడేదో ఇప్పుడూ అంతే ఉంది. కానీ, ఆల్బనీలో జరిగే జాతరను వీలైనంత తొందరగా ముగించాలనే ఆరాటంగూడా వారి మనసును కలవరపెడుతూంది. కాబట్టి, ఒక మెట్టు దిగిరాక తప్పదనే అభిప్రాయంతోపాటు, నీగ్రోనాయకుల వేగిరపాటులో ఏదో లోపాయికారితన ముందని తలపండిన తెల్లనాయకత్వం గుర్తించింది.

సుదీర్ఘమైన డిమాండ్ల జాబితాతో నీగ్రోనాయకులు మేయర్‌ను కలిశారు. ప్రతి రంగంలో జాతివివక్షను తొలగించాలని అడిగారు; పోలీసుశాఖలో సైతం నీగ్రోలకు ఉద్యోగాలు ఇవ్వాలని అడిగారు; ఆరెస్టైన ఖైదీలందరినీ బేషరుతుగా విడుదల చెయ్యాలని అడిగారు; ఇరుజాతులతో కూడిన ఒక సమన్వయ సంఘాన్ని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చెయ్యాలని అడిగారు. వీటిల్లో ఏవొక్క అంశాన్నీ అంగీకరించకపోయినా, వీటన్నిటినీ సానుభూతితో పరిశీలిస్తామనే హామీ మేయర్ నుండి వాళ్లకు లభించింది. ఈ అస్తవ్యస్తమైన పరిస్థితుల్లో కాకుండా, 1962 జనవరి 23వ తేదీన, తీరుబాటుగా చర్చలు కొనసాగించటానికి ఇరువర్గాలు అంగీక రించాయి. వెలుపలికొచ్చి, ఆమోదయోగ్యమైన అంగీకారం కుదిరినట్టు నీగ్రో నాయకత్వం ప్రకటించింది.

ఇంత హఠాత్తుగా తెల్లదొరల అంతరంగంలో కలిగిన మార్పు జైల్లోవున్న లూథర్‌ను అయోమయంలో పడేసింది. ఐనా, అక్కడ ఒప్పందం కుదిరిన తరువాత తను జైల్లో కొనసాగడంలో ఔచిత్య ముండదు. అందువల్ల, సంకోచాలను పక్కకు నెట్టి, బెయిలుబాండ్ల మీద సంతకాలు జేసి మిత్రులతోసహా జైలునుండి విడుద లయ్యాడు లూథర్. బయటికొచ్చి ఆల్బనీలో అడుగుబెట్టిన తరువాతగానీ అతనికి స్థానికులు నిర్వహించిన తతంగం తెలిసిరాలేదు. తెలిసి చేయగలిగిందిగూడా లేదు. నోరు విప్పితే మొత్తం ఉద్యమమే కకావికలౌతుంది.

అనేక సందర్భాల్లో వాస్తవానికీ ప్రచారానికీ పొంతన కుదరదు. ఆల్బనీ ఒప్పందం గురించి లూథర్ విషయంలోనూ అదే జరిగింది. జైలునుండి బయట పడటానికి అర్థంపర్థంలేని ఆ ఒప్పందాన్ని లూథరే ప్రోత్సహించాడనే అపవాదు దావానలంలా అతన్ని కమ్ముకుంది. కాదని వాదించటానికి గానీ, ఔనని అంగీకరిం చటానికిగానీ కుదరని పరిస్థితి లూథర్‌ది. అంతర్జాతీయంగా అతని ప్రతిష్టను ఇంతగా దిగజార్చిన సంఘటన అతని జీవితంలో మరొకటి లేదు. 'నా' అనుకున్న వాళ్ళకోసం పోరాటం సాగిస్తుంటే, ఒకవైపు ప్రత్యర్థులు మృగానికి మల్లే వేటాడు తున్నారు, మరోవైపు 'నా' అనుకున్న వాళ్ళే అల్పమనస్తత్వంతో గుండెల్లో గునపాలు దించుతున్నారు. 'భగవంతుడా! ఏది నాకు దారి' అనుకుంటూ కన్నీరు మున్నీరుగా ప్రభువును అర్థిస్తూ ఏకాంతంలో కూలిపోయాడు లూథర్.

లూథర్‌కు వాతలేసి ఇంటిదారి పట్టించిన ఆల్బనీ నాయకుల సంతోషం ఎంతోసేపు నిలువలేదు. పొరుగు ప్రదేశాలనుండి వచ్చిన జనం నగరాన్ని వదలిన మరునాడే పాలకవర్గం ఎదురుదాడి మొదలెట్టింది. వెదికి వెదికి తప్పులు ఏరుకోవడం, ఏ చిన్న తప్పుకైనా నీగ్రోలను జైలుకు లాక్కెళ్ళడం పనిగా పెట్టుకుంది. ఆ అరెస్టులకు జాతిభేదం తప్ప వయోభేదంగానీ లింగభేదంగానీ లేదు. అరెస్టు చేసేందుకొచ్చిన పోలీసులమీద తిరగబడ్డాడనే నెపంతో ఒక నీగ్రో హోటల్ యజ మానిని పిస్టల్‌తో కాల్చి చంపేశారు.

ఈ దిగజారిన వాతావరణంలో 1962 జనవరి 23 ప్రవేశించింది. చర్చలకు పిలిపిస్తారని నీగ్రో నాయకత్వం ఆశగా ఎదురుజూసింది. కనీసం ఆ విషయం గుర్తున్నట్టైనా పాలకులు ప్రవర్తించలేదు. ఉద్యమకారుల్లో గుసగుసలు మొదల య్యాయి. పరస్పరం నిందించుకోడంలో పాత పురాణం బయటికొచ్చింది. ఓర్చలేని తనంతో ఇటు ఉద్యమాన్నీ అటు లూథర్ ప్రతిష్టనూ దెబ్బతీసిన గుంపును ప్రజలు ఏవగించుకున్నారు.

కేసులు ఎత్తివేయనందున, విచారణ కోసం ఫిబ్రవరి 27వ తేదీన కోర్టుకు హాజరయ్యేందుకు లూథర్, అబెర్నెథీలు మరోసారి ఆల్బనీలో అడుగుబెట్టక తప్పలేదు. ఆ రోజు విచారణ జరిగింది. కోర్టు వాళ్ళిద్దరిని దోషులుగా నిర్ణయించింది. ఐతే, శిక్ష విధించకుండా, మిగతా ముద్దాయిల విచారణ ముగిసేంతవరకు వాయిదా వేసింది. ఆ మిగతా విచారణ జులై 10న జరిగింది. లూథర్ అబెర్నెథీలు కోర్టుకు హాజరయ్యారు. ఆ యిద్దరికి 178 డాలర్ల జరిమానా విధించాడు న్యాయమూర్తి. జురిమానా చెల్లించని పక్షంలో 45 రోజులు కఠిన కారాగారశిక్ష అనుభవించమన్నాడు. జరిమానా చెల్లించటానికి నిరాకరిస్తూ ఆ ఇద్దరు నాయకులు జైలు శిక్షకు సిద్ధమయ్యారు.

ఈసారి వాళ్ళను సిటీ జైల్లోనే ఉంచారు. 'ఇంత రోతైన జైలుగదులు నేనెక్కడా చూడలేదు. నాగరికతకు సంబంధించిన ఆనవాళ్ళైనా ఇందులో కనిపించవు. గదిలో పేరుకుపోయిన చెత్తాచెదారం చూస్తే, ఈ తరంలో దాన్ని శుభ్రంజేసిన పాపాన పోలేదని తెలుస్తుంది. గండుచీమలూ, బొద్దెంకలూ అక్కడి ఖైదీలకు సహచరులు. రాజకీయ ఖైదీలం వచ్చినందు కనుకుంటా, శుభ్రపరిచే కార్యక్రమం మొదలెట్టించాడు కమిషనర్.' అని తన డైరీలో రాసుకున్నాడు లూథర్.

జైల్లో ఉంచిన లూథర్ వల్ల ఉద్యమానికి బలం పెరుగుతుందని నగరపాలకులకు ఇంకా తెలిసినట్టులేదు. 'ఆల్బనీ కారాగారంలో మార్టిన్ లూథర్ కింగ్' అనే పతాకశీర్షికలతో పత్రికలు నిండిపోయాయి. తక్షణం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోమని కోరుతూ ఫెడరల్ న్యాయవ్యవహారాల శాఖకు గవర్నర్ రాక్‌ఫెల్లర్ తంతివార్త పంపించాడు. ''అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం అమలుగాని ప్రదేశాలు ఈ దేశంలో ఇంకా మిగిలుండటం సిగ్గుచేటు'' అంటూ పెన్సిల్వేనియా సెనెటర్ జోసెఫ్ క్లార్ తన లేఖలో ఫెడరల్ ప్రభుత్వాన్ని అభిశంసించాడు. లూథర్ పరిస్థితి గురించి వివరమైన నివేదిక తయారుజేయమని అసిస్టెంట్ అటార్నీ జనరల్‌ను ప్రెసిడెంట్ కెనెడీ ఆదేశించాడు. అంతేగాకుండా, లూథర్ గురించి అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నామనీ, ఆందోళన పడే అవసరం లేదనీ కొరెట్టాను టెలిఫోన్‌లో ఓదార్చాడు.

జులై 13 ఉదయం లూథర్, అబెర్నెథీలను కొట్టునుండి బయటికి తీసి, కమిషనర్ పిచ్చెట్ కార్యాలయానికి తీసుకెళ్ళారు. ''మీరు విడుదలయ్యారు. ఎవరో అజ్ఞాతపురుషుడు మీ జుల్మానా చెల్లించాడు'' అన్నాడు పిచ్చెట్.

''కానీ మేము జైల్లోనే ఉండదలుచుకున్నాం. ఏడువందలమందికి పైచిలుకు

ఉద్యమకారులు ఇప్పటికీ జైల్లో మగ్గుతున్నారు. వాళ్ళను వదిలివెళ్ళాలని మాకు లేదు.'' అన్నాడు లూథర్.

''దాన్ని గురించి భగవంతునికే తెలియాలి ఫాదర్. మీరు మాత్రం నా జైల్లో ఉండటానికి వీల్లేదు.''

''ఇదివరకు నన్ను చాలాచోట్ల బయటికి గెంటారు. జైల్లోనుండి గెంటబడటం ఇది నా మొదటి అనుభవం.'' అన్నాడు అబెర్నెథీ.

''నేను నిమిత్తమాత్రుని'' అన్నాడు చిరునవ్వుతో పిచ్చెట్.

ఎదుటివారి దృష్టిలో పలుచనైన తరువాత ఆల్బనీ నాయకులకు తమ తూకం తెలిసొచ్చింది. లోటుపాట్లు సవరించుకోటానికి ఒక సమావేశం జరుపుకోవాలనుకున్నారు. సమావేశానికి లూథర్‌ను గూడా ఆహ్వానించి మనసువిప్పి మాట్లాడుకోవాలనుకున్నారు. జులై 16న లూథర్ మరోసారి ఆల్బనీకి ప్రయాణమయ్యాడు. అంతర్గత విభేదాలకు స్వస్తిపలికి, ఉద్యమాన్ని కొనసాగించాలని అందరూ తీర్మానించారు. పెద్ద ఎత్తన మొదలెట్టి పోలీసు రిజర్వు బలగాలు దిగేలా చేసుకోవడం కంటే, చిన్నచిన్న గుంపులుగా ప్రతిరోజూ కార్యక్రమం జరిగేలా చూడటం ఎత్తుగడగా నిర్ణయించారు.

మరోవైపు నగరపాలకులు చట్టపరమైన అవరోధాలు కలిగించడంగూడా అవసరమని తీర్మానించారు. ఆల్బనీలో ఏ రకమైన ఆందోళనకూ తావులేకుండా ప్రశాంతత కలిగించమని ఫెడరల్ కోర్టును అభ్యర్థించారు. నగర పెద్దల కోరిక మేరకు ప్రదర్శన లన్నిటినీ నిషేధించడమేగాక, వాటిల్లో పాల్గోకుండా లూథర్, అబెర్నెథీ వంటి అగ్రనాయకత్వాన్ని ప్రత్యేకంగా హెచ్చరిస్తూ జులై 20వ తేదీన ఫెడరల్ న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశాడు. ఆ జారీచేసిన న్యాయమూర్తి మరెవరో కాదు; ప్రెసిడెంట్ కెనెడీ తొలిసంతకంతో నియామకమైన రాబర్ట్ ఎలియట్. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ, ఆల్బనీ కింగుల కుటుంబసభ్యుడైన అడ్వొకేట్ ఛవేన్ కింగ్ ఆ వెనువెంటనే ధర్మాసనానికి అపీలు చేశాడు. అపీలులో సింగిల్ జడ్జి ఆదేశాలు రద్దయ్యాయి.

చిలకాటగా సాగుతున్న ప్రత్యర్థుల పోరాటం, జులై 24 సంఘటనతో ఒక్కసారి భగ్గున మండింది. అడ్వొకేట్ ఛవేన్ కింగ్ తమ్ముని భార్య, ఖైదీలకోసం తినుబండారాలు తీసుకుని క్యామెల్లా జైలుకు వెళ్ళింది. ఆమె నిండు చూలాలని గూడా చూడకుండా ఆ క్యాంపు జైలరు పగబట్టిన శత్రువులా దాడిజేసి, స్పృహ

తప్పిందాకా ఆమెను లాఠీతో చితకబాదాడు. రెచ్చిపోయిన నీగ్రోలు నగరంలో అల్లకల్లోలంగా చెలరేగి, రాళ్ళతో కట్టెలతో పోలీసులమీద తిరగబడ్డారు. తీవ్రమైన గాయాలతో వొక పోలీసు జవాను ఆస్పత్రి పాలయ్యాడు. ''ఏం జరుగుతూందో మీరే చూడండి. మళ్ళీ వీళ్ళంతా అహింసావాదులమని చెప్పుకుంటారు'' అంటూ కమిషనర్ పిచ్చెట్ హేళనచేస్తూ మాట్లాడాడు.

ప్రతిస్పందించటానికి ఏమాత్రం జాప్యం జరుగనివ్వలేదు లూథర్. ఆ మరుసటిరోజు ఆందోళన కట్టబెట్టి, 'ప్రాయశ్చిత్త దినం' పాటించాలని ఆల్బనీవాసులకు విజ్ఞప్తి చేశాడు. రాత్రికిరాత్రే లూథర్ అనుచరులు వాడవాడకూ తిరిగి ఆ కబురును ప్రజలకు చేరవేశారు. విద్యార్థుల్లో కొంతమందికి ఇది నచ్చకపోయినా, ప్రాయశ్చిత్త దినాన్ని ప్రశాంతంగా పాటించారు. ఎంతోకాలంగా కరువైన ప్రశాంతత ఆల్బనీకి అనుకోకుండా తిరిగొచ్చింది.

అబెర్నెథీని వెంటదీసుకుని జులై 27న లూథర్ ఆల్బనీకి తిరిగొచ్చాడు. ఈసారి ప్రార్థనా సమావేశం చర్చిలో కాకుండా, టౌన్‌హాలు ఎదురుగా నిర్వహించాలనుకున్నారు నాయకులు. టౌన్‌హాలు ముందుకు చేరి ప్రార్థనలో మోకరిల్లిన ప్రదర్శకులతో పాటు కమిషనర్ పిచ్చెట్ గూడా మోకరిల్లాడు. ప్రార్థన ముగియగానే లూథర్, అబెర్నెథీ, ఆండర్సన్ తదితర నాయకులతో పాటు పదిమందిని అరెస్టు చేసి రిమాండుకు తీసుకెళ్ళాడు. ఇదివరకులాగే జైల్లో ఉండిపోటానికి నాయకులు నిర్ణయించుకున్నారు. అడ్వొకేట్లతో సహా, బయటి మనుషులెవరూ లూథర్‌ను కలిసేందుకు వీల్లేకుండా కట్టుదిట్టం చేశాడు పిచ్చెట్.

మరుసటి రోజు సాయంత్రం లూథర్ జైలుగది దగ్గరికి కమిషనర్ పిచ్చెట్ స్వయంగా వచ్చాడు. ''డాక్టర్, దయవుంచి మీరు మా జైల్లోనుండి వెళ్ళిపొండి.'' అన్నాడు దిగాలుగా.

''జైలునుండి మీరు మళ్ళీ బయటికి గెంటేలా ఉన్నారు. నాకది ఇష్టంలేదు. శిక్ష అనుభవించాలనే కోరికతోనే నేనిక్కడున్నాను.'' అన్నాడు లూథర్.

''బయట ఎంత గందరగోళంగా ఉందో మీకు తెలీదు. ఈ రోజు ఏం జరిగిందో తెలుసా?''

''చెప్పండి.''

''అడ్వొకేట్ ఛవేస్ కింగుకు తల పగిలేశారు. ఇంచుమించు రెండు ఒప్పులుగా చీలింది. అదృష్టంకొద్దీ ప్రాణాపాయం జరగలేదు.''

‘‘భగవంతుడా! ఎవరా పని చేసింది?’’

‘‘మా జైలరు.’’

పాలకసిబ్బందిలో పెరుగుతున్న అసహనానికి ఇది మరో నిదర్శనం. పెరుగుతున్న ఖైదీల సంఖ్య వాళ్ళను బేజారులో పడేస్తూంది. జూలై మాసాంతానికి అరెస్టైన ఆందోళనకారుల సంఖ్య వెయ్యికి దాటింది.

ఈ ప్రకంపనలు మరోసారి వాషింగ్టన్ను కదిలించాయి. ఉమ్మడిగా పదిమంది సెనేటర్లు ‘ఆందోళనకారు లందరినీ విడుదల చేయించటానికి ఫెడరల్ ప్రభుత్వం తన సత్తాను ప్రయోగించా’లని కోరుతూ ఒక ఉత్తరం ద్వారా న్యాయవ్యవహారాల శాఖను ఒత్తిడి చేశారు. అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ ప్రపంచ పత్రికారంగం వ్యాసాలు ప్రకటించింది. ఆగస్టు 5వ తేదీన, అంటే అరెస్టైన పదో రోజు, పదహైదు నిమిషాల పాటు కుటుంబసభ్యులతో ఇంటర్వ్యూకు లూథర్‌ను అనుమతించడం పత్రికల్లో మరో సంచలనవార్తకు కారణమైంది. ఆ రోజు తమ ముగ్గురు పిల్లలతో కొరెట్టా భర్తను కలిసింది. వారి సంభాషణ కేవలం కుటుంబ విషయాలకే పరిమితం.

‘‘ఇంకా కొన్నిరోజులు మీరు ఇక్కడేవుంటే పిల్లలు మిమ్మల్ని గుర్తు పట్టలేరు.’’ అంది కొరెట్టా.

‘‘నన్ను గురించి అడిగినప్పుడు ఏమని చెబుతున్నావు?’’

‘‘మనం ఎక్కడ తిరగాలనుకుంటే అక్కడంతా తిరిగేందుకు అడ్డు తొలగాలని మీ నాన్న జైల్లో ఉన్నాడని యోకీతో చెప్పాను. అదేమందో తెలుసా? ‘భలేభలే. ఐతే నన్ను ఫన్‌టౌను(అట్లాంటాలో తెల్లపిల్లలకు ప్రత్యేకించిన ఒక పార్కు)లోకి పోనిచ్చేదాకా జైల్లోనే ఉండమని నాన్నతో చెప్పు’ అనేసింది.’’

ఇద్దరూ నవ్వుకున్నారు. ఇంటర్వ్యూకు కేటాయించిన సమయం ముగిసింది. పదిహేనంటే సరిగ్గా పదిహేనే నిమిషాలు; గంట మోగింది; జవానొచ్చి తొందర చేశాడు. పిల్లలను తీసుకుని కొరెట్టా బయటికి నడిచింది.

ఆగస్టు 10వ తేదీన విచారణ కోసం నాయకులను కోర్టుకు తీసుకొచ్చారు. లూథర్ తదితరులు నేరానికి పాల్పడినట్టు కోర్టు నిర్ధారించింది. కానీ, చిత్రాతిచిత్రంగా శిక్షలు రద్దుజేసి అందరినీ విడుదల చేసింది.

‘‘ఇక ఉద్యమానికి మా రాకతో అవసరం ఉండదనుకుంటాను. పెద్దమనసుతో నగరపాలకులు చర్చలు కొనసాగించి నల్లజాతీయుల సమస్యలను పరిష్కరిస్తారని

ఆశిస్తున్నాను.'' అనే వాక్యాలతో స్థానిక నాయకత్వం చేతికి పగ్గాలను అందజేస్తూ, ఆల్బనీవాసులతో లూథర్ వీడ్కోలు తీసుకున్నాడు. అతని జీవితంలో ఇంత సుదీర్ఘమైన జైలుశిక్ష ఇదివరకు అనుభవించలేదు. ఐనా, పరిష్కారం దిశగా ఆల్బనీ సమస్యలు అంగుళమైనా ముందుకు కదల్లేదు. పైగా, గాంధేయ విధానాలు అమెరికాకు తగవని వాదించే ప్రత్యర్థులకు ఊత దొరికేలా చేసింది ఆ వైఫల్యం.

# బర్మింగ్‌హాం

దక్షిణాది కంతా తలమానికమైన పారిశ్రామిక నగరం బర్మింగ్‌హాం. అది ఉక్కు కర్మాగారాలకు కాణాచి. అలబామా రాష్ట్రంలో, మాంట్గోమెరీకి 86 మైళ్ళు ఉత్తరంగా దాని ఉనికి. పారిశ్రామికంగా ఎంత ఎత్తుకు ఎదిగిందో, రాజకీయంగా అంత వెనుకబాటుతనంలో కూరుకుపోవడం ఆ నగరం ప్రత్యేకత. అక్కడ పుట్టిన సామాన్యుడికి అబ్రహాం లింకన్ ఎవరో తెలీదు.

ఆ పట్నం జనాభాలో పాతిక వంతు నీగ్రోలది. వాళ్ళల్లో పనిజేసే వయసుకు చేరిన తొంభైశాతం జనాభా పొట్టబోసుకునేది కసువు తీయడం, కాలువ లెత్తడం వంటి నాల్గవతరగతి చాకిరీతో. 'ఈరోజు ఏ నిగ్గర్(నీగ్రో) తన్నులు తినలేదు' అనేది ఆ నగరానికి గమ్మత్తైన వార్త. నీగ్రోలకు సంబంధించినంతవరకు అదొక పోలీసురాజ్యం. బర్మింగ్‌హాం శాంతిభద్రతల కమిషనర్‌గా పాతికేళ్ళనుండి పాతుకు పోయిన మనిషి పేరు యూజెన్ 'బుల్' కనోర్. అదే హోదాలో సుదీర్ఘంగా కొనసాగడం మూలంగా, ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన ఒక స్వతంత్ర సామ్రాజ్యంగా మారిపోయింది అతని పోలీసుశాఖ. పౌరహక్కులన్నా, ఫెడరల్ గవర్నమెంటు పెత్తనమన్నా కనోర్‌కు అరికాలి మంట. క్రూరత్వంలో అతడు ఆల్బనీ కమిషనర్ పిచ్చెట్‌ను తలదన్నే దిట్ట. లాఠీలూ, తుపాకులూ, నీటి గొట్టాలూ, కదం తొక్కే గుర్రాలూ తదితర సాంప్రదాయ సంపత్తితోపాటు, అతని పటాలంలో కోరలు చాచే కుక్కలు దండు చేరుండడం మరో విశేషం.

అటువంటి నగరాన్ని తన ఉద్యమానికి తరువాతి మజిలీగా అంగీకరించాడు లూథర్.

ఎడారివంటి బర్మింగ్‌హాం వాతావరణంలో, ఊట ఉబికిన ఒయాసిస్ లాగా 1956లో ఒక పౌరహక్కులసంఘం పుట్టుకొచ్చింది. ఫ్రెడ్ షటిల్‌వర్త్ పేరుండే మతగురువు దానికి వ్యవస్థాపకుడు. మాంట్గోమెరీ పోరాటంతో ప్రభావితుడైన షటిల్‌వర్త్, 1956 ఏప్రిల్లో 'అలబామా పౌరహక్కుల వేదిక' అనే సంస్థను బర్మింగ్‌హాంలో ప్రారంభించాడు. అతని సంస్థను గురించి పోలీసు కమిషనర్ కనోర్ పెద్దగా పట్టిం చుకోలేదు. 'వీడూ మరొక పేచీకోరు నిగ్గర్' అనే భావంతో నిర్లక్ష్యం చేశాడు. కానీ, క్లాన్ సభ్యులు అంత తేలిగ్గా అతన్ని వదల్లేదు. అదే ఏడాది నవంబర్‌లో

షటిల్‌వర్త్ చర్చిని పేల్చేశారు. క్రిస్టమస్ రోజున అతని ఇంటిని కూల్చేశారు. మరుసటి సంవత్సరం అతన్నీ, అతని భార్యనూ నిర్దాక్షిణ్యంగా చితకబాది, శరీరంలో కత్తులు దిగేశారు. అదృష్టవశాత్తు ఆ ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. అంత జరిగినా షటిల్‌వర్త్ మాత్రం తన ప్రయత్నాన్ని విరమించలేదు. బర్మింగ్‌హాం నీగ్రోల విముక్తికోసం ఆసక్తితో నిరీక్షించే షటిల్‌వర్త్, నీగ్రోల మనోభావాల్లో ఇటీవల వెల్లడౌతున్న మార్పును బట్టి, తన సంకల్పానికి తగిన సమయం దగ్గరైనట్టుగా భావించాడు.

మాంట్గోమెరీ పోరాటంతో ప్రభావితుడైన మతగురువు కాబట్టి, షటిల్‌వర్త్‌కు మార్టిన్ లూథర్ కింగ్ మీద అపారమైన భక్తివిశ్వాసాలు ఉంటాయని విడిగా వివరించే అవసరం లేదు. లూథర్ నాయకత్వంలో దక్షిణాది క్రిస్టియన్ లీడర్ల సమాఖ్య ఏర్పడగానే, దానికి అనుబంధగా మారడానికి ముందుకొచ్చిన మొట్టమొదటి సంస్థ షటిల్‌వర్త్ నాయకత్వంలోని పౌరహక్కుల వేదిక. అందువల్ల, తనకున్న సాన్నిహిత్యంతో, లూథర్ తదితర ఎస్.సి.ఎల్.సి. నాయకులతో తన అభిప్రాయాన్ని కూలంకషంగా చర్చించాడు. లూథర్‌కు గూడా షటిల్‌వర్త్ మీద ఎనలేని విశ్వాసముంది. కానీ, అతడింకా ఆల్బనీ గాయాలనుండి కోలుకోలేదు.

ఆల్బనీలో జరిగింది ఒకందుకు మంచిదే నంటాడు షటిల్‌వర్త్. ''లొసుగులు ఎక్కడెక్కడ ఏర్పడతాయో తెలుసుకునే పాఠం నేర్పింది. అక్కడ ఓడిపోయామని అనుకుంటున్నది మనమే. ఆల్బనీలో అడుగుబెట్టడమే గొప్ప సాహసమని ప్రజల అభిప్రాయం. బర్మింగ్‌హాం ప్రజానీకం కాకమీద ఉందిగాబట్టి, అలసిస్తే పుణ్యకాలం దాటిపోతుంది'' - జోరీగలా గీపెట్టి, ఎస్.సి.ఎల్.సి. అగ్రనాయకత్వాన్ని తన దారికి తెచ్చుకున్నాడు షటిల్‌వర్త్. బర్మింగ్‌హాం పోరాటానికి 'సరే'నని తలూపడంలో ఎస్.సి.ఎల్.సి.కి గూడా తగినన్ని కారణాలు కనిపించాయి. దక్షిణాది వేర్పాటువాదానికి బర్మింగ్‌హాం గుండెకాయ. అక్కడ బావుటా ఎగిరేస్తే దక్షిణాది వేర్పాటువాదానికి మూకుమ్మడిగా నడ్డి విరుగుతుంది. బర్మింగ్‌హాంలో ఉద్యమాన్ని నడిపించడం ఆషామాషీ కాదని వాళ్ళకు బాగా తెలుసు. ఐనా, ఆల్బనీ వైఫల్యంతో చులకనైన సంస్థకు వెనుకటి గౌరవాన్ని సాధించాలంటే బర్మింగ్‌హాంలో గెలుపోటములు తేల్చుకోవడం తప్పనిసరిగా ఎస్.సి.ఎల్.సి. నాయకత్వం అభిప్రాయపడింది.

బర్మింగ్‌హాం పోరాటంతో కలిగే ప్రయోజనాలు ఒకవైపు ఊరిస్తున్నా, ఆల్బనీలో చవిజూసిన వైఫల్యం లూథర్‌ను మానసికంగా వెంటాడటం మానలేదు.

ఈసారి ఏకొంచెం పొరబాటు జరిగినా అహింసాసిద్ధాంతానికి పునాదులే కూలి పోతాయనే ఆందోళన ఒకవైపూ, చేతులు ముడుచుకుని ఇంట్లో కూర్చుంటే అహింసా సిద్ధాంతానికి ఒరిగే ప్రయోజనంగూడా శూన్యమనే ఆవేదన మరోవైపు అతని అంతరంగాన్ని కల్లోలితం చేస్తున్నాయి. సరైన దారికోసం ఒకటికి పదిసార్లు సన్నిహితులతో సమాలోచనలు నిర్వహించాడు లూథర్. మాంట్గోమెరీతో ఆల్బనీలో జరిగినదాన్ని పోల్చుకుంటూ విశ్లేషించాడు. ఆ విశ్లేషణలో వాటిమధ్య ఒక ప్రాథ మికమైన తేడా బయటపడింది. ఒక నిర్దిష్టమైన అంశంమీద కేంద్రీకృతమైన పోరాటం మాంట్గోమెరీ. అలాకాకుండా, అనేక లక్ష్యాలకు విస్తరించి, మొనలేని ఆయుధంగా తయారైన పోరాటం ఆల్బనీ. దానికి తోడు, బహునాయకత్వం, అనైక్యత, రాగద్వేషాల వంటి సంస్థాగత వైరుధ్యాలు ఉద్యమానికి గుదిబండలై, అడుగడుగునా అవరోధాలు కలిగించాయి. ఈ లొసుగులకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోగలిగితే బర్మింగ్‌హాంలో విజయం సాధ్యమేనని నాయకత్వానికి నమ్మకం కుదిరింది.

బర్మింగ్‌హాం వాతావరణాన్ని స్వయంగా పరిశీలించటానికి లూథర్, అబెర్నె థీలు 1962 సెప్టెంబర్‌లో ఆ నగరం చేరుకున్నారు. గ్యాస్టన్ మోటెల్ గది నెంబరు 30లో బసచేసి, కలుసుకోవలసిన ముఖ్యులందరినీ కలుసుకున్నారు. రహస్యంగా నిర్వహించిన మంతనాల్లో, అక్కడి వాతావరణం ఆల్బనీని పోలింది కాదని తేల్చుకున్నారు. అక్కడి వాళ్ళందరికీ లూథర్ నాయకత్వంమీద అచంచలమైన విశ్వాసముంది. స్థానికులతో సాన్నిహిత్యం పెరగటానికి లూథర్, అబెర్నెథీలు అనేక పర్యాయాలు బర్మింగ్‌హాంకు రాకపోకలు నిర్వహించారు. వెళ్ళిన ప్రతిసారి లూథర్ అదే గదిలో బస చేయడం, తరువాత అదే గది వాళ్ళకు కార్యాలయంగా మారడంతో గ్యాస్టన్ మోటెల్ 30వ నెంబరు గది ప్రాముఖ్యతను సంతరించుకుంది.

పోరాటానికి ఒకే లక్ష్యం ఉండేలా చూడటం వారి రెండవ కర్తవ్యం. ఈ దిశగా జరిగిన పరిశోధనలో లూథర్ దృష్టి 'డౌన్ టౌన్' దుకాణాల మీద పడింది. అక్కడి అంగళ్ళన్నీ తెల్లోళ్ళవి; ఖరీదైన కొనుగోళ్ళకు ఎగబడే జనమంతా నీగ్రోలు. ఆ దుకాణాల అస్థిత్వాన్ని నిర్ధారించేంత కొనుగోలు శక్తి బర్మింగ్‌హాం నీగ్రోలకుండటం ఆశ్చర్యకరమైన వైవిధ్యం. అందువల్ల, ఆయుధాన్ని అదే దిశగా ఎక్కుబెట్టడం ప్రయోజనకరంగా ఉంటుందని లూథర్, అబెర్నెథీలు నిర్ధారించుకున్నారు. క్రిస్టమస్ తరువాత ఇబ్బడిముబ్బడిగా కొనుగోళ్ళు జరిగేది ఈస్టర్ పండుగ సందర్భంలో. అది ఏప్రిల్ 14న రాబోతూంది. పండుగకు నెలరోజుల ముందునుండి వ్యాపారం

పుంజుకుంటుంది. కాబట్టి, పోరాటానికి అనువైన సమయంగా వాళ్ళు 1963 మార్చిని ఎన్నుకున్నారు.

కనోర్ సామ్రాజ్యంతో తలపడే సన్నాహంలో అత్యంత కీలకమైన సరంజామా బెయిలుబాండ్లు. అరెస్టైన కార్యకర్తలను ఒకవైపు విడుదల చేసుకుంటూ, మరోవైపు అదనపు సిబ్బందిని సేకరించగలిగితేనే కనోర్‌ను ఎదిరించడం సాధ్యపడుతుంది. ఎంత పొదుపుగా లెక్కేసినా బెయిలుబాండ్లకు అవసరమయ్యే సొమ్ము లక్షల డాలర్లను తాకుతూంది. ఆ సొమ్ము ప్రోగైతే తప్ప పోరాటంలో అడుగెట్టడం అవివేక మౌతుంది. ఇంత తక్కువ వ్యవధిలో అంతపెద్ద మొత్తాన్ని సేకరించడం శక్తికి మించిన కర్తవ్యం. సాధించాలనే పట్టుదలతో ఆ కార్యక్రమానికి తలపడ్డాడు లూథర్. 1963 జనవరిలో మొదలెట్టి, నెలరోజులపాటు, దాదాపు 60 ఉత్తరాది నగరాల్లో విసుగూ విరామం లేకుండా పర్యటించి, తన ఉపన్యాసాలతో లక్షలాది డాలర్లను విరాళంగా ప్రోగుచేయడమేగాక, ఉన్నతస్థాయిలో ఉండే వేలాది ఉత్తరాది వాసులను ఉద్యమానికి సానుభూతిపరులుగా అతడు మలుచుకోగలిగాడు.

ఇంతా మోపుజేసి, తీరా రంగంలో దిగే సమయానికి అనుకోని అవాంతరం ఉద్యమానికి అడ్డుతగిలింది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం బర్మింగ్‌హాం మేయర్ ఎన్నికలు మార్చి 5వ తేదీకంతా ముగిసిపోవాలి. విచిత్రమైన పరిణామం కారణంగా అవి మరింత ముందుకు జరిగాయి. ఆ పదవికి పోటీ చేసిన ముగ్గురు అభ్యర్థుల్లో ఏఒక్కరికీ స్పష్టమైన మెజారిటీ రానందున, అతి తక్కువ ఓట్లొచ్చిన అభ్యర్థిని బరిలో నుండి తొలగించి, మరోసారి ఎన్నిక నిర్వహించే పరిస్థితి ఏర్పడింది. పోటీలో మిగిలిన ఇద్దరిలో ఒకడు బుల్ కనోర్, మరొకడు ఆల్బర్ట్ బౌట్‌వెల్. ఉద్యమం ఊసెత్తితే నరమాంస భక్షకుడైన కనోర్‌కు పరోక్షంగా సహకరించిన ట్లౌతుంది. రెండో అభ్యర్థి బౌట్‌వెల్ గూడా నల్లజాతిని ద్వేషించే మనిషే. షటిల్‌వర్త్ మాటల్లో చెప్పాలంటే - 'కాస్త మర్యాదస్తునిగా కనిపించే కనోర్.' ఐనా, రాక్షసునిగా పాతుకుపోయిన కనోర్ స్వయంగా అధికారంలో ఉండటానికంటే, సత్తాకు గుర్తింపులేని కొత్తమనిషి అధికారానికి రావడం ఉద్యమానికి లాభసాటిగా ఉంటుందని నాయకుల అంచనా. అందువల్ల, ఎస్.సి.ఎల్.సి. కార్యకర్తలందరినీ తక్షణం బర్మింగ్‌హాం వదలవలసిందిగా లూథర్ ఆదేశించాడు. మలి విడత పోలింగ్ పూర్తయ్యే ఏప్రిల్ 2 దాకా సమయం వృధా కాకుండా, షటిల్‌వర్త్‌ను వెంటదీసుకుని, మరింత సహకారం సమకూర్చుకోటానికి అతడు న్యూయార్క్ బయలుదేరాడు.

ఈ సందర్భంగా లూథర్ చిరకాల మిత్రుడు, ప్రఖ్యాత గాయకుడు హ్యారీ బెలెఫోన్టే అతనికి కొండంత అండగా నిలిచాడు. బెలెఫోన్టే గొప్ప సంగీత విద్వాంసుడే కాక, అంకితభావం కలిగిన సంఘసంస్క ర్త. ఇదివరకుగూడా తన గాన కచేరీలతో లూథర్ సంస్థకు ఎన్నోసార్లు ఆర్థికంగా తోడుపడ్డాడు. ఇప్పుడు తనొక్కడే కాకుండా, సంపన్నులైన మరో 75 మంది సానుభూతిపరులను తన ఇంటికి ఆహ్వానించి లూథర్‌తో సమావేశం చేయించాడు. బెయిలుబాండ్లకోసం వీలైనంత సొమ్మును సమకూర్చే బాధ్యత మీదేసుకున్నాడు.

నీగ్రో నాయకులు ఆశించినట్టే బుల్ కనోర్ ఓడిపోయాడు. వార్త తెలిసిన మరుక్షణం న్యూయార్క్‌లో విమానమెక్కిన లూథర్, షటిల్‌వర్త్‌లు బర్మింగ్‌హాం దిగగానే పరిస్థితి కొత్తమలుపు తిరిగింది. చట్టం ప్రకారం 1965 వరకు తమను అధికారం నుండి తొలగించేందుకు వీల్లేదని కోర్టులో వ్యాజ్యం దాఖలుచేసి, బుల్ కనోర్ తదితర కమీషనర్లు పదవులు వదలకుండా కుర్చీలు ఆక్రమించారు. కోర్టులో గెలిస్తే వాళ్ళు మరో రెండేళ్ళపాటు అధికారంలో ఉంటారు. ఓడినా వాళ్ళ గడువు ఏప్రిల్ 15 దాకా, అంటే ఈస్టర్ పండుగ దాటేదాకా, కొనసాగుతుంది.

ఏం చెయ్యాలో పాలుపోని సందిగ్ధంలో చిక్కుకున్నాడు లూథర్. మరోసారి వాయిదా వేస్తే ఉద్యమానికి వెన్ను విరుగుతుంది. సమీకరించిన సైన్యం చెల్లాచెదు రౌతుంది. ముందుకు అడుగేద్దామంటే, జోడు ప్రభుత్వాల నడుమ, చర్చలకొచ్చే యంత్రాంగమే ఉనికిలో కనిపించడంలేదు.

మారిన పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడను మార్చి ఉద్యమం నడిపించ టానికే నాయకత్వం మొగ్గు జూపింది. కార్యకర్తలను పెద్దఎత్తున రంగంలో దించ కుండా, రోజుకో చిన్నగుంపుతో ఆహారపానీయాల కొట్లముందు బైఠాయింపు కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయించింది.

ఆడంబరం లేకుండా మొదలైన తొలిరోజు ప్రదర్శన ఆదర్శప్రాయంగా ముగియడమేగాక, ఆశించిన ఫలితాన్ని సాధించింది. తరువాతి రెండురోజులు అదే రీతిలో ఉద్యమం కొనసాగింది. మూడురోజులకు కలిసి 35 మంది అరెస్ట య్యారు. తెల్లోళ్ళ దుకాణాల్లో నీగ్రోల కొనుగోళ్ళు దాదాపు స్తంభించడమేగాక, ఏప్రిల్ 6వ తేదీకి పోరాటం ఊపందుకుంది. ఆరోజు పెద్ద సంఖ్యలో ఆందోళన కారులు ఊరేగింపుగా బయలుదేరి, సిటీహాలు ముందు ప్రదర్శన నిర్వహించారు. అరెస్టులైతే పెరిగాయిగానీ పోలీసుల ప్రవర్తన దురుసుగా కనిపించలేదు.

బుల్ కనోర్ సిబ్బంది అంత నిగ్రహాన్ని పాటించడం బర్మింగ్‌హాం ప్రజలకు విడ్డూరంగా కనిపించింది. ఐతే, పరిస్థితుల కారణంగా మారేవి ఎత్తుగడలేగాని స్వభావాలు కాదని లూథర్‌కు తెలుసు. మంచితనం ప్రదర్శించి ఉద్యమాన్ని గాలికి ఊదేసిన ఆల్బనీ కమిషనర్ పిచ్చెట్‌ను ప్రస్తుతానికి ఆదర్శంగా పాటించాడు కనోర్. మరోవైపు, ప్రదర్శనలు నిర్వహించే హక్కును సవాలుచేస్తూ కోర్టులో దాఖలైన పిటిషన్‌మీద వెలువడే తీర్పు తనకు అనుకూలంగా ఉంటుందని అతనికి తెలుసు. ఏప్రిల్ 10వ తేదీన ఆ పిటిషన్ మీద విచారణ జరుగనుంది. అంతలో కొంపలు మునిగేదేమీ లేదని కనోర్ ధీమా.

అన్ని రకాల ప్రదర్శనలనూ నిషేధిస్తూ ఏప్రిల్ 10వ తేదీన కోర్టునుండి ఉత్తరువులు జారీ అయ్యాయి. అపీలుకు వెళితే కాలయాపన జరుగుతుంది. ఫలితం తేలేవరకు ఉద్యమం ఆగిపోతుంది. మార్గాంతరం తోచక ఆశలు వదిలేసే సమయంలో హఠాత్తుగా లూథర్‌కు గాంధీమహాత్ముని ఉప్పుసత్యాగ్రహం గుర్తుకొచ్చింది; 'అన్యాయాన్ని ప్రోత్సహించే చట్ట మొక చట్టమే కాద'ని ప్రకటించిన సెయింట్ అగస్టీన్ జీవితం మనసులో మెదిలింది. వారిని ఆదర్శంగా తీసుకుని, శాసనాన్ని ధిక్కరించడమే ఇప్పటి కర్తవ్యంగా లూథర్ నిశ్చయించుకున్నాడు. శాసనాన్ని ధిక్కరించే ఉద్యమమంటే నాయకుడు వెనకుండి ఇతరులను ప్రోత్సహించే పోరాటంగాదు; ముందు వరుసలో నిలబడి నాయకుడే నడపవలసిన పోరాటం. అందువల్ల, స్వయంగా ప్రదర్శన నిర్వహించటానికి ఏప్రిల్ 12 'గుడ్ ఫ్రైడే'ని ముహూర్తంగా ఎన్నుకున్నాడు.

రేపటిని మాట్లాడుకుంటూ గురువారం సాయంకాలం నీగ్రోనాయకులందరూ గ్యాస్టన్ మోటెల్లో కూర్చున్నారు. ఏర్పాట్లమీద సంతృప్తి పడుతున్న సమయంలో పిడుగుపాటువంటి వర్తమానం వాళ్ళ చెవికి సోకింది. బెయిలుబాండ్లు సమకూరుస్తున్న తమ మిత్రునికి కొద్దిసేపటి క్రిందట నగరపాలకసంస్థనుండి ఒక తాకీదు ముట్టిందట. 'ఇప్పటిదాకా ఇచ్చిన పూచీకతులకు నీ ఆస్తివిలువ చెల్లిపోయింది గాబట్టి, ఇకమీద నీ జామీను చెల్లద'ని ఆ తాకీదు సారాంశం. దాంతో, రేపటి ప్రదర్శనలో అరెస్టయ్యే నాయకులకు తొందరగా విడుదలయ్యే అవకాశం ఉండదని తేలిపోయింది. లూథర్ జైల్లో నిలిచిపోతే వేలసంఖ్యలో అరెస్టైన కార్యకర్తలను విడిపించటానికి సరిపడేంత జామీను సొమ్మును సమకూర్చే పరపతి ఇతరులకు లేదు. ప్రదర్శనలో పాల్గొనకుండా లూథర్ తప్పుకుంటే అతని వ్యక్తిత్వం నవ్వులపాలౌతుంది. నెమ్మదిగా మిత్రుల మధ్యనుండి లేచి, ఒంటరిగా పక్క గదిలోకి నడిచాడు లూథర్. మోకాళ్ళమీద

కూర్చుని కాస్సేపు తలవంచి దేవుణ్ణి ప్రార్థించాడు. ప్రార్థన ముగించుకుని తిరిగొచ్చిన లూథర్ ముఖంలో ఏదో అనిర్వచనీయమైన విశ్వాసం ప్రకాశించింది. ''రేపటి ఊరేగింపు యధావిధిగా జరిగిపోతుంది. దేవుడు మన కెప్పుడూ సహాయాన్ని నిరాకరించలేదు'' అన్నాడు నింపాదిగా.

ఏప్రిల్ 12వ తేదీ శుక్రవారం 'జియాన్ హిల్ చర్చ్' నుండి లూథర్ ఊరేగింపు ప్రారంభమైంది. దారి పొడవునా కిక్కిరిసిన జనసందోహం మధ్యగా పాటలు పాడుకుంటూ, నినాదాలు పూరించుకుంటూ ప్రదర్శనకారులు ముందుకు నడిచారు. నిషేధించిన హద్దులు దాటి మరింత దూరం నడిచేదాకా పోలీసుబలగం నిశ్చలంగా నిలబడింది. సిటీహాలు దగ్గర పడుతున్న సమయంలో 'అరెస్టు చెయ్యండి' అనే గర్జన వినిపించింది. వెంటనే ఇద్దరు బలిష్టులైన పోలీసులు లూథర్‌ను చొక్కా కాలరుతో ఎత్తిపట్టుకుని తోసుకుంటూ తీసుకెళ్ళారు. ఇతర నాయకులను గూడా దాదాపు అదే మర్యాదతో అరెస్టు చేశారు.

మిగతా ఖైదీలనుండి వేరుజేసి లూథర్‌ను ఒంటరిగా చీకటి కొట్టులో తోసేశారు. కలవటానికి అడ్వొకేట్లను గూడా అనుమతించలేదు. కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటంటే ఎలావుంటుందో లూథర్‌కు మొదటిసారి తెలిసొచ్చింది. కప్పు కింద అమర్చిన చిన్న కంతనుండి దినానికంతా కలిసి ఒకింతసేపు గది పైభాగంలో ప్రసరించే వెలుతురు తప్ప, తతిమా రోజంతా చీకటే. నాగరికతకు మారుపేరైన అమెరికాలో అటువంటి నరకం ఉంటుందని అతడు ఊహించనైనా లేదు.

ఎంతటి కష్టమైనా పలుకు తోడుంటే తేలికౌతుందంటారు. అది లేనప్పుడు, పొంతనలేని తలపోతలతో మనిషికి మతి చెడటం మొదలౌతుంది. చీకటికొట్టులో, మనసును గుల్లజేసే ఏకాకితనంలో, లూథర్ చితికిపోకుండా అనుకోని రూపంలో పట్టుగొమ్మ దొరికింది. అరెస్టైన మరుసటిరోజు, అలబామా రాష్ట్రంలో ఎనలేని గౌరవ ప్రతిష్టలకు నోచుకున్న ఎనిమిదిమంది మతగురువులు బర్మింగ్‌హాంలో జరుగుతున్న ఉద్యమాన్ని ఖండిస్తూ చేసిన ప్రకటన కొట్టొచ్చినట్టు కనిపించే దినపత్రి కొకటి లూథర్ గదిలోకి వింతగా ప్రత్యక్షమైంది. జైలుఅధికారులే ఉద్దేశపూర్వకంగా దాన్ని చేర్పించారో లేక చేజిక్కిన అవకాశాన్ని ఎవరైనా అభిమానులు అలా వినియోగించుకున్నారో చెప్పలేంగానీ, ఆ ప్రకటన లూథర్ దృష్టిలో పడాలనే ఉద్దేశం నెరవేరింది. శాసనమంటే గౌరవంలేని అరాచకులుగానూ, తీవ్రవాదులుగానూ ఉద్యమకారులను నిరసిస్తూ, శాంతిభద్రతలకు కలిగే విఘాతాన్ని

ఇంతటితోనైనా ముగించమని తమ ప్రకటనలో ఆ పెద్దమనుషులు నీగ్రోనాయకులకు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకటన చదవగానే లూథర్‌కు గుండెల్లో మండిపోయింది. దానికి ఖచ్చితమైన సమాధానం తయారుజెయ్యాలనే పట్టుదల కలిగింది. పరిపరివిధాల పారాడే ఆలోచన ఏకాగ్రత లోకి తిరిగొచ్చింది. కానీ, వ్రాయటానికి తెల్లకాగితంలేదు; ఒత్తు చేసుకోటానికి అట్టముక్క లేదు. అదే పత్రికను బొద్దుగా మడతేసి, దాని అంచుల్లోని తెల్లజాగాలో తన జవాబు తయారుజేయడం మొదలెట్టాడు లూథర్.

ఆ సమయంలో, తమ నాల్గవ బిడ్డను ప్రసవించి ఆరోగ్యం కోలుకుంటున్న పచ్చి బాలింతరాలుగా అట్లాంటాలో నిలిచిపోయింది కొరెట్టా. లూథర్‌ను చీకటి కొట్టులో పడేశారన్న సమాచారం ఆమెను కలవరపెట్టింది. ఒక్కసారి తన భర్తను ఫోన్‌లో పలకరించే అవకాశం కలిగించమని కమిషనర్ కనోర్‌ను ప్రాధేయపడింది. వీలుపడదని ఖరాకండిగా తేల్చేశాడు కనోర్. ఏంచేయటానికీ పాలుపోని కొరెట్టా, ఆదివారంరోజు ప్రెసిడెంట్ కెనెడీ సహాయంకోసం ఫోన్‌లో అర్థించింది. సమయానికి అధ్యక్షుడు అందుబాటు కాలేదు. అతడు పామ్‌బీచ్ విడిదిలో విశ్రాంతి తీసుకుంటు న్నాడు. అధ్యక్షభవనానికి కొరెట్టా పిలుపందిన పదినిమిషాల్లోనే తిరుగుఫోన్‌లో రాబర్ట్ కెనెడీ ఆమెను పలకరించి విషయం తెలుసుకున్నాడు. తను చేయగలిగిన సహాయమంతా చేస్తానని మాటిచ్చాడు. ఆ తరువాత మరికొద్ది సేపటికి ప్రెసిడెంట్ కెనెడీనుండి కొరెట్టాకు ఫోనొచ్చింది. లూథర్‌కు ఎలాటి హాని జరక్కుండా జాగ్రత్త తీసుకుంటానని ప్రెసిండెంట్ ఆమెను ఓదార్చాడు.

ఆదివారం సాయంకాలంనుండి జైలు సిబ్బందిలో పరివర్తన కనిపించింది. లూథర్‌ను కొట్టునుండి బయటికి తీసి ఫోన్‌లో కొరెట్టాతో మాట్లాడించారు. సోమవారం అడ్వొకేట్లతో కలవనిచ్చారు. సోమవారం కలిసిన అడ్వొకేట్లనుండి తను ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమాచారం అందుబాటుకాక లూథర్ మనసు కలతబడింది. బెయిలుబాండ్లకు డబ్బు సమకూరిందో లేదో తెలుసుకోవాలన్నది లూథర్ తాపత్రయం. న్యూయార్క్‌నుండి రాబోతున్న వకీలుకోసం రేపటిదాకా ఆగితే తప్ప ఆ వివరాలు తెలీవన్నారు వచ్చిన అడ్వొకేట్లు. ఆశించిన సమాచారం అందకపోయినా, వాళ్ళ ద్వారా వ్రాతకు అవసరమైన తెల్లకాగితాలు మాత్రం లూథర్‌కు దొరికాయి.

16వ తేదీ మంగ్లవారం న్యూయార్క్‌నుండి క్లారెన్స్ బి జోన్స్ అనే వకీలు మిత్రుడు ఎదురుజూస్తున్న చల్లని కబురును మోసుకొచ్చాడు. ''బెయిలుబాండ్లకోసం

హ్యారీ బెలెఫోంటే యాభైవేల డాలర్లు ఏర్పాటు చేశాడు. ఏ క్షణంలోనైనా విని యోగించుకోటానికి ఆ మొత్తం సిద్ధంగావుంది. అవసరమైతే ఇంకా ఎంతైనా ఏర్పాటు చేయటానికి సిద్ధంగా ఉన్నానని అతడు చెప్పమన్నాడు.'' అంటూ తెలియజేశాడు. లూథర్ గుండెల్లో బరువు దిగిపోయింది.

అదేరోజు, బర్మింగ్‌హాం ఉద్యమాన్ని ఆక్షేపించిన మతగురువులకు లూథర్ వ్రాసిన సమాధానం పత్రికలకు విడుదలైంది. చాలా పొడవైన ఉత్తరం; చాలా ఘాటైన జవాబు. ఆ పదాల నడకలో పుట్టుకొచ్చిన వాడి, వేడి ప్రత్యర్థులను నోరెత్తకుండా చిత్తు చెయ్యడమేగాక, 'బర్మింగ్‌హాం జైలునుండి లూథర్ లేఖ' పేరుతో, అమెరికన్ జాతి చిరకాలం గుర్తుంచుకోవలసిన జార్జ్ వాషింగ్టన్ వీడ్కోలు ప్రసంగం, గెట్టీబెర్గ్‌లో అబ్రహాం లింకన్ ప్రసంగం, ఫ్రాక్లిన్ రూజ్‌వెల్ట్ ప్రారంభోత్సవ నివేదిక వంటి అరుదైన డాకుమెంట్ల సరసన స్థానం సంపాదించింది.

ఏప్రిల్ 20వ తేదీన లూథర్, అబెర్నెథీలు జైలునుండి బెయిలుమీద బయటి కొచ్చారు. వాళ్ళు బయటికి రావడం చాలా అవసరంగూడా. బర్మింగ్‌హాం ఉద్యమం వాళ్ళకోసం పడిగాపులు కాస్తూవుంది. నడిపించే నాయకత్వం కొరతతో గత వారంరోజులుగా ఆందోళన కుంటుబడింది. మరోవైపు, కనోర్ దాఖలుచేసిన కోర్టు ధిక్కారం కేసు గురించి చర్చించటానికి అడ్వొకేట్లుగూడా లూథర్‌కోసం ఎదురు జూస్తున్నారు.

విడుదలైన ఆరవరోజు కోర్టులో విచారణ మొదలయింది. ముగించటానికి న్యాయమూర్తి పెద్దగా సమయం తీసుకోలేదు. కోర్టు ధిక్కారాన్ని 'సివిల్'నేరంగా నైనా పరిగణించొచ్చు, 'క్రిమినల్'నేరంగా నైనా పరిగణించొచ్చు. సివిల్ నేరంగా ఆరోపిస్తే బహిరంగ క్షమాపణతో సరిపోతుంది. కానీ, క్షమాపణ చెప్పటానికి లూథర్ ఒప్పుకోడని కనోర్‌కు తెలుసు. ఆ కారణంగా జైలుకు తరలిస్తే అతని ప్రతిష్ఠ ఆకాశాన్ని తాకుతుంది. లూథర్‌కు అలాటి అవకాశమివ్వడం కనోర్‌కుససేమిరా ఇష్టంలేదు. అందువల్ల, అతడు దాన్ని క్రిమినల్ కేసుగా దాఖలు చేశాడు. యాభై డాలర్ల జల్మానా, ఐదురోజుల నిర్బంధంతో తీర్పు వెలువడింది. శిక్షను వెంటనే అమలు చేయకుండా, అపీలుకోసం ముద్దాయిలకు ఇరవై రోజుల గడువు మంజూరు కావడం లూథర్ ప్రభుతులను ఆశ్చర్యంలో పడేసింది.

లూథర్ విడుదల తరువాత ఉద్యమం తిరిగి ప్రారంభమైంది. దీనివల్ల అరెస్టుల సంఖ్య పెరగడమే తప్ప, బర్మింగ్‌హాం తెల్లదొరల పట్టుదలలో రవ్వంతైనా

సడలింపు కనిపించలేదు. లూథర్ ఆలోచనలో పడ్డాడు. ఉద్యమానికి ఒక కొత్త కోణం కనుగొంటేగానీ చలనం రాదని అతని అంతరాత్మకు తోచింది. పెద్దలకు మారుగా విద్యార్థులను రంగంలోకి దించడం అవసర మనిపించింది. వెంటనే ఎస్.సి.ఎల్.సి. ప్రముఖులను సమావేశపరిచాడు. దయాదాక్షిణ్యా లెరుగని కనోర్ పటాలానికి వ్యతిరేకంగా ముక్కపచ్చలారని పసిపిల్లలను వీధుల్లో నిలబెడితే మీడియానుండి ఎదురయ్యే విమర్శలు తట్టుకోవడం ఎలా అనేది సభ్యుల సంకోచం. ఏదిఏమైనా, ఈ కొత్త ప్రయోగం తప్పదని చివరకు సభ్యులంతా ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. విద్యార్థులను సేకరించటానికీ, అహింసా విధానంలో వాళ్ళకు తర్ఫీదు ఇవ్వటానికీ, యోగ్యత కలిగిన నలుగురు కమాండర్లను ఎంపికజేసి బర్మింగ్‌హాం పంపించాడు లూథర్.

యువతను కదిలించినప్పుడు గానీ ఆ లేతగుండెల్లో దాగిన స్వాతంత్ర్యేచ్ఛ నాయకులకు అంచనా దొరకలేదు. బడి వదలగానే వేలసంఖ్యలో విద్యార్థులు శిక్షణా శిబిరాలకు ఉరకలు తీశారు. పిల్లలు చూపుతున్న చొరవకు చాలామంది తలిదండ్రుల్లో బెంబేలెత్తింది. అడ్డుకోటానికి చేసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. ''నాన్నా, నిన్ను ఎదిరించాలని నాకు లేదు. కానీ, నన్ను ఇంట్లో కట్టి పడేసినా, తప్పించుకుని పారిపోతాను. నువ్వు ఏ శిక్ష వేసినా సరే, సంతోషంగా అనుభవి స్తాను. ఇదంతా నాకోసం నేను చెయ్యడంలేదు. అమ్మా నువ్వూ బ్రతికుండగానే స్వాతంత్ర్యం చూడాలనేది నా కోరిక.'' అంటూ పదహారేళ్ళ యువకుడు తన తండ్రిని సమాధాన పరచిన తీరు, ఆనాటి బర్మింగ్‌హాం విద్యార్థుల చొరవడికి నిదర్శనం.

ఊహించినట్టే విమర్శలతో పత్రికారంగం లూథర్ మీద విరుచుకుపడింది. తన అవసరాలకోసం పసిపిల్లలను 'వాడుకుంటున్నా'డని నిందలు మోపింది. విమర్శల పరంపరను ఏమాత్రం తొణక్కుండా ఎదుర్కొన్నాడు లూథర్. ''నీగ్రో పసికందులమీద మనదేశ ప్రజాస్వామికవాదుల్లో ఇంతటి మమతానురాగాలు దాగున్నాయని నాకు ఇప్పుడిప్పుడే తెలుస్తూంది. మంచిదే. కానీ, ఇదే పసికందులు పుట్టడమే మురికివాడల్లో పుట్టి, పశువుల కంటే హీనమైన వసతుల్లో పెరిగి, వంద సంవత్సరాల క్రిందట అందించిన స్వేచ్ఛావాయువులు తొలి ఊపిరి పీల్చడానికైనా అందక, వెలివేత విధానంతోనే ఊపిరితిత్తులు నింపుకుంటున్న దీనావస్థలో ఈ జాలిగుండెలన్నీ ఏమౌతున్నాయి?'' అంటూ నిలదీశాడు.

లూథర్ కొత్త ప్రయోగానికి 1963 మే 2వ తేదీ ముహూర్తం. ఆరోజు 'పదహారవ వీధి బాప్టిస్టు చర్చి' నుండి విద్యార్థుల ఊరేగింపు బయలుదేరాలి. బడిపిల్లలను ఆపటానికి స్కూలు యాజమాన్యాలు బడిగేట్లను మూయించాయి. గేట్లు దూకి విద్యార్థులు చర్చిదగ్గరికి చేరుకున్నారు. ఒక బృందం తరువాత మరో బృందంగా, సముద్ర కెరటాల్లాగా, స్వాతంత్ర్యగీతాలు ఆలాపిస్తూ రహదారివెంట ఊరేగింపు కదిలింది. పిల్లలు పాటిస్తున్న క్రమశిక్షణ చూపరులకు అబ్బురపాటు కలిగించింది. తల్లి వ్రేలు పట్టుకుని ప్రదర్శకులతోపాటు చిన్నచిన్న అడుగులేస్తూ నడుస్తున్న ఓ ఎనిమిదేళ్ళ పసికూన టి.వి. కెమెరాలను ఆకర్షించింది. అంతలో ఒక పోలీసు జవాను ఆ పాప మీదికి వంగి, ''ఏం కావాలి పాపా నీకు?'' అంటూ వెటకారంగా ప్రశ్నించాడు. ''సొతంతరం'' అంటూ వచ్చీరాని మాటల్లో ఆ చిన్నారి చెప్పిన జవాబు లూథర్ వ్యాసాలకంటే పదునుగా విమర్శకులను తాకింది.

దాదాపు వెయ్యమంది విద్యార్థులు ఆ దినం అరెస్టయ్యారు. ఆరేళ్ళ మొదలు పదహారేళ్ళ దాకా అన్ని వయసులవాళ్ళూ అందులో ఉన్నారు. తగినన్ని వాహనాలు పోలీసులకు అందుబాటు కాక అరెస్టుల సంఖ్య అంతటితో ఆగింది. ఆ రోజెందుకో కమిషనర్ కనోర్ చాలా చట్టబద్ధంగా వ్యవహరించాడు. కానీ, దక్షిణాది జీవనవిధానం అతనికి ఊపిరివంటిది. దాన్ని చెనికితే ఓర్చుకునే స్వభావం కాదు కనోర్‌ది. ఆ మరుసటి రోజే ముసుగును తొలగించి నిజరూపంతో అతడు ఊరేగింపును అటకాయించాడు. చర్చి గేటుదగ్గరే ప్రదర్శకులను అడ్డుకోవాలని ప్రయత్నించాడు. పోలీసు వలయం తప్పించుకుని ప్రదర్శనకు దిగిన విద్యార్థులను అమానుషంగా చితకబాదించాడు. కాట్లకుక్కల స్వైరవిహారంలో ముగ్గురు పసిపిల్లలకు తీవ్రంగా గాయాలయ్యాయి. గొట్టాలనుండి పొగలు కక్కుతూ చిమ్మే వేడినీటి తాకిడికి పసిపిల్లల శరీరాలు కమిలిపోయాయి. పైశాచికత్వాన్ని ఓర్చుకోలేని కొంతమంది ప్రేక్షకులు పోలీసుల మీద రాళ్ళు విసురుతున్నా, ప్రదర్శకులు మాత్రం క్రమశిక్షణ తప్పలేదు. పోలీసు దమనకాండను టి.వి. ప్రసారాల్లో వీక్షించిన అమెరికన్లకు శరీరంతోపాటు మనసుగూడా జలదరించింది. ప్రజాభిప్రాయానికి స్పందించిన కెనెడీ ప్రభుత్వం ఆ మరుసటి రోజే బర్క్ మార్షల్, జోసెఫ్ డొలాన్‌లను తన దూతలుగా బర్మింగ్‌హాం పంపించింది.

లూథర్ మొదట్లో అనుమానించినట్టుగా కెనెడీ దూతలు ఇదివరకటిలా 'ఆటవిడుపు' కోరటానికి రాలేదు; ఈ దఫా, సంధి కుదుర్చాలనే సదుద్దేశంతో

బర్మింగ్‌హాం వచ్చారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా నీగ్రోనాయకులను చర్చలకు ఆహ్వానించే ప్రక్రియకు దక్షిణాది సాంప్రదాయాలు చోటివ్వవు. అందువల్ల, ఇరువర్గాలతో విడివిడిగా సంప్రదించి, డిమాండ్ల విషయాన్ని వొక కొలిక్కి తీసుకు రావడం దౌత్యనీతికి వాళ్ళు నిర్ణయించుకున్న ప్రాథమిక సోపానం. ఆ తరువాత ముఖాముఖి చర్చల్లో కూర్చోబెట్టటానికి తంటాలు పడాలి. ఎదుటివారికి నచ్చజెప్ప డంలో అద్వితీయమైన ప్రావీణ్యుడిగా బర్క్ మార్షల్‌కు పేరు. సిటీహాలుకూ గ్యాస్టన్ మోటెల్‌కూ మధ్య కండెబోటులా తిరుగుతూ మూడురోజులపాటు తమ ప్రయత్నాన్ని ఏకబిగిన కొనసాగించారు ఫెడరల్ దూతలు.

రాయబారంతో నిమిత్తం లేకుండా ప్రణాళిక ప్రకారం విద్యార్థుల ఊరేగింపు మూడవరోజు కొనసాగింది. ఆ ముందురోజు జరిగిన బీభత్సానికి జడిసి, నల్లజాతి తలిదండ్రులు తమ పిల్లలను గడపైనా దాటనివ్వరని కనోర్ వేసుకున్న అంచనాలు తల్లక్రిందులయ్యాయి. ప్రదర్శనకు సిద్ధమైన విద్యార్థుల సంఖ్య మే 4వ తేదీన రెండింతలకు పెరిగింది. అక్కసు దాచుకోలేని పోలీసు పటాలం ఉక్రోషంతో ప్రదర్శకులమీద విరుచుకుపడింది. రెచ్చిపోయిన ప్రేక్షకజనం ఇటుకపెల్లలతో, సోడా సీసాలతో పోలీసులమీద ఎదురుదాడి చేశారు. ఈసారి పోలీసులుగూడా గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు.

ఆ మరుసటిరోజు జరిగిన మరో అనూహ్యమైన సంఘటన బర్మింగ్‌హాం పోరాటచరిత్రలో ప్రాముఖ్యత సంపాదించింది. ఛార్లెస్ బిలిప్స్ అనే మతబోధకుని నేతృత్వంలో మే 5వ తేదీ ఊరేగింపు ముందుకు కదిలింది. క్రమంగా అది పోలీసు హద్దులను సమీపించింది. ''గొట్టాలను ఎక్కుబెట్టండి; పట్టీలు వదులుజేసి కుక్కలను సిద్ధంగా ఉంచండి'' అనే కేక వినిపించింది. ''మేము ఇక్కడ చావడానికైనా తయారుగా వచ్చాము'' అంటూ ఫాదర్ బిలిప్స్ నేలమీద మోకరిల్లి ప్రార్థనకు ఉపక్రమించాడు. ''అదే జరుగుతుంది కాచుకో! నీటిని వదలండి'' అంటూ కనోర్ ఆజ్ఞాపించాడు. కానీ జవాన్లెవ్వరూ కదల్లేదు. ప్రాణంలేని బొమ్మల్లా నిలబడిపోయారు. ప్రదర్శకులు లేచి ముందుకు నడుస్తున్నా పోలీసుల్లో చలనం కనిపించలేదు. సిటీహాలు ఎదురుగా ప్రార్థన ముగించుకుని, ప్రదర్శకులు నిరపాయంగా తిరిగొచ్చారు.

కనోర్ పటాలాన్ని ఆవరించిన మాయాజాలం మరుసటిరోజు విచ్చిపోయింది. ఆ మరుసటి రెండురోజులు అదుపు తప్పిన ఆబోతుల్లా పోలీసులు జనంమీదికి ఎగబడ్డారు. జవాన్ల కాలిబూట్లకు పిల్లలూ వృద్ధులనే తేడా కనిపించలేదు. వాళ్ళ

దుడ్డుకర్రలు ఆడా మగా భేదాన్ని పాటించలేదు. నేలమీద సాగిలబడిన ఒక చూలాలిని నలుగురు జవాన్లు చుట్టుముట్టి లాఠీలతో బాదుతుండగా, ఐదవ జవాను ఆమె మెడమీద మోకాలితో నొక్కుతున్న ఛాయాచిత్రాన్ని పత్రికల్లో చూసిన ప్రపంచం అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని ఏవగించింది.

ఒకే పీటమీద జమటగా అమర్చిన నీటిగొట్టాలతో 7వ తేదీ దాడికి పోలీసులు సన్నద్ధమయ్యారు. వాటి ఒత్తిడి ఏమాత్రముంటుందో చూడాలని, బలమైన చెట్టు మొదలకు ఎక్కుజేసి నీటిని చిమ్మితే, మూరెడు పొడవున తాట లేచి రెపరెప లాడింది. ఆ గొట్టాల ధాటికి ప్రదర్శకులతో నడుస్తున్న షటిల్‌వర్త్ శరీరం గాలిలో తేలుకుంటూ గోడను తాకి నేలమీద కూలిపోయింది. వెంటనే అతన్ని ఆంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. ఈ వార్త విన్న కనోర్, ''ఇది జరగాలని వారంరోజులుగా ఎదురుచూస్తున్నా. ఆంబులెన్సు కంటే వాణ్ణి శవపేటికలో మోసుకుపోయుంటే నాకు మరింత సంతోషంగా ఉండేది'' అంటూ ఆక్రోశించాడు.

అటువైపు, నిద్రాహారాలు లేకుండా మూడురోజులనుండి బర్క్ మార్షల్ చేస్తున్న ప్రయత్నంలో పురోగతి కనిపించలేదు. తెల్లజాతి మొండివైఖరిని మార్చటానికి అతని నైపుణ్యం చాలకొచ్చింది. మే 7వ తేదీ ఉదయంనుండి 'ఛేంబర్ ఆఫ్ కామర్స్' భవనంలో 125 మంది నగరపెద్దలతో తలమునకలుగా సంప్రదించిన మార్షల్ ఆశలు ఆ మధ్యాహ్నంతో సన్నగిల్లాయి. తదుపరి కర్తవ్యం గురించి రాబర్ట్ కెనెడీతో సంప్రదించటానికి సమయం తీసుకుంటూ, భోజన విరామం ప్రకటించి అతడు ఫోనున్న గదిలోకి నడిచాడు. ఆ చిన్న విరామమే ఒక చారిత్రాత్మక మలుపుకు దారితీస్తుందని అతడు ఊహించలేదు.

విరామంలో భోజనానికి బయలుదేరిన నగరపెద్దలు బజారులో కనిపించిన దృశ్యానికి చలించిపోయారు. జీవితంలో అదివర కెన్నడూ వాళ్ళకు అటువంటి అనుభవం తటస్థించలేదు. వీధివైపు పారజూస్తే, కనుచూపు ఆనేంత దూరందాకా నీగ్రోల సమూహమే. నిర్భయంగా స్వాతంత్ర్యగీతాలు పాడుకుంటూ, రాకపోకలకు అంతరాయం కలిగించకుండా, దారికి ఇరువైపులా క్రిక్కిరిసిన జనసందోహం! ఫుట్‌పాతుల మీదా, దుకాణాల మెట్లమీదా, మూసిన అంగళ్ళ వరండాల నిండా, ఎక్కడ చోటుంటే అక్కడ వేలకువేల నల్లముఖాలు; పిల్ల పెద్దా, ముసలి ముతకా, ఆడా మగా తేడాలేకుండా అనేకానేక తరహాల నల్లముఖాలు; ఎంతదూరం ముందుకు సాగినా అంతం కనిపించని చీకటి ప్రవాహంలా బారులుతీరిన నల్లముఖాలు -

నగరపెద్దలకు గగుర్పాటు కలిగింది. ఉద్యమం గురించి వాళ్ళు ఇంతవరకు పత్రికల్లో చదవడం, టెలివిజన్లో తెలుసుకోవడం మినహా ప్రత్యక్షంగా చూడలేదు. కనోర్ పోలీసుల దుడుకుతనం తెలిసిన ఆ పెద్దమనుషులు జరగబోయే నరమేధాన్ని ఊహించుకుని వణికిపోయారు. భోజనం మాట పక్కకు నెట్టి, మధ్యాహ్నం సమావేశానికి జరూరుగా తిరిగొచ్చారు.

వాడిపోయిన నగరపెద్దల ముఖాల్లో చదవగలిగినంత సారాంశాన్ని చదువుకున్నాడు బర్క్ మార్షల్. వాళ్ళ అహం దెబ్బతినకుండా అతిజాగ్రత్తగా తదుపరి కార్యక్రమం నిర్వహించాడు. సమాలోచన తుదిరూపం తీసుకోటానికి మరో మూడు గంటలు పట్టింది. నీగ్రోనాయకులతో ముఖాముఖి చర్చలు ఆ మరుసటి రోజే మొదలెట్టడానికి అంగీకరిస్తూ సమావేశం ముగిసింది.

కబురుకోసం ఎదురుచూస్తూ గ్యాస్టన్ మోటెల్లో వేచివున్న నీగ్రోనాయకులు బర్క్ మార్షల్ ద్వారా అభినందనతో కూడుకున్న సమాచారం అందుకున్నారు. ఇక తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించే బాధ్యత లూథర్ మీదికి వాలింది. ''చర్చలకు అనుకూల వాతావరణం కల్పించటానికి మే 8వ తేదీ బుధవారం బర్మింగ్‌హాంలో ప్రదర్శనలన్నిటినీ నిలిపివేస్తున్నాం. రేపటిరోజు ఆమోదయోగ్యమైన అంగీకారం కుదరకపోతే, గురువారం 11 గంటలనుండి ఉద్యమం పునరావృతమౌతుంది.'' అంటూ వెనువెంటనే లూథర్ ఒక ప్రకటన విడుదల చేశాడు.

అదే సాయంత్రం, రాష్ట్రగవర్నరును ఫోన్‌లో సంప్రదించి, నరమేధానికి అవసరమైన ప్రత్యేక పోలీసు దళాలను బర్మింగ్‌హాం రప్పించుకున్న కనోర్‌కు లూథర్ ప్రకటన వింతగా కనిపించింది. వెంటనే, ఛేంబర్ ఆఫ్ కామర్స్‌లో జరిగిన సంప్రదింపుల సమాచారాన్ని సేకరించుకున్నాడు. కన్నుగప్పి నగరపెద్దలు తనను మోసగించారని గంతులు వేశాడు. ఒప్పందానికి విఘాతం కలిగించే మార్గాలకోసం అన్వేషించాడు. పాత నేరమొకటి బుట్టలోనుండి బయటికి లాగి, లూథర్ అబెర్నెథీలు సంప్రదింపులకు హాజరయ్యే అవకాశం లేకుండా బుధవారం ఉదయమే వాళ్ళను అరెస్టుజేసి రిమాండులో తోసేశాడు. మధ్యవర్తిత్వం నెరపిన బర్క్ మార్షల్ దిక్కుతోచని పరిస్థితిలో ఇరుక్కుపోయాడు. ఫోన్‌లో విషయం తెలుసుకున్న రాబర్ట్ కెనెడీకి చిరాకెత్తింది. ''మీరేం చేసినా చూస్తూ ఎల్లకాలం తటస్థంగా వ్యవహరించడం ఫెడరల్ ప్రభుత్వానికి వీలుపడదు. మా సహనానికిగూడా ఒక హద్దుంటుంది జాగ్రత్త.'' అంటూ బర్మింగ్‌హాం పాలకులమీద రాబర్ట్ కెనెడీ మండిపడ్డాడు. ఆవేశాలకు

లోనుగాకుండా కాస్తా ఓర్పు చూపెట్టమని షటిల్‌వర్త్ వంటి నీగ్రోనాయకులను అతడు బుజ్జగించాడు. తన పలుకుబడిని ఉపయోగించి, లూథర్ అబెర్నెథీలను ఆ సాయంకాలానికి విడుదల చేయించాడు.

లూథర్, అబెర్నెథీలు విడుదలైన వెంటనే ముఖాముఖి చర్చలు మొదలయ్యాయి. బుధవారం రాత్రంతా చర్చలతో గడిచింది. అడుగడుగునా అనుమానాలతో, బర్క్ మార్షల్ సర్దుబాట్లతో తెల్లారింది. అంగీకారం కుదరటానికి మరో పగలూ రాత్రీ ఖర్చయ్యాయి. శుక్రవారం ఉదయం ఒప్పందం వివరాలు బర్క్ మార్షల్ ద్వారా పత్రికలకు విడుదలయ్యాయి. ఆ డాకుమెంటు ప్రకారం -

1. భోజనశాలల్లో, విశ్రాంతి గదుల్లో, పానీయాల దుకాణాల్లో అంచెలంచెలుగా 90 రోజుల్లో జాతివివక్ష తొలగింపబడుతుంది.
2. బర్మింగ్‌హాం పరిశ్రమల్లో వివక్షారహితంగా నీగ్రోలను నియమించడం, ప్రమోషన్లు కల్పించడం, క్లర్కులుగా సేల్స్‌మన్‌లుగా అర్హతగలవారికి అవకాశం కలిగించడం 60 రోజుల్లో జరుగుతుంది.
3. బెయిలుబాండ్లమీదగానీ, వ్యక్తిగత పూచీమీదగానీ అరెస్టైన ప్రదర్శనకారులందరూ విడుదల కావటానికి ముద్దాయిల న్యాయవాదులతో నగరపాలక అధికారులు సహకరిస్తారు.
4. భవిష్యత్తులో ఇలాటి ఉద్రేకాలు నివారించటానికై ఒక సీనియర్ సిటిజన్ల కమిటీ ద్వారాగానీ, ఛేంబర్ ఆఫ్ కామర్స్ ద్వారాగానీ, ఒడంబడిక మీద సంతకాలైన రెండు వారాలలోపు, తెల్లజాతీయులకూ నీగ్రోలకూ మధ్య అభిప్రాయాలు మార్పిడి జరిపే యంత్రాగం ఏర్పాటౌతుంది.

పని ముగించుకున్న లూథర్ అదేరోజు అట్లాంటా తిరిగొచ్చి, స్వగృహంలో స్వాధీనంలేని నిద్రలో మునిగిపోయాడు. అర్థరాత్రి అవిచ్ఛిన్నంగా మ్రోగుతున్న టెలిఫోన్ రొద అతనికి నిద్రాభంగం కలిగించింది. అవతలినుండి ఫోన్‌లో మాట్లాడింది బర్మింగ్‌హాంలో నివసిస్తున్న అతని తమ్ముడు ఎ.డి.కింగ్. కొద్ది నిమిషాల ముందు అతని ఇల్లు బాంబులవల్ల నేలమట్టమైంది. అదృష్టంకొద్దీ అతని భార్యా ఐదుగురు పిల్లలూ ప్రాణాపాయం తప్పించుకున్నారు.

మరికొంత సేపటికి బర్మింగ్‌హాంలోని గ్యాస్టన్ మోటెల్ 30 నెంబరు గది డైనమైట్ల దాడిలో కూలిపోయింది. బహుశా లూథర్ ఇంకా అందులోనే ఉన్నాడనే భావనతో విద్రోహులు ఈ చర్యకు పూనుకున్నట్టు కనిపించింది. ఆ దాడిలోనూ

ప్రాణనష్టం జరుగలేదుగానీ, మోటెల్లో బసచేసిన చాలామందికి గాయాలయ్యాయి.

సహనం కోల్పోయిన నీగ్రోలు తక్షణం ఎదురుదాడికి ఉపక్రమించారు. పోలీసు వాహనాలు అటూఇటూ పరిగెత్తే అవకాశం లేకుండా రోడ్లవెంట ఆటంకాలు కలిగించారు. వాటి అద్దాలను బద్దలు చేశారు. దురుసుగా ముందుకు దూకిన ఒక ఆఫీసరును కత్తితో పొడిచారు. మరో ఆఫీసరుకు తల చీలేశారు. తెల్లజాతి దుకాణాలకు నిప్పంటించి, అగ్నిమాపక వాహనాలు దగ్గరికి చేరకుండా అడ్డుకున్నారు. మరోవైపు పోలీసులతో కలిసి కు క్లక్స్ క్లాన్ గూండాలు నీగ్రో నివాసాలమీద యధేచ్ఛగా దాడులు జరిపారు. తెల్లవారుఝాముదాకా ఇరువర్గాల నడుమ భీకరమైన పోరాటం జరిగింది. దక్షిణాది చరిత్రలో పోల్చటానికి మరో దృష్టాంతమే లేనంత భయంకరంగా ఆరాత్రి బర్మింగ్‌హాం నగరంలో పోరాటం విజృంభించింది.

వార్త తెలిసిన మరుక్షణమే బర్మింగ్‌హాంకు కేంద్రబలగాలను తరలించాడు అధ్యక్షుడు కెనెడీ. తెల్లవారకముందే ఫెడరల్ బలగాలు నగరాన్ని ఆక్రమించడంతో ఎక్కడివారక్కడ తప్పుకుని పోరాటం సద్దుమణిగింది. ఎంతటి ఉద్రిక్తతనైనా అదుపులో ఉంచటానికి అవసరమైన మరిన్ని ఫెడరల్ బలగాలు ఆ మరుసటిరోజు బర్మింగ్‌హాం పరిసరాల్లోని సైనికస్థావరంలో మొహరించాయి. వీటికి తోడు, మీడియా సమావేశంలో అధ్యక్షుడు కెనెడీ నిర్ద్వంద్వంగా బర్మింగ్‌హాం ఒప్పందాన్ని సమర్థించడమేగాక, దాని అమలుకు కేంద్రప్రభుత్వం పూచీ పడిందని అధికారికంగా ప్రకటించడంతో, తెల్లజాతి దురహంకారుల లుకలుకలన్నీ తెరమరుగయ్యాయి. మారిన వాతావరణంలో పుణికిపుచ్చుకున్న సాహసంతో, సంప్రదింపుల్లో పాల్గొన్న 125 మంది నగరపెద్దల్లో 60 మంది 'ఆ ఒప్పందం మేము ఆమోదించినదే'నని బహిరంగంగా ప్రకటించారు.

నగరమంతా నెమ్మదించిందిగానీ, కుర్చీలు వదలని మాజీ నగరపాలకుల గుండెమంటలు మాత్రం చల్లారలేదు. నీగ్రోలను రెచ్చగొట్టే దారులకోసం వెదుకుతున్న ఆ కుట్రదారులకు సులభమైన లక్ష్యంగా విద్యార్థులు కనిపించారు. 'బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్' ద్వారా, ఊరేగింపుల్లో పాల్గొన్న అభియోగంమీద పదకొండు వేలమంది విద్యార్థులను పాఠశాలలనుండి బహిష్కరించేలా చేశారు. ఉద్రేకాలను రెచ్చగొట్టే పన్నాగాలను పసిగట్టిన లూథర్ హుటాహుటి బర్మింగ్‌హాం చేరుకున్నాడు. ''దీనికి మనం ఆందోళన పడే అవసరంలేదు. ఈ సమస్యను న్యాయస్థానాల ద్వారా సులభంగా అధిగమిస్తాం.'' అని విద్యార్థులకు నచ్చజెప్పి, ఉద్రేకాలను నియంత్రించాడు.

ఎన్.ఎ.ఎ.సి.పి. న్యాయవాదుల అవిశ్రాంత పరిశ్రమద్వారా, ఆ మరునాటి నుండి, కోర్టు వ్యాజ్యాల తీర్పుల్లో అహింసాపోరాటాన్ని విజయ పరంపర వరించింది. 'బర్మింగ్‌హాంలో జరిగిన ప్రదర్శనలేవీ చట్టానికి విరుద్ధం కా'వని మే 20వ తేదీన సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో అలబామా వేర్పాటు నిబంధనలన్నీ మట్టి కరిచి, ప్రదర్శకులమీద కనోర్ మోపిన నేరాలన్నీ రద్దయ్యాయి. మే 22వ తేదీన ఐదవ అపీలుకోర్టు తన తీర్పులో 'బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్' ఉత్తరువులను రద్దుచేస్తూ, 'బడి మానేసే విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని దేశం ఒకవైపు సతమత మౌతుండగా, చదువుమీద ఆసక్తి కలిగిన ఇంతమంది విద్యార్థులను పాఠశాలలనుండి బయటికి గెంటడం బాధ్యతారహితమైన దురాగతం' అంటూ పాలకమండలిని మందలించింది. మే 23వ తేదీన అలబామా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో బర్మింగ్‌హాం మాజీపాలకుల అధికారాల రద్దుతోపాటు, దుర్మార్గమైన కనోర్ శకం అంతరించింది. ఈ పరిణామాలతో బర్మింగ్‌హాం నగరంమీద లూథర్ బావుటా దేదీప్యమానంగా రెపరెపలాడింది.

# వాషింగ్టన్ డి.సి. లో కవాతు

బర్మింగ్‌హాం ప్రకంపనాలు దక్షిణాదికంతా నెరుసుకున్నాయి. బర్మింగ్‌హాం విజయం నీగ్రోలకు ఆత్మవిశ్వాసాన్ని అమితంగా పెంచింది. ఎక్కడ చూసినా ఊరేగింపులు; ప్రతి నగరంలోనూ బైఠాయింపులు. 1963 వేసవి చల్లబడే సమయానికి దాదాపు వెయ్యి నగరాల ఆహారపానీయాల దుకాణాల్లో జాతివివక్ష తొలగిపోయింది; పార్కులూ తదితర పౌరసౌకర్యాలు ఏకీకృతమయ్యాయి.

దక్షిణాదిలో విస్తరించిన ప్రకంపనలు వాషింగ్టన్‌లోని అధ్యక్షభవనాన్ని కదిలించకుండా వదల్లేదు. దాంతో ప్రభుత్వ ప్రాధాన్యత ఇప్పుడు పౌరహక్కుల పరిరక్షణ వైపుగా మొగ్గింది. సమగ్రమైన పౌరహక్కుల బిల్లును సెనేట్‌లో ప్రవేశ పెట్టడానికి కెనెడీ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది.

బర్మింగ్‌హాం విజయంతో లూథర్ ప్రతిష్ఠగూడా భారీగా పెరిగింది. అతని ఉపన్యాసాలకోసం దేశం యావత్తూ తహతహ లాడుతూంది. వచ్చిన ఆహ్వానా లన్నిటినీ గౌరవించటానికి సమయం సరిపోదు; కొన్నిటిని ఎంపికజేసి తక్కినవాటిని వదిలేస్తే తరతమ తేడాలు అంటగడతారు. అందువల్ల, నెలరోజులకు సరిపడే కార్యక్రమంతో ఒక ప్రణాళిక ప్రకారం అతడు దేశాన్ని పర్యటించాలనుకున్నాడు. అతని పర్యటన పడమట పసిఫిక్ మహాసముద్ర తీరంలోని లోస్‌ఏంజెల్స్‌లో మొదలై, దారి పొడవునా తారసిల్లే వేరువేరు రాష్ట్రాలను సందర్శిస్తూ, తూర్పున అట్లాంటిక్ మహాసముద్ర తీరంలోని న్యూయార్క్‌తో ముగిసేలా రూపొందించుకున్నాడు.

అడుగుబెట్టిన ప్రతినగరంలో లూథర్ సభలు విశేషంగా ప్రజలను ఆకట్టు కున్నాయి. ప్రతి సభకు పదినుండి పాతిక వేలదాకా ప్రేక్షకులు హాజరుకాగా, జూన్ 22వ తేదీన డెట్రాయిట్‌లో జరిగిన సభ, లక్షా పాతికవేల శ్రోతలతో సమ్మర్దమై, అమర్చిన లౌడ్‌స్పీకర్ల శక్తి చాలక, చివరి వరుసల్లో నిలిచిన స్త్రీపురుషులు అసం తృప్తితో వెనుదిరిగారు.

నెల పొడవునా వెన్నెలరాత్రులు ఆశించేది మానవ స్వభావం. నెలలోనే ఒక పున్నమి, ఒక అమావాస్య సంభవించడం ప్రకృతి ధర్మం. వెన్నెలకు పోలిన ఉత్సాహంతో పర్యటిస్తున్న లూథర్‌కు అదే నెలలో ఒక అమావాస్య తారసిల్లింది. జూన్ 12వ తేదీన, మిసిసిపిలో నివసించే ఎన్.ఎ.ఎ.సి.పి. కార్యదర్శి మెడ్గార్

ఎవర్స్‌ను అతని ఇంటి మెట్లమీదే, గుర్తుతెలియని దుండగులు బుల్లెట్‌తో ప్రాణాలు తీశారు. తెల్ల పాలకుల నిర్బంధాలనుండి నీగ్రో ప్రదర్శకులను విడిపించటానికి తన లాయర్ల బృందంతో రెప్ప వాల్చకుండా కృషిజేసిన ఆత్మీయుడు ఎవర్స్. అటువంటి సహచరుణ్ణి కోల్పోవడం భర్తీ చేయలేని లోటుగా లూథర్ తల్లడిల్లిపోయాడు.

అదే నెలలో తన చివరి మజిలీలో పౌరహక్కుల పితామహుడైన ఎ ఫిలిప్ రాన్డాల్ఫ్‌తో జరిగిన సుదీర్ఘమైన సమాలోచన లూథర్‌కు పునరావృతమైన పున్నమి. పోరాట రంగంలో అద్వితీయమైన సమయస్ఫూర్తితోపాటు ముందుచూపు కలిగిన నాయకుడాయన. ‘‘సమగ్రమైన పౌరహక్కుల చట్టంకోసం వాషింగ్టన్ డి.సి.లో మనమొక ప్రదర్శన నిర్వహించా’’లని ప్రతిపాదించాడు రాన్డాల్ఫ్.

‘‘అధ్యక్షుడు ఆ ప్రయత్నంలోనే ఉన్నట్టు మనకు సమాచారం. ఈ సమయంలో ఇది అవసరమంటారా?’’ - లూథర్ సందేహం.

‘‘వాళ్ళ దారి వాళ్ళదీ, మన దారి మనదీ. వాళ్ళ దయకోసం చేతులు ముడుచుకుని మనం ఎదురుజూస్తూ కూర్చోలేం. బర్మింగ్‌హాం విజయంతో జాతి మొత్తం జాగృదావస్థకు చేరుకుంది. పిలుపిస్తే అందుకోటానికి దేశం సిద్ధమైంది. నీగ్రో బలాన్ని చారిత్రాత్మకంగా ప్రదర్శించే ఈ అవకాశాన్ని వదులుకోవడం క్షమించరాని అవివేకమౌతుంది. ఏ ఒక్క అధ్యక్షుని ప్రయత్నంతో మనకు తెల్లారదు. అది సాధ్యమైతే అబ్రహాం లింకన్ బిల్లుతోనే అమెరికన్ సమాజానికి మానవత్వం అబ్బివుండేది. అలా జరగలేదని నీకూ తెలుసు, నాకూ తెలుసు. కెనెడీ ప్రయత్నం కెనెడీకే వదిలేద్దాం. మన పని మనం చేసుకుందాం. ఒక చారిత్రాత్మక మలుపుకు సమయం ఆసన్నమైందని నా అంచనా. దానికి మనవల్ల ద్రోహం జరుగరాదు.’’

ఆవేశంతో బిగిసిన రాన్డాల్ఫ్ పిడికిటి సందుల్లోనుండి అమెరికన్ నీగ్రోల ఆకాంక్ష కాంతిపుంజాలుగా విరజిమ్ముతున్నట్టు లూథర్ మనోనేత్రానికి కనిపించింది.

రాన్డాల్ఫ్ ప్రతిపాదించిన రాజధాని ప్రదర్శన గురించి వివరాలు చర్చించటానికి జులై 2వ తేదీన న్యూయార్క్‌లో ఒక విస్తృత సమావేశం జరిగింది. దేశం నలుమూలలనుండి దాదాపు 200 మంది ప్రతినిధులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. ఆ ప్రణాళికమీద పౌరహక్కుల సంఘాలతోపాటు ప్రార్థనా సంఘాల ప్రతినిధులుగూడా గణనీయమైన సంఖ్యలో కలిసిరావడం మరో విశేషం.

పౌరహక్కుల బిల్లుకోసం ప్రభుత్వం కసరతు చేస్తున్న సమయంలో నీగ్రో నాయకులు ఇలాటి పథకానికి పూనుకోవడం అధ్యక్షుడు కెనెడీకి నచ్చలేదు.

ప్రయత్నం విరమించమని ప్రతిపాదించటానికి నీగ్రోనాయకులతో వైట్‌హౌస్‌లో సమావేశమయ్యాడు. ఉపాధ్యక్షుడు జాన్సన్, అటార్నీ జనరల్ రాబర్ట్ కెనెడీలు గూడా అందులో పాల్గొన్నారు.

“బిల్లుకు కాంగ్రెస్‌లో ఏవొక్కరు ఎదురుచెప్పకుండా చెయ్యటానికి మేము విశ్వప్రయత్నం చేస్తున్నాం. సొడ్డు దొరికితే అడ్డుకోవాలని కొందరు సభ్యులు కాచుకోనున్నారు. ‘బిల్లు వరకు నాకు అభ్యంతరం లేదు; కానీ, బెదిరింపులకు లొంగిపోయానని అనిపించుకోవడం నాకు కష్టమేస్తూంది’ అనే సాకుతో తప్పుకుం టారు.” అనేది అధ్యక్షుని వాదన.

“నీగ్రోలు రోడ్లమీది కెక్కి చాలారోజులైంది. ఇప్పుడు వాళ్ళందరినీ గడప దాటకుండా కట్టడి చెయ్యడం సాధ్యమేనా? ఉద్రేకంతో రోడ్డెక్కిన జనాన్ని బాధ్యత లేని నాయకులకో, అహింసమీద నమ్మకంలేని నాయకులకో వదిలేయడంకంటే, క్రమశిక్షణతో అహింసాయుతంగా నడిపించే నాయకుల అదుపులో నడిపించడమే మేలౌతుంది.” అనే రాన్డాల్ఫ్ జవాబు కెనెడీని ఆలోచనలో పడేసింది.

“ఈసారి పౌరహక్కులమీద పెద్దగా అవగాహనలేని ప్రదేశాలనుండిగూడా జనం కదులుతున్నారు. ఈ పరిణామంవల్ల, మీరు తలపెట్టే బిల్లుకు మద్దతు పెరిగే అవకాశంగూడా ఉంది. ఇక సమయాసమయాల మాటకొస్తే, మా విచక్షణ మీద ఇప్పటికే మీకు నమ్మకం కుదిరుండాలి. బర్మింగ్‌హాం ఉద్యమానికి ఎన్నుకున్న సమయం సరైందికాదని చాలామంది అనుకున్నారు.” అన్నాడు లూథర్.

“మన అటార్నీ జనరల్‌తో సహా” మందహాసంతో వంతకలిశాడు కెనెడీ.

అప్పటికప్పుడే తీరే సందేహంగాదు అధ్యక్షునిది. నెలరోజుల పరిశీలన తరువాత అతని అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. ప్రదర్శన అవసరాన్ని గుర్తించడమేగాకుండా, అది వీలైనంతా భారీగా జరగాలని కోరుకున్నాడు.

ఆగస్టు 28 ప్రదర్శనకు, బేయర్డ్ రస్టిన్ పర్యవేక్షణలో, ప్రశంసనీయమైన ఏర్పాట్లు జరిగాయి. ఏ రైల్వే స్టేషన్‌లో దిగిన కార్యకర్తలు ఏ కూడలివద్ద ఊరేగింపులో కలవాలో, ఏ బస్సుమెట్టులో దిగిన జనాదులు ఏఏ దారుల్లో గమ్యాన్ని చేరుకోవాలో, విమానాశ్రయంనుండి రాబోయే ప్రముఖులు ఏ రహదారిలో ప్రవేశించాలో నిర్దేశిస్తూ అమలుజేసిన పథకం తొక్కిసలాటకు తావివ్వకుండా అద్భుతమైన సౌకర్యాన్ని కలిగించింది. వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు తరలిస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది తీసుకున్న జాగ్రత్తలుగూడా మన్నన

లందుకున్నాయి. ఆ సమన్వయమే లేకుంటే, ఒక్కసారిగా దిగిన రెండున్నర లక్షల అదనపు సందర్శకులతో అమెరికా రాజధానినగరం అల్లకల్లోలంగా మారుం డేది. అంతటి బ్రహ్మాండమైన ప్రదర్శనలో ఆవగింజంత అపశృతి కనిపించకుండా నిర్ణీత సమయానికి లింకన్ మెమోరియల్ చేరుకోవడం నిర్వాహకుల సమర్థతకు నిదర్శనంగా పత్రికలు మెచ్చుకున్నాయి. ఆ ప్రదర్శనకు తెల్లజాతి మతబోధకులు పెద్దసంఖ్యలో హాజరై, నీగ్రోలతో కలిసిమెలసి ముందుకు నడవడం పౌరహక్కుల ఉద్యమం కూడగట్టిన విలువైన సహకారంగా మీడియా గుర్తించింది.

ఆ సందర్భంగా లూథర్ చేసిన ప్రసంగం చిరస్మరణీయంగా చరిత్రలో నిలిచిపోయే సందేశం.

"మరిచిపోలేని ఈ శుభదినాన్ని, స్వేచ్ఛకోసం జరిగిన మహోన్నత జన ప్రదర్శనగా మనదేశచరిత్రలో నిలిచిపోనున్న ఈ శుభదినాన్ని, మీ అందరితో పంచుకునే అవకాశం కలగడం నేను చేసుకున్న సుకృతం." జనసముద్రాన్ని నలువైపులా నింపాదిగా కలయజూస్తూ మొదలెట్టాడు లూథర్.

"మహోన్నతుడైన ఒక అమెరికన్ పౌరుడు, ఏ మహోన్నతుని జ్ఞాపకచిహ్నం నీడన మనమిప్పుడు నిలుచున్నామో ఆ మహానుభావుడు, నీగ్రోబానిసలకు విముక్తి ప్రసాదించే ఒక శాసనపత్రంమీద వందసంవత్సరాల క్రిందట సంతకం చేశాడు. ఆ శాసనంవల్ల, దయాదాక్షిణ్యాలకు దూరమై, దురాగతాల కొలిమిలో మాడిపోతున్న లక్షలాది బానిసబ్రతుకుల్లో ఆశారేఖ ప్రసరించింది. ఎన్నో తరాలుగా సంకెళ్ళతో గడిపిన జీవితాల్లో చీకటి విచ్చిపోయి సూర్యకాంతి తొంగిచూసింది.

"కానీ, ఆ శాసనం వెలువడి నూరుసంవత్సరాలు దాటిపోయిన తరువాతగూడా నీగ్రోలకు స్వాతంత్ర్యం అందుబాటు కాలేదు; నూరుసంవత్సరాలు దాటిన తరువాత గూడా అవమానకరమైన జాతివివక్షకు బంధీలై, వెలివేయబడిన సామాజిక హోదాకు బానిసలై, నీగ్రో జీవితాలు ఎప్పటిలాగే ఉక్కుపాదంకింద నలిగిపోక తప్పడంలేదు; నూరుసంవత్సరాలు దాటిన తరువాతగూడా, అంతులేని ఐశ్వర్యంతో ఓలలాడే మహాసముద్రం మధ్యలో, అష్టదరిద్రాలకూ ఆలవాలమైన ఏకాకి దీవిలా మనుగడ సాగించడం నీగ్రోలకు తప్పలేదు; ఈ నూరేళ్ళ పొడవునా నీగ్రోగా పిలువబడే మానవుడు, అమెరికన్ సమాజపు వెలుపలిటంచుల్లో దోగాడుతూ, తన జన్మభూమికి తానే కాందిశీకుడై బ్రతికే దీనావస్థ తప్పలేదు.

"అందువల్ల, సిగ్గుచేటైన ఈ వ్యవహారం పదిమందికీ తెలిసేలా చెయ్యటానికి

ఈ దినం మనమంతా ఇక్కడికి చేరుకున్నాం. అంతేగాదు, మనమందరం కలిసి మనదేశ రాజధానికి మరో పనిమీదగూడా ప్రయాణమయ్యాం. మనకిక్కడ ఒక చెక్కును మార్చుకునే పనుంది. దేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించే సందర్భంలో మన గణతంత్రవ్యవస్థ నిర్మాతలు దేశ రాజ్యాంగాన్ని రచించినప్పుడు, అమెరికన్ పౌరుడైన ప్రతిమనిషికి వారసత్వంగా సంక్రమించే ఒక ప్రాంసరీనోటును వారు దేశం తరఫున సంతకం చేశారు. ఆ పత్రంలో వారు ఎంతో విలువైన పదాలతో, పౌరులందరూ . . . . నిజం . . . . అందులో వాడింది పౌరులందరూ అనే పదమే . . . వాళ్ళు నల్లపౌరులను మినహాయించలేదు . . . . నిరపాయంగా జీవించటానికీ, స్వేచ్ఛగా నడుచుకోటానికీ, అనందం పొందటానికీ ఆటంకంలేని హక్కును వాగ్దానం చేస్తూ సంతకం చేశారు. నల్లజాతి పౌరులకు సంబంధించినంతవరకు అమెరికాసమాజం ఆ ప్రాంసరీనోటును ఎగవేసిందని మనకు స్పష్టంగా తేలిపోయింది. 'ఖాతాలో తగినంత జమ లేదు' అనే సంజాయిషీతో మన చేతిలో ఉంచిన చెక్కు వాపసు తిరిగొచ్చింది. ఈ దేశంలో అవకాశాల భాండాగారానికి కొరత ఏర్పడిందంటే, అది మనమెవ్వరం నమ్మలేని సమాచారం. అందువల్ల, మన చేతిలోవున్న ఈ చెక్కును, అడగంగానే స్వాతంత్ర్యమనే ఐశ్వర్యాన్నీ, కోరిన వెంటనే న్యాయస్థానాల నీడలో భద్రతనూ ప్రసాదించే ఈ చెక్కును, ప్రభుత్వ ఖజానాలో మార్చుకునే ఉద్దేశంతో మనమంతా ఇక్కడికి చేరుకున్నాం.

''వంద సంవత్సరాల పుణ్యకాలం దాటిపోయింది. ఆలస్యం చెయ్యటానికి ఇక ఏమాత్రం అవకాశంలేదని అమెరికాను హెచ్చరించే సంకల్పంతో మనమిప్పుడు ఈ పవిత్రస్థలానికి చేరుకున్నాం. ఎప్పుడో వొకప్పుడు దానంతకు అది జరుగుతుందని తీరిగ్గా కాచుకుండే కాలం చెల్లిపోయింది. ఒకేసారి కాకపోయినా, అంచెలంచెలుగా జరగక మానదనే మత్తులో జోగాడే పరిస్థితి దాటిపోయింది. రాజ్యాంగం చేసిన వాగ్దానాలను వాస్తవం చెయ్యవలసిన తక్షణావసరం కట్టెదుట నిలిచింది. వేరుపాటుతనమనే చీకటికూపంనుండి జాతిని వెలుగుబాటలో నడిపించే అవసరం తన్నుకొచ్చింది. తెలుపూనలుపూ పక్షపాతమనే ఊబిలోనుండి దేశాన్ని ఒడ్డుకు లాగి, సౌభ్రాతృత్వమనే గట్టుమీద నిలబెట్టే ఆవశ్యకత చేరువయ్యింది. జాతిభేదాలకు అతీతంగా భగవంతుని సంతానం మొత్తానికి సామాజిక న్యాయాన్ని అందుబాటులో ఉంచవలసిన సమయం సమీపించింది.

''ఈ తక్షణావసరాన్ని నిర్లక్ష్యం చేస్తే దేశం చావుదెబ్బ తింటుంది. నీగ్రోలో

ప్రజ్వరిల్లే ఈ చట్టబద్ధమైన అసంతృప్తి జ్వాల స్వేచ్ఛాసమానతలనే శీతలంతో తప్ప ఇతరత్రా చల్లారదు. 1963 ఆరంభమేగానీ అంతంగాదు. సెగసంతా వెల్లగక్కిన తరువాత చల్లబడక ఏంచేస్తారనే ధీమాతో ప్రశాంతంగా దినసరి వ్యాసంగంలో మునిగిపోయే ఉదాసీనతను కుదుపులతో నిద్రలేపే గడ్డుకాలం వచ్చేసింది.

"నీగ్రోల చేతికి పౌరహక్కులు అందేదాకా అమెరికాకు విశ్రాంతి దొరకదు; ప్రశాంతత దొరకదు. న్యాయమనే వెలుగు ప్రసరించేదాకా సమాజాన్ని కప్పేసిన ముసురును తరిమేయటానికి తిరుగుబాటనే ప్రభంజనం నిరంతరాయంగా హోరెత్తడం మానుకోదు.

"ఐతే, ఈ సంధి సమయంలో, న్యాయమనే అంతఃపురానికి చేరువైన నా సోదర జనానీకానికి, నేను చెప్పవలసిన సందేశ మొకటుంది. ఈ ప్రస్థానంలో, న్యాయసమ్మతమైన మన స్థానాన్ని పొందటానికి జరిపే ఈ పోరాటంలో, దుర్మార్గమైన నడవడికతో మనం నేరస్తులుగా మారగూడదు. మన స్వాతంత్ర్య పిపాసను అసూయా ద్వేషాలతో నిండిన పాత్రనుండి చల్లార్చుకోగూడదు. మన పోరాటంలో హుందాతనం మర్యాదలు గుభాలించాలి. సృజనాత్మకమైన మన ఉద్యమాన్ని హింసాయుత ప్రవర్తనతో దిగజార్చడం భావ్యంగాదు. ప్రత్యర్థుల హింసను పదేపదే మనం ఆత్మబలంతో ఎదుర్కొనే ఔన్నత్యానికి చేరుకోవాలి.

"ఇటీవల, అపారమైన పోరాటపటిమ నీగ్రోసమాజాన్ని ఆవహించడం మంచి పరిణామమే; ఐతే, అది తెల్లజాతి ప్రజానీకాన్ని మూకుమ్మడిగా అనుమానించే దుడుకుతనంగా మారగూడదు. ఈ రెండుజాతుల మనుగడ పరస్పరం పెనవేసుకుని నడుస్తున్నాయనే గుర్తింపు ఎంతోమంది తెల్లసోదరుల్లో కలిగిందనటానికి నిదర్శనం ఈ రోజు వాళ్ళుగూడా మనతో కలిసి నడవడం. తమ స్వాతంత్ర్యం మన స్వాతంత్ర్యంచుట్టూ అల్లుకుపోయిందనే భావన తెల్లసోదరుల్లో కలిగిన తరువాత, మనం ఒంటరిగా ముందుకు పోవాలనే ఆలోచన సమంజసం గాదు. ముందుకు అడుగేసిన తరువాత, వెనుదిరిగి చూడాలనే గుంజాటనకు ఏవొక్కరం లొంగరాదు. మొక్కవోని పట్టుదలతో మునుముందుకు సాగిపోయే కార్యశూరులంగా మనమందరం నిరూపించుకోవాలి.

" 'మీకు తృప్తి కలిగేది ఎప్పుడు?' అంటూ పౌరహక్కుల సాధనకు అంకితమైన కార్యకర్తలను ప్రశ్నించేవారు కొందరున్నారు. ఔను, నోటితో చెప్పలేనంత దారుణంగా పోలీసు పశుత్వానికి నీగ్రోలు బలికావడం తప్పిందాకా మాకు సంతృప్తి

దొరకదు; ప్రయాణంలో అలసిన మా శరీరాలకు రహదారి మోటెల్లలో, పట్టణాల హోటళ్ళలో సేదదీరే సౌకర్యం అందేదాకా మాకు సంతృప్తి దొరకదు; నీగ్రోల పురోగతి చిన్నచిన్న మురికికూపాలనుండి పెద్దమురికికూపాలకు మాత్రమే పరిమితమైనన్ని రోజులు మాకు సంతృప్తి దొరకదు; 'తెల్లవారికి మాత్రమే' అనే ప్రకటనలతో మా బిడ్డల వ్యక్తిత్వాన్ని లూటీజేసి, వాళ్ళ ఆత్మగౌరవాన్ని బూడిదలో కలిపినంత కాలం మాకు సంతృప్తి దొరకదు; మిసిసిపి నీగ్రోకు ఓటువేసే అర్హత కలిగిందాకా, న్యూయార్క్ నీగ్రో ఓటుకు ఒక ప్రయోజనం చేకూరిందాకా మాకు సంతృప్తి దొరకదు; ఔను, మాకు సంతృప్తి దొరకదు; ఈ నేలమీద న్యాయం, ధర్మం ప్రచండమైన ఉరవడితో ప్రవహించేదాకా మాకు సంతృప్తి దొరకదు.

"పోలీసు దర్యాప్తులూ, రౌడీల వేధింపులూ తప్పవని తెలిసిగూడా సాహసంతో ఇక్కడ చేరినవాళ్ళు మీలో ఎందరున్నారో నాకు తెలుసు. క్రిక్కిరిసిన జైలుగదులనుండి ఇటీవలే బయటికొచ్చినవాళ్ళు మీలో ఎందరున్నారో నాకు తెలుసు. స్వాతంత్ర్యమనే మాట వినిపిస్తే చాలు, గూండాల దాడులతో, పోలీసుల దురాగతాలతో తుడిచిపెట్టుకుపోయే ప్రమాదమున్న ప్రదేశాలనుండి వచ్చినవాళ్ళు ఎందరున్నారో తెలుసు. భగవంతుని స్వరూపమైన సహనానికి మీరంతా ప్రతీకలు. ప్రతిఫలాపేక్షలేని సహనం ఫలప్రదమౌతుందనే నమ్మకంతో మునుముందుగూడా మీ కార్యక్రమాన్ని కొనసాగించండి.

"మిసిసిపీకి తిరిగివెళ్ళండి; అలబామాకు తిరిగివెళ్ళండి; దక్షిణ కరోలినా, జార్జియా, లూసియానాలకు తిరిగివెళ్ళండి; ఏనాటికైనా ఈ వాతావరణం మారుతుందనీ, మారక తప్పదనీ గుర్తించిన మనోవికాసంతో తిరిగివెళ్ళండి.

"నిరాశాకూపంలో తడుములాడుకునే అవసరం మనకింక లేదు. స్నేహితులారా, నా మాటగా నేనొకటి మీకు చెప్పదలుచుకున్నాను; కష్టాలను ఎదుర్కోవడం రేపూ మాపూ మనకు తప్పకపోవచ్చు. ఐనా, భవిష్యత్తు గురించి నేనొక కల కంటున్నాను. మన దేశం తన ఆదర్శాల నిజమైన స్వరూపంగా ఎదుగుతుందని నేను కలగంటున్నాను; మనుషులంతా సమానులుగా సృష్టించబడ్డారనే స్వయం నిరూపిత సత్యానికి ఆదర్శంగా నిలుస్తుందని నేను కలగంటున్నాను.

"ఒకానొకరోజు, జార్జియా ఎర్రకనుమలమీద, ఒకనాటి బానిసల బిడ్డలూ, బానిస యజమానుల బిడ్డలూ కలసిమెలసి సోదరత్వమనే సహపంక్తిలో కూర్చుంటారని నేను కలగంటున్నాను.

‘‘ఒకానొకరోజు, మిసిసిపి రాష్ట్రంగూడా, అన్యాయాలకూ అణిచివేతలకూ ఆలవాలమైన మిసిసిపి రాష్ట్రంగూడా, స్వేచ్ఛాధర్మాల ఒయాసిస్‌గా మారుతుందని నేను కలగంటున్నాను.

‘‘ఒకానొకరోజు, నా నలుగురు చంటికూనల అర్హత, వాళ్ళ వొంటి రంగుతో కాకుండా, నడవడికలోని విశేషాలతో అంచనా వేయబడతుందని నేను కలగంటున్నాను.

‘‘ఒకానొకరోజు, అలబామా నడిబొడ్డులో, క్రూరాతిక్రూరమైన జాతివివక్షా వాదులకూ, ‘అడ్డగించండి, రద్దుచేయండి’ అనే నినాదాలతో పెదవులు తడుపుకునే గవర్నర్లకూ నిలయమైన అలబామా నడిబొడ్డులో, నల్లజాతి బాలబాలికలతో తెల్లజాతి బాలబాలికలు చేతులు కలిపి ఆడుకుంటారని నేను కలగంటున్నాను.

‘‘ఒకానొకరోజు, లోయలన్నీ పెల్లుబికి, కొండలూ పర్వతాలూ నేలమట్టమై, మిట్టపల్లాలన్నీ ఏకమై, ఎగుడుదిగుడులేని సమతలాలౌతాయనీ, మానవులంతా ఒకే జట్టుగా భగవంతుని ఔన్నత్యాన్ని ఆస్వాదించే రోజు వస్తుందనీ నేను కలగంటున్నాను.

‘‘ఇది మన విశ్వాసం. ఈ విశ్వాసంతోనే నేను దక్షిణాదికి తిరిగివెళుతున్నాను. ఈ విశ్వాసం ఉన్నప్పుడే నిరాశాశిథిలంనుండి మనం ఆశను పెకలించగలుగుతాం. ఈ విశ్వాసం ఉన్నప్పుడే, కర్ణకఠోరంగా ఈ దేశంలో ఘోషిస్తున్న అపశృతులను ఆహ్లాదకరమైన సౌభ్రాతృత్వ సంగీతంగా మనం మార్చగలుగుతాం.

‘‘ఈ విశ్వాసం కలిగుంటేనే మనం కలిసి పనిజేస్తాం, కలిసి ప్రార్థిస్తాం, కలిసి పోరాడుతాం, కలిసి జైలుకు వెళతాం. ఏదోవొకరోజు మనం స్వతంత్రుల మౌతామనే విశ్వాసం కలిగుంటేనే రొమ్మొడ్డి పోరాటానికి నిలబడగలుగుతాం.

‘‘ఆ రోజు, నేను కలగంటున్న ఆ రోజు, భగవంతుని సంతానమంతా ఒకే గొంతుతో - ‘స్వేచ్ఛా మకరందం చిందే నా జన్మభూమి నీ ఆలయం, నిన్నే ప్రస్తుతించే నా మనసే నీ దేవాలయం, నా పూర్వీకుల జన్మభూమి, యాత్రీకుల పుణ్యభూమి, స్వాతంత్ర్యం నలుదెసలా మారుమ్రోగే పవిత్రభూమి’ అంటూ నిజమైన అర్థంలో గానం చేస్తారు.

‘‘కాబట్టి,

‘‘న్యూహాంప్‌షైర్ పర్వతశిఖరంనుండి స్వాతంత్ర్యం మారుమోగనివ్వండి.

‘‘పెన్సెల్వేనియా అలీఘనీలనుండి స్వాతంత్ర్యం మారుమోగనివ్వండి.

‘‘క్యాలిఫోర్నియా పర్వతసానువులనుండి స్వాతంత్ర్యం మారుమోగనివ్వండి.

“ఇంకా,

“జార్జియా రాతిగుట్టలనుండి స్వాతంత్ర్యం మారుమోగనివ్వండి.

“టెన్నిసీ కొండచరియల్లో స్వాతంత్ర్యం మారుమోగనివ్వండి.

“మిసిసిపిలోని ప్రతి గుట్టనుండి, ప్రతి పుట్టనుండి స్వాతంత్ర్యం మారు మోగనివ్వండి.

“ఇలా స్వాతంత్ర్యం మారుమ్రోగేలా చేయగలిగినప్పుడు, పల్లెపల్లెలో మారుమ్రోగేలా చేయగలిగినప్పుడు, ప్రతి రాష్ట్రంలో ప్రతి పట్టణంలో మారుమ్రోగేలా చేయగలిగినప్పుడు, దేవుని సంతానమంతా - నల్లజాతి తెల్లజాతి అనే తేడాలు లేకుండా, క్యాథలిక్కులూ ప్రొటెస్టెంట్లూ అనే భేదాలు లేకుండా, యూదులూ జెనెటిల్లూ అనే అరమరికలు లేకుండా -‘స్వేచ్ఛలో ప్రవేశించాం చివరకు, స్వేచ్ఛలో ప్రవేశించాం చివరకు, భగవంతుడా ధన్యవాదాలు నీకు, స్వేచ్ఛలో ప్రవేశించాం చివరకు’ అనే నీగ్రో భావనను నిజం చేయగల రోజును అనతికాలంలోనే చేరు కుంటాం.”

లూథర్ ప్రసంగం ముగిసింది. కరతాళధ్వనులతో వాషింగ్టన్ డి.సి. దద్ద రిల్లింది. ఆ క్షణంలో దేవుని సామ్రాజ్యం ప్రత్యక్షమైనట్టు భావించిన శ్రోతలు కంటి తడితో సభనుండి నిష్క్రమించారు.

# పంజా విసిరిన పెద్దపులి

అహింసావాదులు ఆశించినంత సరసంగా దొరికే పదార్థంగాదు పరివర్తన. రంగు వెలిసిందాకా కొన్ని మార్పులు పరివర్తనలాగే కనిపిస్తుంటాయి. గాయంతో బాధపడే పులి కోలుకునేదాకా వేట మానేసినా, వేటాడటం ఆ జంతువు స్వభావం.

ప్రశాంతత నెలకొనిందనే నమ్మకంతో బర్మింగ్‌హాం నుండి ఫెడరల్ బలగాలు వైదొలగిన కొద్దిరోజులకే అమాయకులమీద కు క్లక్స్ క్లాన్ తన పంజా విసిరింది. విద్యార్థుల ఊరేగింపు ప్రారంభానికి కూడలిగా నిలిచిన 'పదహారవ వీధి బాప్టిస్ట్ చర్చి'లో ఆదివారం ప్రార్థనకు ముందు క్లాన్ గూండాలు డైనమైట్లు అమర్చారు. ఆ దాడిలో పది సంవత్సరాలైనా ప్రపంచాన్ని అనుభవించని నలుగురు బాలికలు ప్రాణాలను పోగొట్టుకోగా, ప్రార్థన చేసుకుంటున్న 21 మంది అనామకులు తీవ్రంగా గాయపడ్డారు. నేరస్థలానికి చేరుకున్న పోలీసులు, పరిస్థితిని అదుపుజేసే సాకుతో, ఏ పాపం ఎరుగని ఇద్దరు యువకులను తుపాకులతో బలితీసుకున్నారు. ఆ ఇద్దరు యువకులు నీగ్రోలే!

"భగవంతుడా! నీ గుడిలోగూడా మాకు రక్షణ కరువేనా?" అంటూ విలపించే ఒక తల్లి కడుపుకోత లూథర్ గుండెలను పిండేసింది. ఏ పోరాటంలోనైనా కొందరు అమరవీరులు కావడం సహజం. రెండు నెలల ముందు ప్రాణాలు బలిచేసిన మెడ్గార్ ఎవర్స్ పౌరహక్కుల పోరాటంతో ప్రత్యక్ష్యంగా సంబంధాలు కలిగిన సైనికుడు; తపాలా బంట్రోతుగా పనిజేస్తూ, ఉత్తరాల రూపంలో తన పౌరహక్కుల సందేశాన్ని గడపగడపకూ చేర్చిన సాహసానికి ప్రాణాలు కోల్పోయిన విలియం మూర్ గూడా పౌరహక్కుల పోరాటంలో సిపాయి. కానీ, మాంసపు ముద్దలుగా మారిపోయిన ఈ పసిపాపలు పోరాటమనే మాటే ఎరుగని అమాయకులు. విచక్షణా రహితమైన ఈ రక్తదాహంతో తీవ్రవాదులు ఆశించే ప్రయోజనమేమిటో లూథర్‌కు తెలీలేదు.

ఆ దాడిలో చనిపోయిన బాలికలకు దహనసంస్కారాలు జరిగే సమయంలో ఇద్దరుముగ్గురు మతబోధకులు మినహా, మచ్చుకైనా ఒక్క తెల్లముఖం కనిపించక పోవడం లూథర్‌ను మరింత క్రుంగదీసింది. ఏ మనిషికీ హాని కలిగించని పసికూనల అకాలమరణానికి సానుభూతైనా తెలపజాలని బర్మింగ్‌హాం తెల్లజాతి, తన మానవ

త్వాన్నీ, సంస్కారాన్నీ అదివరకే సమాధి చేసిం దనిపించింది. ఆ ఉదాసీనతను ఆక్షేపిస్తూ ఒక ప్రదర్శన జరపాలనే లూథర్ ఉద్రేకాన్ని, 'ఆవేశంతో తీసుకునే నిర్ణయాలు క్షేమకరంగా ఉండ'వనే హితవచనాలతో అతని మిత్రులు నివారించారు.

తనలో తాను కుమిలిపోతున్న లూథర్‌కు ఆ మరుసటిరోజు టెలివిజన్‌లో ఈ విషయంమీద కెనెడీ చేసిన ప్రసంగం కొంత ఊరట కలిగించింది. ''న్యాయాన్నీ, శాంతిభద్రతలనూ పరిరక్షించటానికి ఈ ప్రభుత్వం వెనకాడదని ఏహొక్కరు మరిచి పోగూడదు. జరిగిన విషాదకరమైన దారుణానికి ప్రతిస్పందనగా బర్మింగ్‌హాం పట్టణంతో పాటు, అలబామా రాష్ట్రమూ, ఈ దేశ ప్రజానీకంలో మానవత్వం జాగృతమైతే మరిన్ని ప్రాణాలు పోకముందే మన దేశాన్ని ముందుకు నడిపించడం వీలౌతుంది. ప్రతీకారానికి రెచ్చగొట్టకుండా, ఉద్రేకాలను అదుపుజేస్తూ శాంతియుత వాతావరణానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్న బర్మింగ్‌హాం నీగ్రోనాయకులను ఈ సందర్భంగా నేను అభినందిస్తున్నాను'' అనేది కెనెడీ ప్రసంగ సారాంశం.

అధ్యక్షుని నోట 'మరికొన్ని ప్రాణాలు బలికాకుండా' అనే మాట విన్నప్పుడు లూథర్ ఉలికిపడ్డాడు. పౌరహక్కుల నాయకత్వాన్ని రంగంనుండి తొలగించడానికి తెల్లజాతి తీవ్రవాదులు హత్యాకార్యక్రమాన్ని పాటించడం మొదలెట్టి పది సంవత్స రాలు దాటిపోయింది. ఫ్లోరిడాలో హ్యారీ మూర్ దంపతుల హత్యతో ఈ పథకానికి అంకురార్పణ జరిగింది; మిసిసిపి లో 'జార్జ్ లీ'ని చంపడంతో మారాకు తొడిగింది; రైఫిల్‌తో కాల్చి, విలియం మూర్‌ను రోడ్డుపక్కన పడేయడంతో మొదలు బలిసింది; ఇటీవల, పట్టపగలు సొంతఇంటి మెట్లమీద మెడ్గార్ ఎవర్స్‌ను ఖూనీ చెయ్యడంతో పూతకొచ్చింది. దక్షిణాది రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా జరుగుతున్న హత్యలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ వాతావరణంలో తన భవిష్యత్తును ముందే ఊహించుకున్నాడు లూథర్. జీసెస్‌ను శిలువకు చేర్చిన క్రూరత్వం, మహాత్మాగాంధీని కబళించిన మాత్సర్యం, అబ్రహాం లింకన్ను బలితీసుకున్న రాక్షసత్వం, తరతరాలుగా మంచితనాన్ని వెంబడించడం అతడు భారతదేశంలో ఉన్నప్పుడే గుర్తించాడు. కానీ, తన సమాజాన్ని ఒక సమైక్యశక్తిగా రూపొందించి, అత్యుత్తమ ప్రజాస్వామ్యంగా అమెరికాను ముందుకు నడిపించాలని తపించే దేశాధ్యక్షుణ్ణి రేపోమాపో ఈ సమాజం బలిగొంటుందని అతడు ఊహించలేదు.

శాంతిభద్రతల సమస్యమీద చర్చించడానికి, పౌరహక్కుల రంగంలో ప్రసిద్ధు లైన నాయకులందరినీ ఆహ్వానించి, వైట్‌హౌస్‌లో సమావేశమయ్యాడు కెనెడీ.

తన ఆవేదననంతా అధ్యక్షుని ముందు లూథర్ వెళ్ళగక్కాడు -

''బర్మింగ్‌హాం పరిణామాలు కేవలం ఆ నగరానికే పరిమితమైనవి కావు. ఆ రాష్ట్రాన్నీ, ఈ దేశాన్నీ మొత్తంగా అతలాకుతలం చేసే తీవ్రతకు అవి నిదర్శనం. మన దేశ భవిష్యత్తునే అవి సవాలు చేస్తున్నాయి. నా అభిప్రాయం ప్రకారం బర్మింగ్‌హాంలో ఆంతరంగిక సంక్షోభం మొదలయింది. నా అభిప్రాయం పొరబాటు కాదని నిరూపించే ఆధారాలు ఎన్నైనా మీకు చూపించగలను.

''ప్రతీకారంకోసం నీగ్రో సమాజం తహతహలాడుతూంది. ఈ ఆవేశాన్నీ, అయోమయాన్నీ ఏ దారిలో నడిపించాలో మాకు పాలుపోవడంలేదు. ఆత్మరక్షణకైనా అవకాశం లేనంత ఏకాకులుగా తమను వదిలేశారనే మనస్తాపంతో నీగ్రోలు కుతకుత లాడుతున్నారు. వాళ్ళకు ఇంట్లోవున్నా భద్రతలేదు, వీధిలో కొచ్చినా భద్రతలేదు. చివరకు ప్రార్థనా మందిరాల్లో తలదాచుకున్నా ప్రాణాలు దక్కుతాయనే నమ్మకం లేదు. ఇలాటి వాతావరణంలో వాళ్ళను సమాధానపరిచే సంజాయిషీ ఏమిటో మీరే చెప్పండి.

''మేము మనసా వాచా కర్మణా అహింసావాదులం. 'నువ్వు బోధించే అహింసతో మా ప్రాణాలు ఎలా నిలుస్తాయో చెప్ప'మని ప్రజలు నిలేస్తూంటే, ఏమని బుజ్జగించాలో మాకు తెలియడంలేదు.''

మిగతా పౌరహక్కుల నాయకులు లూథర్‌తో ఏకీభవించారు.

నిజాయితీతో నిండిన ఆవేదనతో కెనెడీ ముఖం విచారగ్రస్తమైంది. ఈ వాతావరణాన్ని తుదముట్టించే పట్టుదలతో అతని పిడికిలి బిగిసింది. కానీ . . .

కెనెడీకి ఆ అవకాశం దక్కలేదు. అతడు టెక్సాస్ రాష్ట్ర పర్యటనలో ఉండగా, నవంబర్ 22వ తేదీ మిట్టమధ్యాహ్నం, డల్లస్ నగరంలోని నడివీధిలో, సూటిగా తలలో దూరిన రైఫిల్ తూటాకు తన ప్రాణాలను సమర్పిస్తూ, తన ఆశయాలను తనతోటే తీసుకెళ్ళాడు.

# ఫలించిన కల

కెనెడీ దుర్మరణంతో పౌరహక్కుల సంఘాలు అయోమయంలో పడి పోయాయి. తుఫానులన్నీ తట్టుకుని నావ గట్టెక్కే సమయంలో, కనిపించిన ఒడ్డు హఠాత్తుగా కనుమరుగైనట్టు గింజుకున్నాయి. తదుపరి కర్తవ్యం ఆలోచించటానికి 1963 నవంబర్ 26వ తేదీన నాయకులంతా సమావేశమయ్యారు. 'అమరుడైన అమెరికన్ అధ్యక్షునికి నివాళిగా, ఆయన తలపెట్టిన పౌరహక్కుల బిల్లుకు కార్యరూపం కలిగించ'మని ఒక సంయుక్త ప్రకటనలో వైట్‌హౌస్‌కు విజ్ఞప్తి చేశారు.

అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన లిండన్ జాన్సన్ ఆ విజ్ఞప్తికి అంత జరూరుగా స్పందిస్తాడని పౌరహక్కుల నాయకులు ఊహించలేదు. దక్షిణాది రాష్ట్రమైన టెక్సాస్ నుండి వచ్చినవాడు జాన్సన్. 'నిగ్గర్ అభిమాని'గా పిలిపించుకోవటానికి దక్షిణాది తెల్లమనుషులు ఇష్టపడరు. దక్షిణాదినుండి ఎదురయ్యే దుమారాన్ని లెక్కలోకి తీసుకోకుండా, జాన్సన్, పౌరహక్కుల బిల్లును తన ఆమోదానికి తీసుకురాక తప్పదని ఆ మరుసటిరోజే తన అనుచరులను ఆదేశించడం దేశాన్ని విస్మయంలో ముంచింది.

"ఇది సాహసోపేతమైన నిర్ణయం" అంటూ జాన్సన్ను కొనియాడాడు లూథర్. మిగతా పౌరహక్కుల నేతలుగూడా ప్రశంసల జల్లులు కురిపించారు. సాధకబాధకాలు చర్చించటానికి డిసెంబర్ 3వ తేదీన లూథర్‌తో యాభై నిమిషాలపాటు అధ్యక్షుడు జాన్సన్ సమాలోచన జరిపాడు. నీగ్రో సమస్యల లోతుపాతుల గురించి జాన్సన్ కున్న అవగాహన లూథర్‌ను ఆశ్చర్యపరిచింది. "పౌరహక్కులకోసం ప్రాకులాడే ఒక దక్షిణాదివాసి అమెరికా తెల్లసౌధంలో బసచేయడం దక్షిణాదివాసినైన నాకు పట్టరాని సంతోషాన్ని కలిగించింది" అంటూ స్పందించాడు వైట్‌హౌస్ వెలుపలికొచ్చిన లూథర్.

కెనెడీ లేని కొరతనుండి క్రమంగా కోలుకుంటున్న లూథర్‌కు 1964 జనవరి 3వ తేదీ వెలువడిన 'టైమ్' మ్యాగజైన్ అంతులేని ఆత్మస్థైర్యాన్ని సమకూర్చింది. లూథర్ ముఖచిత్రంతో వెలువడిన ఆ సంచిక, అతన్ని 1963కు 'మ్యాన్ ఆఫ్ ది ఇయర్'గా ప్రస్తావించింది. అది చాలా అరుదైన గౌరవం; లూథర్ కిరీటానికి మరో కలికి తురాయి.

ప్రత్యర్థులు మాత్రం ఈ దెబ్బతో లూథర్ చిత్తైపోడానికి ఎంతోకాలం పట్ట

దని సంబరపడ్డారు. వాళ్ళది సహజమైన ఎదురుచూపే. అరుదైన హోదాను అందుకున్న తరువాత దాన్ని నిలుపుకోటానికి మర్యాదస్తునిగా కనిపించాలనే తాపత్రయంతో, ఆదర్శాల విషయంలో రాజీపడని ఉద్యమనాయకులు ప్రపంచంలో అరుదు. కానీ, పొగడ్తలకోసం ఆదర్శాలను వదులుకునే బలహీనత లూథర్‌కు లేదని అతని తదుపరి జీవితం నిరూపించింది. అతడు నిర్వహించిన 1964 పోరాటాల్లో మరింత చొరవ, మరింత తెగువ కనిపించాయి. ఆ ఏడాది లూథర్ చేపట్టిన కార్యక్రమాల్లో ప్రధానంగా చెప్పుకోవలసినవి సెయింట్ అగస్టీన్, మిసిసిపి ఉద్యమాలు.

కొత్తగా కనుగొన్న అమెరికా ఖండానికి యూరప్‌నుండి పోటెత్తిన వలసల సందర్భంలో, అట్లాంటిక్ సముద్ర తీరంలో ఉనికిలోకొచ్చిన మొట్టమొదటి జనావాసం సెయింట్ అగస్టీన్ పట్టణం. అది ఇప్పటి ఫ్లోరిడా రాష్ట్రంలో పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతిగాంచిన ప్రదేశం. విస్తీర్ణంలోనూ జనాభాలోనూ చెప్పుకోదగినంత పెద్దది కాకపోయినా, చారిత్రికంగా సెయింట్ అగస్టీన్‌కు అనేక ప్రత్యేకతలున్నాయి. సముద్ర మార్గంలో అది ఆఫ్రికా ఖండానికి అతి చేరువైన తీరం కావడం మూలంగా, బానిసవ్యాపారం పెద్ద ఎత్తున కొనసాగిన రోజుల్లో, ఆఫ్రికానుండి తీసుకొచ్చిన మానవ సరుకుల అమ్మకం కొనుగోళ్ళకు అది పేరుగాంచిన సంత. అందువల్ల, ఏ నీగ్రోలను అమ్మకపు సరుకులుగా నిన్నామొన్నటిదాకా వ్యాపారం చేసిందో ఆ జాతిని పశువులుగా చూడటం సెయింట్ అగస్టీన్ దొరతనానికి వంశపారంపర్యంగా సంక్రమించిన సాంప్రదాయం.

ఆ సాంప్రదాయాల విషవలయంలో, డా.హేలింగ్ అనే మానవతావాది 1959లో నల్లజాతి హక్కులకోసం ప్రయత్నానికి ఉపక్రమించాడు. రెండేళ్ళ ఒంటరి పోరాటం తరువాత అతనికి విలియం అనే మతబోధకుని తోడు దొరికింది. పోరాటం బలహీనంగా సాగిన తొలిదశలో వాళ్ళను గురించి పరాచికంగా ప్రస్తావించడం మినహా, క్లాన్ సభ్యులకు ఆగ్రహం కలుగలేదు. ఉద్యమం పుంజుకోవడం గమనించిన తరువాత, ఇక ఉపేక్షించడం తగదనుకున్నారు. 1963 సెప్టంబర్‌లో, డా.హేలింగ్ తోపాటు మరో ముగ్గురు నీగ్రోలను ఎత్తుకెళ్ళి, కిరోసిన్ గుమ్మరించి తగులబెట్టే సమయంలో, విద్యుక్తధర్మాన్ని గౌరవించే ఒక పోలీసు అధికారి నేరస్థలం చేరుకుని వాళ్ళ ప్రాణాలు రక్షించాడు.

1964 మార్చి 6వ తేదీన ఫ్లోరిడాలోని 'ఒర్లెండో' నగరంలో ఎస్.సి.ఎల్.సి.

నిర్వహించిన ఊరేగింపు సందర్భంగా డా.హేలింగ్‌కు లూథర్‌ను కలిసే అవకాశం దొరికింది. తీరుబాటు సమయం చూసుకుని, తన పట్నంలోని పరిస్థితిని అతడు లూథర్‌కు వివరించాడు. నిర్లక్ష్యం చెయ్యటానికి వీలులేని లక్ష్యంగా లూథర్‌కు కనిపించింది సెయింట్ అగస్టీన్. హేలింగ్ సాహసాన్ని మెచ్చుకుంటూ, సహకారాన్ని వాగ్దానం చేశాడు లూథర్.

ఐతే, గత మూడు నెలలుగా మిసిసిపి రాష్ట్రంలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టిన ఎస్.సి.ఎల్.సి. ప్రధానసిబ్బంది అక్కడ తలమునకలుగా కూరుకుపోయుంది. బర్మింగ్‌హాం సంఘటనల తరువాత, ధైర్యం కూడగట్టుకున్న మిసిసిపి నీగ్రోల్లో ఓటర్లుగా నమోదు కావాలనే కోరిక బలంగా పెరిగింది. కానీ, మిసిసిపి వంటి రాష్ట్రంలో నీగ్రోలను ఓటర్లుగా చేర్పించడం జల్లెడతో నీళ్ళు తోడే ప్రయత్నంతో సమానం. ఒకవైపు క్లాన్ గూండాలూ, మరోవైపు పోలీసు బలగాలూ స్థానిక నాయకుల ప్రయత్నాన్ని అడుగడుగునా అడ్డుకున్నాయి. ప్రాణాలకు తెగించి ఏడాది పొడవునా ప్రయత్నించగా, 1963లో రాష్ట్రం మొత్తానికి నమోదు చేయించగలిగిన నీగ్రో ఓటర్ల సంఖ్య 1636కు దాటలేదు.

దానికి కారణం మిసిసిపి ప్రత్యేకత. హింసను వినోదించే సాంప్రదాయంలో అమెరికాలోని ఏ ఇతర రాష్ట్రం మిసిసిపికి సాటిరాదు. బహుశా, దాని భౌగోళిక పరిస్థితులు అందుకు కారణం కావచ్చు. విస్తారమైన వ్యవసాయ క్షేత్రాలతో విలసిల్లే పీఠభూమి మిసిసిపి. ప్రపంచంలో మిక్కిలి పొడవైన ప్రవాహంగా గుర్తింపు పొందిన మిసిసిపి నది ఆ రాష్ట్రానికి పడమటి సరిహద్దు. అందులో కలవటానికి తూర్పునుండి ఉరకలేసే అనేకానేక ఉపనదులతో సాగునీటికి కొదవలేని సస్యశ్యామల భౌగోళిక సానుకూలత ఆ రాష్ట్రానికి ప్రకృతి ప్రసాదించిన సౌకర్యం. అందువల్ల, తన మనుగడ కోసం అది ఇప్పటికీ నీగ్రోల చెమటమీద ఆధారపడిన ప్రాంతంగా మిగిలిపోయింది. శ్రమజీవిని చెప్పుచేతల్లో ఉంచుకునే ఏ సౌకర్యాన్నీ పెత్తందార్లు వదులుకోలేరు. కాబట్టి, కు క్లక్స్ క్లాన్‌కూ, వాళ్ళ 'లించింగ్' విధానాలకూ బలమైన కేంద్రంగా మిసిసిపి రాష్ట్రం కొనసాగడం సహజ పరిణామం.

ఎస్.సి.ఎల్.సి., కోర్ కమిటీ, ఎస్.ఎన్.సి.సి.లు కలిసి 1964 జనవరిలో మిసిసిపి మీద ముప్పేట దాడికి పూనుకున్నాయి. వచ్చిన చిక్కేమిటంటే, మిసిసిపి రాష్ట్రంలో బర్మింగ్‌హాం తరహా ఉద్యమానికి అవకాశం బొత్తిగాలేదు. మూడు పూటలా కడుపు నిండడమే గగనమైన మిసిసిపి నీగ్రోలకు వ్యాపారస్థులను లొంగ

దీసేంత కొనుగోలుశక్తి లేకపోవడమే అందుకు కారణం. వాళ్ళ సగటు తలసరి సాంవత్సరిక ఆదాయం ఐదువందల డాలర్లకు మించదు. చాలీచాలని సంపాదనతో పూట గడవడమే కష్టమైన పేదలు, ఖరీదైన ఆహార పానీయాలు కొట్లదగ్గర కనిపించ డమే అపహాస్యంగా ఉంటుంది. అందువల్ల, ఎందరు కలిసినా ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయడం మినహా, చేపట్టగల ప్రత్యామ్నాయం అక్కడ దొరకలేదు.

మిసిసిపిలో జరుగుతున్న మహాయజ్ఞంలో ప్రశంసనీయమైన పాత్రను పోషించిన ఘనత ఉత్తరాది విద్యార్థులకు దక్కుతుంది. స్థానికులకు సహకారంగా ఆ వేసవి సెలవుల్లో 'ఫ్రీడం సమ్మర్ ఆర్మీ' పేరుతో వందలాది విద్యార్థులు ఓహియో రాష్ట్రంనుండి మిసిసిపి చేరుకున్నారు. వాళ్ళల్లో తొంభైశాతం పైబడి తెల్లజాతి విద్యార్థులు. ''ఈసారి వేసవి సరదాలన్నిటికి మనం సెలవు ప్రకటిస్తున్నాం. ఈ వేసవిని మనం మిసిసిపిలో గడపాలి. అక్కడి కెళ్ళి ప్రాణంతో తిరిగొస్తే సంతోషమే. కానీ, అక్కడికెళ్ళి, నిరుపేద నీగ్రోల గుడిసెలో కూర్చుని, వాళ్ళతో కబుర్లు చెప్పుకోవడం దానికి మించిన సంతోషం. మనం భోజనశాలల్లో బైఠాయింపులు జరపటానికి వెళ్ళడంలేదు. ఎందుకంటే, మిసిసిపి నీగ్రోల దగ్గర అంతటి ఖరీదైన ఆహారం కొనగల శక్తిలేదు. ఇంటింటికి వెళ్ళి పుస్తకాలు పంచడం, చదవడం వ్రాయడం నేర్పించడం, సామాజిక చైతన్యం కలిగించడం మన ధ్యేయంగా పనిచేస్తున్నాం.'' అనే స్ఫూర్తితో ఓహియో విద్యార్థులు పనిలో నిమగ్నమయ్యారు.

సిబ్బంది కొరత కారణంగా సెయింట్ అగస్టీన్ను తాత్సారం చెయ్యడం లూథర్‌కు సబబుగా తోచలేదు. సంస్థలో అనుభవం సంపాదించిన నాయకత్వానికి ఇప్పుడు కొదువ లేదు. అందువల్ల, మార్చి నెలాఖరుకు మరో ప్రతినిధిబృందాన్ని తయారుజేసి సెయింట్ అగస్టీన్‌కు పంపించాడు. ఆ సవాలుకు జవాబుగా, ఫ్లోరిడా నలుమూలలనుండి కు క్లక్స్ క్లాన్ గూడా ఆ పట్నంలో మొహరించింది. ఏప్రిల్ మొదటి వారంలో పౌరహక్కుల ప్రదర్శనలు మొదలయ్యాయి. సరిగ్గా ప్రదర్శన జరిగే సమయంలో రంగంనుండి పోలీసులు జారుకుంటారు. క్లాన్ గూండాలు చుట్టుముట్టి ప్రదర్శకులను చితకబాది వెళ్ళిపోతారు. కానీ, క్లాన్ ఆగడాలకు ప్రదర్శ కులు జంకలేదు. ప్రతిరోజూ దెబ్బలు తింటూనే రెండు నెలలపాటు నిర్విరామంగా ఊరేగింపులు నిర్వహించారు. గతకొద్దిరోజులుగా నీగ్రోల ఆందోళన రాత్రి వేళలకు విస్తరించింది. చీకటి పడిన తరువాత, అలనాటి బానిసమార్కెట్ ఆవరణలో గుంపు

లుగా చేరడం, కొద్దిసేపు స్వాతంత్ర్యగీతాలు పాడుకుని తిరిగిరావడం నూతన కార్యక్రమంగా తీసుకున్నారు.

స్వయంగా ఊరేగింపులో పాల్గొనటానికి అబెర్నెథీతో కలిసి లూథర్ మే 31వ తేదీన సెయింట్ అగస్టీన్ ప్రవేశించాడు. చీకటిపడిన తరువాత జరిగే ప్రదర్శనలను నిషేధిస్తూ అదేరోజు పోలీసు కమిషనర్ డేవిస్ ఆదేశాలు జారీచేశాడు. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలుచేసి, లూథర్ అక్కడే మకాం వేశాడు. పట్టణంలోని ప్రతి చర్చికి తిరుగుతూ, తన ఉపన్యాసాలతో సాహసానికి ఊపిరి పోశాడు. లూథర్ అక్కడే బస చేయడటంతో నీగ్రోప్రజానీకంలో ఉత్సాహం, తెల్లజాతి వ్యాపారవర్గంలో కలకలం పెరిగిపోయాయి.

జూన్ 9వ తేదీన కమిషనర్ ఉత్తరువులు కోర్టులో రద్దయ్యాయి. లూథర్ రాత్రివేళ ఊరేగింపుకు తయారయ్యాడు. ఊరేగింపు మధ్యలో పోలీసులు అతన్ని అరెస్టుచేసి జైలుకు తరలించారు. స్వేచ్ఛగా తిరిగే లూథర్‌కంటే కటకటాల మాటునున్న లూథర్ బలవంతుడని అరెస్టుచేసిన మరునాడే కమిషనర్‌కు తెలిసొచ్చింది. సెయింట్ అగస్టీన్ అలజడి జాతీయ పత్రికల పతాకశీర్షికల కెక్కింది. పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయంమీద ఆధారపడిన సెయింట్ అగస్టీన్ వ్యాపారం అప్పటికే సంక్షోభంలో కూరుకుపోయుండగా, జాతీయస్థాయిలో జరిగే ఈ ప్రచారానికి వ్యాపారస్తులు బెంబేలుపడ్డారు. పరిస్థితి చేజారకుండా జాగ్రత్త పడమని ఫెడరల్ గవర్నమెంటు రాష్ట్రగవర్నరును హెచ్చరించింది. ఒత్తిడికి నలిగిన సెయింట్ అగస్టీన్ నగరం సంప్రదింపులకు రహస్య సంకేతాలు ప్రసారంజేసింది. ఐతే, అందుకు ఒక షరతుంది - లూథర్ పట్టణం విడిచి వెళ్ళిపోతేనే సంప్రదింపులు. అందుకు లూథర్ సంతోషంగా అంగీకరించాడు. అనుకున్నది నెరవేరడం ప్రధానంగానీ, అది తన చేతులమీదే జరిగాలనే ఉబలాటం అతనికి లేదు. సంప్రదింపులకు అవకాశమిస్తూ జూన్ 20న బెయిలుమీద విడుదలై అట్లాంటా చేరుకున్నాడు. తరువాత, రాష్ట్ర గవర్నర్ చొరవతో రాజీ ప్రయత్నాలకు నలుగురు మధ్యవర్తుల సంకీర్ణకమిటీ ఏర్పాటయింది.

ఈ లోపుగా, చిరకాలంనుండి ఎదురుజూసే పౌరహక్కుల బిల్లు పార్లమెంటు ఉభయసభల్లో గట్టెక్కింది. కెనెడీ సంస్మరణ, జాన్సన్ చాకచక్యాలు నల్లేరు మీద బండినడకలా ఈ విజయాన్ని సునాయాసంగా సాధించాయి. కన్నీటి తుడుపుగా తీసుకొచ్చిన బిల్లుగా కాకుండా, సంతృప్తికరమైన రూపంలో అది వెలువడటం

పౌరహక్కుల నేతలకు ఆనందం కలిగించింది. నీగ్రో హక్కుల విషయంలో, లింకన్ బిల్లు తరువాత ఇంత సమగ్రమైన రూపంలో వెలువడిన బిల్లు అమెరికా చరిత్రలో మరొకటిలేదు. దాన్ని రూపొందించిన ఘనత జాన్సన్‌కు దక్కింది.

ఆ బిల్లు చట్టం కావటానికి ఇక మిగిలిన తంతు అధ్యక్షుని సంతకమే. ఆ వేడుకకు 1964 జులై 2వ తేదీని నిర్ణయించారు. వేడుకలో పాల్గోటానికి పౌరహక్కుల నాయకులందరినీ వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. బిల్లు మీద సంతకం జరిగే సమయంలో అధ్యక్షుని పక్కన్నే నిలబడే గౌరవం లూథర్‌కు దక్కింది. అంతేగాక, ఆ బిల్లుమీద సంతకం చేసిన కలాన్ని లూథర్‌కు బహుమతిగా సమర్పించాడు అధ్యక్షుడు జాన్సన్. వాస్తవంగా ఆ బహుమతి అందుకునే అర్హత ఒక్క లూథర్‌కే ఉందనేది నిర్వివాదం. లూథర్ చేసిన అవిశ్రాంత పరిశ్రమే ఈ చట్టానికి పుట్టుకనిచ్చిందని దేశం ప్రశంసించింది.

వైట్‌హౌస్ సంబరాలనుండి తేరుకోకముందే మిసిసిపిలో జరిగిన కిరాతకం లూథర్ గుండెలను పిండేసింది. ఓహియో నుండి వచ్చిన 'ఫ్రీడం సమ్మర్ ఆర్మీ' సభ్యుల్లో ముగ్గురు విద్యార్థులు జూన్ 21 నుండి కనిపించడంలేదనే వార్త అతనికి ఇదివరకే చేరింది. ఆ ముగ్గురిలో ఒక యువకుడు నీగ్రో కాగా, మిగిలిన ఇద్దరూ తెల్లజాతీయులు. అందువల్ల, ప్రమాదం జరిగుంటుందనే ఆలోచన అప్పట్లో ఎవ్వరికీ కలగలేదు. పనిభారం తట్టుకోలేక ఇళ్ళకు వెళ్ళుంటారని అందరిలాగే లూథర్‌గూడా అనుకున్నాడు. వాళ్ళను మిసిసిపి క్లాన్ గూండాలు రహస్యంగా ఎత్తుకెళ్ళి, 'లించింగ్' పద్ధతిలో చిత్రహింసలకు గురిచేసి, ఆ తరువాత చంపి పాతిపెట్టారని ఇప్పుడు వెలుగులో కొచ్చింది.

వెంటనే మిసిసిపి ప్రయాణానికి లూథర్ సమాయత్తమయ్యాడు. అతడు మిసిసిపి వెళ్ళడం ప్రమాదమని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. అతనికోసం క్లాన్ గూండాలు రక్తదాహంతో కాపేశారని వారి సమాచారం. ఆపడానికి సహచరులందరూ ప్రయత్నించినా లూథర్ ఆగలేదు. "చావుకు భయపడి ఇంట్లో కూర్చుంటే ఇక నేను చేయగలిగిన పనే ఉండదు. చావుకు తెగించమని అందరికీ సందేశమిచ్చే నాయకుడు చావుకు జడిసి ఆగిపోవడమంటే తన సిద్ధాంతంమీద తనకే నమ్మకం లేనట్టౌతుంది. ప్రాణంకంటే సిద్ధాంతమే విలువైనదని నిరూపించే అవకాశాన్ని నాకు దూరం చెయ్యకండి." అంటూ ఆత్మీయుల అభ్యంతరాలను తోసిపుచ్చి జులై 20వ తేదీన మిసిసిపి చేరుకున్నాడు.

వారం రోజులపాటు మిసిసిపి రాష్ట్రాన్ని విస్తృతంగా పర్యటించాడు లూథర్. గత ఏడాది మెడ్గార్ ఎవర్స్‌ను పొట్టనబెట్టుకున్న హంతకుని స్వస్థలమైన గ్రీన్‌ఉడ్ పట్టణంతో సహా, అనేక నగరాలూ గ్రామీణప్రాంతాలు సందర్శించి దాదాపు ఇరవై వేలమంది నీగ్రోలను ముఖాముఖి కలుసుకున్నాడు. అతడు ఫిలడెల్ఫియాలో ఉన్న సమయంలో, తప్పిపోయిన ముగ్గురు విద్యార్థుల శవాలకోసం పోలీసులు త్రవ్వకాలు జరపడం చూశాడు. లూథర్ పర్యటన నల్లజాతీయుల్లోనూ, ఉద్యమ కారుల్లోనూ ఉత్సాహం, ఐకమత్యాలను పెంపొందించింది.

పేదరికమంటే ఏమిటో లూథర్ ఎరుగనివాడు కాకపోయినా, పేదరికం గురించి అతనికి మిసిసిపి నీగ్రోలను చూసినప్పుడు తెలిసినంత విశదంగా అదివరకు తెలిసిరాలేదు. వారిది మాటలతో వివరించటానికి వీలుపడని దుస్థితి; బ్రతకడం తప్ప మరో కోరికకు విలువలేని సంయమనం. ఈ దారిద్య్రం యథాతథంగా కొనసాగితే, సాధించిన పౌరహక్కుల చట్టంతో రాబట్టుకోగల ప్రయోజనం ఆవగింజలో అర్థం. అందువల్ల, పేదరికాన్ని ఎదిరించే మూడోదశ పోరాటాన్ని తక్షణావసరంగా లూథర్ గుర్తించాడు.

అట్లాంటా చేరినవెంటనే, పేదరికాన్ని తొలగించడానికి ప్రభుత్వం తీసుకో వలసిన బాధ్యతలమీద సమగ్రమైన నివేదిక రూపొందించాడు. ఆగస్టు చివరి వారంలో అతడు దేశాధ్యక్షుణ్ణి కలిసి తన నివేదిక సమర్పించాడు. అమలుకు వేలాది కోట్ల డాలర్లను ఆశించే ప్రణాళిక లూథర్‌ది. అప్పటికప్పుడు అంత సొమ్మును జాన్సన్ కేటాయించనూలేడు, ఎంతోదూరంలేని ఎన్నికల అవసరాల కారణంగా 'కుదర'దని తిప్పికొట్టనూలేడు. సందర్భోచిత రాజకీయ మాయాజాలంగా, 'పేదరికం నిర్మూలనా పథకం' క్రింద వందకోట్ల కంటి తుడుపు కేటాయింపుకు కాంగ్రెస్‌ను ఒప్పించుకున్నాడు జాన్సన్.

కొత్త అధ్యక్షుణ్ణి ఎన్నుకోటానికి నవంబర్ 3వ తేదీన ఎన్నికలు జరుగబో తున్నాయి. డెమొక్రటిక్ పార్టీ తరఫున అభ్యర్థిగా లిండన్ జాన్సన్ పేరు ఖరారైంది. బెర్రీ గోల్డ్‌వాటర్ పేరును రిపబ్లికన్ పార్టీ ఖరారుచేసింది. ఎన్నికల్లో తలదూర్చే అలవాటు లూథర్‌కు ఎప్పుడూ లేదు. కానీ, ఈసారి సంకటం ఎదురుపడింది. అతన్ని ఇరకాటంలో పెడుతున్నది జాన్సన్‌తో అతనికున్న సాన్నిహిత్యం కాదు. ఆ సాన్నిహిత్యం నీగ్రో సమస్యల పరిధి దాటకుండా లూథర్ చాలా మెలుకువగా వ్యవహరించాడు. వచ్చిన సమస్యంతా జాన్సన్ ప్రత్యర్థి గోల్డ్‌వాటర్‌తో. నీగ్రోలను

తూలనాడితే తెల్లజాతి ఓట్లన్నీ తనకే వస్తాయనే తప్పుడు అంచనాతో అతడు పౌరహక్కుల చట్టాన్ని బహిరంగంగా వ్యతిరేకిస్తున్నాడు; తెల్లజాతి దురహంకారాన్ని ప్రోత్సహించే ప్రణాళికతో బాహాటంగా బరిలో నిలుచున్నాడు.

గోల్డ్‌వాటర్ సిద్ధాంతం ఒక్క లూథర్‌కే కాకుండా, పౌరహక్కుల సంఘాలన్నిటికీ చేదెక్కించింది. మింగుడు పడని నాయకులంతా విరుగుడుకోసం విస్తృత ప్రాతిపదికన అభ్యుదయవాదుల కూటమిని ఏర్పాటుచేసుకున్నారు. తెల్లజాతీయులతో సహా, వందలాది క్రైస్తవ మతబోధకులు అందులో భాగస్వాములయ్యారు. "ఓటువేసే మీ నిర్ణయాన్ని ప్రభావితం చెయ్యాలనే ఉద్దేశం నాకు లేదు. కానీ, ఓటు ఎవరికి వెయ్యరాదో వివరించవలసిన బాధ్యత నాకుంది" అనే పల్లవితో సెప్టంబర్‌నుండి లూథర్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించాడు.

పురుసతు లేని ప్రయాసతో లూథర్ ఆరోగ్యం కుంటు పడింది. డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించారు. పనిభారం పెరగడంతో వచ్చిన నలత తప్ప, ఇతర లోపం లేదని పరీక్షల్లో తేలింది. ఇంటిదగ్గర విశ్రాంతికి వీలుండదు కాబట్టి కొద్దిరోజులు ఆస్పత్రిలో ఉండటం మంచిదని డాకర్ల సలహా. దాన్ని పాటించి ఆస్పత్రిలో చేరిన లూథర్‌కు ఆ మరుసటిరోజు పొద్దున్నే నిద్రాభంగం చేస్తూ కొరెట్టానుండి వచ్చిన ఫోన్ సందేశం ఒక అపురూపమైన సమాచారాన్ని అందించింది. ఆ శుభవార్త ఏమంటే - 1964 'నోబెల్ శాంతి పురస్కారం' ప్రధానం చెయ్యడానికి డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ను నార్వీజియన్ పార్లమెంటు ఎంపికజేసింది!

అందిన లక్షలాది అభినందన సందేశాలకు లూథర్ కార్యాలయం చాల కొచ్చింది. వచ్చిన ఏవొక్కటీ దక్షిణాది తెల్లజాతీయులది కాదనే కొరతను అట్లాంటా మేయర్ ఇవాన్ ఎలెన్ పంపిన సందేశం పూరించింది. లూథర్‌కు అభినందన సందేశం పంపడమేగాక, "తెల్లజాతి మైనారిటీలుగా ఉన్న పరిస్థితిలో, సమానత్వానికీ సంపూర్ణ పౌరసత్వానికీ ఒక తెల్లజాతి నాయకుడు ఓ తరహా నాయకత్వాన్ని తన జాతికి అందిస్తాడో, అదే తరహా నాయకత్వాన్ని డా.లూథర్ కింగ్ నీగ్రోలకు అందించాడు." అంటూ అతడు పత్రికలకు తన ప్రకటనగూడా విడుదల చేశాడు.

ఇప్పుడు అమెరికన్ జాతికి గర్వకారణంగా ఎదిగిన హోదాలో లూథర్ చేసిన ఎన్నికల ప్రచారం జాన్సన్ను ప్రత్యక్షంగా సమర్థించకపోయినా, అతని విజయావకాశాలకు పెట్టని కోటగా మారిపోయింది. ఎన్నికల ఫలితాల్లో పౌరహక్కుల సంఘటన విజయం సాధించింది. 62 శాతం మద్దతుతో జాన్సన్ గెలుపొందగా,

అమెరికన్ ప్రజలనుండి గోల్డ్‌వాటర్ చూరగొన్న మద్దతు కేవలం 37 శాతం.

డిసెంబర్ 10వ తేదీన నార్వీజియన్ రాజధాని ఆస్లోలో నోబెల్ శాంతి బహుమతి ప్రధానోత్సవం. మిత్రసమేతంగా ఒకరోజు ముందే లూథర్ దంపతులు ఆస్లో చేరుకున్నారు. అపూర్వమైన ఆదరణతో నార్వే ప్రజలూ ప్రముఖులూ ఆ బృందాన్ని ఆహ్వానించారు. మరుసటి రోజు, బహుమతి అందుకునే సమయంలో, ఉద్రేకంతో లూథర్ కళ్ళు చెమ్మగిల్లాయి. వణికే గొంతుతో మొదలెట్టి, కొద్ది క్షణాల తరువాత గంభీరమైన తన సహజ శైలిని అందుకుంటూ, ఉత్సాహభరితమైన తన ఉపన్యాసాన్ని నోబెల్ బహుమతి ట్రస్టీలకూ నార్వే ప్రజలకూ పార్లమెంటుకూ ధన్యవాదాలతో ముగిస్తూ, హర్షధ్వానాలు చూరగొన్నాడు. అక్కడ బహుమతిగా పొందిన 54వేల డాలర్లను సొంతానికి కాకుండా, ఉద్యమానికి ఉపయోగిస్తానని ప్రకటించాడు.

నోబెల్ బహుమతి అందుకోవడంతో అంతర్జాతీయ ప్రముఖుల్లో తన స్థానాన్ని పదిలం చేసుకున్న లూథర్‌కు మీడియానుండి ఇప్పుడు అంతర్జాతీయ సమస్యల మీద ప్రశ్నలు ఎదురౌతున్నాయి. ఆస్లోలో ఉండగానే, ''కాంగోలో జోక్యం మానేసి అమెరికా తన సైన్యాలను ఉపసంహరించాలని మీరు కోరుతారా?'' అంటూ పత్రికలు వెంటబడ్డాయి. ''నేను అంతదూరం వెళ్ళలేదు. కానీ, బయటి శక్తులు తొలగనంత వరకు కాంగో అంతర్యుద్ధానికి పరిష్కారం దొరకదని మాత్రం చెప్పగలను.'' అనే తెలివైన సమాధానంతో ఉచ్చులో ఇరుక్కోకుండా తప్పించుకున్నాడు.

# ఓటు హక్కు

నోబెల్ బహుమతి గ్రహీతగా యూరప్‌నుండి న్యూయార్క్ విమానాశ్రయంలో దిగిన లూథర్‌కు అభిమానులనుండి కోలాహలమైన స్వాగతం లభించింది. అతని గౌరవార్థం 1964 డిసెంబర్ 18న ఏర్పాటైన విందుకు న్యూయార్క్ మేయర్ వ్యాఘ్నర్, గవర్నర్ రాక్ఫెల్లర్, ఉపాధ్యక్షుడు హంఫ్రీ వంటి ప్రముఖులు హాజరై ఆ సందర్భానికి హంగును సమకూర్చారు.

మర్యాదకోసం దేశాధ్యక్షుణ్ణి కలవటానికి లూథర్ వాషింగ్టన్ డి.సి. చేరుకున్నాడు. అభినందనల తరువాత అధ్యక్షుడు జాన్సన్ మాటామంతీ ముచ్చటిస్తూ ఎంతోసేపు లూథర్‌తో హుషారుగా గడిపాడు. ఆస్లోతో మొదలైన వాళ్ళ సంభాషణ అనేక విషయాలు దాటుకుని, చివరకు ఓటింగ్ హక్కుల బిల్లుకు చేరుకుంది.

''నిజమే. ఈ విషయంలో నీ అభిప్రాయం నేను కాదనను. ఆ పని తప్పకుండా జరిగేలా చూస్తాను. కానీ, ఇప్పుడిప్పుడే అది కుదరదు. అతి ముఖ్యమైన బిల్లులు కొన్ని పార్లమెంటులో దాటించుకోవాలి. వాటికి దక్షిణాది సెనేటర్ల మద్దతుగూడా చాలా అవసరం. ఓటింగ్ హక్కుల బిల్లులాగే, ఈ బిల్లులుగూడా భవిష్యత్తులో నీగ్రో ప్రజలకు ఉపయోగపడేవే. ముందు వీటిని గట్టెంక్కించాలి.'' అన్నాడు అధ్యక్షుడు.

''మిగతా సమస్యల కంటే రాజకీయ సంస్కరణల ప్రాముఖ్యత తీసేసేది కాదు.'' అన్నాడు లూథర్.

''కావచ్చు. కానీ, ఇప్పుడు దాన్ని పార్లమెంటులో నెగ్గించలేం. దాంతో కలిపితే మిగతా వాటినిగూడా దక్షిణాది సభ్యులు అడ్డుకుంటారు. తొందరపడి, అన్నిటినీ చెడగొట్టుకోవడం మంచిదిగాదు.''

''నిజమే. సాధ్యమైనవి చేయడమే వివేకం.'' గుంభనంగా జవాబిచ్చి లూథర్ అధ్యక్షుని దగ్గర సెలవు తీసుకున్నాడు.

ఆ సంభాషణ ద్వారా అధ్యక్షుడు తన బాధ్యతనుండి తప్పుకుంటున్నాడనే అభిప్రాయంకంటే, తన కర్తవ్యాన్ని గుర్తుచేశాడనే భావనే లూథర్‌కు కలిగింది, మాంట్గోమెరీ పోరాటంతోగానీ మొదటి పౌరహక్కుల బిల్లుకు వైట్‌హౌస్ పూనుకోలేదు; బర్మింగ్‌హాం పోరాటంతోగానీ రెండవ బిల్లుకు అడుగులు కదపలేదు; అడిగిన ప్రతి తడవ ఇది సమయం కాదంటూ దాటేయడం వైట్‌హౌస్‌కు ఆనవాయితి.

పోరాటం బరువైన మరుక్షణం, సమయం ప్రసక్తి పక్కకు నెట్టి చట్టాలు తీసుకొచ్చింది. కొద్దిరోజుల పాటైనా సరదాగా కాలక్షేపం చేసే యోగం తన జన్మకు లేదనుకున్నాడు లూథర్. స్వదేశంలో అడుగెట్టిన మరునాడే నోబెల్ బహుమతి కైపు మస్తిష్కంనుండి దిగిపోయింది. ఓటరునమోదు కార్యక్రమం ఒక పోరాటంగా స్వీకరించడం తనకు తప్పదని తేలిపోయింది. ఇక మిగిలిందల్లా 'ఎప్పుడు, ఎక్కడ?' అని నిర్ణయించుకోవడం మాత్రమే.

మొదటి బిల్లుకు కారణమైన మాంట్గోమెరీ పట్టణం అలబామా రాష్ట్రంలోదే. రెండవ బిల్లుకు పురుడుపోసిన బర్మింగ్‌హాం గూడా అలబామాలోదే. ఇప్పుడు ఆశించే మూడవ బిల్లుకుగూడా ఆటపట్టు అదే ఔతుందేమో ఎవరికెరుక? గత సంవత్సర కాలంగా ఎస్.సి.ఎల్.సి., ఎస్.ఎన్.సి.సి., కోర్ సంస్థలు మూడూ కలిసి ఓటరు నమోదు కార్యక్రమంలో తలక్రిందులౌతున్నా అలబామాలో సాధించిన ప్రగతి అంతంతమాత్రమే. అంకెల్లో అద్భుతంగా కనిపించినా, చేయవలసింది చాలావరకు మిగిలిపోయింది. 1963లో ఆరువేలకు మించని నీగ్రో ఓటర్ల సంఖ్య 1964 చివరకు దాదాపు లక్షా పదివేలకు పెరింగింది వాస్తవమే. కానీ, అర్హత కలిగి మిగిలిపోయిన నీగ్రోల సంఖ్య నాలుగు లక్షల పైచిలుకు!

ఈ ఆలోచనలో ఉండగానే, 'డల్లస్ కంట్రీ ఓటర్స్ లీగ్' అనే సంస్థ సెల్మా పట్టణానికి లూథర్‌ను ఆహ్వానించింది. డల్లస్ కంట్రీ అనేది సెల్మా శివారుప్రాంతం. మాంట్గోమెరీకు 80 కిలోమీటర్లు పడమరగా, జాతీయ రహదారి మీదున్న ఒక మోస్తరు పట్టణం సెల్మా. ఆ పట్నంలో తెల్లవాళ్ళకంటే నీగ్రో జనాభా కాస్తంత ఎక్కువ. కానీ, ఓటరు జాబితాలో 14,400 మంది తెల్లజాతీయులుండగా, అర్హత కలిగిన 16,000 మంది నీగ్రోలకుగాను ఓటర్లుగా నమోదైన అదృష్టవంతులు ఒకేఒక్క శాతం. ఈ తారతమ్యానికి కారణం నీగ్రోల నిరాసక్తత కానేకాదు. ఓటరు కావాలనే స్పృహ ఇటీవల నీగ్రో వయోజనుల్లో బాగా పెరిగింది. కానీ, ఇప్పుడున్న నిష్పత్తి తారుమారు కాకుండా కాపాడటానికి దారిపొడవునా తెల్లజాతి కల్పించిన ఆటంకాలను దాటుకోవడం వారికి సాధ్యపడటంలేదు. ఆ మాటకొస్తే, నల్లజాతీయుల మానసిక దౌర్బల్యమే ఓటరు నమోదు కృషికి మొట్టమొదటి ఆటంకం. తరతరాలుగా నల్లజాతీయుల గుండెల్లో పోలీసులంటే ఒక విధమైన గుబులు పాతుకుపోయింది. నలుగురు కలిసి ఒకచోటికి చేరి మాట్లాడుకోటానికి వీలివ్వని మునిసిపల్ చట్టాలు దానికి తోడై, పిరికితనం వదిలిపోయే అవకాశాన్ని దూరం చేస్తున్నాయి. వీటిని

కాదని ఎవరైనా మునిసిపల్ కార్యాలయం చేరుకున్నా, అక్కడ ఓటర్లను నమోదుచేసే రిజిస్ట్రారు ఎప్పుడుంటాడో తెలీదు, ఎప్పుడుండడో తెలీదు. పని మానుకుని పదేపదే అతని ఆఫీసు చుట్టూ తిరగాలంటే పూట గడవని పేదలకు వీలుపడదు. అక్షరాస్యతను పరీక్షించేందుకు రూపొందించిన వింతైన విధానం వీటన్నిటినీ మించిన మరో ప్రతిబంధకం. ఆ పరీక్షలో నీగ్రోలకు ఎదురయ్యే ప్రశ్నల గురించి ప్రస్తావిస్తూ, ''వాటిల్లో కొన్నిటికి మన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగూడా జవాబు వ్రాయలేడు.'' అంటాడు లూథర్.

కట్టు కదలకుండా సెల్మాలో సాంప్రదాయాన్ని నడిపిస్తున్న ఘనత అక్కడ పోలీసు ఇన్స్పెక్టర్‌గా పనిజేసే జేమ్స్ 'జిమ్' క్లార్క్‌దేనంటే తలూపని వారెవరూ ఆ పట్నంలో లేరు. అతనిది ఆరడుగులకు మించిన విగ్రహం, వంద కిలోలకు తగ్గని తూకం. 'జిమ్' అనేది అతని అసలు పేరులో భాగంగాదు; 'జిమ్ క్రో'లను అదుపుజేసే సామర్థ్యంతో సంపాదించిన బిరుదు. భారమంతా అతని భుజాలమీద పడేసి, సెల్మా తెల్లజాతి గుండెలమీద చెయ్యేసుకుని బ్రతుకుతూ వస్తూంది.

క్లార్క్ అధికారనికి ఇటీవల చిన్న విఘాతం కలిగింది. ఉద్దేశపూర్వకంగా కాకపోయినా, కాలానుగుణంగా చేసుకోవలసిన కొన్ని సర్దుబాట్లుకు సెల్మా తెల్ల జాతీయులు తలొగ్గడం ఆ విఘాతానికి కారణం. అనాదిగా వ్యవసాయంతో నెట్టకొస్తున్న భూస్వాములకు ఇప్పుడది లాభసాటిగా కనిపించలేదు. పరిశ్రమలవైపు చూపు మళ్ళింది. భూస్వాములను కూడేసి ఈ కొత్తమార్గం పట్టించిన 'స్మితర్సన్' అనే యువకుడే ఇప్పుడు నగర మేయరుగా ఎన్నికయ్యాడు. సెల్మాలో నడుస్తున్న పోలీసురాజ్యం ఉత్తరాది పారిశ్రామికులకు నచ్చదు గాబట్టి, చట్టం ప్రకారం నడిపించే విల్సన్ బేకర్‌ను పోలీసు ఉన్నతాధికారిగా నియమించాడు. అనవసర బలప్రయోగాన్ని వ్యతిరేకించేవాడు బేకర్. అందువల్ల, క్లార్క్‌తో అతని సంబంధాలు చెడటానికి పెద్దగా సమయం పట్టలేదు.

1965 జనవరి 2వ తేదీన సెల్మా వెళ్ళి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి వచ్చేసిన లూథర్, 18వ తేదీ అక్కడికి తిరిగెళ్ళాడు. బసకోసం హోటల్ ఆల్బర్టో వెళ్ళాడు. ఆ పట్నంలోకెల్లా ఖరీదైన ఆల్బర్టో హోటల్లో అడుగెట్టిన మొట్టమొదటి నీగ్రో లూథరే. చూస్తూ సహించలేని ఒక తెల్లజాతీయునికి శివాలెక్కి లూథర్ మీదకి దురుసుగా కలబడ్డాడు. లూథర్ వెంటుండే విద్యార్థులు అతన్ని దూరంలాగి, పోలీసులకు కబురు చేశారు. విషయం తెలిసిన పోలీసు

ఉన్నతాధికారి బేకర్ అగ్గిమీద గుగ్గిల మయ్యాడు. స్వయంగా అక్కడికి చేరుకోడమే గాక, దుండగుణ్ణి ఈడ్చుకుంటూ స్టేషన్‌కు తీసుకుపోయాడు. ఆ సంఘటన లూథర్‌కు పట్టించుకోదగిన పెద్దవిషయంగా కనిపించలేదు. పత్రికలకు మాత్రం అది పెద్దదిగానే కనిపించింది. నోబెల్ బహుమతి గ్రహీతను అవమానించిన పట్టణంగా సెల్మా జాతీయ పత్రికల శీర్షికల కెక్కింది.

అదే రోజు, అర్హత కలిగిన నాలుగువందల నీగ్రో వయోజనులను వెంట దీసుకుని, కాలినడకన లూథర్ మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నాడు. ఆ సమయంలో అక్కడ అతనికి దర్శనమిచ్చింది పోలీసు అధికారి జిమ్ క్లార్క్. రిజిస్ట్రార్లు డ్యూటీలో లేరుగాబట్టి మరెప్పుడైనా రమ్మని వచ్చినవాళ్ళందరినీ వాపసు పంపించాడు. ఇదిగూడా సెల్మాలో నిత్యం జరిగే తతంగమే. లూథర్ ఉనికివల్ల ఇప్పుడది పత్రికా ముఖంగా బయటి ప్రపంచానికి వెల్లడైంది.

తిరిగొచ్చిన లూథర్ కార్యకర్తలతో సమావేశమయ్యాడు. "నమోదుకు వీళ్ళు తిరస్కరిస్తే, మనం గవర్నర్ వ్యాలెస్ దృష్టికి తీసుకుపోదాం. ఆయనగూడా మన మొర ఆలకించకపోతే, పార్లమెంటును కదిలిద్దాం. అక్కడగూడా మనకు సరైన సమాధానం దొరక్కపోతే, వేలకువేల నీగ్రోలతో కవాతు నిర్వహించి ఫెడరల్ గవర్నమెంటు కళ్ళు తెరిపిద్దాం. మీరు మీ ప్రయత్నం కొనసాగించండి. నేను మళ్ళీ వచ్చి కలుసుకుంటాను." అంటూ ధైర్యం చెప్పి అట్లాంటా తిరిగొచ్చాడు.

లూథర్ సలహా మేరకు సెల్మాలో ఉద్యమం కొనసాగింది. మరునాటి ఉరేగింపును ప్రఖ్యాత పౌరహక్కుల నాయకురాలు ఎమీలియా బోయిన్టన్ వెంటనుండి నడిపించింది. పోలీసుల చేతిలో గుంపు అరెస్టయింది. జిమ్ క్లార్క్ స్వయంగా కలుగజేసుకుని, ఎమీలియాను తన్నుకుంటూ ఈడ్చుకుపోయాడు. వాతావరణం ఉడుకెక్కింది. ఆ మరుసటిరోజు మరింత పెద్దగుంపుతో జాన్ లూయిస్ తదితర విద్యార్థినాయకులు మునిసిపల్ కార్యాలయంలో బైఠాయించారు. బూతుమాటలతో, అరెస్టులతో జిమ్ క్లార్క్ ఎప్పటిలాగే ప్రవర్తించాడు. అతన్ని అదుపుచేయడం పోలీసు ఉన్నతాధికారి బేకర్‌కు సమస్యగా పరిణమించింది. తెల్లజాతి యువతలో క్లార్క్ సంపాదించిన పలుకుబడి బేకర్ చేతులను కట్టిపడేస్తూంది. అతని దురుసు తనంవల్ల ఉద్రిక్తత పెరుగుతుందనే బేకర్ అనుమానం జనవరి 22 సంఘటనతో బలపడింది. ఆరోజు, దాదాపు వందమంది ఉపాధ్యాయులు, స్కూలుబోర్డు అధ్యక్షుని హెచ్చరికలు ఖాతరు చెయ్యకుండా, ఊరేగింపుగా ఓటరు నమోదు కార్యాలయం

ప్రవేశించి తమ నిరసన తెలియజేశారు. అంటే, ఉద్యమం సంస్థాగత వేదికలకు ప్రాకిపోయిందనటానికి ఇదొక సంకేతం. జనవరి 25న మరో నమ్మరాని సంఘటన గూడా జరిగింది. ఓటరుగా నమోదు కావటాని కొచ్చిన ఒక నీగ్రోమహిళను ఉక్రోషంతో మరుగుతున్న జిమ్ క్లార్క్ అనరాని మాటలతో అటకాయించాడు. ఆ మహిళ తిరగబడి అతని ముఖమంతా వాయగొట్టింది. దగ్గరున్న పోలీసులు కలగజేసుకుని విడిపించారు. అరెస్టుకు జంకకుండా ఆమె నిర్భయంగా స్టేషనుకు నడిచింది. జనవరి మాసాంతానికి అరెస్టుల సంఖ్య రెండువందలకు దాటింది.

ఫిబ్రవరి 1వ తేదీన అబెర్నెథీని వెంటదీసుకుని లూథర్ సెల్మాకు తిరి గొచ్చాడు. వాళ్ళ నాయకత్వంలో దాదాపు వెయ్యిమందితో రిజిస్ట్రార్ కార్యాలయానికి ఊరేగింపు నడిచింది. పోలీసులు అడ్డుతగిలి అరెస్టులు మొదలెట్టారు. లూథర్, అబెర్మెథీలతో పాటు దాదాపు 770 మంది ప్రదర్శకులు అరెస్టయ్యారు. కానీ, ఉద్యమం మెత్తబడలేదు. మరుసటి దినం స్థానికనాయకులతోనే ప్రదర్శన జరిగింది. పెద్దలతోపాటు స్కూలుపిల్లలుగూడా అందులో పాల్గొన్నారు. మరో 550 మంది రిమాండులోని తమ సహచరులతో చేరిపోయారు.

లూథర్ రిమాండైన మూడోరోజు, ప్రఖ్యాత నీగ్రో నాయకుడు మాల్కం ఎక్స్, సెల్మాలో హఠాత్తుగా దిగిపోయాడు. అతడు ఆహింసను వ్యతిరేకించే సిద్ధాంతి. మారణహోమం ఎప్పుడు జరుగుతుందోనని బెదురుకుంటున్న తెల్లజాతికి అతని రాక తత్తరపాటు కలిగించింది. మంటను ఎగదోసి ఉద్యమాన్ని ఎక్కడ పక్కదోవ పట్టిస్తాడోననే అనుమానం లూథర్‌కూ కలిగింది. కానీ, లూథర్ పథకాన్ని పాడుజేసే ఉద్దేశంతో తను రాలేదని మాల్కం తనతో చెప్పినప్పుడు కొరెట్టా నమ్మలేకపోయింది. సిద్ధాంత వ్యత్యాసాలే కాక, మాల్కంతో లూథర్‌కు వ్యక్తిగతంగా గూడా అనుకూలమైన సంబంధాలు లేవని ఆమెకు తెలుసు. అటువంటి వ్యక్తి తనతో మాట్లాడాలని కబురు చేస్తే కొరెట్టాకు ఆశ్చర్యం కలిగింది. ఐనా, అంతటి నాయకుణ్ణి రావద్దనడం మర్యాదగాదని అంగీకరించింది.

''నిజంగా నేను సెల్మా కొచ్చింది లూథర్ ప్రయత్నాన్ని చెడగొట్టడానికి కాదు. నన్ను నమ్మండి. నా రాకతో అతని పని తేలికౌతుందనే నమ్మకంతో వచ్చాను. నా గురించీ, నా ఉపదేశం గురించీ తెల్లోళ్ళకు బాగా తెలుసు. వాళ్ళను బెదరగొట్టే ఉద్దేశంతోనే నేనొచ్చాను. లూథర్‌ను కాదంటే ప్రత్యామ్నాయం ఏమిటో తెల్లోళ్ళకు తెలిసేలా చేస్తే, గత్యంతరం కరువై వాళ్ళు లూథర్‌నే కోరుకుం

టారు.'' అన్నాడు మాల్కం ఎక్స్. అతని పోకడలో ఇటీవల ఏదో మార్పొచ్చిందని జరిగే ప్రచారం నిజమే ననిపించింది కొరెట్టాకు. జామీనుమీద లూథర్ విడుదలైన ఫిబ్రవరి 5కు ముందురోజే మాల్కం ఎక్స్ సెల్మానుండి వెళ్ళిపోవడంతో, కాసింత తీరుబడిగా వాళ్ళిద్దరూ కలుసుకునే అవకాశం మరోసారి తప్పిపోయింది.

అతని ఉద్దేశం మంచిదైనా చెడ్డదైనా, సెల్మాలో లూథర్ సాధించిన విజయాన్ని హర్షించే ఘడియలు ఆసన్నమైందాకా మాల్కం ఎక్స్ ప్రాణాలు నిలుపుకోలేకపోయాడు. సెల్మానుండి తిరిగెళ్ళిన కొద్దిరోజులకే, 1965 ఫిబ్రవరి 21వ తేదీన, న్యూయార్క్‌లోని హార్లెం ఆడిటోరియంలో ప్రసంగిస్తూ అతడు తన ప్రాణాలను తుపాకీ తూటాలకు అర్పించాడు. ఒకనాటి సహచరులైన ఇస్లామిక్ తీవ్రవాదులు అతనిమీద ఆ విధంగా పగ సాధించారు.

విడుదలైన లూథర్, ఓటింగ్ హక్కుల బిల్లుకోసం ప్రభుత్వాన్ని అర్థించాడు. మరోవైపు, సెల్మాలో ఓటరు నమోదు రిజిస్ట్రార్లు వారానికి రెండు రోజులు కాకుండా, అనుదినం కార్యాలయంలో ఉండేలా ఆదేశించమని ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. పిటిషనైతే నెగ్గిందిగానీ, ప్రయోజనంలేని తీర్పు వెలువడింది. 'వారానికి రెండు రోజులే కాకుండా, మరింత తరచుగా విధులు నిర్వహించా'లనే అస్పష్టమైన తీర్పుతో ఫెడరల్ కోర్టు చేతులు దులుపుకుంది. ఆ తరుణంలో, అధ్యక్షుడు జాన్సన్ చూపించిన చొరవే లూథర్‌కు కొంత ఊరట కలిగించింది. తాజా పరిస్థితిని ప్రత్యక్షంగా అధ్యయనం చెయ్యటానికి పదిహేనుగురు పార్లమెంటు సభ్యులతో కూడిన ఒక ప్రతినిధి బృందాన్ని సెల్మాకు పంపించాడు జాన్సన్. ఆ పట్నంలో దిగిన ఉత్తరాది పార్లమెంటు సభ్యులకు తాము తిరుగుతున్నది అమెరికా సంయుక్త రాష్ట్రాల భూభాగంలోనేనా లేక మరో కొత్త ప్రపంచంలోనా అనే భ్రాంతి కలగడం భవిష్యత్తుకు ఉపకరించింది.

ఫెడరల్ కోర్టు తీర్పుగానీ, పార్లమెంటు సభ్యుల పర్యటనగానీ జిమ్ క్లార్క్ మీద ఆవగింజంత ప్రభావం చూపలేదు. ఫిబ్రవరి 10వ తేదీన అతడూ, అతని పరివారం మోటారుకార్లలో వెంబడిస్తూ, పశువులను మళ్ళించటానికి ఉపయోగించే కరెంటు ముల్లుబర్రలు కారుకిటికీలనుండి బయటికి చాచి అదిలిస్తూ, 165 మంది నీగ్రో యువకులను జాతీయరహదారి వెంట తోలుకుంటూ ఐదు కిలోమీటర్లు పరిగెత్తించారు. పెడబొబ్బలేస్తూ ఆ పారాట* ముగించుకుని, అలసటతో రొప్పుతూ ఇంటికి చేరుకున్న జిమ్ క్లార్క్, చిన్న గుండెనొప్పితో మంచం పట్టాడు.

ఆ మరుసటిరోజు, దాదాపు రెండువందలమంది నీగ్రో యువకులు మునిసిపల్ కార్యాలయం ముందు జిమ్ క్లార్క్ ఆరోగ్యంకోసం ఎంతో నిజాయితీతో ప్రార్థనలు జరపడం అందరికీ విభ్రాంతి కలిగించింది. ముందురోజు జిమ్ క్లార్క్ వల్ల వేధింపుకు గురైన యువకులుగూడా కొంతమంది అందులోవుండటం మరింత విడ్డూరంగా కనిపించింది. వాళ్ళల్లో ఒక కుర్రాణ్ణి విలేఖరులు ప్రశ్నించగా, 'అతడు లేకుంటే మా ఉద్యమానికి రంజేముంది?' అన్నాడట.

'నీ శత్రువునైనా ప్రేమించు' అనే ఏసుక్రీస్తు ప్రబోధానికి ప్రతీకగా సెల్మా యువకులు ప్రదర్శించిన సౌహార్ద్రత లూథర్‌కు ఆహ్లాదం కలిగించింది. ఫిబ్రవరి 18వ తేదీన సెల్మాకు తిరిగొచ్చిన లూథర్, ఆ యువకులను అభినందించడంతోపాటు, అర్హులైన మూడువేలమంది నీగ్రోలను వెంటదీసుకుని మరోసారి ఓటరు రిజిస్ట్రారు కార్యాలయానికి ఊరేగింపుగా బయలుదేరాడు. జిమ్ క్లార్క్ ఇంకా డ్యూటీలో చేరకపోయినా, ఫలితంలో మార్పేమీ కనిపించలేదు. ఒట్టి చేతులతో తిరిగొచ్చిన లూథర్, ఆ చుట్టుపక్కలుండే ఇతర ప్రాంతాల పరిస్థితి చూద్దామనే కుతూహలంతో, 'క్యాండెన్' పట్టణం వెళ్ళాడు. అక్కడ గుంపుగా కనిపించిన నీగ్రోలను ఉద్దేశించి, "ఓటరు రిజిస్ట్రేషన్ ఎలా సాగుతూంది? మీరంతా ఓటర్లు కావాలనుకుంటున్నారు. ఔనా?" అన్నాడు.

"ఇంతవరకు మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నాను. ఇది నాలుగోసారి. సాక్షి సంతకానికి మనిషే దొరకడంలేదు." అన్నాడు ఆ గుంపులోనుండి ఒక మనిషి.

"అతడు మీకు బాగా తెలుసుగదా. సాక్షి సంతకం మీరే చెయ్యొచ్చు." అన్నాడు లూథర్ అక్కడున్న పోలీసు అధికారితో.

"మీలాగే నాగ్గూడా రాజకీయ అభిప్రాయాలున్నాయి. సాక్షి సంతకానికి అవి లేని మరో తెల్లోణ్ణి వెదుక్కోండి." బదులిచ్చాడు ఆఫీసరు.

ఇంతవరకు ఒక్క నీగ్రోనైనా ఓటరుగా చేర్చుకోని పట్టణం క్యాండెన్!

అక్కడినుండి మేరియన్ పట్టణం చేరిన లూథర్‌కు మెరుగైన పరిస్థితి అక్కడా కనిపించలేదు. చూసిన ఏ తావులోనూ నీగ్రోల ఉత్సాహానికి కొరతలేదు. కానీ, చేస్తున్న ప్రయత్నాలే బూడిద పాలౌతున్నాయి. ఇదంతా గమనించిన తరువాత, పోరాటాన్ని పాత రీతుల్లో కొనసాగించడంతో సాధించగల ప్రయోజనం రవ్వంతైనా ఉండదని లూథర్‌కు తోచింది. కొత్త మలుపు ఎలా తీసుకోవాలో ఆలోచిస్తూ సెల్మా

తిరిగొచ్చాడు. కార్యవర్గ సమావేశంలో అతడొక నూతన ప్రయోగాన్ని ప్రతిపాదించాడు. ‘‘సెల్మా నుండి మాంట్గోమెరీకి మనం పాదయాత్ర నిర్వహిద్దాం. జాతీయ రహదారిలో భారీగా బయలుదేరి, ఇక్కడ జరిగే అక్రమాలను గవర్నర్ వ్యాలెస్‌కు నివేదిద్దాం.’’ అన్నాడు. గవర్నర్ వ్యాలెస్ స్వభావం లూథర్‌కు తెలియందిగాదు. నీగ్రోలను చిన్నచూపుజూసే దురహంకారుల్లో అతనిది మొదటి పంక్తి. అతనివల్ల ఏదో ఒరుగుతుందని లూథర్ ఆశించడంలేదు. కానీ, అలబామా పాలకవర్గం నిర్వాకాన్ని ప్రపంచంముందు ఎండగట్టడానికి ఈ పాదయాత్ర ఉపకరిస్తుంది; కార్యకర్తల్లో ఉత్సాహం పెంచుతుంది; ఫెడరల్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతుంది.

బ్రౌన్ ఛాపెల్ చర్చిలో మాట్లాడుతూ ‘‘ఈ ప్రయత్నంలో మన శరీరం లాఠీ దెబ్బలతో హూనం కాదని నేను చెప్పలేను; మన నివాసాలు బాంబుదాడుల్లో నేలమట్టం కావని నేను చెప్పలేను; భీతావహం కలిగించేందుకు వాళ్ళు ఎంతటి ఘాతుకానికైనా పూనుకోవచ్చు. ఐనా, మన హక్కులకోసం ఏ త్యాగానికైనా సిద్ధపడటం మనకు తప్పదు.’’ అంటూ హెచ్చరించాడు లూథర్. అందరూ సరే నన్నారు. మార్చి 7వ తేదీ ఆదివారం ఉదయం పాదయాత్ర ప్రారంభించాలని తీర్మానించారు.

ఈలోగా, సెల్మా పొరుగునుండే మేరియన్ పట్నంలో ఫిబ్రవరి 18న, నాలుగువందలమంది నీగ్రోలు ప్రశాంతంగా నిర్వహిస్తున్న ప్రదర్శనను అవసరంలేని కాల్పులతో పోలీసులు రక్తసిక్తం చేశారు. ఆ కాల్పుల్లో జిమ్మీ లీ జాక్సన్ అనే కార్యకర్త కడుపులోకి తూటా చొచ్చుకుపోయింది. వారం రోజులు మృత్యువుతో పోరాడి, చివరకు 26వ తేదీన అతడు ప్రాణం వదిలాడు.

దీన్ని ఆసరాగా తీసుకుని, సెల్మానుండి మాంట్గోమెరీకి నడిచే జాతీయ రహదారి నెంబరు 80 మీద ప్రదర్శనలు నిషేదిస్తూ గవర్నర్ వ్యాలెస్ భద్రతా ఉత్తరువులు జారీచేశాడు. మరోవైపునుండి కొత్త అటార్నీ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన నికొలాస్ కజెన్‌బక్ కలగజేసుకుని, లూథర్‌తో పాదయాత్రా ప్రయత్నాన్ని విరమింపజేసే ప్రయత్నాలు మొదలెట్టాడు. ఏడవతేదీ దగ్గర పడుతున్నకొద్దీ ఎస్.సి.ఎల్.సి. కార్యవర్గసభ్యుల అభిప్రాయంలోనూ మార్పు కొట్టొచ్చినట్టు కనిపించింది. సెల్మానుండి ఆశించినంత స్పందన రానందువల్ల, బలహీనమైన సంఖ్యతో ప్రదర్శనకు పూనుకుంటే లూథర్ ప్రతిష్టే కాక, మొత్తం ఉద్యమమే దెబ్బ తింటుందని వాళ్ళ వాదన. అదీగాక, చాలీచాలని సమూహంతో విరోధి

స్థావరాల నట్టనడుమ కాలినడక ప్రయాణాన్ని వాళ్ళు వ్యతిరేకించారు. ధైర్యం వేరు, ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడం వేరని వాళ్ళ అభిప్రాయం. ప్రకటించిన కార్యక్రమాన్ని అపేయడం లూథర్‌కు ఇష్టంలేదు. చివరకు, లూథర్‌కు మారుగా మరో ప్రముఖుని నాయకత్వంలో ఆదివారం పాదయాత్రను యధావిధిగా కొనసాగించేలా సయోధ్య కుదిరింది. నాయకత్వ బాధ్యతలను హోసియా విలియమ్స్‌కు అప్పగిస్తూ తీర్మానించారు.

ఐదువందల మందితో, అట్లాంటా నుండి వచ్చిన హోసియా విలియమ్స్ నాయకత్వంలో, మే 7వ తేదీ పాదయాత్ర బయలుదేరింది. బ్రౌన్ ఛాపెల్ చర్చి దగ్గర గుంపైన ప్రదర్శకులు నగరవీధులు దాటుకుని, 80 నెంబరు జాతీయ రహదారి చేరుకున్నారు. ఎలాటి ఆటంకం లేకుండా పట్టణం పొలిమేరలోని 'పెట్టూస్' వంతెన సమీపించారు. జబ్బునుండి కోలుకుని విధుల్లో చేరిన జిమ్ క్లార్క్, వంతెనకు కుడిఎడమల్లో తన సిబ్బందిని నిలిపి పహరా కాస్తూ కనిపించాడు. ఊరేగింపు తనను దాటుకుంటూ వంతెనమీదికి చేరుతున్నా అతడు కిమ్మనకుండా ఊరుకోవడం ప్రదర్శకులకు ఆశ్చర్యం కలిగించింది. వంతెన దాటి ఇరవై గజాలైనా సాగకముందే, అటువైపు మొహరించిన రిజర్వు బలగాలు ఊరేగింపును అటకాయించాయి.

"వెనక్కు తిరగడానికి మీకు రెండు నిమిషాలు సమయం ఇస్తున్నాను." అంటూ హెచ్చరించాడు రిజర్వు బలగాల అధిపతి మేజర్ క్లౌడ్.

"మీతో ఒక్క మాట . . " అంటూ బ్రతిమాలాడు హోసియా విలియమ్స్.

"అర్థ మాటగూడా వినేదిలేదు." అన్నది జవాబు.

రెండో నిమిషం దాటీదాటకుండానే ప్రదర్శకులమీద రిజర్వు బలగాలు విరుచుకు పడ్డాయి. ఊరేగింపును అనుసరిస్తూ వెనకవైపుగా వచ్చిన జిమ్ క్లార్క్ సిబ్బంది వాళ్ళతో చేతులు కలిపింది. లాఠీలతో మోదుతూ, గుర్రపు డెక్కలతో తొక్కిస్తూ రిజర్వు బలగాలు గుంపును చెల్లాచెదురు చేస్తుండగా, సెల్మా కేసి తరుముకుంటూ క్లార్క్ సిబ్బంది మనిషి మనిషినీ వెంబడించి కకావికలు చేసింది. ఆనాటి పోలీసు ప్రవర్తన, శాంతిభద్రతలకు ఆవసరమైన ప్రయత్నంగా లేదు; రక్తం కళ్ళజూడాలనే కసాయి పరిశ్రమగా సాగింది. పోలీసు ఉన్నతాధికారి బేకర్ పరిగెత్తుకొచ్చి అడ్డుకోకుంటే జిమ్ క్లార్క్ ఎన్ని ప్రాణాలు తీసుండేవాడో ఊహించడం కష్టం. అప్పటికే ఆ దాడిలో గాయపడని ప్రదర్శకుడు లేడు. ఆందోళనకారుల్లో 17గురు ప్రాణాపాయ స్థితిలోనూ, 47గురు తీవ్రమైన గాయాలతోనూ ఆస్పత్రి పాలయ్యారు.

'వెళ్ళక తప్పుజేశానేమో' ననే గిలితో అదివరకే నలుగుతున్న లూథర్‌ను సెల్మానుండి వచ్చిన వార్త కుప్పగూలేలా చేసింది. ''వెంటనే నేను సెల్మా బయలుదేరాలి. స్వయంగా పాదయాత్ర జరపక తప్పదు.'' అన్నాడు ఎస్.సి. ఎల్.సి. కార్యవర్గంతో. కాదనే సాహసం ఎవరూ చేయలేదు. 'లూథర్ రేపు సెల్మా చేరుకుంటాడు. మంగ్లవారం పాదయాత్ర ప్రారంభిస్తాడు' అనే కబురు అక్కడి మిత్రులకు పంపించారు. యాత్రను అడ్డుకోకుండా అలబామా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవలసిందిగా కోరుతూ మరుసటిరోజే ఫెడరల్ కోర్టును ఆశ్రయించటానికి సన్నాహాలు మొదలెట్టారు.

సోమవారం ఉదయం ప్రెసిడెంట్ జాన్సన్నుండి లూథర్‌కు ఫోనొచ్చింది. అతన్తో పాదయాత్ర మాన్పించటానికి అధ్యక్షుడు పరిపరివిధాల ప్రయత్నించాడు. జాన్సన్ కోరికను సున్నితంగా తిరస్కరించి లూథర్ సెల్మాకు బయలుదేరాడు. అతడు అక్కడికి చేరుకునేవేళకు పొద్దు మునిగింది. ఐనా, అతని రాకకోసం ఎదురుజూసే వేలాది కార్యకర్తల సందోహం సెల్మాలో మారిన వాతావరణాన్ని సూచించింది. ఆ ముందురోజు పోలీసుల రక్తదాహం కళ్లారా చూసిన సెల్మా నల్లజాతిలో భీతికి మారుగా పట్టుదల పెరిగింది.

సంతోషం కుదుటపడక ముందే ఫెడరల్ కోర్టు తీర్పు అశనిపాతంలా విరుచుకుపడింది. లూథర్ అభ్యర్థనను తోసిపుచ్చడమేగాక, పాదయాత్రను నిషేధిస్తూ గూడా తాత్కాలిక ఉత్తరువులు జారీచేసింది అలబామా ఫెడరల్ కోర్టు. ఇంతవరకు జాతివివక్ష నిర్మూలనలో పోరాటకారులకు బాసటగా నిలిచిన ఏకైక శక్తి ఫెడరల్ న్యాయవ్యవస్థ. ''ప్రజాస్వామ్యాన్ని సరైన దారిలో నడిపించటానికి అవసరమైన సాహసోపేత నాయకత్వం ఒక్క ఫెడరల్ న్యాయవ్యవస్థలో తప్ప మరెక్కడా కనిపించడంలేదు.'' అంటూ లూథర్ ఆ వ్యవస్థను అనేక సందర్భాల్లో ప్రశంసించాడు. ఇప్పుడు ఆ వ్యవస్థ తీర్పును ధిక్కరించడమా, తలొగ్గడమా? - ఎడతెగని ఆలోచనలో మునిగిపోయాడు లూథర్.

పొరుగు రాష్ట్రాలనుండి పేరుమోసిన పౌరహక్కుల నాయకులంతా యాత్రలో పాల్గొనటానికి ఒక్కరొక్కరే సెల్మాకు చేరుతున్నారు. ''నాకు నిన్న జ్వరమొచ్చింది. కీళ్ళ నొప్పితో నడవడం కష్టమే. ఐనా రేపటి ప్రయాణం మానుకోను.'' అంటున్నాడొక సెల్మా వృద్ధుడు వచ్చిన అతిథులతో. అది అడ్డుకోటానికి అసాధ్యమైన ఉరవడిగా కనిపించింది లూథర్‌కు. 'ఏది ఏమైనా సరే, పాదయాత్ర జరగక తప్పదు' అనుకున్నాడు మనసులో.

మంగళవారం ఉదయం అధ్యక్షుని ప్రత్యేక విమానం సెల్మాలో దిగింది. అందులో, కొత్తగా ఏర్పాటైన 'కమ్యూనిటీ రిలేషన్స్ సర్వీస్' అధ్యక్షునిగా నియమితుడైన మాజీ ఫ్లోరిడా గవర్నర్ కోలిన్స్ వచ్చాడు. అతనితోపాటు, అసిస్టెంట్ అటార్నీ జనరల్ జాన్ డియోర్ గూడా ఉన్నాడు. లూథర్‌ను కలిసి, పాదయాత్ర విరమించేలా ఒప్పించడానికి ఆ ఇద్దరూ చాలాసేపు ప్రయత్నించారు. ప్రతి రంగంలోనూ జాతివివక్షను రూపుమాపి, సంపూర్ణ సమానత్వాన్ని తీసుకొచ్చేందుకు అధ్యక్షునికుండే అంకితభావాన్ని వివరించారు. ఓటింగ్ హక్కుల బిల్లుకోసం జరుగుతున్న ప్రయత్నాలు వెల్లడించారు. ఫెడరల్ న్యాయవ్యవస్థతో చెడ్డపడటం క్షేమం కాదని సలహా ఇచ్చారు. పరిస్థితులు చాలా ఉద్రిక్తంగా ఉన్నాయనీ, ఆదివారం జరిగిన మారణకాండ పునరావృతమైతే, ప్రపంచ దేశాల ముందు అమెరికా తలెత్తుకుని నిలబడలేదన్నారు. దేశం నగుబాటుపాలు కాకుండా చూడమని బ్రతిమాలారు.

''మీరు చెప్పింది బాగానే ఉంది. కానీ, ఆగలేనంత దూరం ఇప్పటికే మేము వచ్చేశాం. దయవుంచి మమ్మల్ని ఆపటానికి ప్రయత్నించకండి. మరోమాట. జాతి పరువు నిలబెట్టడానికి యాత్ర నిలబెట్టమని మాకు చెబుతున్నారేగానీ, మృగాలుగా ప్రవర్తించడం మానుకోమని పోలీసులకు ఎందుకు చెప్పలేరు?'' అడిగాడు లూథర్.

''ఆ ప్రయత్నంగూడా చేస్తాం,'' అంటూ ఫెడరల్ ప్రతినిధులు నిష్క్రమించారు.

మధ్యాహ్నం రెండుగంటలకు, సరిగ్గా ఊరేగింపు బయలుదేరే సమయాన, కోలిన్స్ ఎదురొచ్చి, 'రూట్ మ్యాప్' ఉన్న ఒక కాగితాన్ని లూథర్‌కు అందించి, ''ఈ మార్గాన్ని అనుసరించండి'' అన్నాడు. అది ఇదివరకు ఉద్యమకారులు పోలీసులకు సూచించిన మార్గమే గాబట్టి, 'పేచీ లేద'న్నాడు లూథర్. చెవిలో గుసగుసలాడిన ఆ చిన్న సంభాషణ, 'వడ్లగింజలో బియ్యపుగింజ' సామెతగా, ఆ తరువాత అంతులేని అపవాదుకు దోహదం చేసింది.

మూడువేలకు దాటిన జనసమూహంతో, బ్రౌన్ ఛాపెల్ చర్చినుండి పాదయాత్ర మొదలైంది. గీతాలాపనతో జాతీయరహదారి చేరుకుంది. వంతెన దగ్గర కోర్టు అమీనా ఊరేగింపుకు అడ్డుతగిలి, ఫెడరల్ కోర్టు నిషేధాజ్ఞలు చదివి వినిపించాడు. ''మా యాత్ర ఆగదు.'' అన్నాడు లూథర్. అడ్డు తప్పుకున్నాడు అమీనా. ప్రదర్శకులు వంతెన దాటుకున్నారు. మైలు దూరంలో పారాట్రూపర్ దళాలు

కనిపించాయి. అవి దారి కడ్డంగా మోహరించాయి. సందు లేకుండా భుజానికి భుజం ఆనించి, సిపాయిలు పొరలు పొరలుగా నిర్మించిన గోడల్లా, వరుస వెనుక వరుస నిలబడ్డారు. ప్రదర్శకులు దగ్గరపడగానే, ట్రూపర్లకు నాయకత్వం వహించే మేజర్ క్లౌడ్ ఎదురొచ్చి, ''ఈ యాత్రను ముందుకు సాగనివ్వం. ఇది మీ భద్రతకు గానీ, రహదారిమీద ప్రయాణించే వాహనాల భద్రతకుగానీ క్షేమంగాదు.'' అన్నాడు. కాదుగూడదని ముందుకు అడుగేస్తే, సిపాయిల్లో సందు చేసుకోటానికి ఘర్షణ జరుగుతుంది. తామై దౌర్జన్యానికి దిగడం అహింసావాదులకు సమంజసం కాదనుకున్నాడు లూథర్. ''సరే. ప్రార్థన ముగించుకొని వెనక్కు వెళ్ళిపోతాం.'' అన్నాడు. ''అభ్యంతరం లేదు.'' అన్నాడు మేజర్ క్లౌడ్. ప్రార్థనకు మోకరిల్లాడు లూథర్. ప్రదర్శకులందరూ అతనితోపాటు మోకరిల్లారు. అక్కడితో యాత్ర ముగించి, అందరూ సెల్మాకు తిరుగుముఖం పట్టారు. అంత తేలిగ్గా యాత్రను ముగించడం కొందరు నాయకులకు, ముఖ్యంగా విద్యార్థినాయకులకు, అవమానంగా తోచింది. ఫెడరల్ గవర్నమెంటుతో లూథర్ కుమ్మక్కైనాడని దుమారం లేచింది.

రహదారి సంఘటన వరకు ప్రశాంతంగా ముగిసినా, ప్రమాదాలు లేకుండా రోజు మాత్రం ముగియలేదు. బోస్టన్ నుండి వచ్చిన జేమ్స్ రీబ్, క్లార్క్ ఓసెన్, క్యాలిఫోర్నియా నుండి వచ్చిన అర్లాఫ్ బి విలియమ్స్ అనే మతబోధకులు యాత్రలో పాల్గోటానికి వచ్చిన తెల్లజాతీయులు. ఆ ముగ్గురూ యాత్ర తరువాత ఒక నల్లజాతి రెస్టారెంటులో భోజనం ముగించుకుని బయటికి రాగానే, పొంచేసిన క్లాన్ గూండాలు వాళ్ళమీద దాడి చేసి ముగ్గురినీ తీవ్రంగా గాయపరిచారు. ఫాదర్ రీబ్‌కు తల పగిలి, ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రికి తరలించబడ్డాడు. డాక్టర్ల ప్రయత్నాలన్నీ విఫలమై, మార్చి 11వ తేదీ సాయంత్రం అతడు ప్రాణాలు కోల్పోయాడు.

ఫాదర్ రీబ్ మరణం సెల్మాను దయ్యమై పీడించింది. అతడు మరణశయ్య మీద ఉన్నప్పుడే ఇరుగపొరుగు రాష్ట్రాల మిషనరీలూ, బడిపిల్లలూ తెలిపే నిరసనలతో గంటగంటకు సెల్మా పట్టణం హోరెత్తింది. 12వ తేదీన, నగరపాలక కార్యాలయం మెట్లమీద సంతాప సూచకమైన ప్రార్థన జరపటానికి నీగ్రోలతోపాటు, తెల్ల మిషనరీలుగూడా పట్టుబట్టారు. వారి కోరిక నగరపాలకులు తిరస్కరించారు. పోలీసు బ్యారికేడ్లను తోసుకుంటూ దాదాపు వెయ్యిమంది ప్రదర్శకులు దొమ్మీగా కార్యాలయం ప్రవేశించి ప్రార్థనకు మోకరిల్లారు. కారణం తెలీదుగానీ, ఆరోజు పోలీసులు విపరీతమైన నిగ్రహం పాటించారు. మరుసటిరోజు, అమరవీరుని స్మృతికి

అంజలి ఘటించే కార్యక్రమానికి పురపాలక రంగస్థలాన్ని కోరిన మరుక్షణం అనుమతించారు నగరపాలకులు.

మార్చి 15 సోమవారం, అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి, ఓటుహక్కుల మీద అమెరికన్ అధ్యక్షుడు జాన్సన్ చేసిన ప్రసంగం ఒక మరువరాని సంఘటన. నీగ్రో సమస్యలమీద పెదవులతో కాకుండా హృదయంతో మాట్లాడిన అధ్యక్షుడు, అబ్రహాం లింకన్ తరువాత, లిండన్ జాన్సన్ ఒక్కడే!

''చదువుకోవాలనే మక్కువతో విద్యార్థులుగా వచ్చిన నిరుపేద నీగ్రోలకు నేను టెక్సాస్‌లో ఉన్నప్పుడు పాఠాలు నేర్పుతూ, వారి యాతన కళ్ళారా చూశాను. ఆనాటి నా విద్యార్థుల సంతానానికి, దేశవ్యాప్తంగా అదే స్థితిలో కొట్టుమిట్టాడే అశేష ప్రజానీకానికి, సహాయపడే అవకాశం నాకు వస్తుందని కలలోగూడా నేను ఊహించలేదు. ఇప్పుడు ఆ అవకాశం నాకు దొరికింది. నేనొక చిన్న రహస్యం మీతో చెప్పాలనుకుంటున్నాను. . . . .

''ఈరోజు సెల్మాలో జరిగే ఉద్యమం కేవలం సెల్మాకే పరిమితమైంది కాదు. అది దేశం నాలుగు చెరగులా విస్తరించిన మహోద్యమంలో ఒక చిన్న తునక. అమెరికన్ జీవితం ప్రసాదించే సౌకర్యాన్ని అమెరికన్ పౌరునిగా అనుభవించటానికి అమెరికన్ నీగ్రో చేస్తున్న ప్రయత్నం. 'వాళ్ళు నీగ్రోలు కాబట్టి వాళ్ళ ప్రయోజనం వేరు' అనుకోవడం పొరబాటు. దేశానికి అవిటితనాన్ని అంటగడుతూ, తరతరాలుగా వస్తున్న ఈ ద్వంద్వనీతి నుండి, ఈ అధర్మం నుండి బయట పడవలసిన బాధ్యత మనందరిమీదా సమానంగా ఉంది. కాబట్టి, మనం . . . వెంటనే . . . . బయట పడబోతున్నాం. . . . ''

మారుమ్రోగే కరతాళధ్వనుల మధ్య, ఓటింగ్ హక్కుల బిల్లు ఎల్లుండి బుధవారం సభలో ప్రవేశపెట్టబడుతుందని ప్రకటిస్తూ అధ్యక్షుడు తన ప్రసంగాన్ని ముగించాడు.

మార్చి 17వ తేదీన, సెల్మా-మాంట్గోమెరీ రహదారి ప్రదర్శన మీద విధించిన నిషేధం తొలగిస్తూ, రాష్ట్రప్రభుత్వంగానీ, స్థానిక పోలీసులుగానీ దాన్ని అడ్డుకోకుండా నియంత్రిస్తూ, అలబామా ఫెడరల్ కోర్టు తన తుదితీర్పును ప్రకటించింది.

మబ్బులు విడిపోయిన వాతావరణంలో మరోసారి పాదయాత్రకు లూథర్ ఉపక్రమించాడు. మార్చి 21 ఆదివారం ఉదయం 10 గంటలకు సెల్మానుండి బయలుదేరేలా ప్రకటించాడు. ఆరోజుకు సెల్మా చేరుకోవాలని ఇతర రాష్ట్రాలనుండి

వేలాది ప్రముఖులు బయలుదేరారు. వాషింగ్టన్ కవాతుకు సూత్రధారులైన రాండాల్ఫ్ తదితరులూ, బర్మింగ్‌హాం నుండి వచ్చిన షెటిల్‌వర్త్ వంటి హేమాహేమీలే కాక, గవర్నర్ రాక్ఫెల్లర్ ప్రత్యేక ప్రతినిధిగా న్యూయార్క్ సిటీ కౌన్సిల్ అధ్యక్షుడు పాల్ సర్వేన్ వంటి పేరుమోసిన వ్యక్తులుగూడా కలవటానికి రావడం మరో విశేషం. జాతీయ రహదారి వెంట ప్రదర్శనకు ఫెడరల్ కోర్టు అనుమతించిన సంఖ్య మూడువందలుకాగా, ప్రోగైన జనసంఖ్య ఎనిమిది వేలకు దాటింది.

భద్రతా ఏర్పాట్లను కేంద్రప్రభుత్వం కట్టుదిట్టం చేసింది. అలబామా పోలీసు సిబ్బందిని తన అధీనంలోకి తీసుకోవడమేగాక, దారి పొడవునా మిలిటరీని కాపుంచి, హెలికాప్టర్లలో పహరా ఏర్పాటు చేసింది.

అది ఐదురోజుల ప్రయాణం. మొదటిరోజు సుమారు 11 కిలోమీటర్ల ప్రయాణం సాగింది. ఆ రాత్రి, డేవిడ్ హాల్ అనే నల్లజాతీయుని తోటలో విశ్రాంతి తీసుకున్నారు. వేలమందికి అక్కడ వసతి కల్పించడం కష్టం కాబట్టి, కొద్దిమంది నాయకులు మాత్రం తోటలో బసజేసి, మిగతా జనాన్ని బస్సుల్లో సెల్మా తరలించారు. మరుసటిరోజు ఉదయం 8 గంటలకు, రెండవ అంచె పాదయాత్ర సెల్మా నుండి బస్సుల్లో తిరిగొచ్చి కలుసుకున్న జనంతో బయలుదేరింది. ఆ రోజు ప్రయాణం అత్యంత ప్రమాదకరమైన లోన్డెస్ మండలంగుండా సాగాలి. ఆ మండలంలో తెల్లజాతి జనాభాకు నీగ్రోలు రెట్టింపు. అందువల్ల, నీగ్రోలను తొక్కిపట్టాలనే పిచ్చి ప్రతి తెల్లమనిషిలో నరనరానా వ్యాపించిన మండలం లోన్డెస్. నీగ్రోలను కించపరిచే పోస్టర్లు యాత్రికులకు దారిపొడవునా దర్శనమిచ్చాయి. పాదయాత్రను పరిహసించే కరపత్రాలు ఒక తేలికపాటి విమానంనుండి యాత్రికులమీద వెదజల్లబడ్డాయి. అంతకు మినహా, దౌర్జన్యానికి ఎవరూ సాహసించలేదు. సుమారు 24 కిలోమీటర్ల నడక తరువాత, ఆ రాత్రి రోసా స్టీల్స్‌వారి తోటలో నాయకులు విడిది చేశారు.

మూడవరోజు సాయంత్రానికి సెల్మానుండి సుమారు 53 కిలోమీటర్ల ప్రయాణం సాగింది. ఆ రాత్రికి బర్మింగ్‌హాం కోటీశ్వరుడు ఎ.జి.గ్యాస్టన్ తోటలో విశ్రమించారు. లూథర్ ఆ రాత్రి సెల్మా చేరుకుని, అక్కడినుండి ఒక పురస్కారం అందుకోటానికి ఓహియో వెళ్ళాడు. నాల్గవరోజు పాదయాత్ర అతడు లేకుండానే ముందుకు సాగి, మాంట్గోమెరీ పొలిమేరకు మూడు కిలోమీటర్ల దూరంలో ఆగింది. రాత్రికి సెయింట్ జూడే సెంటర్ అనే నలభై ఎకరాల క్యాథలిక్ పాఠశాలలో విశ్ర

మించిన యాత్రికులను బెలెఫోంటే, బెర్న్‌స్టీన్, బెన్నెట్ తదితర ప్రపంచ ప్రఖ్యాత గాయకుల సమూహం తమ గానామృతంతో చెవులకు విందు చేసింది. ఆ సమయానికి లూథర్‌గూడా తిరిగొచ్చి మిత్రులతో కలుసుకున్నాడు.

ఐదవరోజు, మార్చి 25 గురువారం ఉదయం, అనుకోకుండా వర్షం మొదలైంది. కానీ, పెనుతుఫానుతో పిడుగులు కురిసినా ఆ యాత్రికుల ఉత్సాహాన్ని అడ్డుకోలేదు. ఆ వర్షంలోనే తడుస్తూ దాదాపు ముప్పైవేల సానుభూతిపరులు మాంట్గోమెరీనుండి ఎదురొచ్చి యాత్రికులను ఆహ్వానించారు. చిన్నసైజు వాషింగ్టన్ కవాతులా పాదయాత్ర రాజధానికి కదిలింది. డెక్స్టర్ అవెన్యూ చేరుకున్న తరువాత, విజ్ఞాపన పత్రంతో ఒక ప్రతినిధిబృందం గవర్నర్‌ను కలవడానికి వెళ్ళింది. కానీ, ఆయన ఆఫీసు తాళం వేసుంది. నిరాశతో వెనుదిరిగిన ప్రతినిధిబృందాన్ని కిటికీ సందుల్లోనుండి నిశ్శబ్దంగా చూస్తూ గవర్నర్ వ్యాలెస్ లోపలే ఉండిపోయాడు!

చూస్తూ ఊరుకునే సహనం గవర్నర్ వ్యాలెస్‌కైతే ఉండొచ్చుగానీ, తెల్లజాతి మొత్తానికి ఉండదుగదా! అందువల్ల, పాదయాత్రకు ప్రతీకారంగా, పాదయాత్ర నడిచిన రహదారిమీదే, ఆ మరుసటిరోజు ఒక హత్య జరిగింది. సెల్మా నుండి కారులో ఇంటికి తిరిగొస్తున్న వయోలా లిజ్జో అనే తెల్లజాతి వనితను గుర్తుతెలియని వ్యక్తులు తుపాకితో కాల్చి చంపేశారు. ఆమె మాంట్గోమెరీ నివాసి; ఐదుగురు పిల్లలకు తల్లి. ఆ దారిలోనే నడిచి వెళుతున్న ఒక నీగ్రోను తన కారులో ఎక్కించుకుని గమ్యం దగ్గర దిగబెట్టడం ఆ వృద్ధురాలు చేసిన నేరం!

---

*పారాట: A game of chasing. సంక్రాంతి పండుగ మరుసటిరోజు గ్రామసీమల్లో సాంప్రదాయంగా ఆచరించే ఒక వినోదం. ఈ ఆటలో ఒక కుందేలును విశాలమైన బయలుజాగాలో వదిలేస్తారు. దాని వెంటబడి ఎవరు పట్టుకుంటే ఆ కుందేలు వారి సొత్తౌతుంది. బహుమతిగూడా అందుతుంది. దీన్ని పారువేట, లేదా పారాట అని పిలుస్తారు.

# కొత్త కోణం

ఏదైనా నిర్ణయం తీసుకునే అగత్యం ఏర్పడినప్పుడు, 'అపాయం ఉండదు గదా?' అని అడుగుతుంది మనిషిలోని పిరికితనం; 'మర్యాదకు లోటు రాదుగదా?' అని అడుగుతుంది లౌకికం; 'నగుబాటు కాదుగదా?' అని అడుగుతుంది డాంబికం; 'న్యాయమైనదేగదా?' అని అడుగుతుంది అంతరాత్మ. అంతరాత్మను చంపుకోలేని మనిషి అపాయాన్నీ, కీర్తి మర్యాదలనూ లెక్కలోకి తీసుకోడు. వియత్నాంలో అమెరికా జోక్యాన్ని గురించి నిర్ణయం తీసుకునే సందర్భంలో లూథర్‌కు ఇలాటి అవస్థే తటస్థించింది. 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో జరుగుతున్న ఆ మారణ హోమానికి లూథర్ మనసు తల్లడిల్లింది.

కొన్ని లోపాయికారి వ్యవహారాలను బహిరంగం చేసి, వియత్నాం యుద్ధాన్ని తొలిసారిగా వ్యతిరేకించిన నీగ్రో నాయకుడు మాల్కం ఎక్స్. వియత్నాం యుద్ధానికి సైనికులను సేకరించడంలో జరుగుతున్న తెలుపూ నలుపూ వివక్షను అతడు ఎత్తిచూపించాడు. అర్హులుగా ఎంపికైన యువకుల్లో నీగ్రోలనుండి 69 శాతాన్నీ, తెల్లజాతీయుల నుండి 31 శాతాన్నీ వియత్నాంకు ఎగుమతి చేస్తున్నారు సెలెక్టర్లు. ఇక నష్టాల సంఖ్యను పరిశీలిస్తే, యుద్ధంలో కోల్పోయిన తెల్లోళ్ళకంటే నీగ్రోల సంఖ్య రెండింతలు. మాల్కం వాదనలో లూథర్‌కు సత్యం కనిపించింది.

"ఈరోజు కొంతమంది అమెరికన్ యువకులు, తాము ఏ ప్రయోజనం కోసం ప్రాణాలను పందెంగా పెడుతున్నామో తెలీని యుద్ధంలో, ఎక్కడోవున్న తూర్పు ఆసియా అడవుల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వాళ్ళు ప్రజాస్వామ్యం కోసం త్యాగాలు చేస్తున్నారనే ప్రచారం ఇక్కడ మనం వింటున్నాం. కానీ, ఏ ప్రభుత్వం కోసం వాళ్ళు ప్రాణాలు ధారపోస్తున్నారో ఆ సైగాన్(దక్షిణ వియత్నాం) పరిపాలన ప్రజాస్వామ్యానికి దిష్టిబొమ్మ. అదీగాక, తన జీవితంలో ఏనాడూ ప్రజాస్వామ్యాన్ని అనుభవించని నీగ్రో సైనికుణ్ణి మరొకరి ప్రజాస్వామ్యానికి త్యాగం చెయ్యమని పంపడం విడ్డూరం గూడా. సామాజిక సమస్యల పరిష్కారానికి దౌర్జన్యాన్నీ, యుద్ధాన్నీ పనిముట్టుగా వాడటాన్ని బుద్దెరిగిన దగ్గరినుండి నేను నిరసిస్తున్నాను. పదికాలాల పాటు నిలిచే శాంతినీ, సౌభ్రాతృత్వాన్నీ సాధించగల శక్తి ఒక్క అహింసామార్గానికే ఉందని నమ్ముతున్నాను. ఒక మతబోధకునిగా, ఒక పౌరహక్కుల నాయకునిగా, ఒక నోబెల్ పురస్కార గ్రహీతగా, ఒక నీగ్రోగా,

అన్నిటికంటే ముఖ్యంగా ఒక అమెరికన్ పౌరునిగా, ఈ యుద్ధం విషయంలో నా అంతరాత్మతో నేను కుస్తీ పడుతున్నాను.''

ఇదీ మార్టిన్ లూథర్ కింగ్ వెలుబుచ్చిన అభిప్రాయం. ఈ అభిప్రాయం అతని సొంతసంస్థలోనే కలకలం రేపింది. 1965 ఏప్రిల్ 1, 2 తేదీల్లో బాల్టీమోర్‌లో జరిగిన ఎస్.సి.ఎల్.సి. కార్యవర్గ సమావేశంలో ప్రధాన చర్చనీయాంశంగా ఇదే విషయం తలెత్తింది. ఈ వాదనవల్ల తమమీద దేశద్రోహులుగా ముద్ర వేస్తారనీ, విరాళాలు ఆగిపోతాయనీ, కార్యక్రమం కుంటు పడుతుందనీ, ఇంకాఇంకా కారణాలు చూపించి చాలామంది సందేహించారు. మెజారిటీ సభ్యులు దీన్ని వ్యతిరేకిస్తున్నట్టు లూథర్ దృష్టికి తీసుకొచ్చారు. ''మనం చేస్తున్న పోరాటం జాతివివక్ష మీద. దీనికీ, ఎక్కడో జరిగే యుద్ధానికీ జత కుదరదు.'' అన్నారు.

లూథర్ అభిప్రాయం మారలేదు. ''జాతుల విలీనమనేది భౌగోళిక సమస్య. ఒక దేశానికో, ఒక సరిహద్దుకో కుదించటానికి వీలయ్యేది కాదు. యుద్ధాలతో ఏ దేశాని కాదేశం, ఏ జాతి కాజాతి విడిపోతూ ప్రపంచమే ముక్కలుముక్క లౌతున్నప్పుడు, జాతివిలీనాన్ని ఒక్క అమెరికాలోనే సాధించడం అసాధ్యమైన ప్రయత్నం.'' అన్నాడు లూథర్.

ఒక్క ఎస్.సి.ఎల్.సి. లోనే గాక, ఇతర నీగ్రో సంస్థల్లోగూడా వియత్నాం సమస్యమీద కల్లోలం చెలరేగింది. తీవ్రమైన అభిప్రాయభేదాలతో కొన్ని సంస్థలు నిట్టనిలువునా చీలే ప్రమాదం ఏర్పడింది. ఐతే, చీలిక ప్రమాదం ఎస్.సి.ఎల్.సి.ని తాకలేదు. జులై మొదటివారంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో లూథర్ అభిప్రాయాన్ని సభ్యులందరూ ఆమోదించారు.

వియత్నాం యుద్ధాన్ని ఆత్మగౌరవంతో ముడేసుకుని కూర్చుంది అమెరికన్ ప్రభుత్వం. అందువల్ల, లూథర్ వ్యాఖ్యానం అధ్యక్షుడు జాన్సన్‌కు మనస్తాపం కలిగించింది. ఆ యుద్ధానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని మల్లించొద్దని అధ్యక్ష భవనంనుండి లూథర్‌కు సలహా రూపంలో సంకేతాలు అందడం మొదలయ్యాయి. స్వయంగా అధ్యక్షుణ్ణి కలిసి, ఆ యుద్ధం వల్ల దేశానికి జరుగుతున్న నష్టాన్ని వివరించాలనుకున్నాడు లూథర్.

ఇంతలో లూథర్‌కు ఉత్తరాదిలోని చికాగో నగరంలో చేతినిండా పని తగిలింది. మేడిపండు వంటి ఉత్తరాది ప్రజాస్వామ్యంలో నీగ్రోల అగచాట్లను గురించి చాలా కాలంగా లూథర్ వింటున్నాడు. ఉత్తరాదిలో గూడా చేయవలసింది చాలా ఉందని

లూథర్ గుర్తించాడు. కానీ, అతనికి ఆ అవకాశం చిక్కలేదు. ఇప్పుడా అవకాశం అనుకోకుండా దగ్గరికొచ్చింది. చికాగోలో జరుగుతున్న తమ ఉద్యమంలో స్వయంగా పాల్గొని నడిపించవలసిందిగా నీగ్రో నాయకుడు అల్‌ర్యాబీ నుండి లూథర్‌కు ఆహ్వానం అందింది. శ్రమజీవుల పోరాటానికి గుర్తుగా ఎర్రజెండాను ప్రపంచానికి అందించిన చారిత్రాత్మక చికాగో నగరంలో ఉద్యమాన్ని నిర్వహించే అవకాశం దొరకడం అదృష్టంగా భావించాడు లూథర్.

ఉపాధ్యాయునిగా పనిజేసి, పదవీ విరమణ చేసిన అల్‌ర్యాబీ, చికాగో పాఠశాలల్లో గూడుకట్టుకున్న జాతివివక్షకు వ్యతిరేకంగా ఐదేళ్ళనుండి పోరాటం నడుపుతున్నాడు. 'కోఆర్డినేటింగ్ కౌన్సిల్ ఆఫ్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్' అనే సంస్థను నెలకొల్పి, తన ఉద్యమానికి మద్దతు కూడగట్టాడు. ఎస్.సి.ఎల్.సి. గూడా చాలా కాలంగా ఆ ఉద్యమాన్ని గమనిస్తూ, సహకారం అందిస్తూ వస్తూంది. ఉద్యమానికి పదును పెంచాలనే ఉద్దేశంతో లూథర్‌ను ఆహ్వానించాడు అల్‌ర్యాబీ.

చికాగో ఉద్యమానికి మూలకారణం ఆ నగర పాఠశాలల సూపరెండెండెంట్ బెంజమిన్ సి.విల్స్ విధానాలు. 1958 నుండి నీగ్రో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరగడం మొదలైంది. ఐనా, తరగతులను పెంచకుండా, ఉన్న తరగతులకే పెరిగిన రద్దీని పంచమన్నాడు విల్స్. అటువైపు తెల్లపిల్లల బళ్ళల్లో తరగతులు నిండక, సీట్లు ఖాళీగా పడుంటే, ఇక్కడ సామర్థ్యాన్ని మించి తరగతుల్లో కుక్కడం సమంజసం కాదనీ, దానికంటే కొంతమంది నల్లవిద్యార్థులను తెల్ల బడులకు బదిలీ చేసి రద్దీని తగ్గించమని ఆందోళన మొదలయింది. తెల్లబడులకు నల్లపిల్లల బదిలీ కుదిరేది కాదని తెగేసి చెప్పాడు విల్స్. ఉన్న బళ్ళల్లోనే అదనపు సౌకర్యాలు కల్పించటానికి అంగీకరించాడు. అందుకోసం, 20x36 అడుగుల రడీమేడ్ అల్యూమినియం గదులను కొనుగోలు చేయటానికి అనుమతి కోసం 1961లో అతడు పురపాలక సంఘాన్ని అభ్యర్థించాడు. అనుమతి మంజూరైంది. అది తాత్కాలిక వసతి కోసమై ఉండొచ్చనుకున్నారు ఉద్యమకారులు. విల్స్ ఉద్దేశం అదిగాదు. ఈ ప్రత్యామ్నాయంతో పక్కా తరగతిగదుల నిర్మాణాన్ని శాశ్వతంగా మానుకోవడం అతని పన్నాగం. కాలక్రమంలో 'విల్స్ వ్యాగన్లు'గా అడ్డపేరు(nickname) తెచ్చుకున్న రైలుపెట్టెల్లాంటి అల్యూమినియం గదులను ప్రతిఏటా ఖరీదు చేయడం, స్కూలు ఆవరణలో ఖాళీజాగా వెదికి వాటిని నిలబెట్టడం అతడు పాటించిన పొదుపు కార్యక్రమం. బల్లలూ, కుర్చీలూ, ఆటలాడే మైదానం సంగతి అలా

ఉంచితే, పెరిగిన విద్యార్థి సంఖ్యకు తగినంతమంది ఉపాధ్యాయులనైనా నియమించడానికి అతడు పూనుకోలేదు. పేరుకే అవి పాఠశాలలుగాని, పాఠాలు చెప్పే దిక్కులేక, నీగ్రో బళ్ళల్లో విద్యాప్రమాణం అట్టడుగుకు దిగజారింది.

జులై 24న చికాగో చేరుకున్న లూథర్, మూడురోజుల పాటు ఆ నగరంలోని వాడవాడన పర్యటించాడు; మురికివాడల్లోని మనిషిమనిషినీ కలుసుకున్నాడు; ఆ కొద్దిపాటి సమయంలోనే ముప్ఫైకి తగ్గకుండా ఉపన్యాసాలిచ్చాడు; 26వ తేదీన, దాదాపు ముప్ఫైవేలమంది ప్రదర్శకులతో నగరవీధులగుండా పురపాలక భవనానికి ఊరేగింపు నిర్వహించాడు. ఉద్యమంలో లూథర్ ప్రవేశం చికాగోను కలవరపెట్టింది.

చికాగో మురికివాడల పర్యటన లూథర్‌కు గూడా కొత్త అనుభవమే. వందసార్లు విన్నదానికంటే ఒక్కసారి కళ్ళతో చూసింది మనసులో బలంగా నాటుకుంటుం దంటారు. చికాగో మురికివాడల జీవితాన్ని కళ్ళారా చూసిన లూథర్‌కు గుండె చెరువయింది. 'ఇల్లు' అనటానికి వీల్లేని బడ్డీలు అక్కడి నివాసాలు. పెంపుడు పక్షులకోసం కట్టుకునే 'దావిడి' కంటే కాస్త పెద్దవి. ఆ గూళ్ళైనా వాళ్ళ సొంతం గాదు; అద్దెకొంపలు. అద్దె గూడా చౌకగా ఉండదు; వసతులులేని ఆ అట్టపెట్టెలకు వాళ్ళు భరిస్తున్న అద్దెలో సగం చెల్లిస్తే తెల్లప్రాంతంలో ఆధునిక సౌకర్యాలుండే చిన్న అపార్టుమెంటు దొరుకుతుంది. కానీ, తెల్లప్రాంతాల్లో నల్లవారి నివాసానికి ఇరుగుపొరుగులు అంగీకరించరు.

విశాలమైన కళ్లతో తనవైపు ఆసక్తిగా చూస్తున్న పసిపిల్లలను 'హలో' అంటూ పలకరించాడు లూథర్. వాళ్ళ కళ్ళేమో చురుకుదనంతో మెరుస్తున్నాయి. కానీ, ఆ కొలకుల్లో చేరిన పుసులు, ఆ ముక్కుల్లో కారే చీమిడి దయనీయమైన వాళ్ళ పరిస్థితికి భాష్యం. ఆలనాపాలనా కరువైన పసితనం వాళ్ళది. నిద్ర లేవగానే పొట్ట చేత్తో పట్టుకుని అమ్మానాన్నా ఊడిగానికి వెళ్ళిపోతారు. చీకటి పడేముందు చీకాకుతో తిరిగొస్తారు. కొందరికి పగలొక చాకిరి, రాత్రి మరో చాకిరి చేసుకుంటే తప్ప పూట గడవదు. ఇక పిల్లలను ఆప్యాయంగా చేరదీసే తీరికెక్కడిది ఆ తలి దండ్రులకు? 'హలో' అంటూ అప్యాయంగా పలకరిస్తే ఆ పిల్లల ముఖాల్లో వికసించే ఆనందానికి లూథర్ కళ్ళు చెమ్మగిల్లాయి.

యువకులు - ఉపాధి కోసం వెదికి వెదికి నిరాశతో ముఖాలు వాడిన యువకులు కొందరూ, ఉపాధి దొరకదని నిర్ధారించుకుని రౌడీమూకలుగా మారిన యువకులు మరికొందరు. అవసరాలు గడవడానికి దొంగతనాలూ, దోపిడీలూ,

మానభంగాలూ వారి మార్గాలు. గుండెల్లో పేరుకున్న అక్కసుకు ఉపశమనంగా ముఠాతగాదాల్లో దిగి, ప్రాణాలు పోగొట్టుకోవడం వాళ్ళ రివాజు. మురికివాడల పొలిమేర దాటనంతవరకు, అలాటి చావుల గురించి ఆ నగరం పెద్దగా పట్టించుకోదు. అదనపు భారం శ్రమలేకుండా తగ్గుతున్నందుకు సంతోషిస్తుంది గూడా.

ఒక విధంగా చూస్తే, ఉత్తరాదికంటే నీగ్రోల పరిస్థితి దక్షిణాదిలోనే మెరుగేమో ననిపించింది లూథర్‌కు. దక్షిణాది నీగ్రోలకు సొంత ఆస్తులున్నాయి, సొంత వ్యాపకా లున్నాయి. నిరుద్యోగం, ముఠాతగాదాల మాటే వినిపించదు. పేదరికం ఉండొచ్చు; కానీ, ఉత్తరాదిలో లాగా అది నీగ్రోలు మాత్రమే అనుభవించే ప్రత్యేక బహుమానం కాదు. దక్షిణాది పేదరికాన్ని తెలుపూ నలుపూ జాతులు రెండూ పంచుకుంటున్నాయి. ఈ కారణాలవల్ల సమస్యల స్వభావంలో స్పష్టమైన వ్యత్యాసం కనిపించింది లూథర్‌కు. ప్రభుత్వమేమో ఇంటి సమస్యను గాలికి వదిలేసి, వియత్నాంను ఉద్ధ రించే సాకుతో ఏటా ఇరవై లక్షల కోట్ల డాలర్లను యుద్ధానికి తగలేస్తూ, అమెరికన్ సైనికుల శవాలను విమానంలో ఇంటికి తెచ్చుకుంటూంది.

ఓటింగ్ హక్కుల బిల్లు మీద అధ్యక్షుడు సంతకంజేసే ఆగస్టు 6వ తేదీ సందర్భానికి హాజరుకావాలని కోరుతూ వైట్‌హౌస్ నుండి లూథర్‌కు ఆహ్వానం అందింది. వేడుక ముగియగానే లూథర్ అధ్యక్షునితో సమావేశమయ్యాడు. ఉత్తరాది పరిస్థితులు వివరించి, పేదరికం నిర్మూలనకు పథకం చేపట్టమని విజ్ఞప్తి చేశాడు. అధ్యక్షుడినుండి అతనికి సానుకూలమైన స్పందన అందలేదు. అందుకు కారణాలు రెండు. మీడియా సేకరించే ప్రజాభిప్రాయ నివేదికల్లో, 'నీగ్రో హక్కుల విషయంగా జాన్సన్ చాలా దూకుడుగా ప్రవర్తించా'డని వెల్లడికావడం మొదటి కారణం. ఆ నివేదికలను జాన్సన్ బైబిల్‌తో సమానంగా గౌరవిస్తాడు. వియత్నాం విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా లూథర్ ప్రవర్తించలేదనే గుర్రు రెండవ కారణం. సంభాషణలో వియత్నాం గూడా ప్రస్తావన కొచ్చింది. "మీరు తొందరపడి ప్రకటనలు చేయకండి. సంప్రదింపులు జరపాలనే ప్రయత్నంలోనే నేనున్నాను. త్వరలో ఐక్యరాజ్యసమితి ప్రతినిధితో మీకొక సమావేశం ఏర్పాటు చేస్తాను. ఆయనతో మాట్లాడితే నా ప్రయత్నాల గురించి వివరంగా మీకు తెలుస్తుంది. అంతవరకు మీరు ఓపిక పట్టాలి." అన్నాడు జాన్సన్. లూథర్ అంగీకరించాడు.

లూథర్‌ను తిరుగులేని నీగ్రో నాయకుడుగా నిలబెట్టిన ఓటింగ్ హక్కుల బిల్లుకు అమెరికా దక్షిణాది రాష్ట్రాల్లో పండుగ జరిగింది. కానీ, ఉత్తరాది మురికివాడలు

ఆ సందర్భాన్ని గుర్తించనేలేదు. పైగా, అహింసావిధానాన్ని అవహేలన చేస్తున్నట్టు, ఆగస్టు 11వ తేదీన లోస్ఏంజెల్స్ నగరంలోని 'వాట్స్'లో కనీవినీ ఎరుగనంత భారీ మోతాదులో నీగ్రోలు దొమ్మీకి పాల్పడ్డారు.

లోస్ఏంజెల్స్‌లో నీగ్రోలు నివసించే అతి పెద్ద శివారుప్రాంతం వాట్స్. రెచ్చిపోయిన నీగ్రోలు ఆ ప్రాంతంలోని తెల్లదుకాణాలకు నిప్పంటించారు. తగులబడి పోతున్న అంగళ్ళతో వాట్స్ బజార్లు నిప్పుల కొలిమిగా మారిపోయాయి. అడ్డూ ఆపూ లేకుండా రెండురోజులపాటు ఈ దహనకాండ కొనసాగింది. పోలీసులతో జరిగిన పోరాటంలో ముప్పైనలుగురు చనిపోగా, వెయ్యిమందికి పైగా గాయపడ్డారు. దాదాపు వెయ్యి కట్టడాలు నిప్పులపాలై నేలకొరిగాయి. సైనిక బలగాలు రంగంలో దిగిందాకా పరిస్థితి అదుపులోకి రాలేదు.

అంతటి దారుణానికి కారణమైన సంఘటన అత్యంత స్వల్పమైంది కావడం ఉత్తరాది రాష్ట్రాల ప్రత్యేకత. మోటారుబైకును అడ్డదిడ్డంగా తోలుతున్న ఒక నీగ్రో యువకుణ్ణి, తప్పతాగి నడుపుతున్నాడనే అనుమానంతో, ట్రాఫిక్ జవాను నిలేశాడు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనలమీద అంత పట్టింపులేదు. అందువల్ల, ఆ నీగ్రో యువకుడూ, వెంటవచ్చిన అతని సోదరుడూ, దాన్ని చిన్నతనంగా భావించి జవానుతో తగాదా పెట్టుకున్నారు. చుట్టూ జనం ప్రోగయ్యారు. అంతలో ఆ అబ్బాయిల తల్లి నోరు పారేసుకుంటూ వచ్చి తగాదాలో చేరిపోయింది. కుటుంబ సభ్యులు ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు. అంతే; బజార్ల వెంట బీభత్సం మొదలైంది. వినేవాళ్ళకు అది పథకం ప్రకారం జరిగిన దాడిలా కనిపిస్తుంది; కానీ, ఉత్తరాది దొమ్మీలు పథకం ప్రకారంగానీ, నాయకత్వం కిందగానీ జరగవు. ఎవరికి వారుగా వచ్చి, పిలుపందుకున్న కార్యకర్తల్లా జనమంతా దొమ్మీలో దిగి పోతారు.

ఆ దారుణం జరిగే సమయంలో లూథర్ దేశంలో లేడు. ప్రపంచ క్రైస్తవ మహాసభల్లో పాల్గొటానికి పోర్టోరికో దీవిలోని శాన్‌జాన్ నగరంలో ఉన్నాడు. దేశానికి తిరిగొచ్చిన మరుసటిరోజే, ఆగస్టు 17న, అతడు లోస్ఎంజెల్స్ చేరుకున్నాడు. ఉద్రేకాలతో రగిలిపోతున్న వాట్స్‌కు వెళ్ళొద్దని మిత్రులు వారించారు. అక్కడి జనం శాంతిని గురించి వినిపించుకునే ధ్యాసలో లేరని హెచ్చరించారు. అందుతున్న బెదిరింపుల కారణంగా ఇతర నీగ్రోనాయకు లెవ్వరూ వాట్స్‌లో అడుగెట్టటానికి సాహసించలేదు.

లూథర్ చేరుకునే వేళకు వాట్స్‌కు ప్రశాంతత తిరిగొచ్చింది. మలుపు మలుపులో సైనికులు పహరా కొనసాగిస్తున్నారు. ఇరువైపులా బూడిద రాసులుగా మారిన భవనాల నడుమ తెల్లోళ్ళూ నల్లోళ్ళూ నిశ్శబ్దంగా పనులమీద వెళుతున్నారు. వాడలో నివసించే నీగ్రోలను కలుసుకున్నాడు లూథర్. జరిగిన నష్టానికి వాళ్ళు సిగ్గుపడకపోగా, ఘనకార్యం సాధించినట్టు కేరింతలు కొట్టడం లూథర్‌ను ఆశ్చర్యంలో ముంచింది. వాళ్ళందరూ కంటికి కనిపించని ఏవో సంకెళ్ళను తెంచుకోటానికి ప్రయత్నిస్తున్నట్టు కనిపించింది అతనికి.

''అనుకున్నది సాధించాం.'' అన్నాడొక నీగ్రో యువకుడు.

''ఏమిటి మీరు సాధించింది? ముప్పైమందికి పైగా కాల్పుల్లో చనిపోతే అందులో ఇద్దరు తప్ప మిగతావాళ్ళంతా నీగ్రోలు; ఎవరికీ దక్కకుండా కోట్ల డాలర్ల ఆస్తి బూడిదలో కలిసింది. ఇదేనా మీరు సాధించింది?'' అడిగాడు లూథర్.

''కావచ్చు. మేమున్నామని వాళ్ళు గుర్తించేలా చేశాం.'' ఆ యువకుడు సగర్వంగా జవాబిచ్చాడు.

ఆ మానసిక పరిస్థితిని అర్థం చేసుకోటానికి ప్రయత్నించాడు లూథర్. అది నిర్లక్ష్యం చేయబడిన జనాభా. సమాజం వాళ్ళ బాగోగులను పట్టించుకోకుండా వదిలేసింది. లోస్‌ఏంజెల్స్ పట్టణంలో నీగ్రోపుట్టక కంటే, తెల్లజాతీయుల పెంపుడు కుక్కకు గౌరవం ఎక్కువని వాళ్ళ నమ్మకం. బ్రతుకులో సుఖం లేదు; సమాజంలో మర్యాద లేదు. తన లేమికి తను కారణం కాదని ఆ నీగ్రోకు తెలుసు; కారణమెవరో అతనికి తెలీదు. కష్టంతో బ్రతకడానికి అతడు సిద్ధమే; కానీ, చెయ్యడానికి ఉద్యోగం దొరకదు. గాలికి తిరగాలి, గాలికి బ్రతకాలి. కంటి ఎదురుగా విలాసవంతమైన భవంతులు; తన కాపురం రెండో అంగకు చాలని పిచుక గూట్లో. ఏరోజు కారోజు కడుపు నింపుకోవడమే యాతన; 'రేపు' అనేది అతనికొక పీడకల. రేపటిని గురించి ఆశలేని వాడిలో తెంగిపు పెరుగుతుంది, పగ పారాడుతుంది, ఓర్పు తగ్గుతుంది, లౌకికం అడుగంటుతుంది. ఈ వాతావరణంలో, ఒక పోలీసు జవాను మందలింపు, ఒక కొట్టు యజమానితో చిన్న వాదులాట, ఒక కాఫీ కౌంటర్లో సరఫరాకు కాసింత ఆలస్యం వంటి అతి చిన్న కారణం చాలు - భారీ విధ్వంసానికి దారితీస్తుంది.

ఉత్తరాది నీగ్రోను నలిపేస్తున్నది పౌరహక్కుల సమస్య కాదు; జీవన ప్రమాణాల సమస్య. అందుకే, ప్రవర్తనలో ఉత్తరాదికీ దక్షిణాదికీ చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. దక్షిణాదిలో పౌరహక్కులకోసం జరిగిన అహింసా పోరాటం వాట్స్

నీగ్రోల దృష్టిలో అర్థంలేని వ్యాసంగం. తెల్లజాతిని నరనరానా ద్వేషించే ఆ నీగ్రోకు తెల్లోళ్ళతో కలిసి ఉద్యమం నడపడం విడ్డూరంగా కనిపించింది. నీగ్రోల కోసం ప్రాణాలర్పించిన జేమ్స్ రీబ్, వయోలా లిజ్జోలు తెల్లోళ్ళేనని లూథర్ చెబుతూంటే వాట్స్ నీగ్రోలు ముక్కుమీద వేలేసుకున్నారు.

వాట్స్‌ను చూసిన తరువాత, పాలకవర్గమేగాక పౌరహక్కుల నాయకత్వం గూడా చాలాకాలంగా ఉత్తరాదిని నిర్లక్ష్యం చేసిందనే అభిప్రాయం లూథర్‌ను వేధించింది. తెలిసి జరిగినా తెలియక జరిగినా, ఆ నేరంలో తనుగూడా భాగస్వామి. గెరి గీసుకుని తన ప్రజాసేవ దక్షిణాదికి పరిమితం చెయ్యాలనే ఉద్దేశం లూథర్‌కు లేకపోవచ్చు. కానీ, సంఘటనల పరంపర అతన్ని దక్షిణాదిలో కట్టి పడేసింది. అట్లాంటా తిరిగిరాగానే అతడు సంస్థ సభ్యులతో సమావేశమయ్యాడు. మిత్రపక్షాలతో కలిసి విశాల ప్రాతిపదికన అహింసా విధానాన్ని ఉత్తరాదిలో అమలుచేయటానికి అందరూ సమ్మతించారు. ఈ నిర్ణయంతో లూథర్ తన పోరాటాన్ని కొత్త పొలిమేరలకే కాదు, కొత్త సమస్యలకు గూడా విస్తరిస్తున్నాడు. ఎందుకంటే, ఇంతవరకు అతడు దక్షిణాదిలో నడిపిన ఉద్యమం కేవలం నైతిక బాధ్యతలకు సంబంధించింది; వ్రాతలో ఎప్పటినుండో ఉంటూ, వాస్తవంలో చేతికందని హక్కులకోసం జరిగిన పోరాటం అదంతా. ఉత్తరాదిలో కొరవడింది పౌరహక్కులు కాదు; వాటిని అనుభవించటానికి అవసరమైన ఆర్థిక స్వాతంత్ర్యం. అది రాజ్యాంగం ప్రస్తావించని కొత్త హక్కు!

ఐక్యరాజ్య సమితిలో అమెరికాకు ప్రతినిధిగా వ్యవహరించే గోల్డ్‌బర్గ్‌తో సెప్టంబర్ 10వ తేదీకి ఏర్పాటైన సమావేశంకోసం లూథర్ వాషింగ్టన్ చేరుకున్నాడు. అతనితోపాటు బేయర్డ్ రస్టిన్ తదితర నాయకులు మరికొందరు ఆ సమావేశంలో పాల్గొన్నారు. వియత్నాం పరిస్థితిమీద లూథర్ వెలుబుచ్చిన అభిప్రాయాన్ని గోల్డ్‌బర్గ్ మెచ్చుకున్నాడు. ప్రభుత్వంగూడా ఆ సమస్యను సంప్రదింపుల ద్వారా తెంచుకోవాలనే ప్రయత్నంలో ఉందనీ, సామరస్య పూర్వకమైన పరిష్కారం తొందరలో జరుగుతుందనీ వాళ్ళకు భరోసా ఇచ్చాడు. లూథర్‌కు ఊరట కలిగింది. వియత్నాం సమస్యను వదిలేసి, తన దృష్టిని ఇక ఉత్తరాది పేదరికంమీద కేంద్రీకరించాలని నిర్ణయించుకున్నాడు.

# ఉత్తరాదిపై దండయాత్ర

ఉత్తరాదిని ముట్టడించడానికి తన తొలి మజిలీగా చికాగో నగరాన్ని ఎన్నుకున్నట్లు 1966 జనవరి 7వ తేదీన ప్రకటించాడు లూథర్ -

"ఉత్తరాది నీగ్రోల సంక్షేమానికి నా సర్వశక్తులు వినియోగించడం కర్తవ్యంగా భావిస్తున్నాను. సమాజం మొత్తానికి నైతికంగా, ఆర్థికంగా గుదిబండల్లా మారిన మురికివాడలను సృష్టించి పోషిస్తున్న శక్తులను తిరిగి తలెత్తకుండా లొంగదీయడం నా ధ్యేయం. మురికివాడల సమస్యుండేది ఒక్క చికాగోలోనే కాదు. కానీ, జాతి వైషమ్యాన్ని పోతబోసి మిగతా నగరాలకు ఎగుమతి చేస్తున్న మూస చికాగో."

లూథర్ చెప్పింది అక్షరాలా నిజం. పేదరికం, పెత్తందారీతనం, నేరం, జాతివివక్ష, లంచగొండితనం, పోలీసు దుర్మార్గం వంటి పెడసరాలకు చికాగో నగరంతో సరితూగే నగరం ఉత్తరాదిలో మరొకటి లేదు. అక్కడున్న 35 లక్షల జనాభాలో పది లక్షలు నీగ్రోలు. అందులో సగంమంది కటిక దరిద్రులు. మిగతా సగంలోగూడా పేదల సంఖ్యే అధికం.

సాటిలేని పరిపాలనా దక్షుడుగా పేరుమోసిన రిచ్చర్డ్ డ్యాలీ ఆ నగరానికి మేయరు. అతనికి బుజ్జగించడమూ తెలుసు, బెదిరించడమూ తెలుసు. అతన్ని ఇరుకున పెట్టగలిగిన ప్రత్యర్థి ఇంతవరకు కనిపించలేదు. తాను ఎదిరించబోయే ప్రత్యర్థి సత్తా లూథర్‌కు తెలుసు. అందుకే, తన నివాసాన్ని చికాగోకు మార్చాలని నిర్ణయించాడు.

పేరు బయటికి పొక్కకుండా, లూథర్ కోసమని లాన్డెల్ మురికివాడలో ఒక వాటాను అద్దెకు కుదిరించారు లూథర్ మిత్రులు. దాచటానికి ఎంత ప్రయత్నించినా ఇంటి యజమానికి విషయం తెలిసిపోయింది. కట్టింది మొదలు పట్టించుకోకుండా వదిలేసిన ఇంటికి ముస్తాబులు మొదలెట్టాడు. ప్రయత్నలోపం లేకున్నా, కాపురానికి తగిన వసతిగా మారటానికి ఆ ఇల్లు నిరాకరించింది. జనవరి 22వ తేదీన లూథర్ సకుటుంబంగా అందులో దిగాడు. ఆ గదుల్లో వాసనకు కడుపులో దేవి, వాంతులు చేసుకుంది కొరెట్టా.

లూథర్ నగరంలో దిగాడని తెలిసినా మేయర్ డ్యాలీ కంగారు పడలేదు. ఎందుకైనా మంచిదని తీసుకోవలసిన ముందుజాగ్రత్తల గురించి ఆలోచించాడు.

లూథర్ కదలికలను డ్యాలీ ఎంత నిశితంగా గమనిస్తున్నాడో, అంతే నిశితంగా డ్యాలీ ఆయువుపట్టుకోసం లూథర్ వాకబు చేస్తున్నాడు. విలియం డాసన్ అనే చికాగో పార్లమెంటు సభ్యుని పాత్ర ఆ వాకబులో వెల్లడైంది. అతడు నీగ్రో. ఐనా ప్రతి తడవ ఎన్నికల్లో అతడే గెలుస్తాడు. నీగ్రోలను అదుపుజేసే డ్యాలీ ఆంతరంగిక యంత్రాంగానికి అతడు చోదకుడు. ఆతని పలుకుబడికి దీటుగా తన పరిచయాలను నీగ్రో సమాజంలో పెంచుకోవడం మొదటి కర్తవ్యంగా లూథర్ తెలుసుకున్నాడు.

లూథర్ పలుకుబడి పెరగకుండా అటువైపునుండి ఎత్తుగడ ప్రారంభమైంది. 'మురికివాడ గృహయజమానుల మీద కొరడా' అనే పతాక శీర్షికతో స్థానిక దినపత్రిక నగరపాలకులు తలపెట్టిన కార్యక్రమాన్ని ప్రముఖంగా కొనియాడింది. వాడల్లో సౌకర్యాలను తనిఖీ చేసేందుకు అదనంగా యాభైమంది పర్యవేక్షకులను కొత్తగా నియమించినట్టు తెలిపింది. గృహవసతి నియమాలను ఉల్లంఘించే యజమానులను కఠినంగా శిక్షించేందుకు రంగం సిద్ధమైందనీ, నియమాలు పాటించని పాతికమంది యజమానులను ఇప్పటికే గుర్తించి కేసులు నమోదు చేశారనీ వ్రాసింది.

నగరపాలక సంస్థ దగ్గరున్న తేనె పెదవుల పూతకు తప్ప ఆకలి తీర్చేది కాదని లూథర్‌కు తెలుసు. ఆ ప్రకటనలను ఖాతరు చెయ్యకుండా అతడు తన పని తాను చేసుకుపోతున్నాడు. జరుపబోయే పోరాటానికి ఏఏ సమస్యలు ఎన్ను కోవాలా అన్నది అతని ముందున్న మీమాంస. చంటిపిల్లల ఆరోగ్యం మొదలు చికాగో చలిగాడ్పులనుండి ముదుసళ్ళను ఆదుకునే తొడుగుల దాకా మురికివాడల్లో అన్నీ సమస్యలే. పాఠశాలల్లో జాతివివక్ష, సన్నగిల్లిన విద్యాప్రమాణాలు, వాడల్లో కరువైన పారిశుద్ధ్యం, దుకాణాల్లో పగటి దోపిడీ, యువకుల్లో నిరుద్యోగం, బ్యాంకుల్లో అందని రుణసౌకర్యం - ఇలా ఏకరువు పెడితే ఎన్నెన్నో సమస్యలు. విడదీయాలంటే వీలుపడని బీరకాయ చిక్కు; కలిపి ఎదుర్కోవాలంటే ఆల్బనీలోలాగా మొన మొద్దుబారుతుందనే సందేహం. వీటిని ఆలోచించటానికి అల్‌ర్యాబీ తదితర ముఖ్యు లతో ఒక అజెండా కమిటీని ఏర్పాటుచేశాడు లూథర్.

మార్చి 18వ తేదీన ఇరవయ్యైదుగురు నీగ్రో మతగురువులతో తన కార్యా లయంలో చిన్న సమావేశం నిర్వహించాడు మేయర్ డ్యాలీ. నీగ్రోల సంక్షేమానికి తీసుకున్న చర్యలనూ, వాటి పురోగతినీ వివరించే నివేదిక ప్రతులను వాళ్ళకు అందించాడు. దాన్ని పరిశీలించి నెలాఖరులో మరో సమావేశానికి రమ్మన్నాడు. ఇంకా చేయవలసింది ఏదైనావుంటే ఆ సమావేశంలో నిర్మాణాత్మక ప్రతిపాదనలు

చేయమన్నాడు. డ్యాలీ చూపించిన ఆదరణ, చేసిన గౌరవ మర్యాదలకు ఆ మతగురువులు విస్తుపోయారు. నెలాఖరులో రెండో సమావేశం జరిగింది. పాఠశాలల్లో పాటిస్తున్న జాతివివక్షను మతగురువులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. అతని జవాబులు విని, సమావేశం ముగించుకుని, మేయర్ నిజాయితీని శంకిస్తూ ఇళ్ళకు తిరిగొచ్చారు మతగురువులు.

ఆ సమయంలో లూథర్ చికాగోలో లేడు. విరాళాల సేకరణకు బెలెఫోంటేతో కలిసి యూరప్‌లో పర్యటిస్తున్నాడు. తృప్తికరమైన మొత్తాన్ని విరాళంగా జమచేసుకుని, ఏప్రిల్ రెండోవారంలో స్వదేశం తిరిగొచ్చాడు. యూరప్‌లో ఉన్నప్పుడు, ఒక పత్రికలో 'వియత్నాం సంతానం' అనే వ్యాసం అతని కంటబడింది. యుద్ధం కారణంగా వియత్నాంలో భావితరాల జీవితం ఎంత దయనీయంగా మారిందో వివరించే ఆ వ్యాసం చదివిన తరువాత, మౌనంగా ఉంటూ తను తప్పు చేస్తున్నాననే భావన లూథర్‌ను కలిచివేసింది. సైనికుల మీద కాక, పౌరులమీద గూడా దాడులు చేసే నీచానికి తన దేశం దిగజారడం లూథర్‌ను సిగ్గుపరిచింది. స్వదేశం తిరిగొచ్చిన మరునాడే అతడు ఫ్లోరిడాలోని 'మెయిమీ'లో ఏర్పాటైన ఎస్.సి.ఎల్.సి. వార్షికోత్సవంలో పాల్గొన్నాడు. ఆ వేదికనుండి చేసిన ప్రసంగంలో 'వియత్నాం నుండి అమెరికన్ సైన్యాలు తక్షణం వెనక్కు రప్పించా'లని డిమాండు చేశాడు. అతని మాటల్లోని ప్రతి అక్షరం అధ్యక్షుడు జాన్సన్‌కు జరూరుగా చేరిపోయింది.

చికాగో చేరుకోగానే లూథర్ మిత్రపక్షాలతో కలుసుకున్నాడు. వాళ్ళ అభిప్రాయాలు ఒక కొలిక్కి చేరినట్టు అతనికి కనిపించలేదు. ఇంతలో, మేయర్ ఆడుతున్న జూదానికి మరో ప్రతిబంధకం ఎదురైంది. ఏప్రిల్ చివరి వారంలో ఫ్రెడ్ హబ్బర్ అనే రాజకీయనాయకుడు హత్యకు గురయ్యాడు. అతడు నల్లజాతీయుడు. వచ్చే ఎన్నికల్లో పార్లమెంటుకు విలియం డాసన్‌తో పోటీ చెయ్యడానికి తయారౌతున్నాడు. ఆ హత్యకు డ్యాలీ, డాసన్‌ల ప్రోత్సాహం ఉందని నీగ్రోలు అనుమానించారు.

కుతకుతలాడుతున్న నీగ్రో సమాజం లూథర్ పథకానికి మంచి అవకాశాన్ని కల్పించింది. పరిస్థితిని అంచనా వేసుకుని, భారీ ప్రదర్శనకు లూథర్ సన్నాహాలు మొదలెట్టాడు. ''చికాగో ప్రజాసంఘాల్లో కనిపించే ఐకమత్యం నాకు మరెక్కడా కనిపించలేదు. ఇవి ఆదర్శవంతమైన ప్రజాసంఘాలు. ఈ సంఘాలతో కలిసి చికాగో నిరుపేదల అవసరాల గురించి నేను చాలాకాలంగా అధ్యయనం చేస్తున్నాను. ప్రాధాన్యత ఇవ్వవలసిన అంశాలమీద మేమొక అభిప్రాయానికి చేరుకున్నాం. ఆ

కోరికలతో జూన్ 26వ తేదీన మేయర్ కార్యాలయానికి ప్రదర్శన నిర్వహిస్తున్నాం. దీనికి ప్రతివొక్కరి సహకారాన్ని అర్థిస్తున్నాం.'' అంటూ, మే 26వ తేదీన అతడు బహిరంగ ప్రకటన విడుదల చేశాడు.

మేయరు హుషారయ్యాడు. అస్తవ్యస్తంగా ఉన్న ఐదువందల అపార్ట్‌మెంట్లను మరమ్మతు చేయడానికి ప్రభుత్వంనుండి పెద్దమొత్తంలో రుణసౌకర్యం ఏర్పాటయిందని ప్రకటిస్తూ, ఆ దశాబ్దం చివరకంతా మురికివాడలనేవి లేకుండా చేస్తానని శపథం చేశాడు. కానీ, ఆ రోజు నగరంలో జరిగిన ఒక ఘాతుకం మేయర్ ప్రకటనను నిర్వీర్యం చేసింది. జెరోమ్ హూయీ అనే పదిహేడేళ్ళ నీగ్రో యువకుడు ఉపాధి కోసం వెదుక్కుంటూ సిసిరో శివారుప్రాంతంలో ప్రవేశించాడు. కల్తీలేని తెల్లప్రాంతం సిసిరో. నల్లమనిషి అడుగులను ఆ ప్రాంతీయులు ఓర్చుకోరు. కర్రలతో, ఇనప చువ్వలతో కొందరు తెల్లయువకులు అతనిమీద దాడి చేసి, పట్టపగలు నట్ట నడి రోడ్డులో చితకబాది చంపేశారు. నగరమంతా నల్లజాతి ప్రదర్శనలతో అట్టుడికింది.

లూథర్ ప్రకటించిన జూన్ 26 కార్యక్రమానికి తలవనితలంపుగా పెద్ద అడ్డంకు ఏర్పడింది. జూన్ 6వ తేదీన మిసిసిపిలో జరిగిన సంఘటన దేశంలో పౌరహక్కుల కార్యక్రమాలన్నీ వాయిదా పడేలా చేసింది. జేమ్స్ మెరెడిత్ అనే సాహసి టెన్నిసీలోని మెమ్ఫిస్ నుండి మిసిసిపి రాజధాని జాక్సన్‌కు కాలినడకన స్వేచ్ఛాప్రయాణం ఒంటరిగా మొదలెట్టాడు. మిసిసిపి సరిహద్దుల్లో ప్రవేశించిన కొద్దిసేపటికి అతనిమీద కాల్పులు జరిగాయి. ప్రమాదకరమైన గాయాలతో పడిపోయిన మెరెడిత్‌ను మెమ్ఫిస్ తరలించి ఆస్పత్రిలో చేర్పించారు.

మిసిసిపి విశ్వవిద్యాలయం నుండి పట్టా సంపాదించిన మొట్టమొదటి నీగ్రో జేమ్స్ మెరెడిత్. మిసిసిపి లోని కాస్కోలో జన్మించి, హైస్కూల్లో చదివేప్పుడే వైమానిక దళానికి ఎంపికై, 1951 నుండి 60 వరకు అమెరికా వైమానిక దళానికి సేవలు అందించాడు. 1962లో అతడు పట్టాకోసం మిసిసిపి యూనివర్సిటీలో చేరాడు. అతన్ని చేర్చుకోవడం సహించని తెల్లజాతీయులు నిరసన దాడులకు పాల్పడ్డారు. అదుపు చేయటానికి ఫెడరల్ బలగాలు రావడంతో మరింత విజృంభించారు. దాడుల్లో ఇద్దరు పౌరులు చనిపోగా, 78 మంది సైనికులు గాయపడ్డారు. చివరకు అదనపు బలగాల సహకారంతో అలజడి సద్దుమణిగింది. 1963లో మెరెడిత్ పట్టా సంపాదించి దేశంలో ప్రఖ్యాతుడైనాడు.

మెరెడిత్ గాయపడిన సమాచారం అట్లాంటా వచ్చిన లూథర్‌కు ఆ సాయం

కాలం అందింది. మరుసటి రోజు ప్రొద్దున్నే అతడు మెమ్ఫిస్ బయలుదేరాడు. విమానంలో న్యూయార్క్ నుండి వస్తున్న కోర్ సంస్థ డైరెక్టర్ ఫ్లాయిడ్ మెకిసికీ అతన్ని కలిశాడు. భయం పోగొట్టాలనే ధ్యేయంతో మెరెడిత్ చేపట్టిన యాత్ర ఆగిపోవడం మంచిదిగాదని మాటల్లో ఇద్దరూ అనుకున్నారు. కానీ, ఇతరులతో కొనసాగింపుకు మెరెడిత్‌ను ఒప్పించడమే సమస్య. మొదటినుండి ఒంటరి పోరాటం మెరెడిత్ పంథా. అతడు పౌరహక్కుల సంఘాలతో ఎప్పుడూ కలవలేదు.

ఆస్పత్రిలో మెరెడిత్‌ను పరామర్శించిన తరువాత విషయం కదిలించారు. సులభంగానే అతడు ఒప్పుకున్నాడు. అంతలో విద్యార్థి నాయకుడు స్టోకెలీ కార్మీ-చియల్ గూడా అక్కడికొచ్చి కలుసుకున్నాడు. కాస్సేపుండి మెరెడిత్‌తో సెలవు తీసుకుని ముగ్గురూ నగరంలోని ఫాదర్ లాసన్‌గారి సెంచురీ మెథడిస్ట్ చర్చికి చేరుకున్నారు. అక్కడ చర్చించి, కోర్, ఎస్.ఎన్.సి.సి., ఎస్.సి.ఎల్.సి.లు సంయుక్తంగా పాదయాత్ర కొనసాగించటానికి అంగీకరించారు. చేతులు కలపమని ఇతర పౌరహక్కుల సంఘాలన్నిటికీ విజ్ఞప్తి చెయ్యాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా, అక్కడ చేరినవాళ్ళంతా వాహనాల్లో బయలుదేరి, జాతీయ రహదారిమీద మెరెడిత్ గాయపడిన తావుకు చేరుకుని, అప్పటికప్పుడే పాదయాత్ర ప్రారంభించారు.

మండుటెండలో అందరూ నడుస్తున్నారు; సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. అంతలో ఒక యువకుడు, లూథర్‌కు వినిపించేలా, "ఈ అహింసా గిహింసా నాకు గిట్టవు. నా మీద ఎవడైనా చెయ్యేస్తే కింద పడేసి చావదంతాను." అన్నాడు. మరికాస్సేపటికి ఇంకో యువకుడు, "ఈ పాదయాత్రలో అంతా నీగ్రోలే పాల్గోవాలి. తెల్లజాతి గుంటనక్కలకు మన ఉద్యమంలో చోటివ్వకూడదు. ఇది కల్తీలేని నీగ్రో యాత్రగా ఉండాలి." అన్నాడు. మరొక మనిషి అందుకుంటూ, "ఎంత కలిసినా వాళ్ళ బుద్ధులు మారవు. ఉద్యమంలో తెల్లోడు చస్తే మహాగొప్ప. నల్లోడు చస్తే అనుకుండేవాడు ఉండడు. సెల్మాలో జేమ్స్ రీబ్ చనిపోతే, అతడు తెల్లోడు గాబట్టి, జాన్సన్ పూలగుత్తి పంపుతాడు. అంతకుముందు అలబామాలో జాక్సన్ చనిపోతే, అతడు నల్లోడు గాబట్టి, ఏ పూలగుత్తులూ లేవు." అన్నాడు.

వాళ్ళ సంభాషణంతా లూథర్ నిశ్శబ్దంగా వింటున్నాడు. యువకుల్లో పెరుగుతున్న అసహనాన్ని అతడు అర్థంచేసుకుంటున్నాడు. ఉడుకురక్తంలో ఓర్పు ఎంత కాలమని నిలుస్తుంది? స్వాతంత్ర్యం ఇదిగో వస్తుంది అదిగో వస్తుంది అనే కాకమ్మ కబుర్లతో కాలం గడిచిపోతూంది. అడ్డూఆపూ లేకుండా నీగ్రోల మీద దౌర్జన్యం

ఎప్పటిలాగే కొనసాగుతూంది. అందువల్ల, అహింసతో ఒరిగిందేమిటి అనే ప్రశ్న తప్పకుండా ఉదయిస్తుంది. ''నిరాశలోనుండి తెగింపు పుట్టుకొస్తుంది. తెగింపు ద్వేషానికి జన్మనిస్తుంది. ద్వేషానికి విజ్ఞత ఉండదు. కొందరికి అందరికి మధ్యగల తేడాను తెలుసుకోవడం ద్వేషానికి చేతగాదు. 'కొందరు' చేసే తప్పిదాన్ని ఆ తరగతిలోని అందరికీ అంటగడుతుంది.'' అనుకుంటూ నడిచాడు లూథర్.

మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో స్వాతంత్ర్యగీతాలు అందుకున్నారు. 'కష్టాలను అధిగమిస్తాం' అనే పాటలో 'నలుపూ తెలుపూ సోదరులంతా కలిసి మెలసి' అనే చరణాన్ని పలక్కుండా కొంతమంది మూగబోయారు. విశ్రాంతి కాగానే యాత్ర తిరిగి ప్రారంభమైంది. రాత్రి విడిదికి ఏర్పాట్లు చేసుకోనందున, సాయంకాలం కాగానే అందరూ వాహనాల్లో మెమ్ఫిస్ చేరుకుని, ఒక మోటెల్లో బసచేశారు.

వివాదంగా మారిన విషయాల మీద దాపరికం లేకుండా మాట్లాడటానికి ఆ రాత్రి తతిమా సంస్థల నాయకులతో కూర్చున్నాడు లూథర్. చర్చ వాడిగా వేడిగా సాగింది. తన చివరిమాటగా తెగేసి చెబుతూ, ''చూడండి మిత్రులారా! హింసను నేను సిద్ధాంతపరంగా వ్యతిరేకించడమే కాదు, ఆచరణకు సాధ్యం కానిదిగానూ భావిస్తున్నాను; అందునా మిసిసిపి వంటి రాష్ట్రంలో. ఆ కార్యక్రమానికి తగిన వనరులు మనకు లేవు, సాధనాలు లేవు, మందిమార్బలం లేదు. హింసను రెచ్చగొడితే, మనందరిని నల్లుల్లా నలిపేయడానికి మనమై మిసిసిపి తెల్లోళ్ళకు అవకాశం కల్పిస్తాం. పైగా, నైతికంగా దిగజారి, సానుభూతి కోల్పోతాం.

''ఇక, ఉద్యమంలో తెల్లజాతీయులను కలుపుకోవడం గురించి చెప్పమంటే- నిన్నా మొన్నటి వరకు మీరూ నేనూ గూడా కలిసొచ్చే తెల్లోళ్ళను ఆహ్వానించాం, కలిసి పనిజేశాం. ఉన్నట్టుండి మీలో ఈ మార్పు ఎందుకొచ్చిందో నాకు తెలీదు. ఇదే మిసిసిపి రాష్ట్రంలో రెండేళ్ళ క్రిందట ఓటరు నమోదు కార్యక్రమానికి ఎంతో దూరంనుండి వచ్చిన తెల్లవిద్యార్థులు అరమరికలు లేకుండా నీగ్రోలతో కలిసి పనిజేశారు, ప్రాణాలు త్యాగం చేశారు. తెలుపూ నలుపూ జాతులు కలిసి బ్రతకడం తప్ప మన సమాజానికి గత్యంతరం లేదు. కాబట్టి, మనం సాధించవల సింది జాతుల సమైక్యత. అది అయాచితంగా చేతికి దొరికే పదార్థం కాదు, కష్టపడి సృష్టించవలసిన సౌభాగ్యం.

''కాబట్టి, మన యాత్ర అహింసామార్గంలో, జాతిభేదాలకు అతీతంగా

సాగుతుందని మీరు మాటివ్వకపోతే, ఇందులో పాల్గోవడం నాకు కుదరదు; నా అంతరాత్మ ఒప్పుకోదు.'' అన్నాడు లూథర్.

ఆ యాత్రవరకు లూథర్ ఆదర్శాలకు కట్టుబడి నడవటానికి స్టోకెలీ, ఫ్లాయిడ్ తదితరులు అంగీకరించారు. దారి పొడవునా చర్చ మానకపోయినా, ఊరూరా ప్రజలు గుంపులుగుంపులుగా ఎదురొచ్చి స్వాగతించే కోలాహలంలో వివాదాల తీవ్రత మసకబారింది. మొత్తంమీద పదిరోజులదాకా అపశ్రుతులు లేకుండా యాత్ర కొనసాగింది. మధ్యలో ఒకచోట మాటల సందర్భంలో, ''నడిచి నడిచి చెప్పులు అరగడం తప్ప ఈ ఖాళీ నడకతో ప్రయోజన మేమొచ్చింది? కనీసం ఓటరు నమోదు కార్యక్రమైనా దీంతోపాటు చేసుకుంటూ పోతే తప్పేముంది?'' అన్నాడు ఎన్.ఏ.ఏ.సి.పి. నాయకుడు ఛార్లెస్ ఎవర్స్.

''తప్పేంలేదు. చెయ్యొచ్చు.'' అన్నాడు లూథర్.

పనోలా అనే చిన్న టౌనులో ఆ కార్యక్రమాన్ని ఆవిష్కరించి, గ్రెనెడా పట్నం చేరుకున్నారు యాత్రికులు. ఆ పట్నం 8000 నీగ్రో జనాభాలో ఓటర్లుగా నమోదైన సంఖ్య 697. అందువల్ల, నమోదు కార్యక్రమాన్ని భారీగా చేపట్టి, దాదాపు 1300 మందిని ఆ పనిమీద తరలించారు. అనవసరంగా రచ్చపడటం గ్రెనెడా అధికారుల అభిమతం కాదు. వచ్చిన ఓటర్లందరినీ కాదనకుండా నమోదు చేసుకున్నారు. యాత్రికులు దాటిపోయిన రెండోరోజే ఆ రిజిస్టర్లను చెత్తకుప్పలో విసిరేసినా, కళ్ళముందు మాత్రం కార్యక్రమం హుందాగా జరిపించారు.

ఇక రాబోయేది గ్రీన్‌వుడ్ పట్టణం. అది స్టోకెలీ విద్యార్థిసంస్థకు బలమైన కేంద్రం. పట్టణం దగ్గరౌతున్నకొద్దీ స్టోకెలీలో ఆత్రుత ఎగసిపడుతూంది. జూన్ 16వ తేదీ మధ్యాహ్నం యాత్రికులంతా గ్రీన్‌వుడ్‌లో ప్రవేశించారు. పాతమిత్రులూ కొత్త సానుభూతిపరులూ పెద్ద ఎత్తున ఎదురై స్వాగతించారు. సాయత్రం సిటీ పార్కులో జరిగిన బహిరంగసభకు తండోపతండాలుగా జనం హాజరయ్యారు. స్టోకెలీ ప్రసంగంలో మిసిసిపిలో జరిగే అన్యాయాలనూ, ఆ పాలకుల పక్షపాతాన్నీ ఘాటుగా విమర్శించి, ''కాబట్టి, వీటిని ఎదుర్కోటానికి మనకు కావలసింది 'నీగ్రో సత్తా.' '' అన్నాడు. ఆ మాట విన్నవెంటనే రిక్స్ అనే విద్యార్థి వేదికమీదికి చొరబడి, ''మనకు కావలసిం దేమిటి?'' అంటూ జనాన్ని ఉద్దేశించి అడిగాడు. గుంపులోనుండి వేలగొంతులు 'నీగ్రో సత్తా' అన్నాయి. అతడు మళ్ళీమళ్ళీ అడిగాడు. అదే జవాబు మారుమ్రోగింది. 'నీగ్రో సత్తా' అనే పదం నినాదంగా అప్పటికప్పుడు

గ్రీన్‌వుడ్ పట్టణంలో పుట్టుకొచ్చింది. ఆ పదాన్ని చాలారోజుల క్రిందటే కొందరు రచయితలు ఉపయోగించారుగానీ, అంతవరకు దాన్నెవరూ నినాదంగా వాడలేదు.

అక్కడినుండి దారిపొడవునా నినాదాల పోటాపోటీ ఏర్పడింది. కొందరు 'స్వాతంత్ర్యం కావాలి' అని ఎలుగెత్తితే, మరికొందరు 'నీగ్రో సత్తా వర్ధిల్లాలి' అంటూ నినదించారు. యాజో పట్టణం వరకు ఈ గందరగోళం కొనసాగింది. యాజోలో స్టోకెలీ, ఫ్లాయిడ్ల అంతరార్థం స్పష్టంగా తెల్సుకోటానికి లూథర్ సిద్ధ మయ్యాడు. ఒక చిన్న క్యాథలిక్ చర్చిలో వాళ్ళతో సమావేశమయ్యాడు. ఐదు గంటల పాటు నిర్విరామంగా వాదన జరిగింది.

''అమెరికా జనాభాలో మనముండేది పదిశాతం. నీగ్రో సత్తా అనే నినాదాన్ని మీరు ఏ అర్థంలో వాడుతున్నారో నాకు తెలీదు. ప్రతి పదానికీ సార్వజనీనమైన అర్థం ఒకటి, సంకేతాత్మకమైన అర్థం మరొకటి ఉంటుంది. నీతికీ, చట్టానికీ కట్టుబడి సత్తా చూపించడంలో నాకు అభ్యంతరం లేదు. కానీ, ఈ నినాదం మరోరకమైన అర్థానికి ఆస్కారం కలిగిస్తూంది. పరోక్షంగా హింస ధ్వనించేలా చేస్తూంది. పత్రికల్లో అప్పుడే వంకరటింకర వ్యాఖ్యానాలు మొదలయ్యాయి. కొందరు మిత్రుల మాటల్లో కనిపించే దురుసుతనం ఈ వ్యాఖ్యానాలకు ఊతమిస్తూంది.'' అన్నాడు లూథర్.

''హింస, అహింసల ప్రస్తావన ఇక్కడ అనవసరం. రాజకీయంగా, ఆర్థికంగా వనరులు సమీకరించుకుని పగ్గాలు చేతిలోకి తీసుకోవాలంటే నీగ్రోలకు సత్తా అవస రమని మా నమ్మకం. ఈ ప్రపంచంలో గౌరవముండేది సత్తాకే. ఏదిఏమైనా సత్తా సంపాదించుకోవాలి. ఈ అమెరికాలో అల్పసంఖ్యాక జాతులన్నీ - యూదులుగానీ, ఇటాలియన్లుగానీ, ఐరిష్ జాతీయులుగానీ - ఇదే మార్గంలో ఎదిగారని నీకూ తెలుసు మాకూ తెలుసు. అదే పని నీగ్రోలు చేస్తే తప్పేముంది?'' అన్నాడు స్టోకెలీ. ఫ్లాయిడ్ సమర్థించాడు.

''బాగా గుర్తుచేశావ్. నువ్వు చెప్పిన మైనారిటీలంతా సత్తా సంపాదించారు. కానీ, వాళ్ళెప్పుడూ వీధులవెంట 'యూదుల సత్తా', 'ఇటాలియన్ల సత్తా' అంటూ నినాదాలు చెయ్యలేదే. జాతిలో ఐకమత్యంతో, కృషిలో పట్టుదలతో, సృజనాత్మక మైన ఆలోచనతో ఆ స్థాయిని చేరుకున్నారు. మనం చేయవలసిందిగూడా అదే పని.'' అన్నాడు లూథర్.

''జనాన్ని ఉత్తేజపరచాలంటే నినాదాలు అవసరం. స్వాతంత్ర్యంకోసం దేశం పోరాడినప్పుడు నినాదాలు లేవా? ఇప్పుడు కార్మికుల ఉద్యమానికి నినాదాలు లేవా?''

“నినాదాలు వద్దని నేను చెప్పడంలేదు. పెడర్థాలకు అవకాశమిచ్చి, సందిగ్ధంలో పడేసే నినాదాలు వద్దంటున్నాను. మిత్రులను దూరంచేసుకుని, నీగ్రోజాతిని ఏకాకిగా మిగిలించే నినాదాలు వద్దంటున్నాను. నీగ్రోలను నీచంగా చూస్తున్నందుకు తలదించుకోవలసిన దురహంకారులు రొమ్ములు విరుచుకునేలా చెయ్యొద్దంటున్నాను.”

“ఈ నినాదానికి జాతీయగుర్తింపు రావాలంటే నువ్వుండాలి. అందుకే నువ్వు పాల్గొనే సందర్భాన్ని ఎన్నుకున్నాం.”

“ఇదివరకు చాలాసార్లు నన్ను వాడుకున్నారు. మరొక్కసారి వాడుకుంటే నాకొచ్చే నష్టమేంలేదు. కానీ, ఉద్యమానికి నష్టం జరగడం నేను సహించలేను.” అన్నాడు లూథర్.

ఎంత ప్రయత్నించినా స్టోకెలీ, ఫ్లాయిడ్లు మొండిపట్టు వదల్లేదు. చివరకు, ఏ నినాదం లేకుండా ముందుకు సాగటానికి అంగీకరించడంతో సయోధ్య కుదిరింది. సాయంత్రం ప్రార్థనా సమావేశం నిర్వహించే సమయంలో లూథర్ ప్రసంగానికి కొందరు కుర్రాళ్ళు పిల్లికూతలతో అంతరాయం కలిగించడం లూథర్‌ను గాయపరిచింది. రాత్రంతా కునుకు పట్టలేదు. “ఎన్నోచోట్ల ఎన్నోరకాల శ్రోతలముందు వేలసార్లు ప్రసంగించాను. విరోధించే తెల్లజాతీయులుండే సభల్లోనూ మాట్లాడాను. ఇలాటి అవమానం జీవితంలో ఎప్పుడూ జరగలేదు. వీళ్లు 'నావాళ్ళు' అనుకున్నాను. పన్నెండు సంవత్సరాలుగా వీళ్ళకు నా సర్వస్వం ధారపోస్తున్నాను. వీళ్ళేనా నన్ను అవమానించేది?” అనుకుంటూ తల్లడిల్లాడు. 'పిల్లల్లో అసహనం పెరిగిపోయింది' అనుకున్నాడు. 'పెరగదా మరి! పన్నెండేళ్ళనుండి వీళ్ళకు ఎన్నెన్నో ఆశలు కల్పించాను. నేను కలలు గన్నాను, వీళ్ళు కలగనేలా చేశాను. స్వాతంత్ర్యం రేపోమాపో చేతికందుతుందని భ్రమలు కలిగించాను. ఆశలు అడియాసలయ్యాయి. తియ్యని కలలన్నీ ఎండమావు లయ్యాయి. ఏ తెల్లజాతిని నమ్మమన్నానో ఆ తెల్లజాతి తన నిజాయితీని నిరూపించుకోవడంలో ఘోరంగా విఫలమైంది. అందుకే నామీద వీళ్ళకు విసుగొచ్చింది. అది సహజంగూడా.' అనే సమాధానంతో తనను తాను సరిపెట్టుకున్నాడు.

మరుసటిరోజు కాంటోన్ పట్టణం దిశగా జరిగిన పాదయాత్ర మునుపటిలా ప్రశాంతంగా సాగలేదు. కొరకొర చూపులు మినహా, గత రెండువారాలుగా తెల్లజాతీయులనుండి యాత్రకు ఆటంకం కలుగలేదు. ఇప్పుడు వాతావరణం మారిపోయింది. వాహనాలతో కావాలని యాత్రికులను ఒరుసుకుంటా ముందువెనకలకు

తిరుగుతున్నారు. ఏదోవొక సాకుతో చెనకడానికి ప్రయత్నిస్తున్నారు.

తగాదాకు చోటివ్వకుండా జాగ్రత్తగా తప్పుకుంటూ కాంటోన్ శివార్లు చేరుకున్నారు యాత్రికులు. ఒక నల్లజాతి పాఠశాల ఆవరణలో విడిదికోసం డేరాలు పాతుకుంటున్నారు. పోలీసులు అడ్డొచ్చి పాతటానికి వీల్లేదన్నారు. మాట వినకుండా పనిలో దిగిపోయింది స్టోకెలీ సేన. హెచ్చరికలైనా చెయ్యకుండా పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. అంతటితో ఆగకుండా, లాఠీలతో కొరడాలతో గుంపుమీదికి ఎగబడ్డారు. కాల్పులు జరిగే ప్రమాదాన్ని పసిగట్టిన లూథర్, ఫ్లాయిడ్లు జనాన్నంతా దాపుల్లోవున్న చర్చిలోకి మల్లించారు. పోలీసుల వీరంగానికి విస్తుపోయిన లూథర్, ఫెడరల్ జోక్యాన్ని కోరుతూ టెలిగ్రాం ద్వారా అధ్యక్షుణ్ణి అర్థించాడు. వైట్‌హౌస్‌నుండి లూథర్‌కు సమాధానం రాలేదు.

ప్రమాదం పొంచేసుకుందని తెలిసినా, యాత్రను అర్థాంతరంగా ముగిస్తే పిరికితన మౌతుంది. గమ్యంగా ఎంచుకున్న జాక్సన్ పట్టణం అక్కడికి ఎంతో దూరంలేదు. బిక్కుబిక్కుమంటూ యాత్రికులు జాక్సన్ వైపుకు దారితీశారు. అదృష్ట వశాత్తు, ఏ గండం ఎదురవకుండా జూన్ 26న గమ్యం చేరుకున్నారు. పాదయాత్ర ముగించుకుని లూథర్ చికాగో తిరిగొచ్చాడు.

లూథర్ చేరుకోగానే, మెరెడిత్ ఉదంతంతో వాయిదా పడిన చికాగో ప్రదర్శనకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. దాన్ని జులై 10 తేదీన నిర్వహించటానికి మిత్రపక్షాలన్నీ సిద్ధమయ్యాయి. ఆరోజు 'సోల్జర్స్ ఫీల్డ్' మైదానంలో జరిగిన బహిరంగసభలో యాభైవేలకు పైగా పాల్గొన్నారు. లూథర్ తన ప్రసంగాన్ని 'దొమ్మీలతో ప్రయోజనం ఉండదు' అనే అంశంమీద ప్రధానంగా కేంద్రీకరించాడు. ''హింసాత్మక ఆందోళనకుండే బలహీనత మనమంతా గమనిస్తున్నాం. ఆందోళన చేసే శక్తులకంటే బలమైన శక్తి రంగంలో దిగగానే అవి అణిగిపోతున్నాయి. హింసాత్మక పోరాటంతో ఫలితం సాధించగల బలం మనకు లేదు; ఆయుధసంపత్తి మనకు లేదు; సాంకేతిక పరిజ్ఞానం మనకు లేదు. హింసామార్గంలో ఆశించిన గమ్యానికి మనం ఏనాటికీ చేరుకోలేం. అందుకని, చేతులు ముడుచుకుని గమ్మున ఉండిపొమ్మని నేను చెప్పడంలేదు. మన ఆకలిని వాళ్ళే తెలుసుకుని, ఈ ప్రభుత్వం, ఈ తెల్లమనుషులు, పసందైన భోజనాన్ని వెండి తట్టలో మన బల్లమీద ఉంచుతారని ఎవరైనా అనుకుంటే, అంతకంటే పొరపాటు మరొకటి ఉండదు. పెత్తందార్లు స్వాతంత్ర్యాన్ని స్వచ్ఛందంగా అందివ్వరు; దాన్ని మనం పోరాడి సాధించుకోవాలి.

శాంతియుత మార్గంలో, అహింసా పోరాటంతో దాన్ని సాధించుకోవాలి. సాయుధ బలగాలతో అణచడానికి వీలుపడని మహోన్నతమైన నైతిక శక్తి అహింసది. అందు వల్ల, మనం బాధలు సహించటానికి సిద్ధపడాలి; జైళ్ళను నింపటానికి సిద్ధపడాలి. అంతేగాదు, ఈ నగరానికి మేయరుగా ఎవరుండాలో నీగ్రో ఓటుతో నిర్ణయించే శక్తిని సంతరించుకోవాలి.'' అంటూ ఉపన్యాసం ముగించాడు లూథర్.

సభ సమాప్తం కాగానే ఊరేగింపు మొదలయింది. మూడు మైళ్ళ దూరంలో ఉన్న సిటీహాలుకు సందోహం తగ్గకుండా జనం వెంటనడిచారు. అక్కడికి చేరగానే, ఎనిమిది డిమాండ్లతో కూడిన పత్రాన్ని అతడు సిటీహాలు గేటుకు అంటించి కార్య క్రమం ముగించాడు.

మరుసటిరోజు సంప్రదింపులకు మేయర్ డ్యాలీ అంగీకరించాడు. తనతో పాటు మరో పదిమంది ప్రతినిధులతో లూథర్ మేయర్‌ను కలిశాడు. సమావేశం స్నేహపూర్వకమైన వాతావరణంలో జరిగింది. అంతకు మినహా, లావాదేవీల్లో చీపురుపుల్లైనా దొరకలేదు. ''మేయర్ డ్యాలీ పిడివాది కాదు. కానీ, మేము సమర్పిం చిన సమస్యల లోతుపాతులు ఆయనకింకా అవగాహన కాలేదు.'' అన్నాడు లూథర్ బయట వేచివున్న విలేఖర్లతో. ''కోరికలకు లూథర్ పేదోడు కాడు; పాపం, పరిష్కా రాలే ఆయన దగ్గర లేనివి.'' అని ప్రకటించాడు డ్యాలీ. చికాగో జైళ్ళు నిండేలా చేస్తానన్న లూథర్ ప్రకటన గురించి ప్రస్తావించగా, ''నేను మేయరుగా ఉన్నంత వరకు అరాచకానికి తావుండదు. ఐనా, డా.కింగ్ చట్టాన్ని ధిక్కరించే మనిషి కాదు. అయన దౌర్జన్యాన్ని ప్రోత్సహించడు.'' అన్నాడు.

ఇరు నేతల ఆశాభావానికి భంగం కలిగిస్తూ, ఆ మరుసటి రోజే చికాగోలో భారీ విధ్వంసం చెలరేగింది. ఇక్కడగూడా కారణం పెద్దది కాదు. అగ్నిప్రమాదం ఎదుర్కోటానికి వాడలో ఏర్పాటుచేసిన 'ఫైర్ హైడ్రేట్' కుండే కవాటాన్ని తుంటరి పిల్లలెవరో విప్పేసి, నీళ్ళు చిమ్మేలా వదిలేశారు. అది చట్టానికి వ్యతిరేకం. దాన్ని కట్టేయడానికి పోలీసులు వచ్చారు. వాతావరణంలో వేడి ఎక్కువగా ఉన్నందున నీళ్ళను కట్టేయొద్దని జులాయిమూక వాళ్ళను అడ్డగించింది. చిన్న తగాదాగా మొదలై, అది ఏకంగా మూడురోజుల దొమ్మీకి దారితీసింది. ఆస్తి నష్టమే కాకుండా దాదాపు 75 మందిని గాయాలపాలు చేసింది.

'ఈ అల్లరులన్నీ మీ కారణంగానే' అంటూ మేయర్ డ్యాలీ ఎస్.సి.ఎల్.సి. మీద అభాండాలు వేశాడు. మరుసటి రోజు కాస్తా సర్దుకుంటూ, 'డా.కింగ్ మీద

నాకు ఎలాటి అనుమానం లేద'ని ప్రకటించాడు.

చికాగోలోనే కాకుండా, 1966 వేసవిలో అనేక ఉత్తరాది పట్టణాలు నీగ్రోల దాడులతో అల్లకల్లోలంగా తయారయ్యాయి. 'ప్రశాంతంగా సాగే ప్రజాజీవితాన్ని అస్తవ్యస్తం చేసేందుకు లూథర్ అహింసను ముసుగుగా వాడుకుంటున్నాడు.' అనే విమర్శలు ఉత్తరాదిలో ఎల్లువెత్తాయి. ఎర్నెస్ట్ రేథర్ అనే సంఘసంస్కర్త, నీగ్రో జాతీయుడు, లూథర్ మీద విరుచుకుపడుతూ, "ఉత్తరాదికి అతనితో జరిగిన మేలు ఇక చాలు. వెంటనే అతడు తన దక్షిణాదికి పెట్టేబేడా సర్దుకుంటే నేను సంతోషిస్తాను." అన్నాడు పత్రికల్లో.

ఇలాటి అభియోగాలు లూథర్ జీవితానికి కొత్తగాదు. వీటిని అతడు ఏమాత్రం పట్టించుకోలేదు. అతన్ని కలిచివేసింది చికాగో అల్లరిమూకల ప్రవర్తన. చీటికీ మాటికీ వాళ్ళు ఇలా దాడులకు దిగుతూంటే తన కార్యక్రమం ముందుకు సాగదు. అందువల్ల, ఆ యువకుల గుంపులను ఎలాగైనా సమాధాన పరచాలనుకున్నాడు. ముఠాలు ఏవేవున్నాయో విచారించాడు. మాట్లాడటానికి రమ్మని ముఠానాయకులను ఆహ్వానించాడు. ముఖాముఖి నాలుగ్గంటలసేపు వాళ్ళకు ఎన్నెన్నో విధాల నచ్చ జెప్పాడు. చివరిగా - "మీరు ఇక్కడ చాలా అవకాశాలు తీసుకున్నారు. నేను అహింసావిధానాన్ని ప్రయత్నించడానికి మొదటిసారిగా ఇక్కడికొచ్చాను. నాకు ఒక అవకాశమివ్వండి. అహింసా ఉద్యమానికి సహకరించండి." అని విజ్ఞప్తి చేశాడు. వాళ్ళు ఒప్పుకున్నారు.

మరోవైపు లూథర్, మురికివాడల్లో అద్దెకుంటున్న గృహస్తులను సంఘటితం చేసి 'అద్దె సంఘాల' ఏర్పాటు చేపట్టాడు. ఈ సంఘాలతో జులై రెండవవారం మొదలు ప్రతిరోజు రియల్ ఎస్టేట్ యజమానుల కార్యాలయాలకు ప్రదర్శనలు నిర్వహించాడు. ఆ ఊరేగింపులతో చికాగో దద్దరిల్లింది.

ప్రతిఘటనకు తెల్లమూకలు తయారయ్యాయి. అంగళ్ళలో ఆయుధాలకు గిరాకీ పెరిగింది. చిన్న స్థాయిలో మొట్టమొదటి ఎదురుదాడి ఆగస్టు 5వ తేదీన జరిగింది. ప్రదర్శనకు నీగ్రోశ్రేణులు వీధిలో నిలబడ్డాయి. దారికి ఇరువైపులా తెల్లమూకలు మోహరించాయి. ముందుజాగ్రత్తగా పోలీసులుగూడా పెద్ద ఎత్తున రంగంలో దిగారు. ఊరేగింపు నడిపించటానికి లూథర్ వచ్చాడు. అతడు కారు దిగి నిలబడగానే, బలంగా విసిరిన రాయి రెక్కకు తగిలింది. నొప్పితో లూథర్ మోకాళ్ళ మీద వంగిపోయాడు. పోలీసులు కలుగజేసుకుని, ఇరుపార్శ్వాల్లో అడ్డు

గోడగా నిలబడ్డారు. నొప్పినుండి కోలుకోగానే లూథర్ ఊరేగింపు నడిపించాడు.

ఆగస్టు 7వ తేదీ ఊరేగింపు సందర్భంగా ఎదురుదాడి మరింత పెరిగింది. వేల సంఖ్యలో తెల్లమూకలు ప్రోగై ఊరేగింపుమీద రాళ్ళూ, సీసాలూ రువ్వారు. ఆ సంఘటనలో కొందరు పోలీసులు గూడా గాయపడ్డారు. ప్రదర్శకులు ప్రాణాలను ఉగ్గబట్టుకున్నారు. ఐనా, వెనక్కు తగ్గకుండా లూథర్ ఊరేగింపు నడిపించాడు.

కళ్ళముందే పరిస్థితి దిగజారిపోవడం డ్యాలీని కలవరపరిచింది. ప్రదర్శనలు చాలించమని లూథర్‌కు రాయబారం పంపించాడు. ప్రదర్శనలు ఆపేస్తే 300 మందికి ఉద్యోగాలు చూపిస్తాననీ, 300 పక్కా ఇళ్ళు కట్టిస్తాననీ ప్రతిపాదించాడు. తను కొసరుకోసం రాలేదనీ, నల్లజాతి గౌరవం నిలబెట్టడానికి వచ్చాననీ లూథర్ జవాబిచ్చి దూతను వాపసు పంపించాడు. నీగ్రో నాయకులకు తనమీద నమ్మకం కుదరటానికి కొన్ని తక్షణ చర్యలు తీసుకోవాలనుకున్నాడు మేయరు. జాతి వివక్షలో రాటుదేలిన పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు మిస్ ఛూచెట్‌ను రాజీనామా చేయించాడు. కొంతమంది నల్లవిద్యార్థులను తెల్లబడులకు బదిలీ చెయ్యమని సూపరెండెంట్ విల్స్‌ను ఒత్తిడి చేశాడు. తన చేతుల మీదుగా ఆ పని ఇష్టపడని విల్స్, తన పదవికి రాజీనామా చేశాడు.

ఆగస్టు 17వ తేదీన మేయరు నీగ్రోనాయకులను సంప్రదింపులకు ఆహ్వానించాడు. ఉద్యమకారుల తరఫున లూథర్, అల్‌ర్యాబీ తదితర నాయకులు నలుగురు ప్రాతినిధ్యం వహించగా, అటువైపు మేయరుతోపాటు నగరపాలక అధికారులూ, రియల్ ఎస్టేట్ యజమానులూ పాల్గొన్నారు. ఎనిమిది గంటల సుదీర్ఘ చర్చ ఫలితం లేకుండా ముగిసింది. ఎల్లుండి మళ్ళీ చర్చకు కూర్చోవాలనే ఒకేవొక అంశంమీద అంగీకారం కుదిరింది. 19వ తేదీ చర్చలకు మేయరు హాజరుకాలేదు. మేయరు లేకుండా చర్చ జరపటానికి నీగ్రోనాయకులు ఇష్టపడలేదు.

అదే సమయంలో మేయరు మీడియాతో మాట్లాడుతూ, ప్రదర్శనల నిషేధానికి కోర్టును అర్థిస్తున్నట్టు ప్రకటించాడు. చర్చలను ఎగవేయడంలో మేయర్ అంతరార్థం నీగ్రోనాయకులు తెలుసుకున్నారు. నగరపాలకసంస్థ కోరినంత కాకపోయినా, ప్రదర్శనలమీద కోర్టు పరిమితమైన ఆంక్షలు విధించింది. రోజుకు ఒకటికి మించి ప్రదర్శనలు ఉండరాదనీ, అందులో ఐదువందలమందికి మించి పాల్గోరాదనీ, అదిగూడా పగటిపూట మాత్రమే జరగాలనీ నిర్బంధం విధించింది.

కోర్టు ఆంక్షలను ఖాతరు చెయ్యకుండా, రాబోయే ఆదివారం, అంటే

ఆగస్టు 28వ తేదీ, సిసిరోలో ఊరేగింపు తలపెట్టినట్టు లూథర్ ప్రకటించాడు. అది జాతిదురహంకారం వరదలుగా పారే ప్రదేశం. కేవలం వీధిలో అడుగుబెట్టిన నేరానికి మూడు నెలలముందు, జెరోమ్ హూయీ అనే నీగ్రోకుర్రాణ్ణి దారుణంగా చంపేసిన ప్రాంతం. అక్కడ ప్రదర్శన జరపడం ఆత్మహత్యతో సమానమని పోలీసులు లూథర్‌ను వారించారు. ఎంత వద్దన్నా లూథర్ వినిపించుకోలేదు. సిసిరో ప్రదర్శనకు నీగ్రో యువకుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది.

జరిగితే ఎట్లుండేదో చెప్పలేంగానీ, తరువాత చోటుచేసుకున్న పరిణామాలు ఆ ప్రదర్శనతో అవసరమే లేకుండా చేశాయి. ఊరేగింపుకోసం నిర్ణయించిన గడువుకు రెండురోజుల ముందే నీగ్రోనాయకులను మేయర్ డ్యాలీ చర్చలకు ఆహ్వానించాడు. ఇళ్ళ విషయంలో జాతివివక్షను సంపూర్ణంగా తొలగించడానికి అంగీకరించాడు. మొత్తం పది అంశాలమీద ఆరోజు అంగీకారం కుదిరింది. 1966 ఆగస్టు 26న కుదిరిన ఆ ఒప్పందం 'శిఖరాగ్ర ఒడంబడిక'గా చికాగో చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది.

# మొండి పట్టు

సందివ్వకుండా మీదమీద పనులు తగులుకోవడంతో లూథర్ రచనా వ్యాసంగం కుంటుబడింది. ఎప్పుడో మొదలుబెట్టిన 'వేర్ డు ఉయ్ గో ఫ్రం హియర్' అనే పుస్తకం అట్లాగే ఆగిపోయింది. కొన్నిరోజులు పనులన్నీ కట్టబెట్టి అట్లాంటాలో కూర్చుని పుస్తకం పూర్తిజెయ్యాలనుకున్నాడు లూథర్. చికాగోను విడిచొచ్చే ముందు, అక్కడి లిబర్టీ బాప్టిస్టు చర్చిలో ప్రసంగించే ఆహ్వానాన్ని అంగీకరించాడు. ఆ సభలో మాట్లాడుతూ, ''అతి తక్కువ జీతాలతో దిగువస్థాయి ఊడిగం చేసే నీగ్రోలు తమ ఆదాయాన్ని పెంచుకోటానికి సంఘాలుగా ఏర్పడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి ప్రయోజనాలకోసం యజమానులతో సమిష్టిగా బేరమాడే శక్తి సంఘంద్వారా కలుగుతుంది.'' అంటూ లూథర్ చేసిన సూచన చర్చనీయంగా రచ్చకెక్కింది.

దానికి తోడు, అట్లాంటాలో మాట్లాడే ఒక సందర్భంలో, ''ఈ సమాజాన్ని సంస్కరించడానికి ఏళ్ళతరబడి నేను కన్నతిప్పలు పడుతున్నాను. ఇక్కడింత అక్కడింతగా జరిగిన చిరు పరివర్తన తప్ప చెప్పుకోదగిన మార్పు నాకు కనిపించలేదు. విప్లవంతో పునాది మొదలు దీన్ని కొత్తగా నిర్మించడం తప్ప గత్యంతరం కనిపించడంలేదు. నైతిక విలువలు కలిగిన విప్లవమే దీనికి శరణ్యం.'' అన్నాడు లూథర్ తన వెతలను వెల్లబోస్తూ.

అదనుకోసం పొంచేసుకున్న ఎదుటి పక్షానికి లూథర్ మాటల్లో కావలసినంత మేత దొరికింది. అతనికి అహింసమీద నమ్మకం సడలిందని కొందరు వ్యాఖ్యానించారు. లూథర్ కమ్యూనిస్టుగా మారిపోయాడని మరికొందరు విరుచుకుపడ్డారు. ''నల్లజాతి యువకులంతా 'నీగ్రో సత్తా' వైపు మొగ్గు చూపుతున్నారు. నాయకత్వం నిలుపుకోవాలంటే జనాన్ని అనుసరించవలసిన అవసరాన్ని మీరు గుర్తించారా?'' అంటూ మీడియా వెంటబడింది.

''నాయకత్వమంటే గొర్రెలా నలుగురినీ అనుసరించేది కాదు; ఆ నలుగురినీ తన మార్గానికి మల్లించేది. ఈ దేశంలోని నీగ్రోలంతా మూకుమ్మడిగా అహింసను వదిలేసినా, ఒంటరిగానైనా నేను అహింసకోసం నిలబడతాను.

''కార్ల్ మార్క్స్ రచనలు నాకు కొత్తగాదు. విద్యార్థి దశలోనే ఆయన

'దాస్ క్యాపిటల్'నూ, 'కమ్యూనిస్టు మ్యానిఫెస్టో'ను చదివాను. ఆయన సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని ప్రపంచంలో ఎన్నో విప్లవోద్యమాలు ఆవిర్భవించాయని నాకు తెలుసు. మన దురదృష్టం ఏమిటంటే, విప్లవంకోసం ఎక్కడో వెదుక్కోవలసిన పనిలేదనీ, అది క్రైస్తవమతంలోనే ఉందనీ గుర్తించకపోవడం. నన్ను ప్రభావితం చేసింది కార్ల్ మార్క్స్ కాదు; పగిలిన గుండెలను అతికించిన ఏసుక్రీస్తనే ఒక మహర్షి; తన జీవితాన్ని పేదలకు కవచంగా కప్పిన జీసెస్ నాకు ఆదర్శం.'' అంటూ లూథర్ జవాబిచ్చాడు.

కొంతకాలం ఈ గొడవలకు దూరంగా, ఏదైనా మారుమూల ప్రదేశంలో కూర్చుంటే తప్ప రాస్తున్న పుస్తకాన్ని పూర్తిచెయ్యడం కుదరదనుకున్నాడు లూథర్. రచనకు సహకరించే ఇద్దరు మిత్రులనూ, కొరెట్టానూ వెంటదీసుకుని డిసెంబర్‌లో జమైకా దీవికి ప్రయాణమయ్యాడు. మూడువారాల విశ్రాంతితోపాటు, 'వేర్ డు ఉయ్ గో ఫ్రం హియర్' రచనను పూర్తిజేసుకుని, 1967 జనవరిలో స్వదేశం తిరిగొచ్చాడు.

ఇంట్లో అడుగేసే సమయానికి లూథర్‌కోసం ఎదురుజూస్తూ ఒక అమూల్యమైన ప్రతిపాదన ముంగిట్లో నిలిచోనుంది. మూడవ ఫ్రంటు అభ్యర్థిగా అమెరికా అధ్యక్ష పదవికి పోటీచేయమని దేశం నాలుగు చెరగులనుండీ వచ్చే ప్రోత్సాహం అతన్ని వెల్లువలా తాకింది. ''ఓట్లకోసం వేటాడటం నా అజెండాలో లేదు. నన్ను మన్నించండి.'' అంటూ అభిమానుల ఒత్తిడిని అతడు సున్నితంగా తిరస్కరించాడు. హోదాపట్ల అతడు చూపిన వైముఖ్యం లూథర్ గౌరవాన్ని ఇనుమడించింది.

ఇప్పుడు లూథర్ అజెండాలో ప్రధానాంశం పేదరికం మీద పోరాటం. ఆఫ్రో-అమెరికన్ల స్థితిగతులు మెరుగుపడాలంటే, భారతదేశంలో లాగా ప్రభుత్వం చెయ్యందించి చేదుకోవాలని అతని అభిప్రాయం. చాలారోజుల క్రిందటే ఈ అంశంమీద అధ్యక్షుడు జాన్సన్‌కు ఒక నివేదికను గూడా అతడు సమర్పించాడు. ఐతే, ఇంతకాలం లూథర్ పౌరహక్కుల మీద సారించినంత బలంగా అటువైపు దృష్టిని కేంద్రీకరించలేదు. ఉత్తరాది అనుభవం తరువాత 'ఆర్థిక స్వేచ్ఛ'మీద అతని అభిప్రాయం మరింత బలపడింది. ఆర్థిక స్వేచ్ఛ లేని జాతి మిగతా ఏ హక్కునైనా నిలబెట్టుకోవడం సాధ్యంకాదని ఉత్తరాది రాష్ట్రాలు నిరూపించాయి. నేరానికి పేదరికం పుట్టిల్లు. హేతువును తొలగించకుండా హింసను హింసతో అరికట్టాలని ప్రభుత్వం చేసే ప్రయత్నం ఎప్పటికీ ఫలించదు. అందువల్ల, అతడు

'పేదరికం నిర్మూలన'కు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ఉద్యమం మొదలెట్టాలనుకున్నాడు.

ఇంతలో, అధ్యక్షుడు జాన్సన్‌తో అంతంతమాత్రంగా ఉన్న లూథర్ సంబంధాలు పుటుక్కుమనే పరిణామం సంభవించింది. వియత్నాం సమస్యను సామరస్యపూర్వకంగా తెంచుకోటానికి అమెరికా అధ్యక్షుడు నిజంగానే ప్రయత్నిస్తూందని ఇంతకాలం లూథర్ విశ్వసించాడు. 1967 ఫిబ్రవరిలో అతనికి నిజం తెలిసిపోయింది. వియత్నాం సంధికి రష్యాప్రధాని బ్రెజ్నేవ్ ప్రతిపాదించిన రాజీ మార్గాన్ని అమెరికా నిర్మొగమాటంగా తిరిస్కరించింది.

''బాంబు దాడులు మానేయమని సోవియట్ యూనియన్ అడిగింది మొత్తం వియత్నాం మీద కాదు; కేవలం ఉత్తర వియత్నాంమీద; అదివరకటి ఒప్పందం ప్రకారం సైగాన్ పాలనకు సంబంధంలేని స్వతంత్ర దేశంగా గుర్తించిన ఉత్తర వియత్నాంమీద. అది మానేస్తే, సంబంధిత పక్షాలన్నిటినీ శాంతి చర్చలకు కూర్చునేలా చేసే పూచీని సోవియట్ ప్రధాని మీదేసుకున్నాడు. దాన్ని మన ప్రభుత్వం తోసిపుచ్చింది. పరిష్కారానికి సైనిక మార్గాన్నే వరించింది. నాదేశం నాలుకతో శాంతిని వల్లిస్తూ, చేతల్లో నరమేధం కొనసాగిస్తూంది. నిజాయితీ లోపించిన ప్రభుత్వం మాటలు నమ్మి నేను నోరు మెదపకుండా ఇంతకాలం ఆగినందుకు సిగ్గుపడుతున్నాను.'' అంటూ ఘాటుగా గొంతెత్తాడు లూథర్.

విరామం సంగతి వదిలేసి చర్చి చర్చికి తిరిగి లూథర్ ప్రార్థనా సమావేశాలు నిర్వహిస్తున్నాడు; ప్రతి సమావేశంలో వియత్నాం యుద్ధాన్ని నిరసించేలా ప్రజలను సమాయత్తం చేస్తున్నాడు. ''నువ్వు ఇలాగే మాట్లాడితే మనకు ఒక్క డాలరైనా విరాళంగా దొరకదు. సంస్థ దివాళా తీస్తుంది.'' అన్నారు ఎస్.సి.ఎల్.సి. విరాళాలశాఖ కార్యదర్శులు. లూథర్ వినిపించుకోలేదు.

1967 మార్చి 25వ తేదీన చికాగో నగరంలో యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ లూథర్ తన మొట్టమొదటి ఊరేగింపు నిర్వహించాడు. మరోసారి లూథర్ మీద విమర్శల దాడి విజృంభించింది. ఈ దాడిలో ప్రముఖులైన నీగ్రో నాయకులే ఎక్కువగా పాల్గోవటం మరో విశేషం. బేయర్డ్ రస్టిన్, ఫిలిప్ ఎ. రాన్డాల్ఫ్ వంటి సన్నిహితులుగూడా లూథర్‌ను సమర్థించలేదు. 'శక్తిని మించి ఎగురుతున్నా'డని కొందరు ఎద్దేవా చేశారు; 'తన పౌరహక్కుల పనేదో తను చూసుకోక, ఇవన్నీ అతనికెందుకు?' అంటూ కొందరు నిరసించారు; 'విదేశాంగ విధానాన్ని పౌరహక్కు

లతో జతగలిపి కలగాపులగం చెయ్యొద్దు. అదో ఇదో, ఏదో ఒకదానికి నిలబడు.' అంటూ మరికొందరు గద్దించారు.

ఈ చీదరింపులకు లూథర్ చలించలేదు. ''నేను మాంట్గోమెరీ చర్చిలో పనిజేసే సమయంలో, 'మతబోధ చేసుకోక బస్సుల విషయం నీకెందు'కన్నారు. బర్మింగ్‌హాం వెళ్ళినప్పుడు, 'జార్జియావాడికి ఇక్కడేం పని?' అన్నారు. సమాజ శ్రేయస్సనేది ఎవరో కొందరు వ్యక్తులకు ప్రత్యేకించిన వృత్తి కాదు. అది ప్రతి పౌరుడు పంచుకోవలసిన బాధ్యత. ఒంటికంటి చూపుకు జాతీయ సమస్యలు వేరుగా అంతర్జాతీయ సమస్యలు వేరుగా కనిపించొచ్చు. ఇంట్లో పేదరికం సహించరాని స్థాయికి పెరిగి హింసాత్మకంగా మారుతూంటే, గొప్పలకోసం లక్షలకోట్ల డాలర్లు విదేశాల్లో తగలేసి శవాలను మోసి తెచ్చుకోవడం చూడగలిగితే, ఆ రెంటికీ ఉన్న పరస్పర సంబంధం బోధపడుతుంది. అన్నిటికంటే నన్ను క్రుంగదీసింది 'నీగ్రోలు ఇలాటి విషయాలు మాట్లాడగూడదు' అనే వ్యాఖ్యానం. ఇది కొందరు మధ్యతరగతి నీగ్రోల అభిప్రాయం. యుద్ధంవల్ల వ్యాపారానికి పెద్దగా లాభాలొస్తాయని వారి ఆశ. స్వార్థ చింతనతో వాళ్ళు చేసే వ్యాఖ్యానం నీగ్రోల స్థాయిని కించపరుస్తూంది.'' అన్నాడు.

యుద్ధంమీద లూథర్ ఉపన్యాసం వినటానికి ఏప్రిల్ 4వ తేదీన న్యూయార్క్ నగరంలోని 'రివర్ సైడ్' చర్చి జనంతో కిటకిటలాడింది. సుదీర్ఘమైన ప్రసంగంతో శ్రోతలను తన వెనకంటా అనుసరించేలా చేసుకోవడమే కాక, మీడియాను విశేషంగా ఆకట్టుకున్నాడు లూథర్. ఆ ఉపన్యాసంలో లూథర్ చెప్పినవి మూడేళ్ళనుండి పదేపదే చెబుతున్న విషయాలేనైనా, వియత్నాం యుద్ధాన్ని అతడు మొదటిసారి బహిర్గతం చేస్తున్నంత విడ్డూరంగా జాతీయపత్రికలు పతాక శీర్షికలతో ఎత్తిపట్టాయి. బహుశా అమెరికన్ ప్రజానీకంలో వియత్నాంయుద్ధం పట్ల పెరుగుతున్న విముఖతకు అదే నిదర్శనమేమో! ఏప్రిల్ 15న న్యూయార్క్‌లో లూథర్, హ్యారీ బెలెఫోంటే తదితరులు నడిపించిన 'శాంతి యాత్ర'లోగూడా ప్రజల మనోగతం ప్రతిబింబించింది. దాదాపు ఒకటిన్నర లక్షల జనప్రవాహం న్యూయార్క్ సెంట్రల్ పార్కునుండి బయలుదేరి, నగరవీధులగుండా నడుచుకుంటూ ఐక్యరాజ్యసమితి కార్యాలయం చేరుకుని, సమితి ఉపకార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

ఒకవైపు లూథర్ ప్రపంచ శాంతికోసం ఉపన్యాసాలూ ఊరేగింపులూ జరుపుతూంటే, మరోవైపు చెలరేగిన దొమ్మీలతో 1967 వేసవి ఉత్తరాది మహానగరాలను

అగ్నిగుండాలుగా మార్చింది. ఒక్క డెట్రాయిట్‌లో జరిగిన ప్రాణనష్టం, ఆస్తినష్టమే అదివరకటి రికార్డులను బ్రద్దలు చేసింది. ఈ పరిణామం లూథర్‌ను తిరిగి 'పేదరికం నిర్మూలన' పథకం వైపుకు మరలించింది.

డిసెంబర్‌లో జరిగిన ఎస్.సి.ఎల్.సి. విస్తృత సమావేశానికి లూథర్ తను రూపొందించిన 'పేదల వాషింగ్టన్ యాత్ర' పథకాన్ని చర్చకు సమర్పించాడు. మూడువేలమంది నీగ్రోలూ, నిరుపేదలైన తెల్లజాతీయులూ, రెడ్ ఇండియన్లూ, మెక్సికన్ మైనారిటీలూ కలిసి, పార్లమెంటు కదిలొచ్చేదాకా రాజధానిలో తిష్ఠవేసి ప్రతిరోజూ ప్రదర్శనలు జరపాలని లూథర్ ప్రతిపాదన. ఖరీదైన ఆ పథకానికి ఎస్.సి.ఎల్.సి. సిబ్బంది విస్తుపోయింది.

లూథర్ పథకంమీద పెద్దగా దుమారం రేగింది. ''వాళ్ళు అడిగిందంతా ఇచ్చేస్తున్నాం. ఒకటి దొరకగానే ఇంకొకటి - ఇలా ఎంతదూరం తరమాలనుకున్నారు మమ్మల్ని? వాళ్ళ ఆశకు అంతులేదా?'' అంటూ వాపోయాయి తెల్లగొంతులు. ''అతని నకిలీ మందులు మాకు అవసరంలేదు.'' అన్నాయి విద్యార్థిసంస్థలు. ''ఇంత పొడవాటి కార్యక్రమాన్ని చేపట్టే ఆర్థికస్థోమత లూథర్ సంస్థకు ఇప్పుడు లేదు. ఇదివరకటిలా అతనికి ప్రభుత్వంనుండి సానుభూతి దొరకదు. ఈ కార్యక్రమంలో నేను కలవను.'' - బేయర్డ్ రస్టిన్ ప్రకటన సంచలనానికి దారితీసింది. అభిప్రాయం వెల్లడించడానికి ఎన్.ఎ.ఎ.సి.పి. తిరస్కరించినా, వాళ్ళుగూడా జారుకున్నా రనటానికి వాళ్ళ మౌనమే నిదర్శనం. నలువైపులా వెల్లడైన సహాయ నిరాకరణకు లూథర్ సిబ్బంది బెంబేలు పడింది. ఏదిఏమైనా కార్యక్రమం నడిపించటానికి లూథర్ వెనకాడలేదు. 1968 వేసవికోసం కాచుకుని కూర్చున్న హింసను అరికట్టాలంటే అహింసాపోరాటంవైపుకు జనాన్ని మళ్లించడ మొక్కటే మార్గమని లూథర్ నమ్మకం.

కొత్త సంవత్సరం ప్రవేశించింది. 'పేదల వాషింగ్టన్ యాత్ర'కు ఏర్పాట్లన్నీ పూర్తిజేసి, ఎస్.సి.ఎల్.సి. సిబ్బంది ఫిబ్రవరిలో పచ్చజెండా ఊపింది. 1968 ఏప్రిల్ 20వ తేదీన ఆ యాత్రను మొదలెట్టాలనుకున్నారు. 'ఫార్చ్యూన్' పత్రిక నిర్వహించిన అభిప్రాయ సేకరణలో 80 శాతం నీగ్రోలు లూథర్ పథకాన్ని మెచ్చుకున్నారు. లూయిస్ హారీస్ నిర్వహించిన ఈ అభిప్రాయ సేకరణలో, 'ఆర్థికంగా వెనకబడిన నల్లజాతి పురోగతికి ప్రభుత్వంనుండి ఎంతోకొంత సహకారం అవసర' మని మెజారిటీ తెల్లజాతీయులు అంగీకరించారు. ఇప్పుడు పాతమిత్రులు లూథర్‌కు

కొద్దికొద్దిగా దగ్గరవడం మొదలెట్టారు. మూడవ ఫ్రంట్ అభ్యర్థిగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయమనే ప్రతిపాదన మరోసారి ముందుకొచ్చింది. గుంజాటన పడకుండా లూథర్ దాన్ని తిరస్కరించాడు.

ఇది ఇలా జరుగుతుండగా, మెమ్ఫిస్ పట్టణంలో నీగ్రో పారిశుధ్య కార్మికుల సమ్మె జటిలమైన కూడలికి చేరుకుంది. అక్కడ ఆపనికి నియోగించే కార్మికుల్లో ఎక్కువమంది నీగ్రోలే. ఫిబ్రవరి 1వ తేదీన, ట్రక్కునుండి సరుకును దిగవిడిచేందుకు ఉపయోగించే ఆటోమేటిక్ కంప్రెసర్ పొరపాటున నడవడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు నీగ్రోకార్మికులు నలిగి, ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆ విచారంలో నీగ్రో కార్మికులు ఎదుర్కొనే ఇతర సమస్యలుగూడా బయటికి గుప్పుమన్నాయి. అదే తరహా పనికి నియమించిన తెల్లకార్మికులతో సమానంగా తమకు గూడా జీతాలు ఇవ్వాలనీ, జీవిత భీమా తదితర సౌకర్యాలు కల్పించాలనీ నీగ్రో కార్మికులు మేయర్‌ను డిమాండు చేశారు. మేయర్ లోయెబ్ సమ్మతించాడుగానీ, లిఖితపూర్వకమైన ఒప్పందం కుదరదన్నాడు. దాంతో, ఫిబ్రవరి 12వ తేదీన కార్మికులు సమ్మెలో దిగిపోయారు. మరుసటిరోజు విధులకు హాజరుకాకుంటే పనినుండి తొలగిస్తానని మేయరు హుకుం జారీచేశాడు. కార్మికులకు మద్దతుగా స్థానిక నీగ్రోనాయకులు రంగంలో ప్రవేశించారు. మేయరు బెదిరింపులకు లొంగకుండా సమ్మె కొనసాగింది. ప్రదర్శనలతో, చిన్నచిన్న పోలీసు ఘర్షణలతో నెలరోజులు గడిచింది. పోలీసు కాపలా కింద కొత్త కార్మికులతో పనిజేయించడానికి మేయర్ పూనుకున్నాడు. మునిసిపల్ కార్మికుల జాతీయసంఘం నాయకులు పరిగెత్తుకొచ్చారు. బేయర్డ్ రస్టిన్, రాయ్ విల్కిన్స్ వంటి జాతీయ నీగ్రోనాయకులు మెమ్ఫిస్‌లో దిగి, మార్చి 14వ తేదీన బహిరంగసభ నిర్వహించి కార్మికులకు మద్దతు ప్రకటించారు. పట్టణ వాతావరణం వేడెక్కింది. కానీ, ఈ ఆర్భాటాలన్నీ మేయరును ఒక్క మెట్టైనా దించడానికి సరిపడలేదు. ఇక లూథర్‌ను పిలిపించడం మినహా గత్యంతరం లేదని స్థానిక నీగ్రోనాయకత్వం తీర్మానించింది.

# చెదరిపోయిన కల

లూథర్‌కు మెమ్ఫిస్‌లోని సెంచురీ మెథడిస్ట్ చర్చి పాస్టర్ రివరెండ్ జేమ్స్ లాసన్ అత్యంత సన్నిహితుడు. విద్యార్థిగా ఉన్నప్పటినుండి లూథర్ అభిమాని. అందువల్ల, లూథర్‌ను మెమ్ఫిస్ పిలిపించడానికి లాసన్ను పురమాయించారు స్థానిక నీగ్రోనాయకులు.

'పేదల వాషింగ్టన్ యాత్ర'కు కార్యకర్తలను సేకరించే ప్రయాసలో లూథర్ తలమునకలౌతున్నాడు. ఐనా, లాసన్ మాటను తోసెయ్యకుండా మెమ్ఫిస్ వస్తానన్నాడు.

1968 మార్చి 18వ తేదీన లూథర్ మెమ్ఫిస్ చేరుకున్నాడు. అక్కడికి చేరిన తరువాత అతనికి ఆ సమస్య ప్రాముఖ్యత తెలిసొచ్చింది. ఆరోజు పదహైదు వేల శ్రోతలకు ఉపన్యాసమిస్తూ, ''ఇది కేవలం కార్మికుల సమస్య కాదు; నల్లజాతి మొత్తాన్ని పీడిస్తున్న సమస్య. కాబట్టి, ఇందులో పాల్గొనడం నల్లజాతి మూకుమ్మడి కర్తవ్యం. నేను 22వ తేదీ తిరిగొస్తాను. ఆరోజు జరిగే ప్రదర్శనలో నల్లజాతి యావత్తూ పాల్గోవాలి. ఆరోజు మెమ్ఫిస్ గడియారం ఆగిపోవాలి. అప్పుడు మన గొంతు మేయరుకు వినిపిస్తుంది.'' అన్నాడు. వెంటవచ్చిన అబెర్నెథీ, ఆండ్రూ యంగ్‌లు ఆ ప్రతిపాదనను సమర్థించారు.

అకాల హిమపాతం మార్చి 22 కార్యక్రమాన్ని అడ్డగించింది. అనుకూల వాతావరణాన్ని ఆశిస్తూ 28వ తేదీకి ప్రదర్శనను వాయిదా వేశారు. దాటేయటానికి వీలుపడని న్యూయార్క్ వ్యాసంగాలు ముగించుకుని ఆరోజు నేరుగా మెమ్ఫిస్ చేరుకున్నాడు లూథర్. చేరుకోవడంలో జరిగిన ఆలస్యం మూలంగా మిత్రులతో ముచ్చటించే సమయం కరువై, క్లేబర్న్ చర్చినుండి మొదలయ్యే ఊరేగింపు స్థలానికి హుటాహుటి చేరుకున్నాడు.

మధ్యాహ్నం 11 గంటలకు ఊరేగింపు ప్రారంభమైంది. పది అడుగులు ముందుకు కదిలిందో లేదో, వంద గజాల ఆవల బ్రహ్మాండమైన విస్ఫోటనం వినిపించింది. సహాయకులు లూథర్‌ను లాక్కెళ్ళి కారులో తోసేశారు. ప్రోగైన ప్రదర్శకులంతా చెల్లాచెదురయ్యారు. జరిగిందేమిటో ఎవరికీ తెలీలేదు. తరువాత తెలిసిన సమాచారాన్నిబట్టి, కొందరు యువకులు పథకం ప్రకారం అక్కడ దొమ్మీకి పాల్ప

డ్డారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో పదిహారేళ్ళ యువకుడొకడు ప్రాణాంతకంగా గాయపడ్డాడు. మరో పదిహేనుమంది తూటాగాయాలతో ఆస్పత్రికి తరలించబడ్డారు. అదుపు చేయటానికి సైన్యం నగరంలో దిగింది. పట్టణమంతా కర్ఫ్యూలో కూరుకు పోయింది. తమ సత్తా చూపటానికి లూథర్ ఉనికిని వాడుకోవాలని ప్రయత్నించిన 'నీగ్రో సత్తా' ఘోరంగా విఫలమై, మెమ్ఫిస్ కార్మికోద్యమాన్ని డోలాయంలో పడేసింది.

హింసాకాండతో ఊరేగింపు విఫలం కావడం లూథర్‌ను క్రుంగదీసింది. స్థానికులను విచారించి చొరబాటుదార్ల ఆచూకీ తెలుసుకున్నాడు. తను బసచేసిన గదికి ఆ నాయకులను పిలిపించుకున్నాడు. మెమ్ఫిస్‌లో తన ప్రయత్నానికి ఒక్కగా ఒక్క అవకాశం కలిగించమని బ్రతిమాలాడు. ఇకమీదట అంతరాయం కలిగించకుండా వాళ్ళతో వాగ్దానం చేయించుకున్నాడు. వచ్చే శుక్రవారం మరోసారి ఊరేగింపు జరుగుతుందని ప్రకటించి అట్లాంటా బయలుదేరాడు.

ఏప్రిల్ 3వ తేదీ బుధవారం లూథర్ మెమ్ఫిస్ చేరుకున్నాడు. అబెర్నెథీ, ఆండ్రూ యంగ్‌లతో కలిసి లారైన్ మోటెల్ 306వ నెంబరు గదిలో బసచేశాడు. ఆలోపలే, ప్రదర్శనలను నిషేధిస్తూ నగరపాలకులు ఫెడరల్ కోర్టునుండి ఆదేశాలు సంపాదించారు. వాటిని రద్దు చేయించటానికి లూథర్ అడ్వొకేట్లు వెనువెంటనే ప్రయత్నాలు మొదలెట్టారు. కానీ, కోర్టునుండి అనుకూలమైన ఆదేశం పొందడం అంత సులభంగా కనిపించలేదు. కోర్టును ధిక్కరించైనా శుక్రవారం ప్రదర్శన నిర్వహించాలని లూథర్ మొండికేశాడు. సోమవారం దాకా ఆగేందుకు అతి ప్రయాసతో అతన్ని ఒప్పించారు మిత్రులు.

ఆ సాయంత్రం మంచి వర్షం కురిసింది. రాత్రి 'మ్యాసన్ పూజామందిరం'లో లూథర్ ఉపన్యాసముంది. చిత్తడికి బయలుదేరే ఓపికలేక, ఆ పని అబెర్నెథీకి అప్పగించాడు లూథర్. వెళ్ళిన పావుగంటలోనే అబెర్నెథీనుండి లూథర్‌కు ఫోనొచ్చింది. జనంతో చర్చి కిటకిటలాడుతూందనీ, శ్రోతలు లూథర్‌కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారనీ, వెంటనే బయలుదేరి రావాలనీ అడిగాడు అబెర్నెథీ.

ఆనాటి లూథర్ ప్రసంగానికి జనం ముగ్ధులు కావటమేగాదు, మాటల్లో తొంగిచూసిన విచారానికి మనసుల్లో కుమిలిపోయారు.

''ఈరోజు ఉదయం అట్లాంటాలో బయలుదేరాను. విమానం ఆలస్యంగా

బయలుదేరుతున్నందుకు సంజాయిషీ చెబుతూ పైలట్ మైకులో, 'ఆలస్యానికి క్షమించండి. మనతోపాటు ఈ విమానంలో డా. మార్టిన్ లూథర్ కింగ్ ప్రయాణం చేస్తున్నాడు. అందువల్ల, భద్రతాలోపం జరక్కుండా విమానాన్ని ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయవలసి వచ్చింది. రాత్రంతాగూడా విమానానికి కాపలా ఏర్పాటు చేయ వలసి వచ్చింది.' అన్నాడు.

"విమానంలో ప్రమాద సూచనలేవీ కనిపించలేదు. సురక్షితంగా మెమ్ఫిస్ చేరుకున్నాం. నాకు ప్రాణాపాయం కలిగించాలని కరుడుగట్టిన తీవ్రవాదులు - తెల్లోళ్ళే కాదు, నల్లోళ్ళు గూడా - ప్రయత్నిస్తున్నారనే పుకార్లు ముమ్మరంగా వినిపిస్తున్నాయి. దాన్ని గురించి నేను దిగులుపడే అవసరం దాటిపోయింది. ఎందు కంటే, నేను శిఖరాగ్రానికి చేరుకున్నాను గాబట్టి. మీ అందరిలాగే నాగ్గూడా చాలాకాలం బ్రతకాలని ఆశ ఉండొచ్చు. ఐతే, దేని పరిమితులు దానికుంటాయి. ఆ పరిమితి ఎక్కడ అనే ఆలోచనతో నాకు అవసరంలేదు. భగవంతుని ఇచ్ఛకు నేను బద్ధుణ్ణి. ఆయన నన్ను శిఖరాగ్రానికి చేర్పించాడు. ఆ శిఖరంనుండి నాకు పుణ్యభూమి దర్శనమిచ్చేలా చేశాడు. దాన్ని చేరుకోటానికి మీతో కలిసి నేను ప్రయాణంలో పాల్గొనే అవకాశం లేకపోవచ్చు. కానీ, మనం ఒక జాతిగా ఆ పుణ్యభూమిని చేరుకోవడం తథ్యమని నమ్మవలసిందిగా మీ అందరినీ నేను కోరుతున్నాను. చింతలకు నేను అతీతుడి నయ్యాను. కాబట్టి మనిషికి జడుసుకునే అవసరం నాకు తొలగిపోయింది. భగవంతుని సాన్నిహిత్యంలో ప్రకాశించే కాంతిపుంజాలు అవిగో, నా కళ్ళెదుట కనిపిస్తున్నాయి." అంటూ లూథర్ ప్రసంగాన్ని ముగించాడు.

ఏప్రిల్ 4వ తేదీ గురువారం పగలంతా లూథర్ మొటెల్‌నుండి బయటికి కదల్లేదు. ఏదో వ్రాసుకుంటూ గదిలోనే ఉండిపోయాడు. ఆ లారైన్ మోటెల్ వెనుకవైపు అరవై గజాల దూరంలో మరో చిన్న లాడ్జింగ్ హోటలుంది. మధ్యాహ్నం 3 గంటలకు ఆ హోటల్ 5బి నెంబరు గదిలో జాన్ విల్లార్డ్ పేరుతో ఒక వ్యక్తి చేరుకున్నాడు. చేరిన మరోగంటలో అతడు కిందికిదిగి, ఒక రైఫిల్‌నూ బైనాకులర్స్‌నూ కొని గదికి తెచ్చుకున్నాడు. ఆ విల్లార్డ్ గదికి పక్కనున్న స్నానాలగదినుండి లూథర్ బాల్కనీ మరుగులేకుండా స్పష్టంగా కనిపిస్తుంది.

లూథర్ రాత్రి భోజనానికి రివరెండ్ శామ్యూల్ కైల్స్ ఇంటికి వెళ్ళవలసి ఉంది. అతన్ని తీసుకెళ్ళటానికి సాయంత్రం 6 గంటలకు తన కారు తీసుకొచ్చాడు

కైల్స్. అప్పటికే లూథర్ దుస్తులు మార్చుకుని సిద్ధంగా ఉన్నాడు.

"మీ సతీమణి వంటల్లో ఫరవాలేదా?" నవ్వుతూ అడిగాడు లూథర్.

"భయపడకండి. సాంప్రదాయ వంటకాల్లో ఆమె నేర్పరి." అన్నాడు కైల్స్.

"ఐతే ఆలస్యం దేనికి? వెళ్దాం పదండి." అన్నాడు లూథర్ టై ముడేస్తూ.

"ఒక్క నిమిషం. నేను తయారౌతున్నాను." అన్నాడు అబెర్నెథీ.

"కానివ్వ." అంటూ లూథర్ తలుపు తోసుకుని బాల్కనీలో అడుగెట్టాడు. మరుక్షణంలో పెద్ద శబ్దంతో రైఫిల్ ప్రేలింది. గదిలోనుండి అబెర్నెథీ, కైల్స్, ఆండ్రూలు పరిగెత్తుకొచ్చారు. కుప్పకూలిన లూథర్‌ను అబెర్నెథీ చేతుల్లోకి తీసుకున్నాడు. బాల్కనీ కమ్మీల నడుమ చిక్కుకుపోయిన కాలు విడిపించాడు. లూథర్ ముఖంమీద ఏర్పడిన మూడంగుళాల గాయంనుండి ఇంకా రక్తం చిమ్ముతూనేవుంది. 'మార్టిన్, మార్టిన్' అంటూ కదుపుతున్నాడు అబెర్నెథీ. నాడి కోసం వెదికితే దొరకలేదు. గుండె ఇంకా కొట్టుకుంటున్నట్టు అనిపించింది అబెర్నెథీకి. ఆంబులెన్సును పిలిపించారు. కానీ, అస్పత్రి చేరేలోపే లూథర్ పరలోకం చేరుకున్నాడు.

లూథర్ మరణంతో

అమెరికన్ నీగ్రోల ఆశాజ్యోతి అర్ధాంతరంగా ఆరిపోయింది.

***

## In consultation of:


1. The Autobiography of Martin Luther King, Jr. - Edited by Clayborne Carson.

2. A Testament of Hope - Edited by James M. Washington.

3. King, a biography - by David Levering Lewis.

4. The autobiography of Malcom X - Assisted by Alex Haley.

5. Nat Turner, Slave Rebellion - by Herberd Aptheker.

6. The Narrative of  A Northern Slave - Sojourner Truth.

7. Information from Internet sources, mainly Wikipedia.

8. Papers from The King Center.

9. The King Papers, Martin Luther King Jr., Reseach and Education Institute, Standford University.

(అట్ట చివర)

అమెరికా స్వభావానికి అద్దం పట్టే ఈ పుస్తకాన్ని ఎవరికీ అరువీయకండి. కానీ, మీకు పరిచయమున్న ప్రతిమనిషి దీన్ని చదివేలా చేయండి; స్వయంగా కొని దగ్గరుంచుకునేలా చూడండి. ఈ మహాయజ్ఞంలో మీరు పొందగలిగే ఫలితాలు రెండున్నాయి. తెలుగు పుస్త కాలను చదవటం మానేసి, టి.వి.లకు అప్పగించిన కళ్ళను తెలుగు అక్షరాలమీదికి మళ్ళించడం మొదటి ప్రయోజనం. సంపాదన కోసం అనురాగాన్ని బలిచేసి, తమ సంతానాన్ని అమెరికాకు పంపాలనే ప్రయత్నంలో సాముగరిడీలు చేస్తున్న తలిదండ్రులకు ఆ అమెరికా గురించి కాసింత కనువిప్పు కలిగించడం రెండో ప్రయోజనం. ఈ ఆశయాన్ని ఆమోదించే తెలుగు ప్రజలకు నమ్రతతో నమస్కరిస్తున్నాం.



అమెరికా స్వభావానికి అద్దం పట్టే ఈ పుస్తకాన్ని ఎవరికీ అరువీయకండి. కానీ, మీకు పరిచయమున్న ప్రతిమనిషి దీన్ని చదివేలా చేయండి: స్వయంగా కాపీ దగ్గరుంచుకునేలా చూడండి. ఈ మహాయజ్ఞంలో మీరు పొందగలిగే ఫలితాలు రెండున్నాయి. తెలుగు పుస్తకాలను చదవటం మానేసి, టి.వి.లకు అప్పగించిన కళ్ళను తెలుగు అక్షరాలమీదికి మళ్ళించడం మొదటి ప్రయోజనం. సంపాదన కోసం అనురాగాన్ని బలిచేసి, తమ సంతానాన్ని అమెరికాకు పంపాలనే ప్రయత్నంలో సాముగరిడీలు చేస్తున్న తల్లిదండ్రులకు ఆ అమెరికా గురించి కాసింత కనువిప్పు కలిగించడం రెండో ప్రయోజనం. ఈ ఆశయాన్ని అమోదించే తెలుగు ప్రజలకు నమ్రతతో నమస్కరిస్తున్నాం.

ఎం.వి. రమణారెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి. 1944 లో జన్మించిన ఆయన వైద్య విద్యను అభ్యసించిన తర్వాత 'లా' చదివి కొంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. కార్మికనేతగా, క్రియాశీల రాజకీయవేత్తగా సుప్రసిద్ధులు. రచయితగా, సృజనశీలిగా విలువైన రచనలను తెలుగు పాఠకులకు అందించిన ఆయన రాయలసీమ వెనకబాటుతనాన్ని మొట్ట మొదటగా గణాంకాలతో సహా ప్రజల ముందుంచారు. పరిష్కారం కథలసంపుటి, రాయలసీమ కన్నీటి గాథ, తెలుగు సినిమా - స్వర్ణయుగం వీరి రచనలు. పాపియాన్ కు వీరి తెలుగు అనువాదం రెక్కలు చాచిన పంజరం, పురోగమనం పేరెన్నికగన్నవి. ప్రస్తుతం ఆయన ప్రొద్దుటూరులో నివసిస్తున్నారు.